ASBL
REALTY OF TOMORROW

ఈనాడు

LOFT

హైదరాబాద్ 28-9-2024 శనివారం సిటీ సంపుటి 51. సంచిక 49

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్స్



ఈపాటికి బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసిపోయి.. భారత బ్యాటింగ్ కూడా మొదలైపోయేదేమో! కానీ పేసర్లకు అనుకూలించేలా పరిస్థితులను మార్చిన వరుణుడే.. వారి జోరుకు బ్రేకులు వేశాడు. కాన్పూర్‌ను వర్షం ముంచెత్తడంతో భారత్-బంగ్లాదేశ్ రెండో టెస్టు తొలి రోజు ఆటలో 35 ఓవర్ల ఆటే సాధ్యపడింది. జరిగిన ఆటలో భారత్ ఆధిపత్యం స్పష్టం. యువ పేసర్ ఆకాశ్‌దీప్ చక్కటి బౌలింగ్‌కు తడబడ్డ బంగ్లా 80 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. వర్షం వల్ల ఆట నిలిచే సమయానికి ఆ జట్టు 107/3తో నిలిచింది.

బంతి జోరుకు వరుణుడి బ్రేక్

తొలి రోజు 35 ఓవర్ల ఆటే

మెరిసిన ఆకాశ్.. బంగ్లా 107/3

కాన్పూర్

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఘనవిజయం తర్వాత రెండో టెస్టునూ టీమ్‌ఇండియా ఘనంగానే ఆరంభించింది. కానీ భారత్ జోరుకు వర్షం అడ్డంకిగా మారింది. వర్షం వల్ల 35 ఓవర్ల ఆటే జరిగిన తొలి రోజు ఆటలో బంగ్లా 3 వికెట్లకు 107 పరుగులు సాధించింది. చక్కటి ఫామ్‌ను కొనసాగించిన పేసర్ ఆకాశ్ దీప్ (2/34).. బంగ్లాను దెబ్బ తీశాడు. ఆట చివరికి మొమినుల్ హక్ (40 బ్యాటింగ్; 81 బంతుల్లో 7×4), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శనివారం కూడా వర్షం ఆటకు కొంత అంతరాయం కలిగించే అవకాశాలున్నాయి.

ఆకాశ్ అదరహో..: శుక్రవారం సాధ్యమైన కొంత ఆటలో ఆకాశ్ దీప్ బౌలింగే హైలైట్. వర్షం కారణంగా గంట ఆలస్యంగా ఆట ఆరంభం కాగా.. మబ్బులు కమ్మిన వాతావరణంలో, కాస్త పచ్చిక ఉన్న పిచ్‌ను అతను బాగా ఉపయోగించుకున్నాడు. అగ్రశ్రేణి పేసర్ బుమ్రా కంటే ఉత్తమంగా అతను బౌలింగ్ చేశాడు. పేస్‌కు అనుకూలిస్తున్న పరిస్థితుల్లో కొత్త బంతి బౌలర్లు బుమ్రా, సిరాజ్ చక్కగానే బౌలింగ్ చేశారు కానీ.. వికెట్లు మాత్రం పడగొట్టలేక పోయారు. బంగ్లా ఓపెనర్లు జాకిర్ హసన్, షాద్మన్ వ్యూహాత్మకంగా బ్యాటింగ్ చేశారు. జాకిర్ పరుగుల కోసం ప్రయత్నించకుండా డిఫెన్స్‌కు ప్రాధాన్యమిస్తే.. షాద్మన్ కొంత దూకుడుగా ఆడాడు. 8 ఓవర్ల పాటు వీళ్లిద్దరూ వికెట్ ఇవ్వలేదు. అయితే తొమ్మిదో ఓవర్లో భారత కెప్టెన్ రోహిత్.. బంతిని ఆకాశ్‌కు అప్పగించాడు. అతను మూడో బంతికే ఫలితం రాబట్టాడు. అప్పటి దాకా ఖాతాయే తెరవని జాకిర్.. తాను ఎదుర్కొన్న 24వ బంతికి వికెట్ ఇచ్చేశాడు. ఆకాశ్ చక్కటి లెంగ్త్‌తో ఎడ్జ్ రాబట్టగా.. స్లిప్‌లో యశస్వి జైస్వాల్ క్యాచ్ అందుకున్నాడు. తన మూడో ఓవర్లో ఆకాశ్ ఇంకో వికెట్ పడగొట్టాడు. మరో ఓపెనర్ షాద్మన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయితే అంపైర్ ఔటివ్వకున్నా, రోహిత్ సమీక్ష కోరేందుకు అంతగా ఆసక్తి ప్రదర్శించకపోయినా.. ఆకాశ్ పట్టుబట్టాడు. సమీక్షలో బంతి స్టంప్‌ను తాకేదని తేలడంతో రోహిత్ ఆశ్చర్యపోయి.. తర్వాత ఆకాశ్‌ను అభినందించాడు. 29/2తో కష్టాల్లో పడ్డ బంగ్లాదేశ్‌ను మొమినుల్‌తో కలిసి కెప్టెన్ నజ్ముల్ శాంటో (31; 57 బంతుల్లో 6×4) ఆదుకున్నారు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ సాధించిన ఊపులో నజ్ముల్ ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. చకచకా కొన్ని బౌండరీలు కొట్టాడు. మొమినుల్ కూడా కుదురుకున్నాక స్వేచ్ఛగా పరుగులు రాబట్టాడు. వర్షం పడడంతో 15 నిమిషాల ముందే అంపైర్లు లంచ్ విరామం ఇచ్చారు. అప్పటికి స్కోరు 74/2. తిరిగి ఆట మొదలయ్యాక మూడో వికెట్ తీయడానికి అశ్విన్ ఎంతో సమయం తీసుకోలేదు. నిలకడగా ఆడుతున్న శాంటోను ఎల్బీగా ఔట్ చేశాడు. ఆ తర్వాత మొమినుల్, ముష్ఫికర్ జాగ్రత్తగా ఆడారు. కానీ ఏ క్షణాన అయినా వికెట్ పడేలా కనిపించింది. కానీ అంతలో వర్షం మైదానాన్ని ముంచెత్తడం, ఎంతకీ అది తగ్గకపోవడంతో అక్కడితో ఆట ఆగిపోయింది.

అశ్విన్.. ఆసియాలో అత్యధికం

ఆసియాలో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రికార్డు సృష్టించాడు. శుక్రవారం బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ శాంటోను ఔట్ చేయడం ద్వారా అతను ఆసియాలో 420వ వికెట్ పడగొట్టాడు. దీంతో భారత దిగ్గజ లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే (419) పేరిట ఉన్న రికార్డు బద్దలైంది. ఓవరాల్‌గా మురళీధరన్ ఆసియాలో అత్యధికంగా 612 వికెట్లు తీశాడు. తర్వాతి స్థానం అశ్విన్‌దే.



బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: జాకిర్ హసన్ (సి) యశస్వి (బి) ఆకాశ్‌దీప్ 0; షాద్మన్ ఎల్బీ (బి) ఆకాశ్ 24; మొమినుల్ బ్యాటింగ్ 40; శాంటో ఎల్బీ (బి) అశ్విన్ 31; ముష్ఫికర్ బ్యాటింగ్ 6; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (35 ఓవర్లలో 3 వికెట్లకు) **107**

వికెట్ల పతనం: 1-26, 2-29, 3-80

బౌలింగ్: బుమ్రా 9-4-19-0; సిరాజ్ 7-0-27-0; అశ్విన్ 9-0-22-1; ఆకాశ్ దీప్ 10-4-34-2

2015 తర్వాత ఇప్పుడే..

సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో 2015 తర్వాత ఓ భారత కెప్టెన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం ఇదే తొలిసారి. చివరగా 2015లో విరాట్ కోహ్లి ఇలా చేశాడు. భారత మైదానాల్లో తొలి రోజు బ్యాటింగ్‌కు పరిస్థితులకు అనుకూలంగా ఉండడం, స్పిన్నర్ల ప్రభావం ఎక్కువ ఉండే నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టం అన్న ఉద్దేశంతోనే టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్ చేస్తుంది. కానీ చెన్నైలో తొలి టెస్టులోనే కాక ఈ మ్యాచ్‌లోనూ పరిస్థితులు పేసర్లకు అనుకూలంగా ఉండడంతో బంగ్లా, భారత కెప్టెన్లు టాస్ నెగ్గి బౌలింగే ఎంచుకున్నారు.

భారత్.. అదే కూర్పు

చెన్నైతో పోలిస్తే కాన్పూర్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని.. సంప్రదాయ శైలిలోనే ఇక్కడి పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుందని మ్యాచ్ ముంగిట వచ్చిన వార్తలు నిజం కాదని తేలింది. స్వదేశంలో పరిస్థితులు పేస్‌కు అనుకూలంగా ఉంటేనే.. ఫాస్ట్ పిచ్‌లు ఉండే దేశాలకు వెళ్లినపుడు మెరుగైన ప్రదర్శన చేయగలమన్న గంభీర్ ఉద్దేశానికి తగ్గట్లే కాన్పూర్‌లోనూ పిచ్‌ను తీర్చిదిద్దారు. పిచ్‌పై పచ్చికను ఉంచగా.. ముందు రోజు వర్షం పడడం, శుక్రవారం కూడా మబ్బులు కమ్మి ఉండడంతో పరిస్థితులు పేస్‌కు అనుకూలంగా కనిపించాయి. దీంతో భారత్ చెన్నై టెస్టులో మాదిరే ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్ల కూర్పును కొనసాగించింది. తుది జట్టులో మార్పులేమీ చేయలేదు. దీంతో మూడో స్పిన్నర్‌గా కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌ల్లో ఒకరికి చోటు దక్కలేదు. మరోవైపు బంగ్లాదేశ్ మాత్రం ఒక పేసర్ (నహిద్ రాణా)ను తగ్గించుకుని మూడో స్పిన్నర్‌గా తైజుల్ ఇస్లామ్‌కు అవకాశమిచ్చింది. సీనియర్ పేసర్ తస్కిన్ అహ్మద్ ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతుండడంతో అతడి స్థానంలో ఖలెద్ అహ్మద్‌ను తుది జట్టులోకి తీసుకుంది.



సెమీస్‌లో గాయత్రి జోడీ

శ్రీకాంత్ పరాజయం

మకావు: మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌కు చుక్కెదురవగా.. గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో మూడో సీడ్ గాయత్రి- ట్రీసా ద్వయం 21-12, 21-17తో యిన్ హ్యూ- లిన్ యున్ (ఛైనీస్ తైపీ) జంటపై విజయం సాధించింది. 39 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన భారత జోడీ.. ప్రత్యర్థి జంటపై తన విజయాల రికార్డును 2-0తో మెరుగుపరుచుకుంది. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న గాయత్రి- ట్రీసా జోడీకి రెండో గేమ్‌లో కాస్త ప్రతిఘటన ఎదురైంది. ఒకదశలో 10-13తో వెనుకంజలో ఉన్న భారత జోడీ గొప్పగా పుంజుకుని వరుసగా 4 పాయింట్లు నెగ్గి 14-13తో ఆధిక్యం సంపాదించింది. 14-14తో స్కోరు సమమైనా.. గాయత్రి- ట్రీసా జోడీ మరింత దూకుడుగా ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. సెమీస్‌లో పీ షాన్- హుంగ్ జు (ఛైనీస్ తైపీ) జోడీతో గాయత్రి- ట్రీసా జంట తలపడనుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆరో సీడ్ శ్రీకాంత్ 16-21, 12-21తో రెండో సీడ్ లాంగ్ అగ్నస్ (హాంకాంగ్) చేతిలో పరాజయం చవిచూశాడు.



కోల్‌కతా గూటికి బ్రావో

క్రికెట్‌కు, చెన్నైకి స్టార్ ఆల్‌రౌండర్ గుడ్‌బై

దిల్లీ: వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2021లోనే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్న అతడు ఇప్పుడు ఆటకు పూర్తిగా స్వస్తి చెప్పాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో బ్రావో సుదీర్ఘ బంధానికి కూడా తెరపడింది. అతడు ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ గూటికి చేరాడు. ఆ ఫ్రాంఛైజీ మార్గనిర్దేశకుడిగా వ్యవహరించనున్నాడు. కోల్‌కతా మెంటార్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ భారత జట్టుకు కోచ్‌గా ఎంపిక కావడంతో 40 ఏళ్ల బ్రావో ఆ బాధ్యతలను చేపట్టనున్నాడు. ఈ ఏడాది కరీబియన్ ప్రిమియర్ లీగ్ ఆటగాడిగా అతడికి చివరి టోర్నీ. గాయం కావడంతో అతడు ఆ లీగ్ నుంచి అర్ధాంతరంగా వైదొలిగాడు. "నాకెంతో ఇచ్చిన క్రికెట్‌కు వీడ్కోలు చెబుతున్నా. ప్రొఫెషనల్ క్రికెటర్‌గా 21 ఏళ్లు కొనసాగాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా. మైదానంలో దిగిన ప్రతిసారి వందశాతం రాణించేందుకు కృషి చేశా. అయితే క్రికెట్‌తో బంధం మాత్రం తెగిపోదు'' అని బ్రావో ఇన్‌స్టాలో పేర్కొన్నాడు. 2023లోనే బ్రావో ఐపీఎల్ కెరీర్ కూడా ముగిసింది. 2011లో సీఎస్కేకి ఎంపికైన అతడు.. మూడుసార్లు టైటిళ్ల గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. గతేడాది ఈ ఆల్‌రౌండర్ చెన్నైకి బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. "కోల్‌కతాతో బ్రావో పని చేయబోతుండడం ఆసక్తిని రేపుతోంది. అతడి అపార అనుభవం కేకేఆర్ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడనుంది. ఐపీఎల్‌తో పాటు సీపీఎల్, ఎంఎల్‌సీ, ఐఎల్‌టీ20లోని కోల్‌కతా జట్లకు కూడా బ్రావోనే మార్గనిర్దేశకుడిగా సేవలందిస్తాడు'' అని నైట్‌రైడర్స్ సీఈవో వెంకీ మైసూర్ తెలిపాడు.

భారత్‌తో టెస్టులకు గ్రీన్ అనుమానం!

లండన్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ త్వరలో భారత్‌తో జరిగే అయిదు టెస్టుల సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది. ఇంగ్లాండ్‌తో చెస్టర్ లీ స్ట్రీట్‌లో జరిగిన మూడో వన్డే సందర్భంగా గ్రీన్ వెన్నుకు గాయమైంది. దీంతో ఈ సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడు స్వదేశానికి వెళ్లి కోలుకునే ప్రక్రియను ప్రారంభించనున్నాడు. అయితే ఈ ఆల్‌రౌండర్ నవంబర్‌లో భారత్-ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ మొదలయ్యే సమయానికి కోలుకుంటాడా అన్నది అనుమానమే. గ్రీన్ స్వదేశానికి వచ్చాక పరీక్షలు చేసి అతడు ఎప్పుడు బరిలో దిగుతాడో చెప్పగలమని వైద్యులు చెప్పారు. 2019-20 సీజన్లోనూ గ్రీన్ వెన్నునొప్పితో బాధపడ్డాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య టెస్టు సిరీస్ ఆరంభానికి ఇంకా రెండు నెలల వ్యవధి ఉంది. తొలి టెస్టు పెర్త్‌లో నవంబర్ 22న మొదలు కానుంది.



కమిందు భారీ శతకం

శ్రీలంక 602/5 డిక్లేర్డ్.. కివీస్ 22/2

గాలె: కమిందు మెండిస్ (182 నాటౌట్; 250 బంతుల్లో 16×4, 4×6) అదరగొట్టాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారీ శతకంతో శ్రీలంకను తిరుగులేని స్థితికి చేర్చాడు. ఓవర్‌నైట్ స్కోరు 306/3తో శుక్రవారం ఉదయం ఆట కొనసాగించిన శ్రీలంక 163.4 ఓవర్లలో 602/5 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కమిందు, కుశాల్ మెండిస్ (106 నాటౌట్; 149 బంతుల్లో 6×4, 3×6) సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా 200 పరుగులు జతచేశారు. ఈ క్రమంలో కమిందు.. టెస్టు క్రికెట్లో అత్యంత వేగంగా 1000 పరుగులు చేసిన వారిలో మూడో స్థానంలో ఉన్న క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ (13 ఇన్నింగ్స్; ఆస్ట్రేలియా) సరసన చేరాడు. 1930లో బ్రాడ్‌మన్ ఈ రికార్డు సాధించాడు. 1925లో హెర్బర్ట్ సట్‌క్లిఫ్ (ఇంగ్లాండ్), 1949లో ఎవర్టన్ వీక్స్ (వెస్టిండీస్) 12 ఇన్నింగ్స్‌ల్లోనే 1000 పరుగుల మైలురాయిని చేరుకున్నారు. ఇక రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 14 ఓవర్లలో 2 వికెట్లకు 22 పరుగులు చేసింది. కేన్ విలియమ్సన్ (6 బ్యాటింగ్), అజాజ్ పటేల్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

బంగ్లా అభిమానిపై దాడి!



కాన్పూర్: స్టేడియంలో పులి వేషధారణలో తమ జట్టుకు మద్దతిచ్చే బంగ్లాదేశ్ వీరాభిమాని రోబి అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. శుక్రవారం గ్రీన్ పార్క్ స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టు సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. "కానిస్టేబుల్‌ను కలిసినప్పుడు రోబి శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నాడు. మేం మాట్లాడే లోపు అతను స్పృహ తప్పాడు. ప్రస్తుతం అతను బాగానే ఉన్నాడు'' అని అదనపు పోలీస్ కమిషనర్ హరీశ్ చందర్ తెలిపారు. అయితే భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు సిరాజ్‌ను దూషిస్తుండడంతో భారత అభిమానులు అతడితో గొడవ పడ్డట్లు తెలిసింది. కొందరు తన పొత్తి కడుపుపై కొట్టినట్లు రోబి చెప్పాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినట్లు వీడియో సందేశంలో పేర్కొన్నాడు. "నేను అనారోగ్యానికి గురయ్యా. పోలీసులు నన్ను ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇప్పుడు నేను చాలా బాగున్నా. నా పేరు రోబి. నేను బంగ్లాదేశ్ నుంచి వచ్చా'' అని రోబి తెలిపాడు.

యూత్ టీటీలో భారత్ హవా

దిల్లీ: సౌదీ అరేబియాలో జరిగిన డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో అండర్-19, అండర్-15 విభాగాల్లో భారత్ పతకాల పంట పండించింది. ఆరు స్వర్ణాలతో సహా 27 పతకాలు కొల్లగొట్టింది. వీటిలో ఏడు రజతాలు, 14 కాంస్య పతకాలు కూడా ఉన్నాయి. సుహానా సైని (అండర్-19, బాలికలు సింగిల్స్), హంసిని (అండర్-17, బాలికలు సింగిల్స్), సార్థక్ (అండర్-15, బాలురు సింగిల్స్), బాలమురుగన్-జెన్నిఫర్ (అండర్-19, మిక్స్‌డ్ డబుల్స్), కావ్యభట్ (అండర్-15 బాలికల సింగిల్స్), సార్థక్-కావ్య (అండర్-15, మిక్స్‌డ్ డబుల్స్)లో స్వర్ణాలు కైవసం చేసుకున్నారు.

హాకీ స్టార్లను పట్టించుకోకుండా...



దిల్లీ: వరుసగా రెండు ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకాలతో అదరగొట్టారు భారత హాకీ వీరులు. ఇంకా అనేక టోర్నీల్లో చక్కటి ప్రదర్శనతో భారత జట్టు పూర్వ వైభవం దిశగా అడుగులేస్తోంది. అయితే ఇంత సాధిస్తున్నా సామాన్య జనాల్లో తమకు పెద్దగా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు యువ ఆటగాడు హార్దిక్ సింగ్. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచి స్వదేశానికి వచ్చాక ఎయిర్‌పోర్టులో జనం తమను గుర్తు పట్టకుండా సోషల్ మీడియా ద్వారా ప్రాచుర్యం పొందిన డాలీ చాయ్‌వాలా వెంట పడ్డట్లు అతను వెల్లడించాడు. ఆ సమయంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, స్టార్ ఆటగాడు మన్‌దీప్ సింగ్ సహా అయిదారుగురు పేరున్న ఆటగాళ్లు ఉన్నప్పటికీ.. అభిమానుల్లో ఎవరూ తమను గుర్తు పట్టలేదని హార్దిక్ చెప్పాడు. తమను పట్టించుకోకుండా డాలీతో సెల్ఫీలు దిగడానికి జనం ఎగబడ్డారని.. అప్పుడు ఆశ్చర్యంతో తామంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నామని హార్దిక్ తెలిపాడు.

హెరీరా హ్యాట్రిక్

గోవా విజయం

కోల్‌కతా: బోజా హెరీరా హ్యాట్రిక్ సాధించడంతో ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లో గోవా ఎఫ్‌సీ బోణీ కొట్టింది. శుక్రవారం ఆ జట్టు 3-2తో ఈస్ట్ బెంగాల్‌ను ఓడించింది. 20 నిమిషాల్లోనే గోవా 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ రెండు గోల్స్‌ను హెరీరానే చేశాడు. 29వ నిమిషంలో పెనాల్టీని తలాల్ గోల్‌గా మలచడంతో బెంగాల్ మ్యాచ్‌లోకి వచ్చింది. మ్యాచ్ చివరి దశలో హెరీరా మరో గోల్ చేయడంతో గోవా 3-1తో విజయం దిశగా సాగింది. 81వ నిమిషంలో మెక్‌హ్యూ (81వ)కి రిఫరీ రెడ్ కార్డ్ ఇవ్వడంతో గోవా పదిమందికే పరిమితమైంది. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుంటూ బెంగాల్ ఆటగాడు డేవిడ్ (85వ) బంతిని నెట్‌లోకి పంపినా గోవా చివరిదాకా మరో గోల్ చేయనీయకుండా ప్రత్యర్థిని అడ్డుకుని విజయం సాధించింది.

ఆ స్పిన్ జోడీని అడ్డుకుంటేనే..



మ్యాక్స్‌వెల్

దిల్లీ: భారత స్పిన్ ద్వయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలను సమర్థంగా అడ్డుకోవడంపైనే బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా విజయం ఆధారపడి ఉంటుందని ఆ జట్టు ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అన్నాడు. ఆస్ట్రేలియాలో జరిగిన గత రెండు సిరీస్‌లోనూ టీమ్‌ఇండియానే గెలుచుకున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "చాలా ఏళ్లుగా అశ్విన్, జడేజాలను ఎదుర్కొంటున్నాం. ఎక్కువ సందర్భాల్లో వీళ్లిద్దరూ మ్యాచ్ ఫలితాన్ని శాసించారు. రాబోయే టెస్టు సిరీస్‌లోనూ మా బ్యాటర్లు ఈ జోడీని సమర్థంగా అడ్డుకోవడంపైనే ఆసీస్ విజయం ఆధారపడి ఉంటుంది'' అని మ్యాక్సీ చెప్పాడు. తక్కువ సమయంలోనే పేసర్ బుమ్రా ఎంతో ప్రభావవంతమైన బౌలర్‌గా ఎదిగాడని అతడన్నాడు. "బుమ్రా మంచి ఫామ్‌లో ఉన్నాడు. 2013 ఐపీఎల్‌లో అతడిని నెట్స్‌లో ఎదుర్కొన్నా. ఇప్పుడు మూడు ఫార్మాట్లలో ఉత్తమ బౌలర్‌గా ఎదిగాడు. అతడిదొక గొప్ప కథ'' అని మ్యాక్స్‌వెల్ పేర్కొన్నాడు. 2018-19, 2020-21 సిరీస్‌లలో ఆసీస్‌ను భారత్ ఓడించింది. ఈ నవంబరులో ఆరంభమయ్యే సిరీస్‌లో మరోసారి కంగారూలతో తలపడబోతోంది.

2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్ లక్ష్యం



సోనీపత్: 2025 టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తెలిపాడు. కొత్త సీజన్‌లో 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉంటానని చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజతం.. బ్రసెల్స్ డైమండ్ లీగ్ ఫైనల్లో ద్వితీయ స్థానంతో సీజన్‌ను ముగించిన నీరజ్ శుక్రవారం భారత్‌కు తిరిగొచ్చాడు. "ఇప్పుడు సీజన్ ముగిసింది. వచ్చే ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్ అతిపెద్ద లక్ష్యం. అందుకోసం సన్నాహాలు ప్రారంభిస్తాం. ఒలింపిక్స్ ఎప్పుడూ మదిలోనే ఉంటుంది. విశ్వ క్రీడలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. ఇప్పుడు గాయంతో ఇబ్బంది పడట్లేదు. కొత్త సీజన్‌లో 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉంటా. కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిపై పనిచేస్తాం. నా టెక్నిక్‌ను మెరుగుపరుచుకుంటా. భారత్‌లోనే శిక్షణ తీసుకుంటా. కాని పోటీలు ప్రారంభమైతే విదేశాల్లో తర్ఫీదు పొందుతా'' అని నీరజ్ వివరించాడు.

ఈనాడు

హైదరాబాద్ 28-9-2024 శనివారం సిటీ సంపుటి 51. సంచిక 49

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సిల్వర్ సునామీ!

జనాభా విస్ఫోటం...
పేలుతున్న జనబాంబు...
కొన్నాళ్ల కిందటి దాకా ప్రపంచాన్ని భయపెట్టిన పదాలివి! కానీ ఇప్పుడు వాటితో భయం లేదు. జనాభా వృద్ధిరేటు నెమ్మదించటమే ఇందుకు కారణం! కానీ ఇప్పుడు మరో కొత్త పదం ప్రభుత్వాలను ఆలోచింపజేస్తోంది...
ఆందోళనలోకి నెడుతోంది!
అదే సిల్వర్ సునామీ!

ఉత్పాదనలో కీలకమైన యువతరం సంఖ్య తగ్గి, వయోధికుల సంఖ్య పెరుగుతున్న ఈ పరిణామానికి ఆర్థికవేత్తలు 'సిల్వర్ సునామీ'గా నామకరణం చేశారు. ఈ సునామీని తట్టుకోవటం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు సమాయత్తమవుతున్నాయి. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా వయోధికుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2022 ఐక్య రాజ్యసమితి గణాంకాల ప్రకారం... ప్రపంచంలో 77.1 కోట్ల మంది 65 ఏళ్ల పైబడినవారున్నారు. అంటే మొత్తం జనాభాలో వీరు దాదాపు 10శాతం! ఈ సంఖ్య రాబోయే రోజుల్లో వేగం పుంజుకుంటుందని ఐరాస అంచనా వేసింది. వివిధ దేశాల్లో జనాభా వృద్ధి, తగ్గుతున్న శిశుమరణాల రేటు నేపథ్యంలో... 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పెరగటం అనివార్యమని ఐరాస నిపుణులంటున్నారు. 2050 నాటికి వీరి వాటా 16 శాతానికి, ఈ శతాబ్ది అంతానికి 24 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. అంటే.... 2100 నాటికి ప్రపంచంలో ప్రతి నలుగురిలో ఒకరు 65 ఏళ్ల పైబడినవారుంటారు.



ఆ అంతరం పెరిగింది!

గతంలో 65 ఏళ్ల పైబడిన వారి కంటే ఐదేళ్ల లోపు వయసున్న వారి సంఖ్యే ఎక్కువ. 2018లో ఈ గణాంకాలు మారిపోయాయి. ప్రపంచ జనాభాలో 65 ఏళ్లు పైబడినవారి సంఖ్య ఐదేళ్ల లోపు పిల్లల సంఖ్యకంటే అధికమైంది. అక్కడినుంచి 65 ఏళ్లు దాటిన వారి సంఖ్య పెరుగుతూ పోతోంది. ఇది అన్ని దేశాల్లోనూ ఒకేరకంగా లేనప్పటికీ అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ అంతరం ఎక్కువగా నమోదవుతోంది.

ఇప్పటికే....

ఇప్పటికే జపాన్, ఇటలీ, ఫిన్లాండ్‌లాంటి దేశాల్లో 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య భారీగా ఉంది. జపాన్‌లో అత్యధికంగా దాదాపు 30శాతం, ఇటలీలో 24%, ఫిన్లాండ్‌లో 23శాతం 65 ఏళ్ల పైబడినవారున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో (ఖతార్, ఉగాండా, అఫ్గానిస్థాన్..) మాత్రం వీరి వాటా 2%కంటే తక్కువ నమోదవుతోంది. కానీ మునుముందు కాలంలో దాదాపు అన్ని దేశాల్లోనూ వయోధికుల జనాభా పెరుగుతుందంటున్నారు. వచ్చే 30 ఏళ్లలోనే ముఖ్యంగా... ఐరోపా, ఉత్తర అమెరికా, ఆసియా దేశాల్లో ప్రతి నలుగురిలో ఒకరు 65 ఏళ్లు దాటినవారే ఉండొచ్చన్నది నిపుణుల భావన. తక్కువ జనాభావృద్ధి నమోదవుతున్న దేశాల్లో ఈ సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుంది. 2100 నాటికి ముఖ్యంగా దక్షిణకొరియా, జమైకాల్లో వీరి సంఖ్య 44%, అల్బేనియాలోనైతే 49శాతం పైబడుతుంది. చాద్‌లాంటి (ఆఫ్రికా) దేశాల్లో ఈ సంఖ్య 10శాతంలోపే ఉంటుందని అంచనా.

-పూర్తి కథనం 2లో

వంటింట్లో ధరల మంట

భారీగా పెరిగిన వంట నూనెల రేట్లు ● 12 రోజుల్లోనే లీటరుకు రూ.17 నుంచి రూ.42 వరకు పెరుగుదల

పాత నిల్వలకూ కొత్త బాదుడే ● ఉల్లి, వెల్లుల్లి, పప్పులకూ రెక్కలు ● పండగ వేళల్లో వినియోగదారులపై భారం

ఈనాడు, హైదరాబాద్: పండుగల సీజన్‌లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్లు, మాల్స్‌లోనూ సరకులన్నీ తగ్గేదేలే అన్నట్టుగా పైకి ఎగబాకుతున్నాయి. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచుతున్నట్లు ఈ నెల 14న ప్రకటించగా మరుసటిరోజు నుంచే వాటి ధరలు పెరిగాయి. కేంద్రం కేవలం ఆయిల్‌పామ్, సోయా, పొద్దుతిరుగుడులపై మాత్రమే సుంకం విధించినా.. మిగిలిన అన్ని వంట నూనెల ధరలను కంపెనీలు, వ్యాపారులు పెంచేశారు. పండగల సీజన్‌ను వారు తమకు అవకాశంగా తీసుకోవడంతో నూనెల ధరలు మండుతున్నాయి. నగరాలు, పట్టణాల్లోని దుకాణాల్లోనే కాదు..



గ్రామాల్లోనూ పెరుగుదల భారీగా ఉంది. ఆన్‌లైన్ విక్రయ సంస్థలూ పెంచాయి. మాల్స్‌లోని నిల్వలను నల్లబజారుకు తరలించి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

...మిగతా 10లో

వంట నూనెల ధరలు ఇలా.. (లీటరుకు రూపాయల్లో)

రకం	15న- 26వ తేదీన
పామాయిల్	↑ 110 – 152
సోయా	↑ 110 – 152
సన్‌ఫ్లవర్	↑ 115 – 150
వేరుసెనగ	↑ 130 – 163
నువ్వులు	↑ 109 – 140
రైస్‌రిచ్	↑ 116 – 133
పత్తి	↑ 106 – 128



నేడు రాష్ట్రానికి రాష్ట్రపతి ముర్ము

● నల్సార్ స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా హాజరు

8లో

వరద బాధితుల సహాయార్థం

రిలయన్స్ భూరి విరాళం

● సీఎం రేవంత్‌కు రూ.20 కోట్ల చెక్కు అందజేత

8లో

91 ప్రశ్నలు... తొట్రుపాటు సమాధానాలు

10లో

● జస్టిస్ పీసీ ఘోష్ విచారణలో గజ్వేల్ ఈఎన్సీ, కేపీసీఎల్ ఎండీ హరీరాం ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్

కొత్త ప్రాంగణం

● 5 వేల మందికి ఉద్యోగావకాశాలు

● నూతన క్యాంపస్ ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తమ కొత్త క్యాంపస్‌ను త్వరలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ప్రారంభించనుంది. ఇందులో అదనంగా 5 వేల మంది ఇంజినీర్లకు ఉద్యోగాలను కల్పించనుంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

...మిగతా 2లో



హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం రేవంత్



ఎందుకింత దూకుడు!

● ఒక్క రోజు కూడా ఆగలేరా.. ● హైడ్రాకు చట్టబద్ధత ఏమిటి?

● వ్యక్తిగతంగా హాజరై వివరణివ్వండి

● హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్‌లకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: 'అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేతల్లో ఎందుకింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు? శనివారం నోటీసు ఇచ్చి ఆదివారం కూల్చివేస్తారా? ఒక్కరోజు కూడా ఆగలేరా' అని హైడ్రాను శుక్రవారం హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటంటూ గతంలోనే రెండు పిటిషన్లలో అడిగామని, మళ్లీ అడుగుతున్నామని వ్యాఖ్యానించింది. హైడ్రా కేవలం నోడల్ ఏజెన్సీ మాత్రమేనని పేర్కొంది.

...మిగతా 2లో

గందరగోళంగా.. పునరావాసం

● వ్యతిరేకించిన మూసీ నిర్వాసితులు

● ధర్నా చేపట్టిన ఎంపీ ఈటల

2లో



హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి చేయడంతో దట్టంగా అలముకున్న పొగ

నస్రల్లా లక్ష్యంగా భీకర దాడి

● హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

● దద్దరిల్లిన బీరుట్ నగరం

● నేలమట్టమైన అనేక భవంతులు

● అంతుచిక్కని హెజ్‌బొల్లా అధిపతి జాడ!

● ఐరాసలో ఇరాన్‌పై నెతన్యాహు నిప్పులు

● యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టీకరణ

11లో



సోదాల సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నం.17లోని ఇంటి వద్ద సీఆర్‌పీఎఫ్ బందోబస్తు

పొంగులేటి కుటుంబసభ్యుల ఇళ్లలో ఈడీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: ఖరీదైన చేతి గడియారాల కొనుగోలుకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. దిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులు స్థానిక అధికారుల సహకారంతో ఈ సోదాలు జరిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 17లో ఉన్న ఇల్లు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంతో పాటు మొత్తం అయిదు ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి పొద్దుపోయే వరకూ కొనసాగాయి. హిమాయత్‌సాగర్‌లోని పొంగులేటి నివాసంలో ఆయన కుమారుడు హర్షరెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. ఈ ఇంట్లో ఈడీ సోదాలు జరగలేదని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

ఇదీ కేసు..

ఈ ఏడాది ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి చెన్నై వచ్చిన ముబీన్ అనే వ్యక్తి నుంచి కస్టమ్స్ అధికారులు ఖరీదైన చేతి గడియారాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, ముబీన్‌ను విచారించిన కస్టమ్స్ అధికారులు.. అతడు రూ.1.73 కోట్ల విలువైన రెండు వాచీలను పొంగులేటి కుమారుడు హర్షరెడ్డి కోసం తెచ్చాడని, అందుకు నవీన్‌కుమార్ మధ్యవర్తిగా వ్యవహరించాడని గుర్తించారు. వాటి కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు క్రిప్టో కరెన్సీ, హవాలా ద్వారా జరిగినట్లు కస్టమ్స్ అధికారులు నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా చెన్నై కస్టమ్స్ అధికారులు గత జూన్‌లో కూడా పొంగులేటి ఇంట్లో సోదాలు నిర్వహించారు. సుంకం చెల్లించకుండా విదేశాల నుంచి వస్తువులను దిగుమతి చేసుకోవడం విదేశీ మారకద్రవ్య నిరోధక చట్టం (ఫెమా) కిందికి వస్తుందంటూ ఈడీ దీనిపై మరో కేసు నమోదు చేసింది. ఈ దర్యాప్తులో భాగంగానే ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. తనిఖీల సమయంలో ఖమ్మం ఎంపీ, పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి జూబ్లీహిల్స్ ఇంటికి వచ్చి వెళ్లారు.

రాజకీయ కక్షతోనే ఈడీ దాడులు: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాజకీయ కక్షతోనే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వారి బంధువుల ఇళ్లపై ఈడీ దాడులు చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. భాజపా, భారాస పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందంలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయంగా లబ్ధి పొందడానికి కాంగ్రెస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, భయపెట్టడానికి ఈడీ, సీబీఐని వాడుకుంటున్నారని మండిపడ్డారు.

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ కొత్త ప్రాంగణం

(మొదటి పేజీ తరువాయి)

నూతన ప్రాంగణ విశేషాలను సీఎంకు వివరించారు. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆమె ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు, విద్యా వనరులను విస్తరించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది యువకులకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాభివృద్ధికి హెచ్‌సీఎల్‌తో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్‌సీఎల్ విశేషంగా కృషి చేస్తోంది. ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుంది. యువతకు ఉద్యోగావకాశాలను కల్పించటంతో పాటు.. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి హెచ్‌సీఎల్ వ్యూహాత్మక భాగస్వామ్యం దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలను నేర్పించి సాధికారత కల్పించేందుకు చేపట్టే కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని రోష్ని నాడార్ అన్నారు. ఉపాధి అవకాశాలతో పాటు సాంకేతిక సామర్థ్యాలను 'హెచ్‌సీఎల్ గువి' పెంపొందిస్తుందని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీతో పాటు హెచ్‌సీఎల్ విద్యా కార్యక్రమాలను తెలంగాణలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించే ప్రణాళికలను సమావేశంలో చర్చించారు.




తల్లిదండ్రుల్లో ఈ లక్షణాలు పిల్లలకు నచ్చవు

తల్లిదండ్రుల్లోని కొన్ని లక్షణాలు పిల్లలకు అస్సలు నచ్చవు. అవేంటంటే..
✦ ఎప్పుడూ ఫోన్‌లో లీనమవడం ✦ వారితో ఎక్కువ సమయం గడపకపోవడం ✦ తరచూ కోప్పడటం ✦ ప్రతి విషయంలో తప్పులను ఎత్తిచూపడం ✦ అబద్ధాలు చెప్పడం

– జాన్ డెలోనీ, మానసిక ఆరోగ్య నిపుణుడు

సిల్వర్ సునామీ!





మన దేశం పరిస్థితేంటి

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి ఉన్న దేశంగా పేరొందిన భారతావనికి ఇప్పటికిప్పుడు సిల్వర్ సునామీ సమస్య లేకున్నా... జనాభా పెరుగుదల రేటు తగ్గుదల నేపథ్యంలో కొద్ది సంవత్సరాల్లోనే (2050 నాటికి) ఇప్పుడు ఐరోపా, జపాన్‌లాంటివి ఎదుర్కొంటున్న ఇబ్బంది భారత్‌కు ఎదురవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ప్రస్తుతం 60 ఏళ్ల పైబడ్డ వారి సంఖ్య భారత్‌లో సుమారు 10 కోట్లుంది. 2050 నాటికి ఇది 24 కోట్లకు చేరుకుంటుంది. ఈ శతాబ్దం చివరికల్లా ఆ సంఖ్య మూడింతలవుతుందన్నది అంచనా!

సిల్వర్ సునామీకి కారణాలు...

1 ఆరోగ్య, వైద్య రంగంలో పరిశోధనల కారణంగా జీవన ప్రమాణాలు పెరగటం

● భారత్‌లోనే చూస్తే... 1960ల్లో 41 సంవత్సరాలున్న సగటు ఆయుర్దాయం ఇప్పుడు 70కి చేరుకుంది. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఈ సంఖ్య 80దాటింది.

2 సంతాన సాఫల్య సామర్థ్యం తగ్గిపోతుండటం

● ప్రపంచవ్యాప్తంగా... 1960ల్లో మహిళల సగటు సంతానం ఒక మహిళకు ఆరుగురు కాగా ఇప్పుడది 2కు పడిపోయింది. రష్యా, జపాన్‌లాంటి దేశాల్లో ఇది ఇంకా తక్కువ! జపాన్‌లో మహిళల సగటు సాఫల్యత కేవలం 1.26.

● పెరిగిపోయిన జీవనవ్యయాల కారణంగా చాలామంది దంపతులు జపాన్‌లో పిల్లల్ని కనటానికి ఇష్టపడటం లేదు.

● ఈ ఏడాది చివరికల్లా ఐరోపాలో 15 ఏళ్ల లోపు జనాభాకంటే 65 ఏళ్లపైబడ్డ వారి జనాభా పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

● వీటన్నింటి ఫలితంగా... ఉత్పత్తిలోకి వచ్చే యువ జనాభాకంటే... రిటైర్మెంట్ వయసును చేరుతున్న జనాభా ఎక్కువగా ఉంటోంది.

సవాళ్లు:

పెరిగిన జీవన ప్రమాణాల నేపథ్యంలో ఎక్కువ మంది రిటైరయ్యాక కూడా చాలాకాలం జీవించి ఉండటంతో ప్రభుత్వాలపై పింఛన్ల భారం పడుతుంది.

వయోవృద్ధుల పెరుగుదల కారణంగా ఆరోగ్య సంరక్షణ కీలకమవుతుంది. దీనిపై ప్రభుత్వం ఎక్కువ ఖర్చుచేయాల్సి ఉంటుంది.

ఉత్పాదనలో యువశక్తి తగ్గి... వయసు పైబడిన వారు పెరుగుతారు. దాని ప్రభావం ఉత్పాదనపై కూడా ఉండే అవకాశం ఉంది.


ఏంటి ప్రభావం?

● జీవన ప్రమాణాలు, సౌకర్యాలు పెరుగుతుండటంతో వయసు పైబడిన వారు పనిచేసే కాలం కూడా పెరుగుతోంది.

● తగినంత యువశక్తి లేని కారణంగా ఉద్యోగ విరమణ వయసులను పెంచుతూ వారినే కొనసాగించేందుకు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

● తాజాగా చైనా కూడా ఉద్యోగ విరమణ వయసును పెంచుతున్నట్లు ప్రకటించింది. రాబోయే జనవరి నుంచి రిటైర్మెంట్‌ను మగవారికి 60 నుంచి 63, మహిళలకు 55 నుంచి 58 చేసింది.

అవకాశాలు



● కృష్ణారామా అనుకుంటూ కూర్చునే స్థితి నుంచి... వయసును మరచి పనిలో కొనసాగటం చాలామందిని చలాకీగా ఉంచే అవకాశముంది.

● తమకంటే చిన్నవారితో కూడా కలసి పనిచేయటం... తరాల అంతరాలను తగ్గిస్తుంది.

● వయసు పైబడినవారు ఎక్కువకాలం పనిచేస్తూ, జీవిస్తూ ఉండటంతో వారికి ఇళ్లలో, బయటా... కార్యాలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సి వస్తుంది. వారిని దృష్టిలో ఉంచుకొని అనేక ఆవిష్కరణలు రావొచ్చు.

1950 నుంచి 2100 వరకు 65 ఏళ్లు పైబడిన జనాభా వాటా (శాతాల్లో)

దేశం	1950	2022	2100 (అంచనా)
భారత్	3.1	6.9	29.81
ఇండోనేసియా	1.74	6.8	25.28
ఇటలీ	8	24	38.1
జపాన్	4.8	29.9	38.7
జమైకా	3.8	7.4	44
పాకిస్థాన్	5.4	4.2	17.2
పోర్టోరికో	3.6	22.9	48.9
రష్యా	4.8	15.8	27.8
సౌదీ అరేబియా	3.3	2.8	30.2
సింగపూర్	2.29	15.1	36.5
దక్షిణకొరియా	2.7	17.49	44.4
అమెరికా	8.1	17.1	30.4
బ్రిటన్	10.8	19.1	32.5
ఫ్రాన్స్	11.3	21.6	34.2
జర్మనీ	9.4	22.4	33.7
చైనా	5.04	13.72	40.93
ఆస్ట్రేలియా	8.1	16.9	31.38
ప్రపంచవ్యాప్తంగా	**5.13**	**9.82**	**24.03**

● ఆరోగ్య భద్రత మెరుగుపడుతుంది.

● ఇప్పటికే అమెరికాలో అనేకచోట్ల పెద్దవారికి వర్క్ఔట్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

● వారి ఆరోగ్య భద్రత కోసం, సౌకర్యాల కోసం... ఇంటి నుంచి ఆఫీసుల దాకా ప్రతి చోటా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

● జపాన్‌లాంటి చోట్ల రోబోటిక్ పెంపుడు జంతువులు కూడా వచ్చేస్తున్నాయి

సవాళ్లతో పాటు... సామాజిక మార్పులకు, సరికొత్త ఆవిష్కరణలకు కూడా సిల్వర్ సునామీ అవకాశం కలిపిస్తోంది. సరికొత్త సంబంధాలు, ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో మానవాళి సిల్వర్ సునామీని ఆవాహన చేసుకోబోతోంది!

– ఈనాడు ప్రత్యేక విభాగం

గందరగోళంగా.. పునరావాసం







న్యూమారుతీనగర్ నార్త్ కాలనీలో రసాయనం పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన యువకుడిపై నీరు పోస్తున్న పోలీసు అధికారి ★ న్యూమారుతీనగర్ వద్ద ధర్నా చేస్తున్న ఎంపీ ఈటలకు తన గోడును వినిపిస్తున్న ఓ వృద్ధుడు ★ లంగర్‌హౌస్ సమీపంలోని ఆశంనగర్‌లో బాధితుల నిరసన

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, మెహిదీపట్నం, కార్వాన్, నాగోల్: మూసీ నది అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన పునరావాస ప్రక్రియ గందరగోళంగా మారింది. నిర్వాసితులను ఖాళీ చేయించడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో సర్వే కోసం వెళ్లిన మండల రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. ఇప్పటికిప్పుడు ఇళ్లు ఖాళీ చేయాలంటూ కొన్ని ప్రాంతాల్లో అధికారులు బాధితుల పట్ల అత్యుత్సాహం ప్రదర్శించడం వివాదాస్పదమైంది. తమకు మూడు నాలుగు రోజులు గడువు ఇవ్వాలని వారు కోరారు. కొన్నిచోట్ల ఇందుకు తహసీల్దార్లు ససేమిరా అనడం ఆందోళనకు దారి తీసింది. మూసీ పరీవాహక ప్రాంతంలో దాదాపు వెయ్యికిపైగా పక్కా భవనాలు ఉన్నాయి. ఇందులో రెండు, మూడు అంతస్తుల కట్టడాలుండటం గమనార్హం. ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం బాధితుల తరఫున రంగప్రవేశం చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, అంబర్‌పేట, గోల్నాక, తదితర డివిజన్ల కార్పొరేటర్లు అధికారుల తీరుకు నిరసన తెలుపుతూ.. బాధితులకు మద్దతుగా నిలిచారు.

ఆందోళనలు ఇలా...

మూసీ పరీవాహక ప్రాంతాలైన చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్, నాగోల్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. లంగర్‌హౌస్‌లోని ఆశంనగర్‌లో బాధితులు రోడ్డెక్కారు. వారు పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నంబరు 102 వద్ద ఉదయం 11 గంటల నుంచి రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మూసారంబాగ్ వద్ద మూసీ సమీప పరిశ్రమల యజమానులు ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. గోల్నాక డివిజన్‌లోని తులసీనగర్‌లంక, కమలానగర్, గంగానగర్ తదితర కాలనీల్లో సర్వే చేపట్టేందుకు వచ్చిన సైదాబాద్ ఎమ్మార్వో, సిబ్బందిని బాధితులు అడ్డుకున్నారు. కార్వాన్‌లోని కేసరి హనుమాన్ ఆలయం సమీపంలోని మూసీ నది వెంట దరియాబాగ్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. మార్కింగ్ చేస్తున్న అధికారుల్ని పెద్దఎత్తున బస్తీవాసులు అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులూ ఉన్నాయంటూ కరెంటు బిల్లులు, పన్ను రసీదులు చూపించారు. 127 ఇళ్లు రివర్‌బెల్టులో ఉన్నట్లు గుర్తించామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఏం పని చేసుకుని బతకాలి?

పదేళ్లుగా నివాసముంటున్న ఇళ్లను.. ఉన్నపళంగా ఖాళీ చేయిస్తున్నారంటూ చాదర్‌ఘాట్‌లోని మూసానగర్‌కు చెందిన రెహ్మాన్ అనే బాధితుడు సర్వే చేపట్టిన తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్లన్నింటినీ బయట పెట్టండని.. వాహనం వచ్చి ఉప్పల్ తీసుకెళ్తుందని అధికారి బాధితుడితో చెప్పారు. గడువు కావాలని అడిగినా అధికారి వినలేదు. స్థానికంగా పనులు చేసుకునే తమను, ఉప్పల్‌కు తరలిస్తే.. ఏం పని చేసుకుని బతకాలంటూ రెహ్మాన్ అధికారిని ప్రశ్నించగా.. అయితే పటాన్‌చెరు సమీపంలో కొల్లూరు వెళ్లాలన్నారు. అధికారుల తీరుతో విసిగిపోయిన కొందరు బాధితులు మలక్‌పేట ఎమ్మెల్యే బలాలను ఆశ్రయించారు. తాను చెప్పేవరకూ ఎవరూ ఇళ్లను ఖాళీ చేయొద్దని ఆయన వారికి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఇంటి పన్ను, నల్లా, కరెంటు కనెక్షన్, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు వంటి అన్నిరకాల పత్రాలతో కొన్నేళ్లుగా తాము నది ఒడ్డున నివసిస్తున్నామని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటేసి గెలిపిస్తే.. ప్రభుత్వం తమ ఇళ్లను కూల్చుతోందని న్యూమారుతీనగర్ నార్త్ ప్రాంతంలో మహేశ్ అనే యువకుడు ఒంటిపై రసాయనం పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. 9 నెలల గర్భవతి అయిన తన భార్యను తీసుకుని ఎక్కడికెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని ఒంటిపై నీరు పోసి సముదాయించారు.

ప్రభుత్వం జవాబు చెప్పాలి: ఈటల

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొత్తపేట మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ న్యూమారుతీనగర్ ఈస్ట్ కాలనీలో ధర్నా చేపట్టారు. ఎంపీనైన తనకు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలకు పాల్పడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్‌కు ఫోన్ చేస్తే.. ఆయన స్పందించలేదని, ప్రభుత్వం దిగి వచ్చి సమాధానం చెప్పేంత వరకు అక్కడి నుంచి కదిలేది లేదని ఎంపీ ధర్నాకు దిగారు.

ప్రయోజనాలందించాకే నిర్మాణాల తొలగింపు: దానకిశోర్

మూసీ ప్రక్షాళనలో నిర్వాసితులకు ప్రయోజనాలందించాకే నిర్మాణాలను తొలగిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దానకిశోర్ అన్నారు. ఆయన శుక్రవారం మూసీ సుందరీకరణ, అభివృద్ధి, నిర్వాసితులకు పునరావాసం తదితర అంశాలపై ఎన్జీవోల సలహాలు, సూచనలు స్వీకరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు 15 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. నిర్వాసిత కుటుంబాల విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూస్తామన్నారు. రివర్‌బెడ్‌లో నిర్మాణాల సర్వే, మార్కింగ్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు.

ఎందుకింత దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పంచాయతీ శ్రీకృష్ణనగర్‌లో మహమ్మద్ రఫీ, గణేష్ కన్‌స్ట్రక్షన్‌లకు చెందిన ఆసుపత్రి భవనం కూల్చివేయడాన్ని తప్పుబట్టింది. ఈ భవనానికి సంబంధించి చట్ట ప్రకారం వ్యవహరించాలంటూ సెప్టెంబరు 5వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ తహసీల్దార్, హైడ్రా చేపట్టిన చర్యలను ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చేపట్టిన కూల్చివేతలపై ఈనెల 30వ తేదీన వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్‌లకు ఆదేశాలిచ్చింది. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేని పక్షంలో ఆన్‌లైన్‌లో అయినా హాజరై వివరణ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఈలోగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ వివరణను సమర్పించాలని దాని తరఫు న్యాయవాదిని ఆదేశించింది. అమీన్‌పూర్‌లోని సర్వే నం.164లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలంటూ ఈ నెల 20వ తేదీన తహసీల్దార్ ఇచ్చిన నోటీసును సవాల్‌చేస్తూ డాక్టర్ మహమ్మద్ రఫీ, అమీన్‌పూర్‌కు చెందిన గణేష్ కన్‌స్ట్రక్షన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది నరేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 20న జారీచేసిన నోటీసులు 21న సాయంత్రం 6.30కి అందజేసి, 22న ఉదయం 7.30 గంటలకు జేసీబీ, బుల్డోజర్లు, 50మంది సిబ్బందితో వచ్చిన హైడ్రా కూల్చివేతలు చేపట్టిందన్నారు. వాస్తవంగా సర్వే నం.165, 166లోని మహమ్మద్ రఫీకి చెందిన 270 గజాల స్థలాన్ని గణేష్ కన్‌స్ట్రక్షన్‌కు విక్రయించారన్నారు. ఇందులో 2022 నవంబరు 10వ తేదీన పంచాయతీ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో హైడ్రా తరఫు న్యాయవాది తన వాదనల్లో.. ఆసుపత్రి ఉన్న ప్రాంతాన్ని హైడ్రా ఎప్పుడూ సందర్శించలేదని, కూల్చివేయాలని అధికారులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఏవైనా చర్యలు చేపడితే జీవో 99 ప్రకారం ఉంటాయని న్యాయస్థానానికి హామీ ఇవ్వడంతో పిటిషన్‌పై సెప్టెంబరు 5న హైకోర్టు విచారణను మూసివేసిందన్నారు. హైడ్రా తరఫు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించడానికి యంత్రాలు, సిబ్బందిని పంపాలంటూ తహసీల్దార్ లేఖ ఈ నెల 21వ తేదీన అందిందని.. జీవో 99, తహసీల్దార్ లేఖ ప్రకారం ప్రభుత్వ స్థలం రక్షణ నిమిత్తం యంత్రాలు, సిబ్బందిని పంపినట్లు తెలిపారు.

కాగా పిటిషన్లపై విచారణ ముగిసేదాకా.. కొనసాగుతున్న నిర్మాణాల్లో జోక్యం చేసుకోరాదని గతంలో ఉత్తర్వులున్నాయని, వాటితోపాటు జీవో 99 ప్రకారం చట్ట నిబంధనలను అనుసరించాలని హైడ్రాను ఆదేశిస్తూ సెప్టెంబరు 5న జారీచేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా తహసీల్దార్, హైడ్రా కమిషనర్ కూల్చివేతలు చేపట్టారని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీనిపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

ఇదీ సంగతి!



బంగారం కొంటే ఉల్లిపాయలు ఫ్రీ అంటేనూ!!

గ్రహం అనుగ్రహం 28–9–2024 శనివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం;
వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం

ఏకాదశి: సా. 4-43 తదుపరి ద్వాదశి; **ఆశ్లేష:** పూర్తి; **వర్జ్యం:** రా. 6-11 నుంచి 7-51 వరకు; **అమృత ఘడియలు:** తె. 4-14 నుంచి; **దుర్ముహూర్తం:** ఉ. 5-52 నుంచి 7-28 వరకు; **రాహుకాలం:** ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ. 5.53; సూర్యాస్తమయం: సా.5.51; సర్వ ఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	36.0	26.8
ఆదిలాబాద్	33.3	24.2
నిజామాబాద్	33.2	24.3
రామగుండం	33.0	26.0
ఖమ్మం	32.0	25.0
కరీంనగర్	32.0	23.0
మెదక్	31.8	20.8
హనుమకొండ	31.5	24.5
సూర్యాపేట	31.0	25.5
హైదరాబాద్	30.7	23.1
నల్గొండ	30.0	23.8
మహబూబ్‌నగర్	28.1	22.2

'హైడ్రా' భయంతో మహిళ ఆత్మహత్య



బుచ్చమ్మ

మూసాపేట, న్యూస్‌టుడే: 'హైడ్రా'కు భయపడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. తమ కట్టడాలను కూల్చివేస్తారనే బెంగతో ఉరేసుకుంది. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కూకట్‌పల్లి రామాలయం సమీపంలోని యాదవబస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ (56), శివయ్య యాదవ్ దంపతులు నివాసముంటున్నారు. కూకట్‌పల్లి నల్లచెరువు పరిధిలోని 16 కట్టడాలను 'హైడ్రా' అధికారులు ఈ నెల 22న కూల్చివేయగా.. వాటి ఎదురుగానే బుచ్చమ్మ, శివయ్య దంపతులకు రెండు ఇళ్లు, ఓ షెడ్డు ఉన్నాయి. ఈ మూడింటిని వారు తమ ముగ్గురు కుమార్తెలకు రాసి ఇచ్చారు. అయితే అధికారులు నల్లచెరువులోని కట్టడాలను కూల్చివేసినప్పటి నుంచి బుచ్చమ్మ దిగులుగా ఉంటున్నారు. తమ కుమార్తెలకు రాసిచ్చిన ఇళ్లు, షెడ్డును కూడా కూలుస్తారేమోనని అందరితో చెబుతూ ఆందోళన చెందుతుండేది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుమార్తె సరిత తెలిపారు. ఈ ఘటనపై కూకట్‌పల్లి ఎస్సై దీక్షిత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బుచ్చమ్మ ఆత్మహత్యకు, హైడ్రా కార్యకలాపాలకు ఎటువంటి సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

3, 4 తేదీల్లో సెర్చ్ కమిటీల సమావేశాలు!

- **దసరా నాటికి 10 వర్సిటీలకు కొత్త వీసీల నియామకం**

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని మొత్తం 10 విశ్వవిద్యాలయాలకు శాశ్వత ఉపకులపతులను నియమించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అక్టోబరు 3, 4 తేదీల్లో ప్రభుత్వం సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించనుంది. ఏ రోజు ఏ వర్సిటీల సమావేశాలన్నది శనివారం అధికారికంగా ఆయా విశ్వవిద్యాలయాలకు సమాచారం ఇవ్వనుంది. ఈ విషయమై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సమావేశమయ్యారు. సెర్చ్ కమిటీల్లో ప్రభుత్వ, యూజీసీ, వర్సిటీ నామినీలుంటారు. ప్రభుత్వ నామినీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు. దసరా లోపు 10 వర్సిటీలకు కొత్త ఉపకులపతులు రానున్నారు. గత ఉపకులపతుల పదవీ కాలం మే 21వ తేదీకి ముగియగా, నాటి నుంచి ఐఏఎస్ అధికారులు ఇన్‌ఛార్జి వీసీలుగా వ్యవహరిస్తున్నారు.



'సీతారామ' పనుల్లో వేగం పెంచండి

- భూ సేకరణ, టెండర్లలో అలసత్వం వద్దు
- ఇంజినీర్లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు
- ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి సమీక్ష


సమీక్షిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచాలని, టెండర్ల నిర్వహణ, భూ సేకరణలో అలసత్వం వద్దని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. 'ఆగస్టు 15న సీఎం పంపుహౌస్‌లను ప్రారంభించారు. మిగిలిన సొరంగాలు, కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలి. పనులకు సంబంధించి పరిపాలన అనుమతుల్లో జాప్యం లేకుండా చూడాలి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. సీఎం ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత గడువులోపు ప్రాజెక్టు పూర్తి చేయాలి' అని ఉత్తమ్ సూచించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. యాతాలకుంట సొరంగం పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తమ చిరకాల స్వప్నమని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. టెండర్లలో సాంకేతిక అంశాలకు సంబంధించి ఇంజినీర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సమావేశంలో నీటిపారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్ పాల్గొన్నారు.

గ్రూప్-1 తాజా నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటిషన్లు

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 పోస్టులకు 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరొకటి జారీ చేయడం చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన జి.దామోదర్‌రెడ్డి మరో అయిదుగురు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది జె.సుధీర్ వాదనలు వినిపిస్తూ 2022లో 503 పోస్టుల భర్తీ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేశారని, వివిధ కారణాలతో పరీక్ష రద్దయిందని తెలిపారు. నాడు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులకే ఈ నోటిఫికేషన్‌ను పరిమితం చేయాల్సి ఉందన్నారు. 503 ఖాళీలకు అదనంగా మరో 60 పోస్టులను కలిపి తాజాగా మరొకటి జారీ చేయడం చెల్లదన్నారు. ఈ 60 ఖాళీలను విడిగా భర్తీ చేయాలని చేయాలని కోరారు. ఎస్టీ రిజర్వేషన్‌లను 6 నుంచి 10 శాతానికి పెంచడమూ సరికాదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షను రద్దు చేసి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసే అధికారం టీజీపీఎస్సీకి ఉందని పేర్కొన్నారు. అదనపు ఖాళీలను చేర్చడం వల్ల అభ్యర్థులకు ప్రయోజనం ఉంటుందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని రాష్ట్ర రెడ్డి సంఘం కోరింది. ఈమేరకు సంఘం రాష్ట్రాధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి వినతిపత్రం సమర్పించారు.



మేనేజ్‌మెంట్ కోటా అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దరఖాస్తు చేసుకున్న 6412 మంది మెరిట్ జాబితాతో పాటు స్థానికతకు సంబంధించి కోర్టు ఉత్తర్వుల ద్వారా అనుమతి పొందిన 45 మంది విద్యార్థుల మెరిట్ జాబితాను వెల్లడించారు. సింగరేణి కోటా కింద రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏడు ఎంబీబీఎస్ సీట్లు ఉండగా ఈ కోటా కింద 109 మంది దరఖాస్తు చేసుకున్నారు.







ఈనాడు

స్వార్థనేతలకు సాగిలబడి...

చట్టాలకు కట్టుబడాల్సిన ఖాకీలే సంఘ వ్యతిరేకశక్తులై చెలరేగిపోతుండటంపై అలహాబాద్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ నరైన్ ముల్లా కటువైన వ్యాఖ్య ఒకటి చేశారు. అరాచక ముఠాలను మించిపోయిన సంఘటిత నేరగాళ్ల బృందమంటూ భారతీయ పోలీసులను ఆయన అరవై ఏళ్ల క్రితమే ఛీత్కరించారు. సాధారణ సిబ్బందితో పోలిస్తే- ఐపీఎస్ అధికారుల్లోనే నేరగాళ్లు ఎక్కువగా పోగుపడ్డారంటూ కేరళ మాజీ డీజీపీ టీపీ సేన్‌కుమార్ సైతం కొన్నేళ్ల కిందట కుండబద్దలు కొట్టారు. కొన్నాళ్లుగా వరసగా వెలుగుచూస్తున్న పోలీసు అధికారుల అకృత్యాలను గమనిస్తే- జస్టిస్ ముల్లా, సేన్‌కుమార్ మాటల్లో అతిశయోక్తులూ అభాండాలూ ఏమీ లేవని అర్థమవుతుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు ఐపీఎస్‌లు రాజ్యాంగ నిబంధనలు, శాసనాలను కాలదన్నిన తీరును పరిశీలిస్తే- అఖిలభారత సర్వీసుల సంస్కరణ ఎంత అత్యావశ్యకమో అవగతమవుతుంది. ప్రజల మనసులను గెలుచుకునేందుకు పోలీసులు నిత్యం ప్రయత్నించాలన్నది సర్దార్ పటేల్ హితవచనం. జనాన్ని వదిలేసి జగన్‌కు పాదపూజలు చేసిన అధికారులు- అఖిలభారత సర్వీసులకే తీరని అప్రతిష్ఠ తీసుకొచ్చారు!

ప్రజాస్వామ్యమంటే ప్రజలందరూ ఒకే పాట పాడటం కాదు. కానీ, జగన్‌స్వామ్యంలో అందరూ ఆయనకే భజన చేయాలి! అసమ్మతి, విమర్శలంటే- జగన్‌కు ఒళ్లుమంట. అందుకే ఆయన అధికారం వెలగబెట్టిన అయిదేళ్లలో ఏపీ తాలిబన్ల రాజ్యంగా తయారైంది. ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో చిన్నపాటి విమర్శలు చేసినవారిపైనా అప్పట్లో కేసులు బనాయించారు. ఆ క్రమంలోనే ఆనాడు వైకాపా ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజుపై రాజద్రోహం కేసుపెట్టి అదుపులోకి తీసుకున్నారు. కస్టడీలో భాగంగా పోలీసులు తనను చిత్రహింసలు పెట్టినట్లు రఘురామ ఆ తరవాత వెల్లడించారు. ఆ సంగతి వాస్తవమేనని ఇప్పుడు తేటతెల్లమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రఘురామను కొడుతూ, ఆ దృశ్యాలను వీడియోకాల్‌లో సీఐడీ చీఫ్‌కు చూపించామని సంబంధిత సిబ్బంది తాజాగా వాంగ్మూలమిచ్చారు. నాటి సీఐడీ అధిపతి సునీల్‌కుమార్ నలుగురు ముసుగు మనుషులతో కలిసి ఆ రోజు రాత్రి అక్కడికి వచ్చినట్లు కూడా వెలుగుచూసింది. నోరెత్తినవారిపై అక్రమ కేసులు మోపి చితకబాదడం కోసమేనా పోలీసులు ఉన్నది? స్వార్థనేతలకు సాగిలబడటానికేనా జనంసొమ్ముతో జీతభత్యాలిచ్చి వారిని పోషించేది?

అఖిలభారత సర్వీసులనేవి భారతదేశ సమగ్రతను సంరక్షించే ఉక్కుచట్రం కావాలని జాతినిర్మాతలు ఆశించారు. అందుకే సివిల్ సర్వెంట్లకు రాజ్యాంగ రక్షణలు కల్పించారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజాప్రయోజనాలను కాపాడాల్సిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లలో కొందరు అధికారపక్షాలకు ఊడిగం చేస్తున్నారు. సినీనటి కాదంబరీ జెత్వానీ అక్రమ అరెస్టు వ్యవహారంలో సస్పెన్షన్‌కు గురైన ఐపీఎస్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్ని - జగన్ జమానాలో భ్రష్టుపట్టిన వ్యవస్థకు ప్రతినిధులు. 'ముఖ్య' నాయకుడికి ఆప్తుడైన ఓ పారిశ్రామికవేత్తకోసం కాదంబరీని, ఆమె కుటుంబాన్ని రాచిరంపాన పెట్టిన ఖాకీలు- ప్రజారక్షకులు కారు, భక్షకులు! యూపీ మాజీ డీజీపీ ప్రకాశ్ సింగ్ హెచ్చరించినట్లు- పోలీసు సంస్కరణలను సత్వరం చేపట్టకపోతే ప్రజాస్వామ్యమే కుప్పకూలిపోతుంది. ఖాకీలే కాదు- అన్ని అఖిలభారత సర్వీసుల్లోని అధికారుల పనితీరును కాలానుగుణంగా నిష్పాక్షికంగా సమీక్షించాలి. తప్పోతాలును నిర్దాక్షిణ్యంగా తొలగించాలి. అప్పుడే పాలనలో నాణ్యత పెరిగి ప్రజలకు భద్రత లభిస్తుంది!



ఈశ్వర సృష్టియందు మానవులెల్లరు సమానులే. ప్రతివానికి అగ్రస్థానము ఇవ్వబడినది. హీనుడు ఘనుడను తారతమ్యములు ప్రళయ జాడ్యములను బుట్టించు క్రిములు. లోకం నావంక కోరగా, వారగా చూచింది. అనాదరించింది, అసత్కరించింది, సత్కరించింది, దూరపర్చింది, చేరదీసింది.

– గుర్రం జాషువా

భగవానుడి మాట

భయం లేనివారు బలవంతులు కూడా అయితే- వారు ఇతరులకు చెడు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. అలా చెడు చేయకుండా మంచితనాన్ని ప్రదర్శిస్తూ ఎదుటివారి భయాన్ని పోగొట్టగల వ్యక్తి తనకు ప్రియమైనవాడు అంటాడు శ్రీకృష్ణ భగవానుడు. తాను బలవంతుడై ఉండీ సమాజాన్ని భయపెట్టకుండా పౌరులకు ధైర్య గుణాన్ని నేర్పేవాడు విజ్ఞుడు అంటాడు భగవానుడు.

గురువు తన శిష్యులందరికీ విద్య నేర్పుతాడు. కొందరికి మాత్రమే అది సంపూర్ణంగా అర్థమవుతుంది. కొందరికి అర్థమే కాదు. కొందరికి తప్పుగా అర్థమవుతుంది. భగవద్గీత కూడా ఇలాగే చదువరులకు వివిధ అనుభవాలను ఇస్తుందని పెద్దలు చెబుతారు.



అంతర్యామి

మనిషి తనను తాను ఉద్ధరించుకోవాలని శ్రీకృష్ణుడు సూచిస్తాడు. ప్రతి మనిషి నుంచి ఒక గొప్ప వ్యక్తి ఆవిర్భవించాలని తాత్పర్యం. చేసే కర్మల ద్వారా మనిషి ఆనందం పొందుతాడు. దుఃఖాన్ని సైతం అలాగే తన పనుల ద్వారానే చవిచూస్తాడు. కర్మ దుఃఖమయమైనదైతే కర్మఫలంగా లభించేది సైతం దుఃఖమే అన్నది యదార్థం.

ఆకలి వేస్తున్నవాడు ఆవురావురుమంటూ అన్నం తింటాడు. అదెంతో రుచిగా ఉంటుంది. కడుపు నిండాక ఇంకా తిని జీర్ణించుకోలేడు కాబట్టి తినాలనే కోరిక నశిస్తుంది. ఆ నశింపు సైతం శాశ్వతం కాదు. వైశ్వానర అగ్ని రగిలినప్పుడు అతడికి కావాల్సింది మళ్లీ అన్నమే! అవసరాలు కోరికలను సృష్టిస్తాయి. సౌకర్యాల కోసం వస్తువులు అవసరమవుతాయి. అలా మళ్లీ మళ్లీ కోరికలు కలుగుతాయి. అగ్నిలో నెయ్యి పోసినప్పుడు మంట ప్రజ్వరిల్లుతుంది తప్ప ఆరిపోదు. జీవనయానం నడుస్తున్నంత కాలం అవసరాలు సంకల్పాలుగా కోరికలుగా మారుతూ మనిషిని ఇంకా సంకల్పపరుడిగానే చేస్తుంటాయి. ఒక పరిధిలో కోరికలు లేని జీవితం కోసం సాధన చేయాల్సి ఉంటుంది. కోరికల వల్ల కర్మకు ప్రేరణ లభిస్తుంది. కర్మను కాక కర్మఫలాన్ని త్యజించి భగవదర్పితం చేయాలన్నది భగవానుడి మాట. వస్తుత్యాగం సన్యాసం కాదు. కర్మలు మానకుండా ఇతరుల ప్రయోజనం కోసం ఆలోచించేవాడే నిజమైన కర్మ సన్యాసి అన్నది శ్రీకృష్ణ భగవానుడి మాట.

గంగాతీరంలో ఒక పడవ నడిపేవాడు తెడ్డు వేస్తూ పాట పాడుతున్నాడు. చేపల కోసం వలను నదిలో విసిరాడు. నదిని దాటడానికి ఆ పడవ ఎక్కిన సన్యాసికి పడవ వాడి ప్రవర్తన ఆసక్తి కలిగించింది. తనను నది దాటించినందుకు సన్యాసి పడవవాడికి ఓ నాణెం ఇవ్వబోయాడు. పడవవాడు డబ్బు నిరాకరించాడు. అతడి వృత్తి వేట! ధనం కోసం నదిని దాటించడం కాదు. సన్యాసిని ఒడ్డున దించి మళ్లీ ఎప్పటిలా నదిలోకి వల విసిరాడు. సన్యాసికి ఓ కొత్త విషయం బోధపడింది. బతుకుతెరువు కోసం చేపలు పట్టే ఆ మనిషి వ్యామోహాన్ని జయించాడు. మోహక్షయమే మోక్షం! సన్యాసి అయిన తాను జేబులో కొన్ని నాణేలు పెట్టుకు తిరుగుతున్నందుకు సిగ్గుపడ్డాడు. అతడి మదిలో పడవ నడిపేవాడి సుందర సుమధుర పల్లెగీతం సుడులు తిరుగుతూ ప్రణవనాదమై ప్రతిధ్వనించింది!

– గోపాలుని రఘుపతిరావు

దేశాభివృద్ధికి వ్యవ'సాయం'

దేశ సామాజిక ఆర్థిక ప్రగతి ప్రస్థానంలో వ్యవసాయ రంగం పాత్ర కీలకం. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చి ఆహార భద్రతను కల్పించడంతోపాటు వివిధ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను సాగు రంగమే అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గిస్తోంది. ఎగుమతుల్లో కీలకపాత్ర పోషిస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది. కానీ, వ్యవసాయ రంగాన్ని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి.

రుతుపవనాల ఆలస్యం, ఎల్‌నినో, తక్కువ ఉత్పాదకత తదితర అంశాలు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తగ్గుదలకు కారణమవుతున్నట్లు 2023-24 ఆర్థిక సర్వే పేర్కొంది. చిన్న కమతాలు, సాగు పెట్టుబడి తగ్గడం, యాంత్రీకరణ లోపించడం, నాణ్యమైన ఉత్పాదకాల లభ్యత కొరవడటం తక్కువ దిగుబడులకు దారితీస్తున్నట్లు వెల్లడించింది. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, పంటకోత అనంతర నష్టాలు, వర్షపాతంపై ఆధారపడటం వంటివీ సాగురంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. నేటికీ ప్రపంచంలో పలురకాల వ్యవసాయ ఉత్పత్తుల్లో భారత్ ప్రధాన ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, పంట దిగుబడులు మాత్రం తక్కువగా ఉండటం ఆందోళన



కలిగించే అంశం. పెట్టుబడి ప్రోత్సాహకాలు వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయంలో స్వల్పకాలిక పెరుగుదలకు తోడ్పడతాయని, మరోవైపు ఈ రంగంలో దీర్ఘకాలిక అభివృద్ధి ఆధునికీకరణకు అధిక పెట్టుబడులు అవసరమని ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించింది.

వాతావరణ మార్పుల ప్రభావం


వాతావరణ మార్పులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దిగుబడులను దెబ్బతీస్తున్నాయి. దాంతో ఆహార భద్రత ప్రమాదంలో పడుతోంది. ప్రపంచ ఉష్ణోగ్రతలో ప్రతి డిగ్రీ పెరుగుదలకూ గోధుమ పంటలో దిగుబడి 4-6 శాతం తగ్గుతుందని అంచనా. దీనికితోడు తెగుళ్లు మరింతగా విజృంభించే ప్రమాదముంది. ఇది దిగుబడి నష్టాలను పెంచుతుంది. వాతావరణ మార్పులవల్ల వ్యవసాయ ఆదాయాలు 15-18 శాతం తగ్గుతాయని, మెట్ట ప్రాంతాల్లో 20-25 శాతం దాకా పడిపోతాయని అంచనా. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానమైన బయోటెక్నాలజీని ఉపయోగించి వాతావరణ ప్రతికూలతలైన నీటి ఎద్దడి, ముంపు, వ్యాధులు, తెగుళ్లను సమర్థంగా తట్టుకునే జన్యువులను గుర్తించాలి. వాటిని వంగడాల్లో చొప్పించడం ద్వారా నూతన వంగడాలను సృష్టించాలి. చైనా తమ జీడీపీలో ఒక శాతం దాకా వ్యవసాయ పరిశోధనలకు కేటాయించి సాగులో ముందుకు దూసుకుపోతోంది. భారత్ మాత్రం జీడీపీలో 0.64శాతమే పరిశోధనలకు కేటాయిస్తోంది. పరిశోధనలపై పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడే తప్ప ఖర్చుకాదు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఏటా రెండు శాతం నుంచి అయిదు శాతం దాకా వృద్ధి అవసరమని నివేదికలు చెబుతున్నాయి. ఆధునిక సేద్య పద్ధతులను రూపొందించే దిశగా పరిశోధనలు ఊపందుకోవాలి. సాగుకు సాంకేతికతను జోడించాలి. పోషక విలువలు పుష్కలంగా ఉన్న జొన్న, సజ్జ, రాగి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరల వంటి పైర్లపై ప్రత్యేక శ్రద్ధతో పరిశోధనలను వేగవంతం చేయాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు బాగా పెరగాల్సిన అవసరం ఉంది. కేంద్ర కేబినెట్ ఇటీవల వ్యవసాయ విద్య, పరిశోధనలు, విస్తరణ, పాడి, ఉద్యాన రంగాల బలోపేతానికి, సాగుకు సాంకేతిక సహకారం కోసం డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు పచ్చజెండా ఊపింది. సాగులో ఎదురవుతున్న సంక్లిష్ట సమస్యలను అధిగమించాలంటే నవీన ఆవిష్కరణలతో ఆధునిక సేద్యానికి బాటలు పరచాలి. అందుకుగానూ వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుట్టడమే ఏకైక మార్గం. వ్యవసాయ పరిశోధనల్లో కొన్ని పంటలకే ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం, మిగిలిన పంటలను పట్టించుకోకపోవడం వల్ల కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదముంది.

విధానాల్లో మౌలిక మార్పులు

ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైనప్పటి నుంచి వస్తుసేవలకు గిరాకీ పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించింది. ఇదంతా చాలావరకు పారిశ్రామిక సేవల రంగం మెరుగుదల ద్వారా సాధ్యపడింది. ముఖ్యంగా సేవల రంగం ఉపాధి అవకాశాలను సృష్టించగలిగింది. అయితే ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల మధ్య సమతుల్యమైన పరస్పర వృద్ధి కీలకం. నేడు ప్రపంచంలో ప్రబల ఆర్థిక శక్తులుగా అవతరించిన చైనా, జపాన్, దక్షిణ కొరియా, అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాలు ఒకప్పుడు వ్యవసాయ సమాజాలే. ఆయా దేశాలు తమ సుస్థిర ఆర్థిక ప్రగతికి విధాన నిర్ణయాల్లో మౌలిక మార్పులు చేపట్టాయి. సరైన ప్రణాళికలను అమలు చేయడం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలుగా ఎదిగాయి.

వాణిజ్య పంటల సాగు

రైతులకు అధిక ఆదాయం లభించేందుకు వాణిజ్య వ్యవసాయంపై దృష్టి సారించాలి. ప్రపంచంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు భారీ డిమాండు నెలకొంది. ఈ క్రమంలో ప్రత్యేక వ్యవసాయ వాణిజ్య మండళ్లను ఏర్పాటు చేసి ఎగుమతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పురుగు మందులు, ఎటువంటి అవశేషాలు లేని వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించే దిశగా ఆధునిక సాంకేతిక విధానాన్ని ఉపయోగిస్తే రైతులకు మేలు జరుగుతుంది. సుగంధ ద్రవ్యాలు, మామిడి, అరటి, మత్స్య ఉత్పత్తులకు ప్రత్యేక ఎగుమతి మండళ్లను ఏర్పాటు చేసి ప్రోత్సహించడం మేలు. ఆహారశుద్ధి రంగం కూడా అనేక ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. వ్యవసాయరంగం పేలవమైన పనితీరు కనబరిస్తే ఆహార ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. అధిక ద్రవ్యభారంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గి అనిశ్చితి, అస్థిరతకు దారితీసే ప్రమాదముంది. ఇది ఆర్థిక వ్యవస్థకు శ్రేయస్కరం కాదు. వ్యవసాయ రంగం మెరుగైన పనితీరే దేశార్థికానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. సాగు రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలతో ముందడుగు వేస్తే అన్నదాతల కుటుంబాలకు ఆర్థిక భద్రత, దేశానికి ఆహార భద్రత సమకూరుతాయి.



డాక్టర్ జె.సురేష్
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు



ఎక్స్‌పైరీ డేట్

సూపర్ మార్కెట్‌కి వెళ్తాం. బ్రెడ్డూ బటరూ పప్పులూ పొడులూ ఏవి కొన్నా ప్యాకెట్‌ని పరిశీలనగా చూస్తాం. ఎప్పుడు తయారైందీ, ఎన్నాళ్లవరకూ వాడుకోవచ్చు అన్నది గమనిస్తాం. కూరగాయల దుకాణానికి వెళ్తే తాజాగా ఉన్నవి ఎంచి తీసుకుంటాం. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే కనీసం వారం రోజులు సరిపోవాలన్నది ప్లాను.

మందుల కొట్టుకు వెళ్లినా అంతే. ట్యాబ్లెట్లు అయినా, టానిక్కులైనా ఎక్స్‌పైరీ డేట్ చూసే కొంటాం. ఆ డేట్ దాటితే అవి పనిచేయవు కాబట్టే అంత జాగ్రత్త. ఫ్రిజ్, వాషింగ్ మెషీన్... ఏది కొన్నా గ్యారంటీ, వారంటీ అన్నీ అడిగి, డెమో చూసి... ఆ తరవాతే కొంటాం.

అల్మారాలో పెడితే ఆవకాయ ముక్క మెత్తబడిపోతోందనీ చింతపండు నల్లబడిపోతోందనీ పిండి పురుగుపడుతోందనీ తెచ్చి ఫ్రిజ్‌లో పెడతాం. పండ్లూ కూరగాయలూ పాలూ పెరుగూ నిన్న మొన్న మిగిలిన కూరలతో పాటు సూపర్ మార్కెట్లో కొన్న సామానులో సగం ఫ్రిజ్‌లోనే ఉంటుంది. అవసరమైనవి వెతుక్కోవడానికి ఎంత ఇబ్బందిగా ఉన్నా పట్టించుకోకుండా కుక్కి కుక్కి పెడతాం. అది పనిచేయడం మానేస్తే ఆగమేఘాల మీద మెకానిక్‌ని పిలిపించి రిపేరు చేయిస్తాం.

ఉతకాల్సిన బట్టలు వాషింగ్ మెషీన్‌లో ఒకసారి వేయడానికి ఎక్కువా, రెండుసార్లు వేయడానికి తక్కువా ఉన్నాయి. ఏం చేస్తాం? పని కావడం ముఖ్యం కాబట్టి ఒక్కసారే కుక్కేస్తాం. ఫలితం... దానిలోని డ్రమ్ము తిరగనని మొరాయిస్తుంది. మళ్లీ మెకానిక్ హాజరు. జేబుకు చిల్లు. మందులు కొంటాం, వేసుకుంటాం... కానీ గుణం కనపడదు. ఎందుకిలా అని ఎప్పుడైనా ఆలోచించారా? ఎక్స్‌పైరీ డేట్ విషయంలో అంత కచ్చితంగా ఉన్న మనం వాటిని ఎక్కడ ఎలా భద్రపరచాలీ అన్న విషయం పట్టించుకోం. కొంతమంది ఎప్పుడు, ఎలా వేసుకోవాలీ అన్నదీ పట్టించుకోరు. వేసుకున్నామా లేదా అన్నదే వాళ్లకి ముఖ్యం. వస్తువులు కొనేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం కదా, మరి వాడేటప్పుడు ఎందుకీ ఆదమరుపు? వాటి సామర్థ్యానికి మించి పనిచేయించుకోవాలన్న అత్యాశ ఎందుకు?

వస్తువులే కాదు, జీవితమూ నూరేళ్ల గ్యారంటీతోనే లభిస్తోంది మనకి. అన్నేళ్లూ మనశ్శరీరాలు ఆరోగ్యంగా పనిచేయడానికి వీలుగా ఒక జీవగడియారమూ ఉంది. తిండికో సమయం, నిద్రకో వేళ, వ్యాయామానికో సందర్భం... ఉన్నాయి. కాలాన్ని బట్టి ఎప్పుడేం తినాలో పెద్దవాళ్లు చెప్పారు. ఏం తినకూడదో కూడా చెప్పారు. వాళ్లేవో చెప్పినట్లు మనం వినడం ఏంటి, మన ఇష్టప్రకారం జరగాలి కానీ అనుకుని ఇరవై నాలుగ్గంటల్లో ఎప్పుడే పని అయినా చేసేలా మన ఒంటి రాజ్యాంగాన్ని మనమే రాసుకుంటున్నాం. ఫలితంగా నూరేళ్ల ఆయుర్దాయానికే కాదు, స్పేర్‌పార్ట్స్‌కీ గ్యారంటీ లేకుండా పోయింది. ఎక్స్‌పైరీ డేట్‌ని చేజేతులా ముందుకు జరుపుకోవడం మాని కాస్త జాగ్రత్త పడదామా?

– పోలిశెట్టి



నిరుద్యోగ భూతం

దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గడం లేదు. ప్రభుత్వాల ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. కార్మిక శక్తిలో నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగిత రేటుగా పేర్కొంటారు. ఏడు రోజుల వ్యవధిలో నిరుద్యోగిత సగటు పరిస్థితిని కరంట్ వీక్లీ స్టేటస్ (సీడబ్ల్యూఎస్) తెలియజేస్తుంది. ఆ విధానం ప్రకారం... ఒక వ్యక్తి వారం రోజుల వ్యవధిలో పనికి సిద్ధంగా ఉన్నా, పని కోరుతున్నా, ఏ రోజూ కనీసం గంటపాటు కూడా పనిచేయకపోతే నిరుద్యోగిగా పరిగణిస్తారు. ఆ పద్ధతిలో లెక్కేస్తే పట్టణ భారత యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

దేశంలోని పట్టణ ప్రాంతాల్లో కరంట్ వీక్లీ స్టేటస్ ప్రకారం నిరుద్యోగిత రేటు (శాతాల్లో)...
(15-29 సంవత్సరాల వయసు వారిలో)

సర్వే కాలం	పురుషులు	మహిళలు
2023 ఏప్రిల్–జూన్	15.9	23.4
2023 జులై–సెప్టెంబర్	15.5	22.9
2023 అక్టోబర్–డిసెంబర్	14.6	22.5
2024 జనవరి–మార్చి	15.1	22.7
2024 ఏప్రిల్–జూన్	14.8	23.0

(ఆధారం: పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే)

ఇంకెన్నాళ్లీ అమానుషం?

మంచి పాఠశాల అంటే చక్కని తరగతి గదులతో పాటు తగినన్ని మరుగుదొడ్లు సైతం ఉండాలి. చాలా బడులు, సంక్షేమ వసతిగృహాల్లో పిల్లల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేవు. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దేశీయంగా పన్నెండు వేల ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లు లేవని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. కొన్ని చోట్ల ఉన్నా నీటి వసతి లేకపోవడంతో వృథాగా మారాయి. సర్కారీ బడుల్లో 1.40 లక్షల టాయిలెట్లు నిర్మించామని చెబుతున్నా, చాలా చోట్ల అవి కనిపించవని, అరకొరగా నిర్మితమయ్యాయని లేదా నిరుపయోగంగా మారాయని కాగ్ పరిశీలన నాలుగేళ్ల క్రితం కుండ బద్దలుకొట్టింది. ఈ దుస్థితి అమ్మాయిలకు శాపంగా మారుతోంది. చాలా బడుల్లో విద్యార్థులు మరుగుదొడ్ల ముందు బారులు తీరిన దృశ్యాలు తరచూ మీడియాలో కనిపిస్తుంటాయి. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటినా, మన పాఠశాలల తీరు మారని దైన్యాన్ని అవి కళ్లకు కడతాయి.



సంక్షేమ వసతిగృహాల నిబంధనల మేరకు ప్రతి 25 మంది విద్యార్థినులకు మూడు స్నానపుగదులు, నాలుగు మరుగుదొడ్లు ఉండాలి. లేదంటే పది మందికి ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి ఉండాలి. తెలంగాణలోని 29 గురుకులాలపై ఇటీవల ఓ సామాజికవేత్త చేపట్టిన సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. 15,136 మంది విద్యార్థులకు 1513 స్నానపు గదులు ఉండాల్సి ఉండగా, 870 మాత్రమే ఏర్పాటయ్యాయి. 2,162 మరుగుదొడ్లకుగాను 1104 మాత్రమే ఉన్నాయి. ఈ కొరతపై హైకోర్టు స్పందిస్తూ.. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం ఉన్నత పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థినులకు ఒక్కటే మరుగుదొడ్డి, నాలుగు మూత్రశాలలే ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ పేరిట గత వైకాపా ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే పథకాల్లో కోత పెట్టింది. సదుపాయాలు కల్పించలేదు. చాలాచోట్ల మరుగుదొడ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కొన్నిచోట్ల ఉన్నా నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. మూత్రవిసర్జనకు బాలురు బయటికి వెళ్తున్నారు. అమ్మాయిలు అసహాయ పరిస్థితుల్లో దాహం వేసినా నీరు తాగడంలేదు. ఏపీలోని 352 కస్తూర్బా విద్యాలయాల్లో 6-10వ తరగతి చదువుతున్న విద్యార్థినుల సంఖ్య అరవై వేలకు పైమాటే. ఇంటర్ విద్య అందిస్తున్నవి 221ఉండగా.. దాదాపు 15వేల మంది వాటిలో ఉన్నారు. ఆ విద్యాలయాల్లో కనీస వసతుల్లేక పిల్లలు నానా అవస్థలూ పడుతున్నారు. ఇంటర్ విద్యార్థినులకు వసతితో పాటు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం ఒక్కోటి రూ. 1.10 కోట్ల వ్యయంతో 101 భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో 90 భవనాల నిర్మాణాన్నీ ప్రారంభించారు. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఎక్కువ సమయం మూత్రాన్ని ఆపుకోవడంవల్ల బాలికలు, ఉపాధ్యాయినులు అనారోగ్యం పాలవుతున్నారు. మూత్రాన్ని చాలాసేపు ఆపుకోవడం వల్ల యూరిన్ ఇన్ఫెక్షన్ తలెత్తే ప్రమాదం ఉంది. హానికర బ్యాక్టీరియా సైతం వృద్ధి చెందుతుంది. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి.

చట్టానికి విఘాతం

ప్రతి బడికి దృఢమైన భవంతి, తగిన సిబ్బంది, ప్రహరీ, గ్రంథాలయం, తాగునీరు, క్రీడాసామగ్రి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలన్నీ ఉండితీరాలని విద్యాహక్కు చట్టం నిర్దేశిస్తోంది. బాలికల 'గౌరవప్రద జీవనానికి' విద్యాహక్కు చట్టం దోహదం చేస్తుందని సర్వోన్నత న్యాయస్థానం అభిలషించింది. కానీ క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. మరుగుదొడ్లు, వాటిలో నీటి సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు అర్ధాంతరంగా బడికి దూరమవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వాటిలో నీటి వసతి ఉండేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే విద్యార్థుల ఇక్కట్లు తీరి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలుపడేది.

– సూగూరు రవీందర్ రావు

హాయ్! బుజ్జీ!! — తాతయ్య మాటతో..!

హాయ్ నేస్తాలు..! ప్రతిరోజు మనకు ఇంట్లో, స్కూల్లో.. పోషకాహారం తినాలని చెబుతూనే ఉంటారు. కానీ మనం ఏ మాత్రం చెవికెక్కించుకోము. అసలు వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయం. కానీ.. మనలాంటి ఓ చిన్నారి మాత్రం ఎన్నో పోషకాలు లభించే ధాన్యాలను సేకరించి.. రికార్డు సాధించింది. మరి తనెవరో తెలుసుకుందామా!

ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బొయిపరిగూడకు చెందిన హర్షిత ప్రియదర్శిని



మహంతికి పదమూడు సంవత్సరాలు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతోంది. తన చిన్నతనంలో వాళ్ల తాతయ్య.. కొన్ని నాణేలు ఇచ్చి ఇవి అరుదుగా దొరుకుతాయని చెప్పారట. అప్పటి నుంచి వివిధ రకాల నాణేలు సేకరించాలని నిర్ణయించుకుందట.

అలా 80 దేశాలకు చెందిన రెండువేల నాణేలు, 40 దేశాల స్టాంపులు సేకరించింది. కొన్ని రోజులకు ఆ ఆసక్తి కాస్త వ్యవసాయ రంగం వైపు మళ్లింది. వరి, రాగులు, వివిధ రకాల చిరుధాన్యాల సేకరణ ప్రారంభించింది. ఇప్పటి వరకు 100కు పైగా రాగులు, 150కి పైగా ఇతర ధాన్యాలు సేకరించింది. 2023లో దిల్లీలో జరిగిన జీ-20 సదస్సులో, భువనేశ్వర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మిల్లెట్స్ సదస్సులో వాటిని ప్రదర్శించి.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు పొందింది.




మన హర్షిత 2023లో కృషక్ రత్న, హెచ్‌డీఎఫ్‌సీ, రెడ్‌ఎఫ్ఎమ్ తరఫున 'ఐడియా యంగ్‌స్టార్స్'లో పాల్గొని రూ. 2,50,000 బహుమానం అందుకుంది. అలాగే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 2024లో దిల్లీలో వార్ ఇండియా తరఫున 'జ్యువెల్స్ ఆఫ్ ఒడిశా'గా నిలిచింది. అంతరించిపోతున్న ధాన్యాలను సేకరించి అవి అందరికీ అందేలా కృషి చేయడమే తన లక్ష్యమట. ఎంతైనా ఈ చిన్నారి గ్రేట్ కదూ!

– వైశాలి, న్యూస్‌టుడే, జయపురం, ఒడిశా

కనిపెట్టండి

ఈ ఆధారాల సాయంతో వచ్చే పదాలను కనిపెట్టండి.



జవాబు: 1.FACT 2.DONE 3.BARE

దిల్లీ కంటోన్మెంట్‌లో దాక్కున్న వెంకటరెడ్డి

- రెండున్నర నెలలుగా అక్కడే మకాం
- సిమ్‌కార్డులు తీసేసి, ఫోన్లు స్విచాఫ్ చేసేసి.. పట్టుబడకుండా ఎత్తుగడలు
- ఆచూకీ పసిగట్టి ఏసీబీ దిల్లీ వెళ్లేలోపే హైదరాబాద్‌కు రాక
- శంషాబాద్ రిసార్ట్‌లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- అక్టోబరు 10 వరకు రిమాండ్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ పెద్దల గనుల, ఖనిజ, ఇసుక దోపిడీని సర్వం తానై నడిపించిన గనుల శాఖ పూర్వ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఏసీబీకి చిక్కకుండా ఉండేందుకు అనేక ఎత్తుగడలు వేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పరారైన ఆయన కొన్నాళ్లపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తిరిగారు. తర్వాత దిల్లీలోని మిలటరీ కంటోన్మెంట్‌లో దాదాపు రెండున్నర నెలలు తలదాచుకున్నారు. తన ఆచూకీ తెలియకుండా ఉండేందుకు సిమ్ కార్డులు తీసేసి, ఫోన్లు స్విచాఫ్ చేసేశారు. ఇండియన్ కోస్ట్‌గార్డు సర్వీసు అధికారైన ఆయన గతంలో తనకున్న పరిచయాలను ఉపయోగించుకుని కంటోన్మెంట్‌కు చేరారు. తాను అక్కడే ఉంటే ఏసీబీ సహా ఎవరి దృష్టిలోనూ పడకుండా ఉంటాననే వ్యూహం పన్నారు. అయితే వెంకటరెడ్డి, ఆయన సన్నిహితుల కదలికలపై కొన్నాళ్లుగా నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు.. ఆయన దిల్లీ కంటోన్మెంట్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లడానికి దిల్లీ పోలీసులు, కంటోన్మెంట్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉండటంతో వాటి కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న వెంకటరెడ్డి హైదరాబాద్ వచ్చేసి.. శంషాబాద్ సమీపం సుల్తాన్‌పల్లిలోని అత్యంత విలాసవంతమైన బ్యూటీగ్రీన్ రిసార్ట్స్‌లో మకాం వేశారు. ఏసీబీ బృందాలు గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకుని రాత్రి 8.15 గంటల సమయంలో వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకున్నాయి. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు తనకు గుండె శస్త్రచికిత్స జరిగిందని, ఆరోగ్యసమస్యలు ఉన్నాయని వెంకటరెడ్డి చెప్పుకొచ్చారు. దీంతో ఆయన్ను విజయవాడకు తీసుకొచ్చిన అనంతరం.. శుక్రవారం అన్ని రకాల వైద్యపరీక్షలు చేయించారు.

ఖజానాకు రూ.2,566 కోట్ల నష్టం

ఏసీబీ అధికారులు వెంకటరెడ్డిని శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా వెంకటరెడ్డి ఇసుక గుత్తేదారు సంస్థలైన జేపీవీఎల్, జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలు, మరికొంతమంది వ్యక్తులతో కలిసి నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని ఏసీబీ న్యాయవాదులు కోర్టుకు వివరించారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ. 2,566 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఆయనకు రిమాండు విధించాలని కోరారు. రిమాండు విధించవద్దని వెంకటరెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. వాదనలు విన్న ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి హిమబిందు.. వెంకటరెడ్డికి అక్టోబరు 10 వరకూ రిమాండు విధిస్తూ ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన్ను విజయవాడ జైలుకు తరలించారు.



గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిని వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ కొత్త ఆసుపత్రికి తీసుకువచ్చిన ఏసీబీ అధికారులు

విశాఖ ఉక్కుకు ఊపిరి!


సెయిల్‌లో విలీనం చేసే యోచనలో కేంద్రం

ఈనాడు, విశాఖపట్నం: 'ఆంధ్రుల హక్కు'గా ఖ్యాతి గాంచిన విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరి పోసేందుకు కేంద్రం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విశాఖ ఉక్కు (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను విలీనం చేసే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ప్లాంటు మనుగడకు ఇదే సరైన ప్రత్యామ్నాయంగా భావిస్తుండటంతో.. సెయిల్‌లో విలీనం దాదాపు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడి, ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న ప్లాంటును తిరిగి పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చొరవతో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలు 1,324 రోజులుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి ఫలితాన్ని చూపించనున్నాయి. 'విలీన ప్రతిపాదనపై స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఎన్ఎండీసీతో చర్చలు జరుగుతున్నాయి. విలీనానికి కొన్ని సాంకేతిక అంశాలు అడ్డుపడుతున్నా.. పరిష్కారం ఆలోచిస్తున్నాం' అని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

జగన్‌ను తిరుమల వెళ్లొద్దని ఎవరన్నారు?

- డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే ఆయన వెళ్లలేదు
- పైగా నోటీసులిచ్చారంటూ అసత్య ప్రచారమా?
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చి దర్శనానికి వెళ్లడం వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ఏ మాత్రం ఇష్టం లేదని, అందుకే ఆయన తిరుమల ప్రయాణం రద్దు చేసుకున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఆ విషయం బయటకు చెప్పకుండా స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు నోటీసిచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు నోటీసిచ్చి ఉంటే మీడియాకు చూపించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రినైన తనకే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే, ఇక దళితుల్ని దేవాలయాల్లోకి రానిస్తారా? అంటూ శుక్రవారం విలేకర్ల సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యల్ని సీఎం తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సచివాలయంలో చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు.



'దళితుల్ని దేవాలయాల్లోకి వెళ్లకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? మీరు తిరుమల వెళ్లకుండా ఉండేందుకు సాకులు వెతుక్కుంటూ, కావాలని ఇతరులపై బురదజల్లడమేంటి?' అని మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదే నెయ్యి కొనుగోళ్లకు టెండర్ నిబంధనలు ఎందుకు మార్చారు? రివర్స్ టెండరింగ్ పేరుతో కిలో రూ.319కి కాంట్రాక్ట్ ఇచ్చి, నాణ్యత లేని, నాసిరకం నెయ్యి కొని ప్రసాదాల్ని ఎందుకు అపవిత్రం చేశారు? తిరుమలలో ప్రసాదం, అన్నదానంలో పెట్టే భోజనం బాగాలేవని, గదులు శుభ్రంగా ఉండట్లేదని వైకాపా హయాంలో భక్తులు ఎన్నిసార్లు ఆందోళనలు చేశారో గుర్తు లేదా?' అని చంద్రబాబు నిప్పులు చెరిగారు. జరిగిన తప్పునకు స్వామి భక్తుడిగా మనోవేదన చెందుతున్నానని ఆయన పేర్కొన్నారు. జగన్‌కు ఇష్టం లేకపోతే తిరుమలకు వెళ్లాల్సిన అవసరం లేదని, వెళ్లినప్పుడు నిబంధనల ప్రకారం అక్కడి సంప్రదాయాల్ని పాటించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. డిక్లరేషన్‌పై సంతకం చేయకుండా దౌర్జన్యం చేస్తానంటే కుదరదన్నారు. 'వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉన్నవారు ఎవరైనా ఆయన దర్శనానికి వెళ్లొచ్చు. వేరే మతాలవారు స్వామి దర్శనానికి వెళ్లాలంటే కొన్ని సంప్రదాయాలు, పద్ధతులు ఉన్నాయి. స్వామివారిపై తనకు విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలి. ఆయన్ను తిరుమల వెళ్లొద్దని ఎవరూ చెప్పలేదు. ర్యాలీలు, జనసమీకరణలు చేయొద్దని చెప్పాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా సెక్షన్ 30 కింద పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు' అని చంద్రబాబు వివరించారు.

హిందూ మతంపై గౌరవం ఉంటే.. తిరుమలలో డిక్లరేషన్ ఎందుకివ్వరు?

'తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలని ఇప్పటి వరకు తనను ఎవరూ అడగలేదని, ఇప్పుడు అడగడమేంటని జగన్ అనడం సరికాదు. తాను నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతానని ఆయనే చెప్పారు. అంటే ఆయన క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నానని అంగీకరించినట్టే కదా? అలాంటప్పుడు తిరుమల వెళ్లినప్పుడు డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరు? గుడికి వెళ్లినప్పుడు అక్కడి సంప్రదాయాలు పాటించకుండా... గౌరవిస్తున్నానంటే సరిపోతుందా' అని ప్రశ్నించారు. 'నేను హిందువుని. వేంకటేశ్వరస్వామి భక్తుణ్ని. చర్చిలకు, మసీదులకు వెళ్లినప్పుడు వారి ఆచారాల్ని, నియమాల్ని గౌరవిస్తాను. మేం మా మతాన్ని ఆచరిస్తూనే మతసామరస్యాన్ని కాపాడతాం అని చంద్రబాబు స్పష్టం చేశారు.

తిరుమల వెళతానంటే అడ్డుకుంటున్నారు!

ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 'దేవుడి దర్శనానికి వెళతానంటే అడ్డుకుంటున్నారు. ఓవైపు తిరుపతిలో మతపరమైన గొడవలు సృష్టించేందుకు హైదరాబాద్ నుంచి భాజపా వారిని రప్పించారు. మరోవైపు మా పార్టీ నాయకులు, శ్రేణులకు తిరుమల వెళ్లవద్దంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇది రాక్షసరాజ్యం కాదా?' అని ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో శుక్రవారం జగన్ తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని ఒక్కొక్కటిగా రుజువవుతున్నాయని తెలిపారు. దీనిపై ప్రజలు ప్రశ్నిస్తున్నారనే డైవర్షన్ కోసం డిక్లరేషన్‌ను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. 'నా మతం, నా కులం ఏమిటనేది రాష్ట్రంలో, దేశంలో ఎవరికి తెలియదు? ముఖ్యమంత్రినయ్యాక ఐదేళ్లు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించా. ఇప్పుడెందుకు డిక్లరేషన్ అంటున్నారు? నేను నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతా. బయటకు పోతే హిందూ, ఇస్లాం, సిక్కు సంప్రదాయాలను అనుసరిస్తా, గౌరవిస్తా. నా మతం మానవత్వం.. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి. ముఖ్యమంత్రిగా చేసిన నాకే ఈ పరిస్థితి ఉంటే, ఇక దళితులను గుడుల్లోకి రానిస్తారా? విషయం పక్కదారి పట్టకూడదనే తిరుమల పర్యటన వాయిదా వేసుకున్నా' అని వెల్లడించారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు



ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

నేటి నుంచి అయోధ్య, ప్రయాగ్‌రాజ్, ఆగ్రాకు విమానాలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, ఆగ్రా నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం కానుండటం పట్ల కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి కాన్పూర్ నగరానికి విమాన సర్వీసులు శుక్రవారం ప్రారంభం కాగా శనివారం అయోధ్య, ప్రయాగ్‌రాజ్, ఆగ్రా నగరాలకు ప్రారంభం కానున్నాయని తెలిపారు. నూతన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రయాణికులను కోరారు.

'పంటల డిజిటల్ సర్వే ఏఈవోలకు పారితోషికం'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పంటల నమోదు (క్రాప్ బుకింగ్) డిజిటల్ సర్వేలో పాల్గొనే విస్తరణాధికారులకు పారితోషికం ఇస్తామని రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు గోపి తెలిపారు. ఎంత ఇవ్వాలనేది ఒకటి, రెండురోజుల్లో నిర్ణయిస్తామని చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం గోపిని ఆయన కార్యాలయంలో కలిశారు. సర్వే సందర్భంగా తమ సమస్యలను వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సర్వేను ఏఈవోలే చేయాలని, వీఏవోలను గానీ, పొరుగు సేవల సిబ్బందికి గానీ ఇవ్వలేమని తెలిపారు.

ముడి బియ్యం ఎగుమతులపై 10 శాతం సుంకం

ఈనాడు, హైదరాబాద్: వడ్లు, ముడిబియ్యం, ఉప్పుడు బియ్యం ఎగుమతులపై 10 శాతం సుంకం విధించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ కస్టమ్స్ నోటిఫికేషన్ జారీ చేసింది. విదేశాలకు ఎగుమతులు చేసే వస్తువులపై విధించే సుంకానికి సంబంధించి 2011 మార్చి 1న విడుదల చేసిన కస్టమ్స్ నోటిఫికేషన్‌లో సవరణలు చేస్తూ వడ్లు, ముడి బియ్యం, ఉప్పుడు బియ్యంపై..10 శాతం సుంకాన్ని విధించింది. అదే సమయంలో పాలిష్‌చేసిన, పాలిష్‌చేయని(ఉప్పుడు, బాస్మతియేతర) బియ్యం ఎగుమతులపై మాత్రం సుంకం విధించలేదు.

మానసిక ఆరోగ్యంపై ఆహార ప్రభావం



ఆహారానికి, మానసిక ఆరోగ్యానికి సంబంధం లేదని చాలామంది భావిస్తుంటారు. అది తప్పు. మనం తీసుకునే ఆహారం మెదడుపై ప్రభావం చూపుతుంది. మెదడు పనితీరు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి- శారీరక ఆరోగ్యం కోసమే కాకుండా మానసిక ఆరోగ్యం కోసమూ ఆహారంపై శ్రద్ధ పెట్టాల్సిందే.

– క్రిస్ పామర్, మానసిక వైద్యుడు

ఈనాడు స్థిరాస్తి CLASSIFIEDS

REAL ESTATE

సెంటు కేవలం. 4 లక్షల 59 వేలు మాత్రమే. ఆంధ్ర రాజధాని అమరావతికి అతి దగ్గరలో ఇళ్ల ప్రక్కనే ప్లాట్స్ (లిమిటెడ్ ప్లాట్స్ కలవు.) Ph: 9160947999, 8498973586.

NTR+ కృష్ణా జిల్లా పరిధిలో పొలములు, వెంచర్లు అమ్మదలచిన/ కొనదలచిన వారు సంప్రదించగలరు. ✆ 92926 02024, 93926 02024.

FLAT FOR SALE

AMEERPET

Ameerpet DK Road, Unnathi, Ultra- Luxury 3BHK 2500 sq.ft. Beautiful Flat 100% Vastu, gym, Reception, Party area Prestigious landmark. Ph: 9640000350

2BHK, 950 Sft, S/F, Flat @ Vengalrao Nagar for Sale. 55 Lacs & 100 Yads House @ R.K. Society, Borabanda. 1.65 Cr. ✆ 9348165666.

Ameerpet, Mythrivanam Premium 3BHK, 2000- 2500 Sft, Ready 2 move Flats 4 Sale. Nr 2 Satyam Theatre & Metro Station. 7900/ Sft+A. ✆ 9948134126.

BHEL

Nallagandla- New 3BHK Luxurious Flats for Sale. E/W Facing. Ready to move. GHMC Approved, on 100 Ft Rd. Opp Ramky One Galaxia, Navodaya Clny. ✆ 9848960444, 9848944044.

DILSUKHNAGAR

Saidabad NMR Vivan Residency 3BHK 1590 & 1670 Sq.Ft W/F Flats @ Sairam Nagar Colony, Opp: Ganga Theater, Ready to move. ✆ 9246273324.

ECIL

Luxury 3BHK Flats near Habsiguda/ Mallapur. Ready for occupy in a Highrise Gated Community with Modern Amenities. Last few Units. Call Ph: 9700554544.

GACHIBOWLI

Kondapur Raghavendra Colony Ready to Occupy 3BHK Deluxe Flats 1650 sft East & West Facing. Ph: 9849009429

New 2&3 BHK Luxurious Flats Ready to Move. HMDA Approved. Pride Park, Sai Anurag Colony. Cont: 9848944044/ 9848960444.

Gachibowli New 2BHK Luxurious Flats for Sale. E/W Facing GHMC Approved, BHEL to Gachibowli 100 Ft Rd. Gulmohar Park Clny. ✆ 9848944044, 9848960444.

HAYATHNAGAR

Hayathnagar near Vijayawada Highway beside Bus Stop/ MRO Office, Ready to move. Sup. Luxurious 3BHK Flats. 2 Side 30' Rd. E&W. Ph: 9849801477, 9247326642.

HITECH CITY

Madhapur Kakatiya Hills Premium Luxury Flats for Sale. Semi Gated, East & West Facing. Ready to Occupy. ✆ 9030194449, 8367070777.

JEEDIMETLA

Jeedimetla, TSIIC Clny, Shapur Rd, New 2 & 3BHK, 1000- 1550 Sft @ 5500 Per Sft. Gym, Party Area, 100% Vasthu. Phone: 9989225665, 8790738313.

KHAIRATABAD

3BHK Flat for Sale. 1410 Sft, 75 Sq.Yds UDS. 3rd Floor N/F, Car Parking @ Jal Vayu Towers, Gated Community near Tankbund. 9866982469.

KUKATPALLY

Individual Floor 3-BHK Apartment (1900, 2200 & 2275 Sft E/W/N Facing) Flats for Sale in KPHB. Raja- 9966744544.

Gajularamaram- New 2BHK Luxurious & Spacious Flats E/N Facing. Ready to move. GHMC Approved. Nr. Samskruthi Avenue & Balaji Layout ✆ 9848944044, 9848960444.

L.B.NAGAR

L.B. Nagar Chintalkunta 'X' Rd 2&3 BHK Luxury 176 Flats G+5 Upper, Floors near Metro, VJA H/W. Round the Clock Security, Ready to Occupy. G-Community. 9160600664, 9573822655, 040-66313144.

MEDCHAL

Kompally Dulapally Rd, Near Chaitanya School 2BHK E/F- 1230 Sft, N/F- 1060 Sft, W/F- 1200 Sft Flat for Sale. ✆ 9908056449.

MALKAJGIRI

Near Sainikpuri, Close to the new Elevated Corridor from JBS to Shamirpet. Ready to occupy 1715 & 1945 Sft Flats. Gated Community. Club House, Swimming Pool. 7207460921.

Neredmet 2BHK Flat 1800 Sft E/F 3rd Floor Fully Furnished 100 Ft Main Rd. Suitable for Commercial/ Residency. 9849747958.

MIYAPUR

Brand New 3BHK Premium Flats @ Deepthi Sri Nagar, Madeenaguda, Miyapur. Close to Mumbai Highway ✆ 9963914098, 6304944734.

Miyapaur- New 2 & 3 BHK Luxurious Flats for Sale, Ready to move, HMDA Approved, Pride Park, Sai Anurag Colony. Ph: 9848944044, 9848960444.

2&3 BHK Premium Flats for Sale. Gated Community Ready to occupy. Kousalya Colony, Miyapur to Bachupally Rd. 7036336458.

MOKILA

2BHK, 1263 Sq.ft (EF) Ground Floor (Fully Gated Community) NCD, Mokila, Near ICFAI University, 70 Lakhs. Ph: 8978820567

NIZAMPET

Pragathi Nagar- New 2BHK & 3BHK Luxurious Flats HMDA Approved, Semi Gated Community, Ready to move. NRI Cly. ✆ 9848944044, 9848960444.

SAGAR ROAD

BN రెడ్డి నగర్, సాగర్ హైవే రోడ్డు నందు 2BHK, 3BHK Flats- Ready to Move అమ్మకమునకు కలవు. 4,500/- P. Sft only. Ph: 8523044468

SECUNDERABAD

Old Bowenpally, Samatha Nagar Luxury 3BHK, each Floor 1 Flat A Block- 2590 Sft, B- Block- 2745 Sft. For Sale ✆ 9908056449.

UPPAL

Ready to Move New 3BHK Flat 301, E/F, 1900 Sft. False Ceiling Lift & Car Park @ Uppal. Very Nr. Metro Station Bank Loan Avl. ✆ 9963946139.

JUBILEEHILLS

3BHK E/F Flat (2000 Sft) for sale at Film nagar, Jubileehills Opp: Apollo Medical College & Hospital. Ph: 9849010325

GENERAL

Ready to occupy New 3BHK Flats for sale @ MN Reddy Colony, Champapet. Contact: 9849021921/ 9010464646

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు దగ్గరలో ఆదిత్రి ఎవోకా గేటెడ్ కమ్యూనిటీ 4వ ఫ్లోర్ ఈస్ట్ కార్నర్ 3BHK ఫ్లాట్ (1600 Sft) అమ్మకానికి కలదు. 98855 51127.



HOUSE FOR SALE

CHIKKADPALLY

Chikkadpally 100 sq.yds N/F Independent old House 5 Rooms for sale at Soap Factory Lane. Contact: 9100028772

DILSUKHNAGAR

Indp. Duplex House 270 Yds, 4400 Sft- 3BHK+ 1BHK+ Pent House. Fully Furnished @ 3.8 Cr at Saidabad. ✆ 9676975424.

ECIL

Shamirpet at Hakimpet, Exit:07, East/ West, Triplex Villas G+2, 2800/ Sft- 180 Sq.Yards, G+2, 3350/ Sft- 200 Sq. Yards, Luxurious Mega Gated Community. Ready to move. Property Googler. Ph: 8886667778.

Ready to Occupy Luxury Duplex 2040 Sft Villas. Club House & Swimming Pool in Cherlapally, near the Railway Station. Just a 10 Minutes drive from ECIL. Ph: 8555816048.

Near ORR Exit No.8, Keesara inside & outside Dammaiguda & Nagaram GHMC Limits Deluxe Indp. & Duplex 2, 3, 4 BHK Houses from 800 Sft to 2000 Sft from 47 to 99 L. in Gated Community. HMDA Venture with Club House and all Amenities ✆ 7286061111, 9100886668, 9100995559.

GACHIBOWLI

Fully Furnished Villa 4BHK & Home Theatre Narsingi Gardenia Florence Gated Community. Ph: 9966662068

KUKATPALLY

Kukatpally 150/200 Sq.Yds Buildings for Sale and 240 Sq.Yds Building Gandimisamma Junction. Contact: ✆ 9849356645.

Kukatpally, Near Traffic Police Station. G+4 Building 130 Yards, Getting Rental 1 Lakh 8,000/-PM. Can use as Hostel. ✆ 90528 25333.

L.B.NAGAR

Vaidehinagar: Plot No 465/ N, Ind. House In G +1, 135 Sq.Yds, Vansthalipuram. Mobile: 8790635042, 7730012111.

Almasguda Nr. YSR Park, Comm. 120 S/Y Buldg G+2 G.Flr 3 Shutters 1st Flr 1BHK 2 Por. 2nd Flr 1 BHK 2 Por. Rent 40K, 1.20 Cr. Neg. ✆ 9989678947.

MEDCHAL

Kompally Aparna, G+2 independent Duplex House, 222 sq.yds, Semi Furnished, W/S Corner. Contact: 9000779552, 8520003330

SHAMSHABAD

Closing Offer 58 Lakhs Independent House, 150 Sq.Yds, Near Int. Airport. HMDA, Bank Loan Avbl. Gated Comm. Ph: 9353359841

UPPAL

Boduppal, W/F 3BHK, 2660 Sft fully furnished Triplex independent house in 87 Sq.Yards @ 1.50 Cr fixed. Ph: 9177807888.

KOMPALLY

Ready to occupy Duplex, 200 Sq.Yds, 2572 Sft (East Facing) Villa for Sale. 10 Mn from Kompally. Cont: ✆ 9676503312.

GENERAL

పెద్దఅంబర్‌పేట హైవే దగ్గరలో మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో MIVAN టెక్నాలజీ కన్‌స్ట్రక్షన్, 4 BHK ప్రీమియం లగ్జరీ డూప్లెక్స్ 516 విల్లాస్ ఫర్ సేల్, 4.5 ఎకరాలు లగ్జరీ పార్క్, లక్ష SFT లగ్జరీ ప్రీమియం క్లబ్‌హౌస్. HMDA & RERA అప్రూవ్డ్. Ph: 96666 85222.

మహేశ్వరం ఎలక్ట్రానిక్ సెజ్ పక్కనే HMDA & RERA అప్రూవ్డ్ మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో 2BHK & డూప్లెక్స్ విల్లాస్ ఫర్ సేల్, రెడీ టు మూవ్. Ph: 96666 85222.

LAND FOR SALE

MEDCHAL

Shamirpet 5 Acres Land For Sale H/W 2nd Bit 2km From ORR Exit 7 Proposed 100' Rd. No Brokers. Ph: 9000581630

PATANCHERU

4000 Sq.Yards Residential/ Commercial Land @ Beeramguda, near Praneeth Pranav Knightwoods Villas, Hyderabad. ✆ 6304700399.

SANGAREDDY

10 Acres Land for Sale with 2 Borewells @ Machareddypalli Village, Sadasivpet Mandal. 100% Clear Title. ✆ 94412 00698 / 94400 53404.

SHANKARPALLI

Shankarpally, Nr. Nawabpet, 2Ac.18 Gts Land @ Ac. 1.95 Lacs. Nr. T.S Model School, opp. Petrol Pump, Nr. by RRR. Ph: 9848330217

PLOT FOR SALE

BALAPUR

Balapur 400 Feet RCI Road near Edify School HMDA Approved Plots for Sale. Bank Loan Available. Ph: 9849040000, 9849558822.

HMDA Approved Fully Developed Residential Plots @ Badangpet Opp. New Muncipal Office, Library, Airport to TCS Road near Int. Schools, Colleges. 9666148089, 9581213344.

CHARMINAR

Prime Land for Sale. 460 Sq.Yd. Plot with Complete Tin Shed at Shamsheergunj, Hyd. Ph: 9848912749, 11.00 AM to 7.00 PM only.

ECIL

310 Sq.Yds E/F Land for Sale Beside Keesara (ECIL) ORR Exit No.8, Service Road, Price: 30K per Sq.Yd. Cont: 9885217967.

Kapra: Sri Enclave (NRI colony) 170 sqy East Face Gated community, 24/7 security. Godavari water. Call: 8247310332

Near ORR Exit No.8, Keesara inside & outside Dammaiguda & Nagaram GHMC Limits Open Plots 100, 125, 150, 175, 200, 250, 300 Sq.Yds @ 20K to 35K in Gated Community. HMDA Venture with Club House with all Developments ✆ 7286061111, 9100886668, 9100995559.

GHATKESAR

Pinewoods: Open Plots @ Aushapur near Ghatkesar! Last 8 Plots left! Gated Community with Excellent Amenities & Club house. Rates @ Rs. 13,000/- Sqyd. HMDA Approved. Call: 7677120120.

వరంగల్ హైవే బీబీనగర్ AIIMS స్వర్ణగిరి టెంపుల్ దగ్గరలో 8 రకాల పండ్ల మొక్కలతో ఫామ్ ల్యాండ్ కలదు. T.S. పాస్‌బుక్ ఇవ్వబడును. 9000242796.

HAYATHNAGAR

500 yds plot for sale at Autonagar Vanasthalipuram, 80 ft road facing, Contact: 9246522275

Vijayawada Highway Facing Projects HMDA & DTCP RERA Villa Projects Highway Commercial Plots Avlble. Cont: 9989754992.

హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, గ్రీన్‌సిటీలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును. నో బ్రోకర్స్. Ph: 9553973999, 6303049720

JEEDIMETLA

Gagillapur Venkatadri- 200 Yds, W/F, 267 Yds, E/F, 534 Yds, N/W 800 Yds, E/S/W 1068 Yds, E/W Plots Sale. Kistaipally- 821 Yds. Sale. 6301829066.

KUKATPALLY

342 Sq.Yds 1.8 Lakhs per Sq.Yd. Behind Traffic Police Station & Metro Cash 'n' Carry, Kukatpally. Brokers excuse. ✆ 9985427122, 9845333298.

PLOT FOR SALE
VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 90141 35437
TIMINGS: 10am to 7pm only

L.B.NAGAR

Amazing Offers for Dasara. Taramatipet Exit No.10, DTCP Approved Budget Friendly, Bank Loan Prime Plots. ✆ 8897713428.

MALKAJGIRI

HB Colony Moula-Ali Thirumala Nagar 247 Sq Yds (45x50) N/E Corner Plot Prime Location. 2 side 30' Road Near Rly Stn. ✆ 9948266710, 9391007193.

MEDCHAL

Villa Plots Available at Saket Sizes: 200 to 600 sq.yds Near Ayodhya Circle, Gowdavelli. Cont: 97015 49945

Commercial Plots for Sale. Opposite Modi Builders @ Aliabad (V), Shameerpet (M), 3000 Sq.Yds, DTCP Final Approved & HMDA Plots @ Turkapally. Ph: 9966099764.

MIYAPUR

1332 Sq.Yds for Immediate Sale in Vaishali Nagar, Madinaguda, Manjeera Pipeline Road, Miyapur 95K Sq.Yd. 2 Bit, M.Road ✆ 9700184387.

MOINABAD

Chilukur open farm plots sale 500 & 1000 Sq.yds Close to Chilukur. Clear title. Spot registration. Phone: 8122349999

APPA Junction @ Moinabad 20 minutes drive from Gachibowli, Farm Lands 418, 565, 1000, 1210 SqYds with 6 years old Mango Trees. Ph: 9000053259

MOKILA

Mokila 150 feet Road Facing Farm Plots with Club House membership Nearby Villa Projects. Contact: 8143539073

మోకిల 150 ft Rd Face లో 15 K లో farm Plots కలవు with Club House, All aminities. Ph: 9014049781

PATANCHERU

Patighanpur (Kollur) 200 Ft Rd Face Plots Sale HMDA Final Layout Nr. Villas, All Devt. Completed, Spot Regi. Ph: 9505808050

HMDA Villa Plot for Sale @ Patancheru admeasuring 200 Sq.yds. Ready for Construction. 2 Mins from ORR. Ph: 8897301021

పటాన్‌చెరు ఇంద్రేశం అరవిందో విల్లాస్ నుండి 5KM లో బేగంపేట 100 Ft రోడ్డు దగ్గరలో 788 గజాలు N/E కార్నర్, LRS ఎప్లైడ్ Ph: 8978985999.

కంది మండలం ఆరుట్ల గ్రామ పరిధిలో 40 Ft-Rd- ఫేసింగ్ 1815 గ॥ ఫామ్ ప్లాట్ అమ్మకం మార్కెట్ వాల్యూ 10K అతితక్కువ ధరకే కలదు. Ph: 9494509834

SANGAREDDY

Bombay Highway near Budhera Bhavishya Infra Developers DTCP Plots for Sale. 9500/- per Sq.Yd. Cont: 92918 57648, 6301423959.

Sadasivapet. Mumbai H/way DTCP & RERA. full Dev. Gated community. Loan. Rs. 9499/-, Spot Reg. Ph: 9951685471. 6281244462

Mumabai High-way Facing Venture @ Digwal. 25 Acres Prestigious Project. Gated Community. Loans, CC Roads, 15M. Drive to NIMZ, Zaheerabad, 25 M. Drive to RRR. Best Venture for Best Returns. Investors Invited. Free Site Visit. G.V.Rao. ✆ 90522 20464 / 89197 13823.

ముంబాయి హైవేకి ఆనుకొని DTCP 200 ఎకర్స్ గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్. ఆఫర్ ప్రైస్ 12,999/- & 5,999/- only. స్పాట్ రిజిస్ట్రేషన్. Ph: 9888944471.

SHADNAGAR

Launching & Dussera Offer: Buy 242 Sq.Yds Farm Plot get Free 1 BHK Farm House 6999/- per Sq.Yd. Shadnagar nr. RRR 9676606974.

Kothur, HMDA Approved Villa Plots on JP Darga Road with all Development at very Reasonable Cost for dtls. ✆ 9951080002.

TLR Ventures DTCP Approved with LP No. 09/2024 Villa Plots @ Shadnagar. Beside Bangalore Highway, Bank Loan. 9000053259.

Shadnagar Town Villa Plots Rs.16,500/- P.sq.yd Nego. DTCP/ RERA. Bank Loans. 2KM From Bus Stand, Gated Comm. Ph: 9666856378

SHAMSHABAD

HMDA&RERA PLOTS
100 Acres Venture with 5 Acres Club House
Bangalore Highway Facing Venture
SHAMSHABAD @KOTHUR
@16999/- per sq yard
5 GRAMS GOLD FREE
First 10 Members
Bank Loans available
70952 72552

SRISAILAM HIGHWAY

8 Lakhs discount on Land Lord share Villa Plots @ Kadthal- Srisailam H/W nr Future City & Pharma City. Raja- 9966744544.

FARM PLOTS
ఫామ్ ప్లాట్స్, శ్రీశైలం రోడ్, మహేశ్వరం మరియు కందుకూరు
Size: 242, 484 sqyds,
క్లబ్ హౌస్ & ప్లాంటేషన్, గేటెడ్ కమ్యూనిటీ, ఫ్రీ మెయింటనెన్స్
9676171633

PREMIUM FARM LAND PLOTS FOR SALE
KANDUKUR
▸ 50 acres Luxury Project with Royal entrance
▸ Nearby Amazon Data centre, Fourth City, AI Capital & Pharma Clusters
▸ Close to Metro train & 300' Roads.
▸ Between ORR & RRR Junctions
Company direct Sales 8000/- sqyd
9885552209

UPPAL

Uppal- Medipally, Satyanarayanapuram, Road No: 12, West Facing, 320 Sq.yds Plot For Sale. LRS Approved. Ph: 9440215640

SHANKARPALLI

JB's Infra వారి అతితక్కువ ధరలో @ మోమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

GENERAL

Y Gutta, 2 Kms from Main Temple, 360 yrds East Plot, YTDA Layout RERA Approved for Sale. Ph 8331848434

233+ 233+ 233+ 233= 932 Sq.Yards, Mucherla 4th City, 20 Min Drive Airport, 100 Meters to Srisailam Highway Amazon, Skill University. 8801000880.

Plots for sale in Attapur, Hyderguda prime location. No brokers. Pls contact: 9100028927/ 9000221625.

800 Sq.yds for sale at peddagolconda facing service road of ring road. Contact: 9848274893/ 9246522275

తెల్లాపూర్, షైహోమ్ సామూక్, వజ్ర ఫైరేంజ్ అపార్ట్‌మెంట్స్‌కి, మంతన ఇంటర్నేషనల్ స్కూల్‌కి ఆనుకొని 75 గజాల కమర్షియల్ స్థలం అమ్మబడును. ఫోన్: 9885286593.

గజం 2500/- మాత్రమే, విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటి వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, కాటేజి మరియు 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో '1210' గజాలు (10 గుంటలు) ప్లాట్ అమ్మబడును. సంప్ర. 93463 63436.

చేర్యాలకు దగ్గరలో కేవలం 302500/- కు ఒక గుంట ఫామ్ ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేసుకోండి. తులం బంగారం బహుమతిగా తీసుకోండి సంప్ర: 8919302962 / 7702925337

PLOTS FOR SALE
Sagar Highway Facing
@ IBRAHIMPATNAM
HMDA LP No. 156/2022
SAMRUDDHI DEVELOPERS
Ph: 9000375375

COMMERCIAL SPACE FOR SALE

Hostel Building For Sale
at KPHB
Monthly Rent Getting 5 Lakhs
North West Corner
9848 66 1666

LEASE

12000 Sft Industrial Shed for Lease at I D A Bollaram 100 H.P Power. Contact: 9491202179

ఎకరం (1.10) గుంటలు కాంపౌండ్, కరెంటు కలిగిన ఓపెన్ ల్యాండు లీజుకు ఇవ్వబడును. దమ్మాయిగూడ చౌరస్తా దగ్గర, చెరువు వెనకాల. Ph: 9348212354.

LEASE/ RENT

For Godowns/ Office: Newly Constructed Building with 6 Portions- 3 Floors in Sapthagiri Colony, Bachupally Main Road near VNR College, Hyd. ✆ 9989931396, 9989322996.

Commercial space for rent, opp: narayana college, drs colony. kothapet. G+3 sft 8000- Hostel, hospital, offices. Ph: 9966626662

WANTED

బిల్డింగ్ లీజుకు కావలెను
తెలంగాణ కర్ణాటకలో గల ప్రముఖ విద్యాసంస్థకు తుర్కయాంజల్, మన్నెగూడ ప్రాంతాలలో 50,000 - 70,000 అడుగులు మరియు శామీర్‌పేట, పటాన్‌చెరువు, మొయినాబాద్, శంషాబాద్, కొంపల్లి ప్రాంతాలలో 30,000 to 40,000 అడుగుల భవనాలు లీజుకు కావలెను.
ఆసక్తికలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
888 690 1299

స్కూల్ బిల్డింగ్ కావలెను
ఒక ప్రముఖ విద్యాసంస్థకు 10,000 చ॥అ॥ నుండి 25,000 చ॥అ॥ వరకు నిర్మించిన/ నిర్మించబడుతున్న బిల్డింగ్ స్కూల్ కొరకు మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, ఖాజాగూడ, మణికొండ, అలకాపురి, నార్సింగ్, షేక్‌పేట్, తెల్లాపూర్, నల్లగండ్ల, కోకాపేట్ పరిసర ప్రాంతాలలో దీర్ఘకాలిక లీజుకు కావలెను. ఆసక్తిగల యజమానులు/ మధ్యవర్తులు సంప్రదించగలరు.
✆ 9059652999 9059651999

PROPERTY FOR SALE

Gachibowli- 200 yds @8cr, Rent: 4L, 1300 yds Sq.yd @ 1.30L, Comm Building @ 20 cr Rent: 10L & 300, 500, 1000 yds. Ph: 9100587259

AGRICULTURE LANDS

3 Acres Land for Sale @ Mominpet, Manna-pur 36 Lac per Acre, Black Soil, Clear Title Land. Owner No: 9700071161

TO LET

4 1/2 BHK with Full Interiors, AC, Home Theatre, Kitchen with all Accessories in Villa No. 40, Preston IVY Villa Project, Guttula Begumpet, Madhapur. ✆ 8143893222

COMMERCIAL

KPHB Cly, Ph-VI Opp. Pick n Buy Stores Comm Space, 2nd & 5th Flr, each 2125 Sft, for IT/ Banks/ Clinics/ Gym etc. Ph: 9963643586.

Commercial Premises at Raigiri- Yadagirigutta Rd. GF+ FF 2400 Sft, All Amenities. Rent Rs. 24,000/-. Cont: 9848013434.

లీజు వ్యవహారంలో పారాహుషార్



ఈనాడు, హైదరాబాద్

ఇల్లు, ఫ్లాట్, స్థలం కొనేటప్పుడు మాత్రమే కాదు.. వాటిని లీజుకు తీసుకునేప్పుడూ అన్ని విషయాలు జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ స్థలంపై వారికి హక్కులు ఉన్నాయా? లేవా అనేది చూడాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది అనేందుకు ఇటీవలి ఉదంతాలే నిదర్శనం.

నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో..

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను హైడ్రా కొద్దిరోజులుగా కూల్చివేస్తోంది. షెడ్లను సైతం నేలమట్టం చేస్తోంది. వీటిలో చాలావరకు లీజుకు తీసుకుని తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. అవి నిబంధనలకు విరుద్ధంగా ఉండటం.. హైడ్రా కూల్చివేతలతో అద్దెకు తీసుకున్న వారు తీవ్రంగా నష్టపోయారు.
● ముందుగా స్థలాలపై టైటిల్ వివాదాలు లేకుండా చూసుకోవాలి. ఎవరి పేరు మీద ఉన్నాయో వారితోనే ఒప్పందం చేసుకోవాలి. ఇల్లు కొనేటప్పుడు అన్నింటిని ఎలా చూసుకుంటామో.. అద్దె విషయంలోనూ అలాగే జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా ఖాళీ స్థలంలో లీజుదారే నిర్మాణాలు చేపట్టే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ● చెరువుల సమీపంలో ఇస్తున్నారంటే అనుమానించాలి. చాలామంది చెరువుల భూములు ఆక్రమించి ఇతరులకు అద్దెకు ఇస్తున్నారు. నష్టపోతే లీజుదారుడే... తమకు పోయేదేముందనే భావనలో కబ్జాదారులు ఉన్నారు. ● యజమాని పేరున పట్టా ఉన్నా.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో శాశ్వత, తాత్కాలిక.. ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. మట్టితో పూడ్చరాదు. ఒప్పందానికి ముందే ఇవన్నీ చూసుకోవాలి.
● కొందరు యజమానులు స్థలాన్ని అప్పటికప్పుడు ఖాళీ చేయమని చెబుతుంటారు. లీజుదారుల్లోనూ కొందరు గడువు తీరిన తర్వాత ఖాళీ చేయడానికి వేధిస్తుంటారు. భవిష్యత్తులో ఎవరికీ సమస్యలు రాకుండా వ్యవధి, అద్దె వివరాలు, నిబంధనలు, షరతులు పక్కాగా రాసుకోవాలి.
● ఆ తర్వాత రెండు పార్టీలు పత్రంపై సంతకాలు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేయించాలి. అప్పుడు చట్టబద్ధత వస్తుంది.

సౌరశక్తి వాడారు..
ఆర్థిక లబ్ధి పొందారు

న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి

సాధారణంగా సోలార్ పవర్ వినియోగించుకోవడానికి.. పలకల ఖరీదు... నిర్వహణ తదితర అంశాల గురించి చాలామంది చర్చించి వదిలేస్తారు. అడుగు ముందుకేయడానికి ఎన్నో ఆలోచనలు, తర్జనభర్జనలు చేస్తారు. కొందరు అపార్ట్‌మెంట్ వాసులు మాత్రం సమన్వయంతో ముందుకుసాగి ఆలోచనను ఆచరణలో పెట్టి విద్యుత్ బిల్లుల భారం నుంచి తప్పించుకొంటున్నారు. మెయింటెనెన్స్ ఖర్చు తగ్గించుకొంటున్నారు.



యాక్టివ్ పెరల్ ప్లేస్ అపార్ట్‌మెంట్ భవనంపై ఏర్పాటు చేసిన సౌర పలకలు

రూ.25 వేల బిల్లు.. రూ.10 వేలకు దిగొచ్చింది

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఅవుట్ ప్రాంతంలోని యాక్టివ్ పెరల్ ప్లేస్ అపార్ట్‌మెంట్ 2800 గజాల స్థలంలో నిర్మించారు. ఇందులో 62 ఫ్లాట్లు ఉన్నాయి. కామన్ ఏరియాకి సంబంధించి లిఫ్టులు, లాంజ్ లైట్లు, సెల్లార్ లైట్లు తదితర వాటికి దాదాపు రూ.25 వేలకుపైనే విద్యుత్ బిల్లు వచ్చేది. దీంతో నెలనెలా మెయింటెనెన్స్ సైతం పెరిగే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘం సభ్యులు, నివాసితులు సంయుక్తంగా ఈ అంశంపై చర్చించి.. కరెంటు బిల్లు తగ్గించుకొనేందుకు.. సౌర శక్తిని వినియోగిద్దామని నిర్ణయించుకున్నారు. 2021లో ఈ నిర్ణయం తీసుకుని రూ.8 లక్షలతో సౌర పలకలు ఏర్పాటు చేశారు. దీంతో బిల్లు రూ. పది వేలకు దిగివచ్చింది. వేసవిలో అయితే మరింత తగ్గిపోతోంది.

అనుమతులు ఇలా..: సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడానికి ముందుగా విద్యుత్ శాఖ నుంచి అనుమతి అవసరం. వీరికి 15 కేవీ కెపాసిటీ వరకు మాత్రమే తీసుకునే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెప్పడంతో అంత వరకే సర్దుకున్నారు. ప్రతీ నెల 1800 యూనిట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇప్పటివరకు ఎటువంటి నిర్వహణ ఖర్చు లేదని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. పది .. పదిహేను రోజులకు ఒకసారి పలకల మీద ఉన్న దుమ్ము తొలగిస్తున్నట్లు తెలిపారు.

అందరూ సంతోషంగా ఉన్నారు..

సౌర విద్యుత్తు వ్యవస్థ ఆలోచన కార్యరూపం దాల్చడం ఎంతో ఆనందంగా ఉంది. ఖర్చులు తగ్గడంతో మా అపార్ట్‌మెంట్‌లో అందరూ సంతోషంగా ఉన్నారు. ఇండిపెండెంట్ ఇల్లు, అపార్ట్‌మెంట్, బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు . . ఈ వ్యవస్థ ఏర్పాటు ద్వారా బిల్లుల నుంచి బయటపడటం మంచిదని మా భావన.

- రామరాజు, అపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు

మెట్రో వస్తే.. రియల్ రంగానికి ఊపు



మియాపూర్, న్యూస్‌టుడే: ఒకప్పుడు దిల్లీ, ముంబయి వంటి నగరాలకే పరిమితమైన మెట్రో రైల్ హైదరాబాద్‌లో ప్రారంభమైనప్పటి నుంచి ప్రజా రవాణా సౌకర్యం మెరుగుపడింది. ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు ఉన్న కారిడార్ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. మెట్రో స్టేషన్లకు దగ్గరగా ఉన్న పలు కాలనీల్లో నివాసానికి ప్రజల్లో ఆసక్తి పెరిగింది. ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం నిత్యం నగరానికి రాకపోకలు సాగించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలోనే మియాపూర్ వరకు నిత్యం వేలాది ప్రయాణికులు ఈ రైలులో రాకపోకలు సాగిస్తున్నారు. మియాపూర్ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల వారు సైతం నిత్యం నగరానికి ఇక్కడి నుంచే రైలులో వెళుతుంటారు.

పటాన్‌చెరు వైపు ఆసక్తి : ఇటీవలి కాలంలో నగర వ్యాప్తంగా భూముల ధరలు గణనీయంగా పెరిగిపోవడంతో చాలామంది పటాన్‌చెరు పరిసరాల్లో సొంత ఇంటిని ఏర్పాటు చేసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ అనుసంధానంగా ఉండటంతో ఈ ప్రాంతంలో నివాసాల సంఖ్య కొంతకాలంగా పెరిగిందనే చెప్పొచ్చు. దీనికి తోడు ఇక్కడ ధరలు మధ్య తరగతి వారికి అనువుగా ఉండటంతో ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బీహెచ్ఎల్ నుంచి అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురం, పటాన్‌చెరు, ఇంద్రేశం, ఇస్నాపూర్, కిష్టారెడ్డిపేట, ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకోవడంపై ఐటీ, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు దృష్టి సారిస్తున్నారు. ఇక పలు ప్రముఖ నిర్మాణ సంస్థలు ఇక్కడే అపార్ట్‌మెంట్లు, విల్లాల ప్రాజెక్టులను ప్రారంభించడంతో కొనుగోలుదారులు ఆసక్తిగా ముందుకొస్తున్నారు. దీనికి తోడు మెట్రో వంటి రవాణా సౌకర్యం ఏర్పడితే ఈ ప్రాంత రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపందుకునే అవకాశం ఉందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

పనుల ప్రారంభానికి ఎదురుచూపులు

ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మియాపూర్ నుంచి మెట్రోను సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న పటాన్‌చెరు వరకు పొడిగించాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతో, ఈ ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు మొదలయ్యాయి. సుమారు 20 పైగా ఉన్న కాలనీల వాసులు త్వరగా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చాలని కోరుకుంటున్నారు. మెట్రో రైలు ప్రారంభమైతే మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు నిత్యం రాకపోకలు సాగించే వేలాదిమంది కార్మికులు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట వైపు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందనడం వాస్తవం. ఈ కారిడార్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల రూపురేఖలు మారిపోయే అవకాశం ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎస్ఎం-రీట్స్‌పై పెట్టుబడిదారుల ఆసక్తి!



ఈనాడు, హైదరాబాద్: దేశంలో స్మాల్ అండ్ మీడియం రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(ఎస్ఎం-రీట్స్) 2026 నాటికి 350 మిలియన్ చదరపు అడుగుల కార్యాలయ భవనాల విస్తీర్ణం అర్హత పొందుతుందని సీబీఆర్ఈ (రియల్ ఎస్టేట్ సేవలు, పెట్టుబడుల సంస్థ) అంచనా వేసింది. వీటి విలువ 60 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఉంటుందని తెలిపింది. ఎస్ఎం-రీట్స్ కోసం సెబీ మార్చిలో ఫ్రేమ్‌వర్క్‌ను నోటిఫై చేసింది. ఈ నేపథ్యంలో విడుదలైన నివేదికలో ఆసక్తికర విషయాలను వెల్లడించింది.
● వాణిజ్య రియల్ ఎస్టేట్ భవిష్యత్తును రూపొందించడంలో కీలకపాత్ర పోషించబోతున్న ఎస్ఎం రీట్స్‌పై పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని వెల్లడించింది. ● ప్రస్తుతం మన దేశంలో కార్యాలయ స్టాక్ 800 మిలియన్ చ.అ. పైగా ఉంది. కొత్తగా ఎస్ఎం-రీట్స్‌తో చిన్న మదుపర్లు వాణిజ్య భవనాల్లో పాక్షిక యాజమాన్యం పొందేందుకు అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఇదీ తేడా... : ప్రస్తుతం రీట్స్ అందుబాటులో ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటి కింద ఆస్తి విలువ రూ.500 కోట్లు ఉండాలి. కొత్తగా ఎస్ఎం-రీట్స్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను సెబీ ఇటీవల విడుదల చేసింది. దీని ప్రకారం రూ.50 కోట్లకు తగ్గించడంతో ఎక్కువ పెట్టుబడులు వచ్చేందుకు వీలుందని ఉం మార్కెట్ వర్గాలు అంటున్నాయి.


ఎత్తైన భవనాలకు నిర్మాణ అనుమతులు ఇచ్చే విషయమై చర్చించేందుకు నిర్వహించాల్సిన ఎంఎస్‌బీ (మల్టీ స్టోరీడ్ బిల్డింగ్) సమావేశాలు సక్రమంగా సాగడం లేదు. ప్రతి వారం జరగాల్సి ఉన్నా వరుసగా మూడు వారాలు అసలు వీటి ఊసే లేదు. ఇటీవల జీహెచ్ఎంసీలో నిర్వహించినా పెండింగ్ దరఖాస్తులపై నిర్ణయం తీసుకోకుండా, మళ్లీ చర్చిద్దామంటూ ముగించారు. ఈ పరిస్థితితో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో నిర్మించే భవనాలకు అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారుల చుట్టూ నిర్మాణ సంస్థల ప్రతినిధులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎందుకు తాత్సారం చేస్తున్నారనే ప్రశ్నకూ అధికారులు సమాధానం ఇవ్వట్లేదని వారు చెబుతున్నారు.

ఈనాడు స్థిరాస్తి

బహుళ అంతస్తులు..

అనుమతులపై అయోమయం

నిర్మాణ అనుమతి కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే.. గూగుల్ పటాల ఆధారంగా ఆయా సంస్థల ప్రణాళిక విభాగం క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలిస్తుంది. దగ్గర్లో నాలా లేదా చెరువు ఉన్నట్లయితే.. నీటి పారుదలశాఖ నుంచి నిరభ్యంతర పత్రం కోరుతుంది. భారీ నిర్మాణాలకైతే.. ఎమ్మార్వో నుంచి సర్వే నంబర్ల ఆధారంగా పట్టాదారు వివరాలను సమర్పించాల్సి ఉంది. ఇటీవలి కాలంలో.. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాల్లో అక్రమ కట్టడాలను హైడ్రా కూలుస్తోంది. ఆయా భవనాలకు అడ్డదారిలో నిర్మాణ అనుమతులు ఇచ్చిన అధికారులనూ వదలట్లేదు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగాల అధికారులు పంథా మార్చుకున్నారు. గూగుల్ పటంలో.. నిర్మాణ అనుమతికి సంబంధించిన స్థలం పక్కన చిన్నపాటి నీటి జాడ కనిపిస్తే చాలు.. నీటిపారుదల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలని దరఖాస్తుదారుకు సూచిస్తున్నారు. ఇందువల్ల కొంత మేలు జరుగుతుండగా.. చెరువులు, నాలాలకు దూరంగా ఉన్న స్థలాలకూ ఎన్వోసీ అడుగుతున్న సందర్భాలు ఇబ్బంది పెడుతున్నాయని నిర్మాణదారులు అంటున్నారు.



- సక్రమంగా జరగని ఎంఎస్‌బీ సమావేశాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న బిల్డర్లు

ప్రణాళిక విభాగం నిర్ణయంతో...

వంద అడుగుల రోడ్డు ఉంటేనే ఏదైనా నివాస సముదాయంలో కొంత భాగాన్ని వాణిజ్య కేటగిరీలో ఉపయోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం ఇటీవల నిర్ణయం తీసుకుంది. జీ.వో.నెం.168 ప్రకారం.. ఎత్తైన భవనాల్లో హోటల్, రెస్టారెంట్, వ్యాయామశాల, బ్యాంకు, ఇతర వ్యాపార కేంద్రాలకు రోడ్డు వెడల్పుతో సంబంధం లేకుండా అనుమతించాల్సి ఉంటుంది. వాహనాల రద్దీ, పార్కింగ్ సమస్యలను కారణంగా చూపుతూ అధికారులు ఆయా దరఖాస్తులను పక్కన పెడుతున్నారని నిర్మాణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నాలుగేళ్లుగా. . ఒకే భవనంలో పైన ఇళ్లకు, కింద వాణిజ్య సముదాయాలకు అనుమతి ఇచ్చే విధానాన్ని జీహెచ్ఎంసీ నిలిపేసిన విషయం తెలిసిందే.

ఉత్తర్వుల జారీలో ఎడతెగని జాప్యం

- ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి హెచ్ఎండీఏకు, హెచ్ఎండీఏ నుంచి జీహెచ్ఎంసీకి, ఇతర స్థానిక సంస్థల మధ్య ప్రణాళిక విభాగం అధికారుల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీకి బదిలీ అయిన అధికారులకు ఇంకా డీపీఎంఎస్ డిజిటల్ కీ అందుబాటులోకి రాలేదు. ఈ కారణంగా.. గతంలోని వందలాది నిర్మాణ అనుమతుల దరఖాస్తులు పరిశీలనకు నోచుకోవట్లేదు.
- డిజిటలీకరణకు ముందు నాటి పలు నిర్మాణ అనుమతి దరఖాస్తులు గత సర్కారు హయాంలో ఆమోదం పొందాయి. వాటికి అనుమతి ఉత్తర్వులు (ప్రొసీడింగ్స్) జారీ కావాల్సిన సమయంలో సర్కారు మారిపోయింది. అదే అదనుగా.. కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రొసీడింగ్స్ జారీ ఆపేసి.. మళ్లీ మొదట్నుంచి దరఖాస్తును పరిశీలించాల్సి ఉందని మెలిక పెడుతున్నారు.
- స్థిరాస్తి రంగంతో ముడిపడిన ఆయా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిర్మాణ సంస్థలు కోరుతున్నాయి.

ఈనాడు, హైదరాబాద్

పనికి 'ఏ' గ్రేడ్

హంగులున్న కార్యాలయాలపై సంస్థల ఆసక్తి



ఈనాడు, హైదరాబాద్

కార్యాలయాల భవనాల లీజింగ్‌లో ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల వాటానే అధికంగా ఉంది. కొన్నేళ్లుగా ఇందులో వృద్ధి స్థిరంగా కొనసాగుతోంది. ఇంజినీరింగ్, తయారీ సంస్థల వాటా వేగంగా పెరుగుతోంది. ఫ్లెక్సీబుల్‌గా ఉండే కార్యాలయాలకు డిమాండ్ నెలకొంది. దేశవ్యాప్తంగా గ్రేడ్ ఏ కార్యాలయాల్లో తమ సంస్థల ఏర్పాటుకు బహుళజాతి సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఉత్పాదకత పెరగాలంటే పని వాతావరణం ముఖ్యమని విశ్వసిస్తున్నాయి.

ఎస్‌బీడీలోనే..

హైదరాబాద్‌లో కార్యాలయ భవనాల లభ్యత సెకండరీ బిజినెస్ డిస్ట్రిక్ట్ (ఎస్‌బీడీ)లోనే అధికంగా కేంద్రీకృతమైంది. మాదాపూర్, రాయదుర్గం, హైటెక్‌సిటీ, కొండాపూర్ చుట్టుపక్కల ప్రాంతాలు ఎస్‌బీడీలో పరిధిలోకి వస్తాయి.

జనవరి నుంచి సెప్టెంబరు 2024 వరకు దేశంలో రంగాల వారీగా (కొలియర్స్ నివేదిక)

రంగం	మి.చ.అ.	వృద్ధి శాతం
టెక్నాలజీ	12.0	25
ఇంజినీరింగ్, మాన్యుఫాక్చరింగ్	7.6	25
బీఎఫ్ఎస్ఐ	8.6	62
ఫ్లెక్స్ స్పేస్	7.9	22
ఆరోగ్యం, ఫార్మా	3.5	133
కన్సల్టింగ్	2.6	−19
ఈ-కామర్స్	0.1	−88
ఇతర	3.1	−24

స్థిరాస్తి వెంచర్లలో కొత్త ట్రెండ్

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే

సీఎం పిలుపుతో ఈత, తాటి చెట్లకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల గీత కార్మికుల రక్షణ పరికరాల ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ... రహదారుల వెంట, ముఖ్యంగా స్థిరాస్తి లేఅవుట్లలోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో తాటి, ఈత చెట్లు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దీంతో కొందరు రియల్ వ్యాపారులు ఇప్పటికే తమ వెంచర్లలోని రహదారుల పక్కన ఈత మొక్కలను నాటించి సంరక్షణపై శ్రద్ధ పెడుతున్నారు. నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఓ లేఅవుట్‌లో ప్రత్యేకంగా తమిళనాడు నుంచి వ్యయప్రయాసలకోర్చి తెప్పించిన ఈత చెట్లను నాటారు. విత్తనాలు లేదా మొక్కలు నాటితే అవి పెరిగి పెద్దయ్యేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉండటంతో, చెట్లనే తీసుకొచ్చి నాటుతున్నారు. దీంతో స్థిరాస్తి వెంచర్లు ఈత చెట్లకు నెలవుగా మారనున్నాయి.



అంతటా అమలైతే.. : కొత్తగా వస్తున్న లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో రోడ్ల పక్కన, పార్కు స్థలాల్లో ఈత, తాటి చెట్ల పెంపకం తప్పనిసరి చేస్తే.. విస్తరిస్తున్న నగరాల మూలంగా అంతరిస్తున్న ఈ వృక్ష వనాలకు పునర్జీవం పోసినట్లే. తద్వారా ఎందరికో ఉపాధి లభించడమే కాకుండా.. ఈత, తాటి ఆకులతో చేసిన ఉత్పత్తులతో పాటు తాటి ముంజలు, కల్లు, ఈత పండ్లు విస్తారంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

కష్టమైనప్పటికీ..

ఈ మొక్కలు నాటి సంరక్షించడం కష్టమైనప్పటికీ కొందరు ప్రత్యేకంగా చెట్లను తమిళనాడుతో పాటు ఇతర ప్రాంతాల్లోని పేరొందిన నర్సరీల నుంచి తెప్పించి నాటి కాపాడుతున్నారు. కొందరైతే తమ గెస్ట్ హౌస్‌లలో ఈ చెట్లు ఉండాలని ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో చెట్టుకు రూ.వేలల్లో ఖర్చు చేసి దూర ప్రాంతాల నుంచి తెప్పించి నాటుతున్నారు.

వైద్యులు లేరు.. వసతుల లేమి!



● కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వ వైద్యం ఆశించిన లక్ష్యానికి దూరంగానే ఉంది. ఆసుపత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సిబ్బంది కొరత, వసతుల లేమి నెలకొంది. 2023లో పరిస్థితులపై కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తాజాగా విడుదల చేసిన 'హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా' నివేదికలో రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్యశాఖలో పరిస్థితులను విశ్లేషించింది.

అద్దె భవనాల్లోనే..

ఆరోగ్య ఉప కేంద్రాల్లో 40% (4,228కి గాను 1,813) అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీల్లో) మూడోవంతు డాక్టర్ పోస్టులు (1,188కి గాను 431) ఖాళీగా ఉన్నాయి.

◆ 6 లక్షల మందికి సేవలందించే కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ల(సీహెచ్‌సీల)లో స్పెషలిస్టుల కొరత ఉంది. ఒక్కో కేంద్రంలో నలుగురు చొప్పున అవసరం కాగా ఇలా పూర్తిస్థాయిలో ఉన్న సీహెచ్‌సీ రాష్ట్రంలో ఒక్కటి కూడా లేదు. సీహెచ్‌సీల్లో 116 స్పెషలిస్టు పోస్టులకు గాను 79 ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 431 డాక్టర్, 362 నర్సు పోస్టులు భర్తీకి నోచుకోలేవు.

గిరిజన ప్రాంతాల్లో..

గిరిజన ప్రాంతాల్లో 902కి గాను 621 మాత్రమే ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. అలాగే మరో 40 పీహెచ్‌సీలనూ ఏర్పాటుచేయాలి. మొత్తం 33 సీహెచ్‌సీలు కావాల్సి ఉండగా 9 మాత్రమే ఉన్నాయి. 87 ఆరోగ్య ఉపకేంద్రాలకు భవనాలే లేకపోగా డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్టులు, స్పెషలిస్టుల కొరత ఎక్కువగా ఉంది. గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్యనిపుణుల పోస్టులు సగందాకా ఖాళీ ఉన్నాయి. 2022 కంటే 2023లో మెడికల్ ఆఫీసర్లు (802 నుంచి 757కు), స్పెషలిస్టుల (98 నుంచి 37కు) సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. సీహెచ్‌సీల్లో 23 ఫిజీషియన్, 18 గైనకాలజిస్ట్, 18 పీడియాట్రీషియన్ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

◆ రాష్ట్రంలో2 12 ఆయుష్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 24 గంటల పీహెచ్‌సీలు 285 ఉండగా వీటిలో నిర్దేశించిన వసతులు సగంలోపే ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో 275 పీహెచ్‌సీలకు గాను 200కి మాత్రమే సొంత భవనాలున్నాయి. 128 డాక్టర్, 444 ఏఎన్‌ఎం, 142 స్పెషలిస్ట్, 84 డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులతో పాటు పలు రేడియోగ్రాఫర్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 4,228 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా వీటిలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నవి కేవలం 877 మాత్రమే. మరో 148 పీహెచ్‌సీల్లోనూ విడివిడిగా మరుగుదొడ్లు లేవు. రాష్ట్రంలో మూడు గ్రామాలకు ఒక ఆరోగ్య ఉపకేంద్రం, 19 గ్రామాలకు ఒక పీహెచ్‌సీ, 387 గ్రామాలకు ఒక సీహెచ్‌సీ ఉన్నాయి.

'ప్రొఫెషనల్' దిశగా

గురుకుల డిగ్రీ కళాశాలలు!

● మెరుగైన ఉపాధి కల్పనే లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలు ప్రొఫెషనల్ కాలేజీలుగా మారుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన గురుకుల విద్య అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు లభించేందుకు వీలుగా కొత్త కోర్సులను సొసైటీలు ప్రవేశపెడుతున్నాయి. డిగ్రీలో ఇప్పటికే ఐటీ సమ్మిళిత కోర్సులు ప్రవేశపెట్టిన సొసైటీలు.. కొన్ని కళాశాలలను వ్యవసాయ, న్యాయవిద్య, ఫార్మసీ తదితర కాలేజీలుగా తీర్చిదిద్దుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల సొసైటీల పరిధిలో ప్రొఫెషనల్ కోర్సుల డిగ్రీ కళాశాలలు 13 అందుబాటులోకి వచ్చాయి.

సంప్రదాయ కోర్సుల స్థానంలో..

ప్రస్తుతం సొసైటీల పరిధిలో 82 గురుకుల డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ కోర్సుల స్థానంలో ప్రొఫెషనల్ కోర్సులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సొసైటీలు నిర్ణయించాయి.

● ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో మొత్తం 30 డిగ్రీ మహిళా కళాశాలలు ఉన్నాయి. ఆర్మీ పోస్టులకు సన్నద్ధమయ్యేలా ఆర్మీ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలను భువనగిరిలో సొసైటీ ఏర్పాటు చేసింది. సిరిసిల్లలో అగ్రికల్చర్ బీఎస్సీ, మహబూబాబాద్‌లో ఫార్మసీ, ఎల్బీనగర్‌లో న్యాయ కళాశాలలు పనిచేస్తున్నాయి. ఆయా కళాశాలలకు సంబంధిత యూనివర్సిటీలు, సెట్ కన్వీనర్లు ప్రవేశాలు నిర్వహిస్తున్నారు.

● గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో 22 కళాశాలలు ఉన్నాయి. వరంగల్‌లో ఆర్మీ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలతో పాటు సంగారెడ్డిలో న్యాయ, సిరిసిల్లలో ఫైన్ ఆర్ట్స్ కళాశాలలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీల పరిధిలో కొత్తగా ఎంబీఏ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. బీసీ గురుకుల సొసైటీలో 30 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో వనపర్తి, కరీంనగర్ కాలేజీలు వ్యవసాయ కళాశాలలుగా, మహేశ్వరం(రంగారెడ్డి),హనుమకొండ(బాలికలు) కాలేజీలు న్యాయవిద్య కళాశాలలుగా కొనసాగుతున్నాయి. సంగారెడ్డిలో హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ, చేవెళ్లలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న బీఏ యానిమేషన్, వీఎఫ్ఎక్స్ కోసం ప్రత్యేక కళాశాలను సొసైటీ ఏర్పాటు చేసింది. న్యాయవిద్య అభ్యసించే విద్యార్థులను క్షేత్రస్థాయి అనుభవం కోసం చివరి ఏడాదిలో సీనియర్ న్యాయవాదులకు సహాయకులుగా పంపించేలా సొసైటీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. తద్వారా వృత్తిలో రాణించేందుకు వీలవుతుందని భావిస్తున్నాయి.

కొత్త పాలసీ ప్రకటిస్తేనే ధాన్యం మిల్లింగ్!



● ప్రభుత్వానికి నివేదించిన మిల్లర్లు

ఈనాడు, నల్గొండ: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సన్నరకాల వరి ధాన్యమే భారీగా రానున్నట్లు అంచనాల నేపథ్యంలో కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ధాన్యాన్ని మిల్లింగ్ చేయబోమని మిల్లర్లు ప్రభుత్వానికి తేల్చిచెబుతున్నారు. ఈ మేరకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మిల్లర్ల సంఘాలు ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదించాయి. ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. మిల్లర్లు క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 67 కిలోల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద అప్పగించాల్సి ఉంటుంది. అయితే దొడ్డురకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాలుకు సగటున 67 నుంచి 68 కిలోల బియ్యం వస్తుందని.. సన్న రకాలకు సంబంధించి మాత్రం కొనుగోలు కేంద్రాల్లో 17% తేమతో ప్రభుత్వ మద్దతుధరకు కొనుగోలు చేసి మిల్లింగ్ చేస్తే క్వింటాలుకు సగటున 58-60 కిలోల బియ్యమే వస్తుందని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో సన్న రకాలకు సంబంధించి 67 కిలోల బియ్యాన్ని సీఎంఆర్ కింద అప్పగించాలంటే క్వింటాలుకు 8 కిలోల వరకు నష్టం వస్తుందని.. కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ఈ సీజన్‌లో మిల్లింగ్ చేసే అవకాశం లేదని పేర్కొంటున్నారు.

● ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 60.38 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేయగా ఇందులో సగం విస్తీర్ణం ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనే ఉంది. కొనుగోలు కేంద్రాలకు దాదాపు 49 లక్షల టన్నుల సన్నరకం ధాన్యం వస్తుందని అంచనా. ఇందులో ఎక్కువగా ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్ జిల్లాల నుంచే రానుంది. మరోవైపు మిల్లింగ్ ఛార్జీలు నల్గొండతో పాటు చాలా జిల్లాల్లో 2018-19 సీజన్ నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని చెల్లించాలని ప్రభుత్వానికి మిల్లర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. రవాణాఛార్జీలు, మిల్లుల వద్ద ఉన్న గోనె సంచుల లెక్కలనూ తేల్చాలని కోరుతున్నారు.

గోదాముల కొరత..

మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐ సకాలంలో తీసుకోక పోవడంతో నిల్వలు పేరుకుపోతున్నాయి. గోదాముల కొరత ఉంది. ఈ ఏడాది విస్తృత వర్షాల నేపథ్యంలో 145 లక్షల టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. 50 లక్షల టన్నులు రైతుల అవసరాలకుపోనూ మిగతా ధాన్యం కొనుగోలు కేంద్రాలకే రానుంది. మిల్లుల్లో ఉన్న బియ్యాన్ని తక్షణం ఎఫ్‌సీఐకి ఇచ్చి.. గోదాములను ఖాళీ చేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

విద్యార్థులకు 'తెలంగాణ దర్శిని'

● ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాల సందర్శన

● నాలుగు విభాగాలుగా రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు..

ఈనాడు, హైదరాబాద్: పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్ని విద్యార్థులు సందర్శించే విధంగా టూరిజం ప్రమోషన్ కోసం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా లక్ష మంది ప్రభుత్వ విద్యార్థుల్ని ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు 'తెలంగాణ దర్శిని'పై పర్యాటకశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కార్యక్రమం మార్గదర్శకాలను ఖరారు చేసింది. విద్యార్థులను తీసుకెళ్లే ప్రాంతాలు ప్రకృతి పర్యాటకం, ఆర్ట్, క్రాఫ్ట్, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలై ఉండాలి. తరగతిని బట్టి నాలుగు విభాగాలుగా గుర్తించారు. మొదటి కేటగిరీలో రెండు నుంచి నాలుగో తరగతి విద్యార్థులు వస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విభాగంలో 30 వేల మంది విద్యార్థులను తీసుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీరికి వనదర్శిని కార్యక్రమం అదే గ్రామంలో లేదా మండల పరిధిలో ఒక రోజు ఉంటుంది. రెండో కేటగిరీలో 5 నుంచి 8వ తరగతి విద్యార్థులు ఉంటారు. 40 వేల మందిని తీసుకెళ్లాలని లక్ష్యం. ఒక రోజు పర్యటన 20- 30 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. మూడో విభాగంలో 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు 20 వేల మందిని తీసుకెళ్లాలని లక్ష్యం. రెండు రోజుల పర్యటన ఉంటుంది. 50-70 కిలోమీటర్ల పరిధిలో ప్రాంతాలకు తీసుకెళ్లాలి. నాలుగో విభాగంలో డిగ్రీ విద్యార్థులు. జిల్లా వెలుపల రాష్ట్రంలో ఎక్కడైనా వీరికి వనదర్శిని నాలుగు రోజులు ఉంటుంది. లక్ష మంది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వనదర్శినితో రూ.12.10 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ఖర్చును పర్యాటక, విద్యా, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అటవీ శాఖలు భరించనున్నాయి.

నేడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

ఈనాడు, హైదరాబాద్, శామీర్‌పేట్, బొల్లారం, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణలో ఒక రోజు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 11.50 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట్‌లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. అనంతరం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకుని.. భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్, అనుదీప్‌లు వేర్వేరుగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

రాష్ట్రపతి నిలయంలో అతి పెద్ద కళామహోత్సవం

రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఎనిమిది రోజుల పాటు జరిగే భారతీయ కళా మహోత్సవంలో ఆయా రాష్ట్రాల నుంచి 430 మంది కళాకారులు పాల్గొననున్నారు. ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఇందుకోసం రాష్ట్రపతి నిలయం అధికారిక వెబ్‌సైట్ లేదా నిలయం ముందున్న కౌంటర్‌లో వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

చారిత్రక భవనాలను

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

● పాత అసెంబ్లీ భవనంలో మండలి సమావేశాలు

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

● మెట్లబావులను తీర్చిదిద్దేందుకు సీఐఐతో పర్యాటకశాఖ ఒప్పందం

● సాలార్‌జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్న భారత్ బయోటెక్



తెలంగాణ దర్శిని గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయిప్రసాద్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్, భారత్ బయోటెక్ జాయింట్ ఎండీ సుచిత్ర ఎల్ల తదితరులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. హైదరాబాద్‌లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో రాష్ట్ర పర్యాటకశాఖ శుక్రవారమిక్కడ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ- మూసీ పరీవాహక ప్రాంతంలో చారిత్రక కట్టడాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో హైదరాబాద్‌లోని అనేకం శిథిలావస్థకు చేరాయన్నారు.

పాత అసెంబ్లీ భవనంలో శాసనమండలి

'పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నాం. త్వరలోనే అందులో శాసనమండలి ఏర్పాటుచేస్తాం. ప్రస్తుతం మండలి ఉన్న జూబ్లీహాల్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. ప్రత్యేక సాంకేతికతతో ఆ భవనాన్ని నిర్మించారు. జూబ్లీహాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలి' అని సీఐఐకి రేవంత్‌రెడ్డి సూచించారు. 'ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని పరిరక్షిస్తాం. దీనికోసం చర్యలు తీసుకుంటున్నాం. ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నాం' అని సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరం ఉందని.. రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవనం నిర్మాణానికి 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ వంతెన వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్‌లోని పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒప్పంద పత్రాలు అందించారు.

◆ సాలార్‌జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించేందుకు భారత్ బయోటెక్ సంస్థ ముందుకు వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావిని తీర్చిదిద్దేందుకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయిలైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డెయిరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నాయి.

ప్రభుత్వ విద్యార్థుల కోసం..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు సీఎం రేవంత్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్, భారత్ బయోటెక్ జాయింట్ ఎండీ సుచిత్ర ఎల్ల, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయిప్రసాద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.



మైన్స్ ప్రదర్శనలో ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీ వివరాలు తెలుసుకుంటున్న భట్టి.. చిత్రంలో బలరాం, కృష్ణ భాస్కర్, రోనాల్డ్‌రాస్

పెట్టుబడులతో రండి.. అభివృద్ధిలో పాలుపంచుకుందాం..

● అమెరికాలో మైన్స్ ఎక్స్‌పో ఇంటర్నేషనల్ సదస్సులో భట్టి


ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరావాలని, పరస్పర అభివృద్ధిలో పాలుపంచుకుందామని అమెరికన్ కంపెనీల ప్రతినిధులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అమెరికా లాస్‌వెగాస్‌లో జరుగుతున్న మైన్స్ ఎక్స్‌పో ఇంటర్నేషనల్ సదస్సులో వారితో ఆయన మాట్లాడారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పునరుద్ధరణీయ ఇంధనం, వస్తు ఉత్పత్తి రంగాల్లో ముందుచూపుతో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రం అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని, సహకారాన్ని కోరుతోందన్నారు. "మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తమ స్వస్థలంగా భావిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగానూ, ఇన్నోవేషన్ హబ్‌గా రూపుదిద్దుకుంది. రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ నగరం పెట్టుబడులకు స్వర్గధామం కానుంది. అమెరికన్ కంపెనీల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులతో రావాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో పరిశ్రమల అభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు ఫ్యూచర్ సిటీలో పెద్దపీట వేస్తున్నాం. ఈ విభాగాల్లో ఆసక్తి, అనుభవం ఉన్న కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతోంది. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి, అభివృద్ధికి దోహదం చేసే ఐటీ సొల్యూషన్స్‌కు ఎక్కువ అవకాశాలున్నాయి" అని వారికి వివరించారు. ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్‌ను భట్టి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు, ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులను, వాటి పనితీరును పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఉన్నారు.




సిద్దిపేట జిల్లా నంగునూరులో నిర్వహించిన రైతుల ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎగవేతల రేవంత్‌రెడ్డి: హరీశ్‌రావు

నంగునూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదని ఎగవేతల రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రైతు భరోసా, రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2500, ధాన్యానికి రూ.500 బోనస్, తులం బంగారం, ఉద్యోగులకు డీఏలను ముఖ్యమంత్రి ఎగ్గొట్టారని చెప్పారు. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరులో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉండేది.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా ఉందని.. సంక్షేమ పథకాల అమలు తీరుపై ధర్నాకు వచ్చిన రైతులను మాజీ మంత్రి అడిగారు. "ఇటీవల ఓ సమావేశంలో కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్తు సరఫరా ఎలా చేయగలిగారు? ఇప్పుడు ఎందుకు అవడం లేదని అధికారులను కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అడగడమే వారి పాలనకు నిదర్శనం. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రేవంత్ అసత్య ప్రచారాలు చేయడం సరికాదు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, అనంతసాగర్‌ల వద్దకు వచ్చి చూస్తే కాళేశ్వరం నీళ్లు ఎలా వచ్చాయో అర్థమవుతుంది. దసరాలోపు రైతుందరికీ రుణమాఫీ పూర్తిచేయపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం' అని హెచ్చరించారు. అనంతరం నంగునూరులో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న రిలయన్స్ గ్రూప్ ఈడీ పీఎంఎస్ ప్రసాద్, సంస్థ మెంటార్ పీవీఎల్ మాధవరావు.. చిత్రంలో మంత్రి తుమ్మల



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జాయింట్ ఎండీ సుచిత్ర ఎల్ల.. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

వరద బాధితుల సహాయార్థం

రిలయన్స్ భూరి విరాళం

● సీఎం రేవంత్‌కు రూ.20 కోట్ల చెక్కు అందజేత

ఈనాడు, హైదరాబాద్: వరద బాధితుల సహాయార్థం రిలయన్స్ ఫౌండేషన్ భూరి విరాళాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20 కోట్ల విరాళాన్ని అందజేసింది. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధిత చెక్కును నీతా అంబానీ తరఫున ఆ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ), బోర్డు సభ్యుడు పీఎంఎస్ ప్రసాద్, ఆ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మెంటార్ పీవీఎల్ మాధవరావు అందించారు.

భారత్ బయోటెక్ రూ.కోటి..

ముఖ్యమంత్రి సహాయనిధికి భారత్ బయోటెక్ రూ.కోటి విరాళాన్ని ప్రకటించింది. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్ల.. సంబంధిత చెక్కును అందజేశారు.

విద్యార్థుల అల్పాహారానికి 'వయాట్రిస్' రూ.6.4 కోట్లు

కొడంగల్ నియోజకవర్గంలోని 322 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. దీనికోసం వయాట్రిస్ కంపెనీ ముందుకు వచ్చి రూ.6.4 కోట్ల విరాళాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసింది. శుక్రవారం సచివాలయంలో సీఎం సమక్షంలో వయాట్రిస్, హెచ్‌కేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ మధ్య ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస, వయాట్రిస్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్, అడ్మినిస్ట్రేటివ్ హెచ్ మిషెల్ డొమినికా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దీంతో 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

రెండో రోజూ కొనసాగిన వీసీఐ తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పశువైద్యశాలల్లో జాతీయ పశువైద్య మండలి(వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా-వీసీఐ) ప్రతినిధి బృందం శుక్రవారం రెండో రోజు తనిఖీలు కొనసాగించింది. వరంగల్ జిల్లా మామునూరు వైద్యకళాశాల, ఆసుపత్రుల్లో అధ్యాపకులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించింది. తనిఖీల నేపథ్యంలో వర్సిటీ అధికారులు.. హడావుడిగా రెండు రోజుల కిందట హైదరాబాద్ నుంచి 12 మంది ప్రొఫెసర్లు, అధ్యాపకులను మామునూరుకు పంపించిన విషయంపై అధికారులను వీసీఐ వివరణ కోరింది.

సీఎంను కలిసిన చెస్ ఒలింపియాడ్ క్రీడాకారులు

ఈనాడు, హైదరాబాద్: చెస్ ఒలింపియాడ్‌లో భారత్ తరఫున మొదటిసారి స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లు అర్జున్(హనుమకొండ), ద్రోణవల్లి హారిక(ఖమ్మం) శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. ఇద్దరు ఆటగాళ్లకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున సీఎం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించారు.

◆ చెన్నైలోని జపాన్ కాన్సుల్-జనరల్ టకాహషి మునియో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ద్రోణవల్లి హారికకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో చెస్ క్రీడాకారుడు అర్జున్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల

అవినీతిలో భారాసను మించిపోయిన కాంగ్రెస్: డీకే అరుణ

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవినీతిలో గత కేసీఆర్ సర్కారును మించిపోయిందని భాజపా ఎంపీ డీకే అరుణ అన్నారు. హైడ్రా పేరిట హైదరాబాద్ వాసులను కాంగ్రెస్ ప్రభుత్వం హడలెత్తిస్తోందని దుయ్యబట్టారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలకు డబ్బు మూటలు సర్దేందుకే రేవంత్‌రెడ్డి హైడ్రా పేరిట డ్రామా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన అనుచరులకే కాంట్రాక్టులు, నీటిపారుదల ప్రాజెక్టుల టెండర్లను కట్టబెట్టడం చూస్తుంటే అవినీతిలో కేసీఆర్‌ని మించిపోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. గతంలో ప్రాజెక్టులు, టెండర్ల విషయంలో రేవంత్ ఏమన్నారనే విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

వ్యర్థాల బయోత్పాతం

- రాష్ట్రంలో ఆరేళ్లలో రెండింతలైన బయో మెడికల్ వేస్ట్
- రోజుకు సగటున 31.91 టన్నుల ఉత్పత్తి.. నిర్వహణలో అలసత్వం
- 231 ఆసుపత్రులకు పీసీబీ నోటీసులు జారీ

ఈనాడు – హైదరాబాద్



హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రి ఆవరణలో కుప్పలుగా పోసిన జీవ వైద్య వ్యర్థాలు

రాష్ట్రంలో ఏటికేడు భారీగా పెరుగుతున్న జీవ వైద్య వ్యర్థాలు(బయో మెడికల్ వేస్ట్).. వాటి నిర్వహణ, నిర్మూలనలో జరుగుతున్న నిర్లక్ష్యం ఆందోళన కలిగిస్తోంది. 2023లో రాష్ట్రంలో సగటున ప్రతి గంటకు 1,299.91 కిలోల వ్యర్థాలు పోగుపడ్డాయి. 2017తో పోలిస్తే ఇవి రెట్టింపయ్యాయి. ఆసుపత్రులు, క్లినిక్‌లు వ్యర్థాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. ఈ విషయమై కాలుష్య నియంత్రణ మండలి గత ఏడాది 231 ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

బయట పారబోయడంతో..

ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు, డిస్పెన్సరీలు, బ్లడ్‌బ్యాంక్‌లు వంటి ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో రోగులకు చికిత్స సందర్భంగా జీవ వైద్య ఉత్పత్తి అవుతాయి. సిరంజిలు, బ్యాండేజ్, దూది, సూదులు, గ్లౌజ్‌లు, పరీక్షల కోసం ఇచ్చిన రక్తం, మాస్కులు వంటి జీవ వైద్య వ్యర్థాలు గతేడాది రాష్ట్రంలో సగటున రోజుకు 31.19 టన్నులు ఉత్పత్తి అయ్యాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ)కి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) ఇటీవల పంపిన నివేదికలో ఈ గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని ఆసుపత్రుల పరిసరాల్లో.. నగరాలు, పట్టణాల శివారు ప్రాంతాలు, మురికి కాలువల వద్ద పరిశీలిస్తే ఈ వ్యర్థాలు కుప్పలుగా పడి ఉంటున్నాయి. నిజానికి వీటిని పారవేసేందుకు ఆసుపత్రుల్లో నాలుగు రకాల డబ్బాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు తరలించాలి. కానీ తరలించే, శుద్ధి చేసే కేంద్రాల నిర్వాహకులు.. ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య ఛార్జీల విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని 48 గంటల్లో తరలించి, నిర్మూలించాలని సీపీసీబీ మార్గదర్శకాలున్నా పలుచోట్ల అమలుకు నోచుకోవట్లేదు. కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు వీటిని బయట పారవేస్తున్నాయి. వాటి నుంచి గాల్లోకి బ్యాక్టీరియా, వైరస్‌లు వెళ్లి ప్రజల అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి.



ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తరలించేందుకు వాహనంలో వేసిన బయో మెడికల్ వేస్ట్

ఒక్కో పడక నుంచి 183 గ్రాములు..

ఒక్కో పడక, ఒక్కో రోగి నుంచి గతేడాది సగటున రోజుకు 183 గ్రాముల జీవ వైద్య వ్యర్థాలు ఉత్పత్తి అయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా హైదరాబాద్‌లో రోజుకు 10,541 కిలోల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. 4,094 కిలోలతో రంగారెడ్డి, 3,335 కిలోలతో మేడ్చల్ రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి.

జీవ వ్యర్థాలు ఏటేటా.. కుప్పలు తెప్పలుగా

సంవత్సరం	2017	2018	2019	2020	2021	2022	2023
జీవ వ్యర్థాలు (రోజుకు కిలోలు)	15,710	16,242	20,471	23,412	28,914	25,306	31,918

- ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు: 10,292
- వాటిలో రోగుల పడకల సంఖ్య: 1,43,313

రాష్ట్రంలో కొత్త ఐటీఐలు

- ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు
- 40 వరకు ఏర్పాటయ్యే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని యువతకు నైపుణ్య శిక్షణ కోసం ప్రభుత్వం కొత్త పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ) ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతమున్న 65 ఐటీఐలకు అదనంగా 40 వరకు కొత్తగా వచ్చే అవకాశాలున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన 119 అవసరం. రాష్ట్రంలో వరంగల్ రీజియన్ పరిధిలో 35, హైదరాబాద్ పరిధిలో 30 కలిపి మొత్తం 65 ఐటీఐలు ఉన్నాయి. సీఎం ఆదేశాల ప్రకారం నియోజకవర్గాల వారీగా వీటి వివరాలను ఉపాధి కల్పన శాఖ తీసుకుంది. ఇందులో వరంగల్ రీజియన్‌లోని 30, హైదరాబాద్ రీజియన్‌లో 34 నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఐటీఐలు లేవని వెల్లడైంది. కొన్ని నియోజకవర్గాల్లో ఒకటి కన్నా ఎక్కువ ఉన్నాయి. ఐటీఐలు లేనిచోట వాటి ఏర్పాటుకు ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు అందుతున్నాయి. వీటిలో భూమి లభ్యత ఎంత ఉంది? నియోజకవర్గ కేంద్రానికి అందుబాటులో స్థలం ఉందా? వంటి వివరాలను కలెక్టర్ల నుంచి ఉపాధి కల్పన శాఖ తీసుకుంటోంది. తొలి దశలో 40 వరకు ఆమోదించి... వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనుంది. ఐటీఐల్లో పారిశ్రామిక అవసరాల మేరకు ట్రేడ్లు బోధించడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనుంది.

గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారానికి 'ప్రవాసీ ప్రజావాణి'

సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లేవారి సమస్యల పరిష్కారానికి 'ప్రవాసీ ప్రజావాణి' ఉపయోగపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జ్యోతిబా పులే ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. "గల్ఫ్‌లో చనిపోయిన వారికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చేందుకు జీవో ఇచ్చాం. వారి కుటుంబాల్లోని పిల్లలకు గురుకులాల్లో సీట్లు ఇస్తున్నాం. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ఎమ్మెల్యేలతో సలహా సంఘం ఏర్పాటు చేస్తాం. విదేశాలకు వెళ్లే వారికి అక్కడి చట్టాలపై అవగాహన కల్పిస్తాం'' అని వివరించారు. అనంతరం ప్రవాసుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌ఛార్జి జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్ వినోద్ కుమార్, ప్రజావాణి నోడల్ అధికారిణి దివ్య, ఎన్నారై విభాగం ప్రతినిధులు మంద భీంరెడ్డి, నంగి దేవేందర్, అమరేందర్, నరేష్, నవీన్, చెన్నమనేని శ్రీనివాస్‌రావు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

రాష్ట్రంలో అధునాతన మాంస శుద్ధి కర్మాగారం

- ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు చెంగిచెర్లలో 25 ఎకరాలు లీజుకు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ వాణిజ్య సంస్థ లులు గ్రూపు అనుబంధ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో తెలంగాణలో భారీ అధునాతన మాంస శుద్ధి కర్మాగారం ఏర్పాటు కానుంది. హైదరాబాద్ శివారు చెంగిచెర్లలోని గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్యకు చెందిన 25 ఎకరాలను ఈ సంస్థకు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దీనికి తాజాగా పశుసంవర్ధకశాఖ ఎన్‌వోసీ జారీ చేసింది. రూ.200 కోట్లతో లులు గ్రూపు నుంచి ప్రతిపాదనలు రావడంతో 2018 మార్చిలో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. దాని సిఫార్సులను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాలను లీజుకిచ్చేందుకు నిర్ణయించింది. భూమి మార్కెట్ ధరలను అనుసరించి ఏడాదికి రూ.3.20 కోట్ల చొప్పున ప్రారంభంలో చెల్లించాలని, ఆ తర్వాత ప్రతి మూడేళ్లకోసారి 5% అదనంగా పెంచి ఇవ్వాలని సూచించింది. భూమి కేటాయింపు ప్రక్రియ 2023 జూన్ 24న ముగిసింది. తాజాగా లులు సంస్థ ప్రభుత్వాన్ని సంప్రదించి తమకు భూమిని స్వాధీనం చేయాలని కోరింది. దాంతో పశుసంవర్ధకశాఖ ఎన్‌వోసీ ఇచ్చింది. ఇక త్వరలో పనులు మొదలవుతాయని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే హైదరాబాద్‌లో లులు సంస్థ భారీ షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

జీవాల పెంపకానికి, ఎగుమతికి ఊతం

గొర్రెలు, మేకల సంఖ్యలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. వినియోగం, కొనుగోళ్లు, అమ్మకాలు భారీ ఎత్తున జరుగుతుంటాయి. రాష్ట్రంలో ప్రస్తుతం మాంస శుద్ధి కర్మాగారం లేదు. ఈ నేపథ్యంలో ఫెయిర్ ఎక్స్‌పోర్ట్ ఏర్పాటు చేసేదే మొట్టమొదటిది కానుంది. రోజుకు 60 టన్నుల మాంసాన్ని శుద్ధి చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేయనుండటంతో గొర్రెలు, మేకల పెంపకం, క్రయవిక్రయాలు భారీగా పెరిగే అవకాశముంది. సంస్థ అవసరాలకు సరిపడాలంటే జీవాల పెంపకం రెట్టింపు కావాల్సి ఉంది. ఈ పరిశ్రమలో 2500 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామని సంస్థ వెల్లడించింది.

సోమశిల, నిర్మల్‌కు ఉత్తమ పర్యాటక గ్రామాల పురస్కారాలు

ఈనాడు, దిల్లీ–కొల్లాపూర్, నిర్మల్, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల, నిర్మల్ జిల్లా ప్రధాన కేంద్రం నిర్మల్ ఉత్తమ పర్యాటక గ్రామాల పురస్కారాలను గెలుచుకున్నాయి. కేంద్ర పర్యాటకశాఖ 2024 సంవత్సరానికి ఎనిమిది కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో స్పిరిచ్యువల్-వెల్‌నెస్ విభాగంలో సోమశిల, క్రాఫ్ట్స్ విభాగంలో నిర్మల్ గ్రామాలు ఎంపికయ్యాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పురస్కారాలను ప్రదానం చేశారు. నిర్మల్ తరపున ఆ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ బొమ్మలు, కళల సొసైటీ అధ్యక్షుడు ఎస్.పెంటయ్య, సోమశిల తరపున జిల్లా పర్యాటక శాఖ అధికారి టి.నరసింహ ఈ అవార్డులను అందుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమేశ్వర క్షేత్రం కాలక్రమంలో సోమశిలగా రూపాంతరం చెందింది. ఇక్కడ రాతి కట్టడాలు, శిల్పకళ నైపుణ్యం ఆకట్టుకుంటాయి. నదిలో విహరించడానికి పర్యాటకశాఖ లాంచీల ఏర్పాటు, నదీ తీరాన కాటేజీలు నిర్మించారు. మరోవైపు నిర్మల్ కళాకారులు కర్రతో సజీవంగా కళ్లకు కట్టినట్లు కనిపించే బొమ్మలు తయారుచేస్తున్నారు. 400 ఏళ్ల నుంచి కొయ్య బొమ్మలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఆ 'కళ'ను బతికిస్తున్నారు.





అవార్డుతో నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కొయ్యబొమ్మల పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పెంటయ్య ★ సోమశిల తరపున పురస్కారం అందుకున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి నరసింహ

ఆర్థిక మోసం కేసులో అధికారి చేతివాటం

- ఖాతా పునరుద్ధరణకు రూ.60 లక్షలు డిమాండ్
- హైకోర్టుకు విన్నవించడంతో ఆయనపై వేటు

ఈనాడు, హైదరాబాద్: ఆర్థిక మోసానికి సంబంధించిన ఓ కేసులో విచారణాధికారి చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ మేరకు పోలీసులు స్తంభింపజేసిన బ్యాంకు ఖాతాను పునరుద్ధరించేందుకు ఏకంగా రూ.60 లక్షలు డిమాండ్ చేసినట్లు ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై తొలుత డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీవోపీ) కార్యాలయానికి ఫిర్యాదు పంపడం.. తాజాగా హైకోర్టుకు విన్నవించిన నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న విచారణాధికారిపై బదిలీ వేటు వేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. వివరాల్లోకి వెళితే.. ట్రేడింగ్ యాప్ పేరిట సుమారు రూ.22 లక్షలు మోసపోయిన ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2021లో రాజధానిలోని ఓ కమిషనరేట్ పరిధిలోని సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు క్రమంలో నలుగురు సభ్యులతో కూడిన ఉత్తర్‌ప్రదేశ్ ముఠాను అరెస్టు చేశారు. మరోవైపు నిందితులకు సంబంధించిన సుమారు రూ.10 కోట్లతో కూడిన బ్యాంకు ఖాతాను స్తంభింపజేశారు. తర్వాత బాధితుడి డబ్బును ముఠాసభ్యులు అప్పగించడంతో ఇరువర్గాలు రాజీ అయ్యాయి. ఈ నేపథ్యంలో స్తంభించిన బ్యాంకు ఖాతాను విడిపించేందుకు నిందితుల తరపున న్యాయవాది ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఓ విచారణాధికారి రూ.60 లక్షలు డిమాండ్ చేశారనేది అభియోగం. అందుకు అంగీకరించని న్యాయవాది ఆ విచారణాధికారిపై రెండు నెలల క్రితం డీవోపీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఖాతాను పునరుద్ధరించే అంశాన్ని కనీసం ఉన్నతాధికారి దృష్టికైనా తీసుకెళ్లలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను అడిగినంత మొత్తం లంచంగా ఇవ్వకుంటే బ్యాంకు ఖాతాను పునరుద్ధరించకుండా అడ్డుకోవడంతోపాటు విషయాన్ని ఆదాయపన్ను శాఖాధికారుల దృష్టికి తీసుకెళతానంటూ బెదిరించారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై సరైన చర్యలు లేకపోవడంతో తాజాగా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన డీవోపీ ఉన్నతాధికారులు ఆ విచారణాధికారిపై బదిలీ వేటు వేశారు. అయితే 'స్మూత్ ఫంక్షనింగ్' కోసమే బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రొబేషనరీలోనే ఉన్నప్పటికీ ఇంత భారీమొత్తంలో డబ్బు డిమాండ్ చేసిన విచారణాధికారి అంశం చర్చకు దారితీసింది. మరోవైపు గతంలో ఓ గృహహింస కేసులోనూ ఆ విచారణాధికారి పెద్దమొత్తంలో చేతివాటం ప్రదర్శించారనే అంశంపైనా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కాగా ఈ వ్యవహారంపై విచారణ బాధ్యతలను రంగారెడ్డి జిల్లా కోర్టుల్లో పనిచేస్తున్న మరో విచారణాధికారికి అప్పగించినట్లు తెలిసింది.

దామగుండాన్ని అగ్నిగుండంగా మారుస్తారా?

భారాస నాయకుడు ప్రవీణ్‌కుమార్



తాండూరు టౌన్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారంలో కోట్ల మొక్కలను నాటి పర్యావరణాన్ని సంరక్షిస్తే... ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు దామగుండం అటవీ ప్రాంతంలోని 12 లక్షల చెట్లను నరికివేయాలని చూస్తున్నారని భారాస నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... "నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదు. ఇందుకోసం వందల ఏళ్ల వయసున్న చెట్లను తొలగించి అగ్నిగుండంగా మార్చడం సమంజసం కాదు. హైడ్రాను జిల్లాలకు విస్తరిస్తామని సీఎం ప్రకటించడం సరికాదు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు'' అని ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణపై 30 నుంచి సూచనల స్వీకరణ

ఈనాడు, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ కోసం కులసంఘాలు, వ్యక్తులు, సమూహాల నుంచి సూచనలు సలహాలు స్వీకరించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ నెల 30 నుంచి పనిదినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజ్ఞాపనలు స్వీకరించనుంది. సుప్రీం తీర్పును అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వర్గీకరణపై అభిప్రాయాలు, విజ్ఞాపనలు స్వీకరించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో commr.scsubclassification@gmail.com మెయిల్‌కు విజ్ఞాపనలు పంపించాలని ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ తెలిపారు. రాతపూర్వకంగా ఇచ్చే విజ్ఞాపనలను సంక్షేమ భవన్‌లో ఎస్సీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కిషన్, సహాయ డైరెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మికి అందించాలని సూచించారు.



విజేతలు, పరాజితులకు మధ్య తేడా ఇదే!

గొప్ప వ్యక్తులు, విజేతలు నిర్ణయాలు తీసుకొని ముందడుగు వేయడానికి కొత్త వేకువ కోసమో, నూతన సంవత్సరం రాక కోసమే వేచిచూడరు. ఒక్క క్షణాన్ని కూడా వృథా చేయరు. ఆలోచన వచ్చిందే తడవుగా పక్కా ప్రణాళిక రూపొందించుకుని ఆచరణ ప్రారంభిస్తారు. విజేతలు, పరాజితులకు మధ్య ఉన్న ప్రధాన తేడా ఇదే.

– డీన్ గ్రాజియోసి, యూట్యూబర్

పోరాటాలకు మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ

- జయంతి సభలో మంత్రి జూపల్లి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి అంటే రాష్ట్రానికి ధర్మకర్తగా ఉండాలని, కానీ పదేళ్ల పరిపాలించిన కేసీఆర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బీసీ, చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ 109వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పట్టుదల, నిజాయతీ, పోరాటాలకు మారుపేరన్నారు. బీసీలంతా ఏకతాటిపైకొచ్చి రాజ్యాధికారాన్ని సాధించుకున్నప్పుడే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీపై పోరాటానికి నేతన్నలు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ గుండు సుధారాణి, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్, బాలలక్ష్మి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోశిక యాదగిరి, గడ్డం జగన్నాథం పాల్గొన్నారు. సభలో 'కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం- ఆదర్శం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎంపీ గుండు సుధారాణి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, జాజుల శ్రీనివాస్‌గౌడ్

సీఎం ఘన నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, నాయకులు టి.కుమార్‌రావు, దయాకర్, రాంమోహన్‌రెడ్డి, పీసీసీ చేనేత విభాగం నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్ రావు, గూడూరు శ్రీనివాస్, వరలక్ష్మీ తదితరులు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. శాసనసభ ప్రాంగణంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డీజీపీ కార్యాలయంలో అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేశ్‌భగవత్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్థానికతపై మరింత స్పష్టత ఇస్తాం!

- 'నీట్' కౌన్సెలింగ్ అంశంపై సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: కేవలం కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకే కాకుండా తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్న 11 వేల మంది విద్యార్థులకూ నీట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలన్న విద్యార్థుల విజ్ఞప్తిపై సోమవారం స్పష్టత ఇస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. కేవలం ఆ 135 మందికే కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఇస్తూ గత శుక్రవారం జారీచేసిన ఉత్తర్వులను సవరించాలంటే గతవారం వాటిని జారీచేసిన త్రిసభ్య ధర్మాసనమే ఉండాలని, ఇప్పుడు అందులోని ఒకరైన జస్టిస్ జేబీ పార్దీవాలా అందుబాటులో లేనందున ఈ అంశాన్ని సోమవారం పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. 'నీట్' రాయడానికి ముందు.. వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదువుకున్న విద్యార్థులను మాత్రమే స్థానికులుగా పరిగణిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జులై 19న జారీచేసిన జీవోపై ఆంక్షలు విధిస్తూ హైకోర్టు ఈ నెల 5న వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్‌మిశ్రలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. గతవారం దీనిపై వాదనలు విన్న ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించడంతోపాటు, కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అవకాశం ఇచ్చింది. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు కేసు విచారణ సందర్భంగా విద్యార్థుల తరపున హాజరైన న్యాయవాది శరణ్.. గతవారం సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వుల వల్ల తెలంగాణలో శాశ్వతనివాసం ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున దాన్ని సవరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్.. వరుసగా నాలుగేళ్లు స్వరాష్ట్రంలో చదివి ఉండాలని తెలంగాణ ప్రస్తుతం విధించిన నిబంధననే గతంలో అస్సాం, హరియాణాలు విధించినప్పుడు సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తుచేస్తూ వాదనలు వినిపించారు. సీజేఐ స్పందిస్తూ "చివరి నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలన్న నిబంధన సరైందేనని మీరు భావిస్తున్నారా" అని ప్రశ్నించగా రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది అవునని సమాధానమిచ్చారు. అప్పుడు సీజేఐ "ఒకవేళ మేం హైకోర్టు తీర్పును కొట్టేస్తే ఏమవుతుంది" అని ప్రశ్నించగా.. ఇప్పుడు కోర్టుకొచ్చినవారికి కూడా ఇదివరకు ఇచ్చిన ప్రయోజనం వర్తించదని బదులిచ్చారు. సీజేఐ స్పందిస్తూ.. "ఇదేమీ ప్రాథమికంగా ఏకపక్షంగా తీసుకున్న కొలమానంగా కనిపించడం లేదు. తమ రాష్ట్రంలో నిర్దిష్టంగా ఇన్నేళ్లు చదివి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పొచ్చు. ఆంధ్ర, మహారాష్ట్ర, దుబాయ్‌కి వెళ్లిన విద్యార్థులను ప్రత్యేకంగా చూడటం సాధ్యం కాదు'' అని అన్నారు. విద్యార్థుల తరపు న్యాయవాది శరణ్ జోక్యం చేసుకుంటూ తెలంగాణలో తప్పితే ఇతర రాష్ట్రాల్లో శాశ్వత నివాసం లేనివారిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అప్పుడు జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందిస్తూ.. "చివరి నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిబంధన సరైందా? కాదా? అన్నది తేల్చాల్సి ఉంది. ఒకవేళ అది సరైందని తేలితే మీరందరూ తప్పుకోవాల్సిందే.. ఒకవేళ హైకోర్టు చెప్పినట్లుగా అది చెల్లదని తేలితే అందరూ అర్హులవుతారు'' అని విద్యార్థుల తరపు న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వాదనల అనంతరం ఈ అంశాన్ని సోమవారం పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు.





మెదక్ చర్చి ప్రాంగణంలో భక్తులు

వైభవంగా మెదక్ చర్చి ఆవిర్భావ వేడుకలు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ మెదక్ కెథడ్రల్ చర్చిలో శుక్రవారం చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాలను వైభవంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. డిప్యూటీ మోడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డాక్టర్ కె.రూబెన్ మార్క్ భక్తులకు దైవ సందేశం వినిపించారు. అంతకుముందు చర్చి 100 సంవత్సరాల వేడుకలో భాగంగా చర్చి ప్రాంగణంలో నిర్మించిన భవనంలో సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని బిషప్ మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ వేడుకల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, బిషప్ సతీమణి కె.ప్రిసిల్లా పరిమళ తదితరులు పాల్గొన్నారు.

91 ప్రశ్నలు తొట్రుపాటు సమాధానాలు

- గజ్వేల్ ఈఎన్సీ, కేఐపీసీఎల్ ఎండీ హరీరాం ఉక్కిరిబిక్కిరి
- కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా మిమ్మల్నే ఎందుకు నియమించారు?
- కేఐపీసీఎల్‌లో 'పాలమూరు'ను కలపాలన్న ఆలోచన ఎవరిది?
- ఈ ప్రాజెక్టు ఎవరి మానస పుత్రికన్న జస్టిస్ పీసీ ఘోష్
- నాకు తెలియదు... చెప్పలేనని ఉన్నతాధికారి స్పందన
- నేడు మళ్లీ కమిషన్ ముందుకు రానున్న ఈఎన్సీ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ శుక్రవారం హైదరాబాద్ బీఆర్కేభవన్‌లో నిర్వహించిన సుదీర్ఘ క్రాస్ ఎగ్జామినేషన్‌లో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్) ఎండీ, నీటిపారుదల శాఖ గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరీరాం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ''నీటిపారుదల శాఖలో ఎందరో సీఈలు ఉండగా కాళేశ్వరం పథకానికి రుణ సమీకరణకు ఏర్పాటు చేసిన కేఐపీసీఎల్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం మిమ్మల్నే ఎందుకు నియమించింది? ఈ పథకం ఎవరి మానస పుత్రిక? ఎవరి సలహా మేరకు కేఐపీసీఎల్‌లో పాలమూరు-రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టు లిమిటెడ్‌ను భాగం చేశారు? కరీంనగర్ సీఈ ఉండగా... కాళేశ్వరం డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి మీరే ఎందుకు సమర్పించాల్సి వచ్చింది?'' అంటూ జస్టిస్ పీసీ ఘోష్ ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 91 ప్రశ్నలను సంధించగా... చాలావాటికి నాకు తెలియదు, చెప్పలేను, రికార్డులను చూసి సమాధానమిస్తానంటూ ఈఎన్సీ పేర్కొన్నారు. శనివారం ఆధారపత్రాలతో కమిషన్ ఎదుట హాజరు కావాలని జస్టిస్ ఘోష్ ఆయన్ని ఆదేశించారు.

ప్రభుత్వ ఆదేశాలు లేకుండా డీపీఆర్ ఎలా సమర్పించారు?

ప్రాజెక్టు పరిధిలో ఆరుగురు సీఈలు ఉండగా సీడబ్ల్యూసీకి... ఎత్తిపోతల డీపీఆర్‌ను హైదరాబాద్ సీఈ ఎందుకు అందించారు? దీనికి ప్రభుత్వ ఆదేశాలున్నాయా? ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా ఎందుకు మార్చాల్సి వచ్చిందన్న ప్రశ్నలకు... ''కాళేశ్వరం డీపీఆర్‌ను వ్యాప్కోస్ రూపొందించి, కరీంనగర్ సీఈకి అందజేయగా.. ఆయన హైదరాబాద్ సీఈకి సమర్పించారు. అప్పట్లో ఆ పోస్టులో నేనే ఉన్నా. నాటి ఈఎన్సీ(జనరల్) సి.మురళీధర్ ఆదేశాలతో ప్రాజెక్టు ప్రతినిధిగా దీని పరిధిలోకి వచ్చే ఆరుగురు సీఈల నుంచి డేటాను సేకరించి 2017 ఫిబ్రవరిలో సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించా. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు రాలేదు. నా పరిధిలో కాళేశ్వరంలోని 10-16 ప్యాకేజీల మధ్యనున్న పనులు మాత్రమే వస్తాయి. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ముంపు ఏర్పడుతోందని మహారాష్ట్ర అభ్యంతరం చెప్పగా ప్రాణహిత-చేవెళ్లకు ప్రత్యామ్నాయంగా మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది'' అని హరీరాం వివరించారు.

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశంతోనే ఎండీగా...

మిమ్మల్నే ఎందుకు కార్పొరేషన్ ఎండీగా నియమించారన్న ప్రశ్నకు... నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వుల ద్వారా తనను నియమించారన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా ముఖ్య కార్యదర్శి ఉన్నారు కదా... ఆ పోస్టులో నాడు ఎవరున్నారని కమిషన్ ప్రశ్నించగా... ఎస్కే జోషి అని తెలిపారు. ఆర్థికపరమైన అంశాలపై మీకు పట్టుందా... అన్న ప్రశ్నకు లేదన్నారు.

✦ 'కాళేశ్వరం'లో పాలమూరు-రంగారెడ్డి ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను భాగం చేయడం ఎవరి ఆలోచన అన్న ప్రశ్నకు... నాటి ఈఎన్సీ(జనరల్) లేఖ రాయడంతో ప్రభుత్వం అనుమతించిందన్నారు.


విచారణ అనంతరం బయటికి వస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

కంపెనీ కిందకు వస్తుంది కదా...

ఈ కార్పొరేషన్ కంపెనీల చట్టాలను అనుసరించి ఏర్పాటైంది కదా.. రుణాలకు పూచీకత్తుగా ఎవరు వ్యవహరించారు, ఆస్తులేం ఉన్నాయన్న ప్రశ్నలకు... ఇది కంపెనీయేనని, రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీగా నిలిచిందని, పంపుహౌసులు, రిజర్వాయర్లు, భూసేకరణలో సేకరించిన భూములు ఆస్తులుగా ఉన్నాయని, లీజు ఒప్పందం ఉందని ఈఎన్సీ వివరించారు. అవన్నీ ఆస్తులు కావని, యంత్రాల్లాంటివి ఏమున్నాయని కమిషన్ ప్రశ్నించగా.... లేవన్నారు. కార్పొరేషన్ సీఈవోను రెండేళ్ల కాలానికి నియమించాలని ప్రభుత్వ ఉత్తర్వు చెబుతోందని, సీఈవో ఎవరని ప్రశ్నించగా... ఎవరూ లేరని, రికార్డులను పరిశీలించి చెబుతానని తెలిపారు. కార్పొరేషన్‌లో ప్రభుత్వ వాటా ఎంతని కమిషన్ ప్రశ్నించగా పరిశీలించి చెబుతానన్నారు.

ఇప్పటివరకు రూ.74,718 కోట్ల రుణం అందింది

''మూడు బ్యారేజీలకు పది బ్యాంకుల కన్సార్షియం రూ. 87,449.16 కోట్ల రుణం మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ. 74,718.44 కోట్లు అందాయి. నిర్మాణాలకు రూ. 62,825.39 కోట్లు చెల్లించాయి. ఈ కార్పొరేషన్‌లో భాగమైన పాలమూరు-రంగారెడ్డి ఇరిగేషన్ కార్పొరేషన్‌కు రూ. 10 వేల కోట్లు మంజూరవగా బ్యాంకులు రూ. 7140.70 కోట్లు ఇచ్చాయి. 2024 సెప్టెంబరు 9 వరకు రుణాలకు వడ్డీల కింద రూ. 29,737 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. 2022 ముందు వరకు ఆడిటింగ్ పూర్తయింది. డీపీఆర్ ప్రకారం... ప్రాజెక్టుకు చేస్తున్న వ్యయం, చేకూరనున్న ప్రయోజనాల నిష్పత్తి... ప్రతి రూపాయికి 1: 1.511గా ఉంది' అని ఈఎన్సీ వివరించారు.

✦ కంపెనీ వార్షిక ఆర్థిక నివేదికలు చట్టసభల ముందు పెడుతున్నారా అన్న ప్రశ్నకు... ''2016-17 నుంచి 2020 వరకు వార్షిక నివేదికలను కంపెనీ ప్రభుత్వానికి అందజేసింది. వాటిని శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టినట్లు లేదు'' అని వివరణ ఇచ్చారు.

కావచ్చు.. తెలియదు.. చెప్పలేను...!

''ఎత్తిపోతల కోసం నీరందేలా ప్రాజెక్టులను నిర్మించడంతోనే నష్టం జరిగిందా...'' అని కమిషన్ ప్రశ్నించగా... కావచ్చని ఈఎన్సీ తెలిపారు. నిర్మాణ ప్రాంతాలు కూడా వైఫల్యాలకు కారణమా,

బ్యారేజీలను డ్యాంలుగా నిర్మించారా అన్న ప్రశ్నలకు.. తానేమీ చెప్పలేనన్నారు. ''మేడిగడ్డ ఏడో బ్లాకులో వైఫల్యాలకు బాధ్యులెవరు? డిజైన్లు, పర్యవేక్షణ, ఇతర లోపాలు ఉన్నాయా'' అని ప్రశ్నించగా తనకేమీ తెలియదన్నారు.

- సీసీ బ్లాకులు, యాప్రాన్‌కు జరిగిన నష్టానికి గేట్ల ఆపరేషన్‌లో వైఫల్యమని అఫిడవిట్‌లో రాశారు కదా... అని గుర్తుచేయగా నిజమేనన్నారు.
- 2017 జనవరి 25న జరిగిన హైపవర్ కమిటీ మినిట్స్‌ను కాళేశ్వరం సీఈ అనుసరించలేదని పేర్కొన్నారు కదా... అని కమిషన్ పేర్కొనగా.. నిజమేనని అంగీకరించారు.
- ''మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల అక్కడి నుంచి ఎల్లంపల్లిలోకి నీటిని ఎత్తిపోసేందుకు అనువుగా, బ్యాక్‌వాటర్ ఎక్కువ దూరం నిల్వ ఉండేలా బ్యారేజీలను నిర్మించడమే నష్టానికి కారణమైందా'' అన్న ప్రశ్నకు... కావచ్చంటూ సమాధానమిచ్చారు.

సబ్ కాంట్రాక్టులపై రామగుండం సీఈని అడిగా...

''మూడు బ్యారేజీల నిర్మాణాల్లో సబ్ కాంట్రాక్టర్ల వివరాలు అందజేస్తారా'' అని కమిషన్ ప్రశ్నించగా... దీనిపై రామగుండం సీఈ నుంచి వివరణ కోరానని, ఇప్పటివరకు జవాబు రాలేదని ఈఎన్సీ తెలిపారు. 'మీరు ఎవరినో రక్షిస్తున్నారని కమిషన్ భావిస్తోందని, అంగీకరిస్తారా'' అన్న ప్రశ్నకు అలాంటిదేదీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎవరి మానస పుత్రికని ప్రశ్నించగా. . తనకు తెలియదంటూ హరీరాం పేర్కొన్నారు.

'మేడిగడ్డ'లో మరో కీలక మలుపు

- కంప్లీషన్ సర్టిఫికెట్‌ను వెనక్కివ్వాలని ఎల్‌అండ్‌టీకి ఎస్ఈ లేఖ
- దాన్ని రద్దు చేశామంటూ అందులో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పని పూర్తయినట్లు తామిచ్చిన ధ్రువపత్రాన్ని (కంప్లీషన్ సర్టిఫికెట్) రద్దు చేశామని, సంబంధిత అసలు ప్రతి(ఒరిజినల్ సర్టిఫికెట్)ని వెనక్కు ఇవ్వాలని మేడిగడ్డ నిర్మాణ సంస్థను నీటిపారుదల శాఖ కోరింది. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్‌కు, ఎల్‌అండ్‌టీ-పీఈఎస్ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు మేనేజర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం సర్కిల్ ఎస్ఈ కరుణాకర్ లేఖ రాశారు. మొదట పని పూర్తి చేసినట్లు ధ్రువపత్రం ఇవ్వడం, పని పూర్తికాకుండానే ఇచ్చినందున అది చట్ట విరుద్ధమని తేల్చడం, తర్వాత దాన్ని రద్దు చేయడం

నీటి పారుదల శాఖలో అరుదైన సంఘటనగా సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగడంపై దర్యాప్తు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్... ''బ్యారేజీ దిగువన సీసీ బ్లాకులు, వియరింగ్‌కోట్‌లు దెబ్బతిన్నాయి. ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులింకా ఉన్నా... పట్టించుకోకుండా పని పూర్తయినట్లు నిర్మాణ సంస్థకు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. దీనికి బాధ్యులైన ఈఈ, ఎస్ఈలపైనా, నిర్మాణ సంస్థపైనా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి'' అని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ, మిగిలిన పనులను నిర్మాణ సంస్థతోనే పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఈఎన్సీ(జనరల్)కి... నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఆదేశాలు జారీ చేశారు. అవి... ఈఎన్సీ నుంచి కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్‌కు, తర్వాత నిర్మాణ సంస్థతో ఒప్పంద అథారిటీ అయిన ఎస్ఈకి వెళ్లాయి. దాంతో సంబంధిత సర్టిఫికెట్‌ను రద్దు చేస్తున్నట్లు ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్‌కు రామగుండం సర్కిల్ ఎస్ఈ లేఖ రాశారు. పని పూర్తవకుండానే మేడిగడ్డ ఈఈ సర్టిఫికెట్ ఇచ్చారని, దానిపై ఎస్ఈ కౌంటర్ సైన్ చేశారని, ఈ కారణంగానే రద్దు చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్‌పై చేసిన ఖర్చులపై చర్చకు రావాలి

- భారాస నాయకులకు మంత్రి పొన్నం సవాల్
- సోషల్ మీడియాలో ఆందోళనకర పోస్టింగులు పెట్టేవారిపై చర్యలకు ఆదేశం




హైదరాబాద్, న్యూస్‌టుడే: భారాస హయాంలో హైదరాబాద్‌పై చేసిన ఖర్చుల వివరాలపై చర్చకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ పార్టీ నేతలకు సవాల్ విసిరారు. 'మూసీ' నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్న ప్రతిపక్షం ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఆందోళన కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. 'భారాస పదేళ్ల అధికారంలో ఉండి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చే ప్రయత్నం చేయలేదు. ఓల్డ్ సిటీకి మెట్రో ఆలస్యం చేశారు. మూసీకి ఏటా రూ. వెయ్యి కోట్లు అని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదు. మూసీ ఆక్రమణలు తొలగించాలని ఆనాడు స్వయంగా మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆరే అన్నారు. అక్కడి నిర్వాసితులకు 10 వేల రెండు పడక గదుల ఇళ్లు నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు తప్ప చేయలేదు. మేము రూ. 5,500 కోట్లతో మూసీ శుద్ధికి ప్రణాళిక చేశాం. నిర్వాసితులకు పునరావాసం కింద రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని, మెప్మా ద్వారా వారికి ఉపాధి కల్పించాలని కార్యాచరణ చేస్తున్నాం. కాంగ్రెస్ హయాంలో ఓఆర్ఆర్‌ను నిర్మిస్తే.. భారాస నాయకులు దాన్ని రూ. 7,300 కోట్లకు అమ్ముకున్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు దెబ్బతిన్నట్లు మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం. సోషల్ మీడియాను మేనేజ్ చేస్తూ తప్పుదోవ పట్టించడానికి కుట్రలు చేస్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని పొన్నం పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీలు అనిల్‌కుమార్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కాంగ్రెస్ నాయకులు రోహిన్‌రెడ్డి, సామ రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టాల చీకట్లలో.. కారుణ్య కాంతులు

వరద ముంచెత్తడంతో పొలాలు, కాలనీలు చెరువులను తలపించాయి. ఇంట్లోని వస్తువులన్నీ పనికి రాకుండా పోయాయి. వారం రోజులు నీటిలోనే ఉండటంతో వాహనాలు మొరాయించాయి. ఇన్నాళ్లూ కూడబెట్టిన కష్టార్జితమంతా కోల్పోయి.. చీకట్లు కమ్ముకున్న వారి జీవితాల్లో దాతలు వెలుగులు పంచుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..


కొడాలి రామనాథం, రాజ్యలక్ష్మి
తెనాలి
విరాళం: రూ. 2,00,000


కే.శే. గొట్టిముక్కల వరలక్ష్మి, W/o కే.శే. గొట్టిముక్కల వెంకటేశ్వర్లు. వీరి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, కంకటపాలెం, బాపట్ల జిల్లా
విరాళం: రూ. 1,00,116


గవిర్నేని రాధారాణి (తండ్రి సూరపనేని వరప్రసాద్ జ్ఞాపకార్థం) విజయవాడ
విరాళం: రూ. 1,00,000

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
సరిదే రాజారామ్ సుధాకర్, హైదరాబాద్	50,000
మదం కృష్ణమూర్తి, హైదరాబాద్	49,999
లింగా శ్రీనాథ్, సికింద్రాబాద్	27,000
కె.దామోదర్‌నాయుడు, బెంగళూరు	11,116
ముక్కామల రవీంద్రబాబు, గుంటూరు	10,116
నారాయణం అజయ్‌బాబు, హైదరాబాద్	10,116
చిలుకూరి వెంకటేశ్వరరావు, తణుకు	10,116
డా.మండవ పూర్ణచంద్రరావు, హైదరాబాద్	10,116
టి.వి.కృష్ణమోహన్, బెంగళూరు	10,000
పరిమి సుబ్బారావు, తణుకు	10,000
నవీన్ రాజా, హైదరాబాద్	10,000
పొడుగు వెంకట సూర్య ప్రభాకరరావు, హైదరాబాద్	10,000
శ్రీ కుసుమ హరనాథ్ ట్రేడర్స్, విజయవాడ	5,116
తుపాకుల సంతోష్, హైదరాబాద్	5,116
కె.వెంకటేశ్వరరావు, తిరుపతి	5,116
ఎ.హెచ్.వి.ఎస్.సుధాకర్, హైదరాబాద్	5,115
ఐనవోలు నరసింహారావు, నరసరావుపేట	5,000
వి.యశోధర, వేదాయపాలెం, నెల్లూరు జిల్లా	5,000
డా.చింతా శారద, గుడివాడ, కృష్ణా జిల్లా	5,000
శ్రీ వి.వి.బ్రహ్మం సేవా ట్రస్టు, తాడిపత్రి	5,000
గోలి వెంకట్రావు, కాకినాడ	5,000
జనపాల మౌనిక దీప్తి, విశాఖపట్నం	5,000
కరణం కృష్ణమూర్తిరావు, హైదరాబాద్	5,000
పి.వెంకటమునీ, వెంకటగిరి, తిరుపతి జిల్లా	5,000
బుర్రా సుబ్రహ్మణ్యం, హైదరాబాద్	5,000
మామిళ్లపల్లి కాంతారావు, నెల్లూరు	5,000
దుర్గా చంద్రభూషణం, హైదరాబాద్	5,000

ప్రకృతి ప్రకోపం.. గట్టెక్కించాలి దాతృత్వం

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.

- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

కాళేశ్వరంపై సీఎం రేవంత్‌కు అవగాహనలేమి

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవగాహనలేమితో మాట్లాడుతున్నారని భారాస సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'రూ.లక్ష కోట్ల కాళేశ్వరం కట్టడం, కూల్చడం మన కళ్ల ముందే అని సీఎం మాట్లాడటం హాస్యాస్పదం. మేడిగడ్డ వద్ద 3 పియర్లు దెబ్బతింటే మొత్తం ప్రాజెక్టు పనికిరానట్టు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతగాక గత భారాస ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రయోజనాలు 20 జిల్లాలకు విస్తరించి ఉన్నాయి' అని తెలిపారు.



గవర్నర్‌తో జపాన్ కాన్సుల్ జనరల్ భేటీ

రాజ్‌భవన్‌లో శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో జపాన్ కాన్సుల్-జనరల్ టకాహషి మునియో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.
– ఈనాడు, హైదరాబాద్



ఎగతాళి చేసినవారే మీ నీడను ఆశ్రయిస్తారు

శ్రేష్ఠత సాధన కోసం మీరు నడుం బిగించినప్పుడు చాలామంది ఎగతాళి చేస్తారు. మీ ప్రయత్నంలో లోపాలను అన్వేషిస్తారు. కానీ అదంతా.. మీ కృషి ఫలించేంతవరకే..! ప్రయత్నం విజయవంతమై మీకు పేరు ప్రతిష్ఠలు రాగానే.. అప్పటిదాకా అవహేళన చేసినవారే మిమ్మల్ని తమవారిగా బయట చెప్పుకోవడం మొదలుపెడతారు. మీ యశస్సు నీడను ఆశ్రయిస్తుంటారు.
– కునాల్ షా, వ్యాపారవేత్త

వచ్చే నెలలో రేషన్ కార్డుల అర్జీల స్వీకరణ

- 'మంత్రులతో ముఖాముఖి'లో ఉత్తమ్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం అక్టోబరు మొదటివారంలో గ్రామ, వార్డు స్థాయుల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులకు అర్జీలు పెట్టుకోవడానికి వచ్చినవారితో మంత్రి మాట్లాడారు. రేషన్ కార్డుల అర్జీలు ప్రత్యేక సమావేశాల్లోనే పెట్టుకోవాలని సూచించారు. ఇక్కడ కూడా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆయాశాఖల మంత్రులకు, ఉన్నతాధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ పట్ల విశ్వాసంతోనే ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు పెద్ద ఎత్తున వస్తున్నారని ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని పనులను వేగవంతం చేసి పరిష్కరిస్తామన్నారు.

320 వినతులు..

మంత్రులతో ముఖాముఖి సందర్భంగా ప్రజలు 320 అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానంగా మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో పాటు.. భూ సమస్యలు, జీవోలు 317, 46కి సంబంధించిన అంశాలు, ఇందిరమ్మ గృహాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఉపాధి వంటి అంశాలపై పలువురు దరఖాస్తులు అందజేశారు. మహిళలు, గర్భిణులు, తల్లులు, దివ్యాంగులు, వృద్ధుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించారు. భారాస హయాంలో తమపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని కాంగ్రెస్ కార్యకర్తలు వినతులు సమర్పించారు. నాంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు ముస్లిం మహిళలు పాతబస్తీలో ఓ టెక్నాలజీ సంస్థ పేరుతో కొందరు అధిక వడ్డీ ఆశ చూపి రూ.700 కోట్లతో ఉడాయించారని.. నిందితులను వెంటనే అరెస్టుచేసి తమకు న్యాయం చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. త్వరగా ఎస్సీ వర్గీకరణ చేయాలని, దాని ప్రకారమే నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

వంటింట్లో ధరల మంట

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో రోజుకు 100 టన్నుల నూనె వినియోగమవుతుంది. పండగల సమయాల్లో రోజుకు 150 టన్నులు వినియోగిస్తారు. ఈ లెక్కన ధరల పెరుగుదల వినియోగదారులకు పెనుభారంగా మారింది.

అల్లం, వెల్లుల్లి దట్టించలేం..

అల్లం, వెల్లుల్లి ధరలు వారం రోజుల వ్యవధిలోనే రూ. 60 చొప్పున పెరిగాయి. అల్లం కిలో రూ. 100 నుంచి రూ. 160కి, వెల్లుల్లి రూ. 300 నుంచి రూ. 360 చేరాయి. మాల్స్‌లో వెల్లుల్లి ధర రూ. 400 పలుకుతోంది. ఉల్లిపాయలు గత పక్షం రోజులుగా కిలో రూ. 60కి తగ్గడం లేదు. ఎండుమిర్చి ధర కిలో రూ. 200 నుంచి రూ. 250కి చేరింది. మరోవైపు పప్పులు సైతం తామేం తక్కువ కాదన్నట్లు మండిపోతున్నాయి. కంది పప్పు కిలో ధర వారం వ్యవధిలో రూ. 20 పెరిగి రూ. 170కి చేరింది. పెసరపప్పు రూ. 30 పెరిగి రూ. 150కి, మినపప్పు రూ. 15 పెరిగి రూ. 135కి, సెనగపప్పు రూ. 5 పెరిగి రూ. 105 పలుకుతోంది.

రెండు నెలలకు నిల్వలున్నా..

వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 14న పెంచింది. దేశీయంగా నూనె గింజల ధరలు పడిపోతున్న నేపథ్యంలో స్థానిక రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అప్పటికే వ్యాపార సంస్థల్లో, నూనె తయారీ కంపెనీల్లో రెండు నెలల వరకు సరిపోయే నిల్వలు ఉన్నందున పాత ధరలతోనే విక్రయిస్తారని కేంద్రం భావించింది. దీనికి భిన్నంగా నూనె తయారీ కంపెనీలు వెంటనే ధరలు పెంచాయి. దీనికి అనుగుణంగా వ్యాపారులు సైతం ధరలను ఇష్టారాజ్యంగా పెంచారు. 15వ తేదీ ఉదయం సాధారణంగా ఉన్న ధరలు సాయంత్రానికి పెరిగిపోయాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని టోకు, చిల్లర దుకాణాల్లో అప్పటికే ఉన్న నిల్వలను కొత్త ధరలతో విక్రయించారు. మాల్స్‌లో మాత్రం గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)పై జీఎస్టీ బిల్లులు ఇవ్వాల్సి ఉన్నందువల్ల. . ఎక్కువ ధరకు విక్రయిస్తే పట్టుబడతామన్న ఉద్దేశంతో నల్లబజారుకు తరలించారు. వాటిని రహస్యంగా హోటళ్లు, రెస్టారెంట్లకు కాసింత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వినియోగదారులు అడిగితే మాత్రం కొత్త స్టాక్ వస్తేనే విక్రయిస్తామని చెబుతున్నారు. వచ్చే నెలలో దసరా, దీపావళి పండగల వరకు వంటనూనెల ధరలు మరింత భగ్గుమనే అవకాశం ఉంది. మరోవైపు ధరలపై నియంత్రణ కరవైంది. మాల్స్, హోల్‌సేల్ దుకాణాల వారు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కంపెనీల సూచనలకు అనుగుణంగానే..

నూనె ఉత్పత్తి కంపెనీల నుంచి వచ్చే దిగుమతులు, వాటి సూచనలకు అనుగుణంగానే ధరలను పెంచి విక్రయిస్తున్నాం. పెరిగిన ధరలకు అనుగుణంగా సొమ్ము చెల్లిస్తేనే కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. అందుకే పెరిగిన ధరల ప్రకారం విక్రయిస్తున్నాం.
– శ్రీనివాస్, రిటైల్ వ్యాపారి, నిజామాబాద్

ప్రపంచ మొక్కల పరిశోధకుల జాబితాలో ఐకార్ శాస్త్రవేత్త

జూకంటి అరవింద్‌కుమార్ ఎంపిక



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) శాస్త్రవేత్త జూకంటి అరవింద్‌కుమార్ ప్రపంచ మొక్కల జీవ, వృక్ష శాస్త్రం పరిశోధకుల్లో స్థానం సంపాదించారు. ప్రపంచ జాబితాలో దేశంలోని ఐకార్ నుంచి 22 మందికి అవకాశం దక్కగా అందులో అరవింద్‌కుమార్ ఒకరు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ వ్యవసాయ విభాగాధిపతి జాన్ పీఏ అయోడినిస్ నేతృత్వంలో ఈ పరిశోధనలు సాగాయి. 2023-24లో చేసిన పలు అధ్యయనాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. నారాయణఖేడ్‌కు చెందిన అరవింద్‌కుమార్ 2012లో ఐకార్‌లో చేరారు. 2017 నుంచి రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధన సంస్థలో ఆయన పనిచేస్తున్నారు. జాబితాలో చోటు లభించడంపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడండి

- విద్యార్థి మహాగర్జనలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- సచివాలయ ముట్టడికి ఎస్ఎఫ్ఐ కార్యకర్తల యత్నం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రాంనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలవుతున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవట్లేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద విద్యార్థి మహాగర్జన ధర్నా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని, వర్సిటీలకు శాశ్వత వీసీలను నియమించి విద్యారంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ ఫీజుల కోసం చట్టం తీసుకువస్తానన్న హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. గత ఆరున్నరేళ్లుగా రాష్ట్రంలో రూ. 8,252 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3214 హాస్టళ్లలో మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. అన్ని గురుకులాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి కామన్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులంతా సచివాలయానికి వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. ఈ అరెస్టులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ శనివారం రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అయిత విజయ్, డీవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెదడులో 'మజిల్ మెమరీ' గుట్టు వీడింది!

దిల్లీ: సంగీత విద్వాంసులు, క్రీడాకారుల్లో చేతుల కదలికలు ప్రణాళికబద్ధంగా జరిగిపోతుంటాయి. దీనికి 'మజిల్ మెమరీ' కీలకం. దీనికి సంబంధించిన గుట్టును బ్రిటన్ శాస్త్రవేత్తలు విప్పారు. మెదడు ప్రమేయం ఎక్కువగా లేకుండానే శారీరక లక్షణాలను ఆటోమేటిక్‌గా నిర్వహించడానికి ఈ 'మజిల్ మెమరీ' వీలు కల్పిస్తుంది. గాయాల నుంచి కోలుకోవడానికి, శారీరక శ్రమ కారణంగా కోల్పోయిన కండర ద్రవ్యరాశిని తిరిగి పొందడానికి ఇది సాయపడుతుంది. మెదడులో కదలికలకు సంబంధించిన భాగాలైన బాసల్ గ్యాంగ్లియా, సెరిబెల్లంతో ఈ జ్ఞాపకశక్తి ముడిపడి ఉందని గతంలో శాస్త్రవేత్తలు భావించారు. తాజాగా బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు దీనిపై పరిశోధన చేశారు. అంతగా వృత్తి నైపుణ్యం లేని కీబోర్డు ప్లేయర్లు.. గుర్తుపెట్టుకొని లయబద్ధంగా వేళ్లను కదిలిస్తున్నప్పుడు వారి మెదళ్లను ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రిజోనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)తో పరిశీలించారు. ఆ సమయంలో పరీక్షార్థుల గ్యాంగ్లియా, సెరిబెల్లంలలో కాకుండా హిప్పోక్యాంపస్‌లలో క్రియాశీలతను గమనించారు. నిర్దిష్ట క్రమానికి అనుగుణంగా వేళ్ల కదలికలు చేపట్టడానికి కావాల్సిన సమాచారాన్ని హిప్పోక్యాంపస్ చేరవేస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. నైపుణ్యంతో కూడిన చర్యల క్రమానికి సంబంధించిన కదలికలను ఈ భాగం నిర్దేశిస్తుందని స్పష్టమైనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కదలికలపై ప్రభావం చూపే నాడీక్షీణత రుగ్మతల బాధితులకు ఉపశమనం కలిగించేందుకు కొత్త మార్గాలకు ఈ పరిశోధన వీలు కల్పిస్తుందన్నారు.

మూత్రపిండాల్లో రక్తపోటు నియంత్రణ 'స్విచ్'

గుర్తించిన అమెరికా శాస్త్రవేత్తలు

జ్ఞాన నేత్రం

దిల్లీ: రక్తపోటు (బీపీ)ను నియంత్రించడంలో సాయపడే ఒక ఎంజైమ్ ఉత్పత్తిని ప్రేరేపించే జన్యువులు మూత్రపిండాల్లో ఉన్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి బీపీని అదుపులో ఉంచే స్విచ్‌ల్లా పనిచేస్తున్నట్లు తేల్చారు.

మూత్రపిండాల్లోని రక్త నాళాల లోపలి భాగాల లైనింగ్‌లో మృదువైన కండర కణాలు ఉంటాయి. ఇవి అవసరాన్ని బట్టి ముడుచుకోవడం, తెరుచుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంటాయి. బీపీ పడిపోయినప్పుడు, అదే స్థితిలో ఎక్కువసేపు కొనసాగినప్పుడు ఈ కణాలు.. రెనిన్ అనే ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా రక్తపోటును సాధారణ స్థాయికి తీసుకొస్తాయి. అయితే దీన్ని ప్రేరేపించే జన్యువులేంటన్నదానిపై ఇప్పటివరకూ అనిశ్చితి ఉంది. దీనిపై అమెరికాలోని వర్జీనియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. రెనిన్ ఉత్పత్తయ్యేటప్పుడు జరిగే జీవప్రక్రియలను పరిశీలించారు. ఇందులోని మూడు ప్రక్రియల్లో ప్రమేయమున్న 9 జన్యువులను గుర్తించారు. ఇవి స్విచ్‌ల్లా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అవసరమైనప్పుడు రెనిన్‌ను ఉత్పత్తి చేసేలా, అవసరంలేనప్పుడు దాన్ని నిలిపివేసేలా మృదువైన కండర కణాలను ఇవి నియంత్రిస్తున్నట్లు తేల్చారు.

నస్రల్లా లక్ష్యంగా భీకర దాడి

- హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనాలు

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం కనీవినీ ఎరుగని స్థాయిలో విరుచుకుపడింది. బాంబుల వర్షం కురిపించింది. హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా లక్ష్యంగా ఈ దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఆయన మరణించారా? లేదా సురక్షితమా? అనే దానిపై స్పష్టత లేదు. నస్రల్లా సురక్షితంగా ఉన్నారని హెజ్‌బొల్లా వర్గాలు చెబుతున్నా.. ఇజ్రాయెల్ మాత్రం ఇంకా ధ్రువీకరించుకోవాల్సి ఉందని అంటోంది. నస్రల్లా గురించిన సమాచారాన్ని సేకరిస్తున్నామని ఇరాన్ తెలిపింది. మరోవైపు ఈ దాడిలో ఇద్దరు మృతి చెందగా 76 మంది గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌లోని దాహియాలో నివాసగృహాల కింద భూగర్భంలో ఉన్న హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై విధ్వంసకర బంకర్ బస్టర్ బాంబులను ఇజ్రాయెల్ ప్రయోగించింది. దీంతో దాహియాతో పాటు, బీరుట్‌లోని చాలా ప్రాంతాలు దద్దరిల్లాయి. భవనాలు నేలమట్టమయ్యాయి. దాదాపు 8 భవంతులు సమూలంగా ధ్వంసమయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాహియా హెజ్‌బొల్లాకు బాగా పట్టున్న ప్రాంతం. అందుకే గత వారం రోజులుగా ఈ ప్రాంతాన్నే లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పదే పదే దాడులు నిర్వహిస్తోంది. దాదాపు 18 మంది హెజ్‌బొల్లా అగ్రశ్రేణి కమాండర్లను ఐడీఎఫ్ మట్టుబెట్టింది కూడా దాహియాలోనే. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 79వ సదస్సులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రసంగం ముగిసిన కొన్ని నిమిషాలకే ఈ భీకర దాడికి ఐడీఎఫ్ దిగడం గమనార్హం. న్యూయార్క్‌లోని తన హోటల్ గది నుంచే ఈ దాడికి నెతన్యాహు ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. ఐరాసలో ప్రసంగం ముగిసిన వెంటనే ఆయన అమెరికా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని ఇజ్రాయెల్ పయనమయ్యారు.

ఇరానే మూలకారణం

తన ప్రసంగంలో ఇరాన్‌పై నెతన్యాహు విరుచుకుపడ్డారు."మీరు దాడి చేస్తే.. మేమూ దాడి చేస్తాం" అంటూ ఆ దేశాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇరాన్‌లోని ఏ ప్రాంతాన్నైనా లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం తమకుందన్నారు. ఆ దేశం అణ్వస్త్రాన్ని సముపార్జించుకోకుండా అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. పశ్చిమాసియాలోని సమస్యలన్నింటికి ఇరాన్ మూలకారణమని ఆరోపించారు. యావత్ ప్రపంచం ఇరాన్‌ను బుజ్జగిస్తూ వస్తోందని.. దానికి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు.

హమాస్ లొంగిపోతేనే యుద్ధం ఆగేది

ఐక్యరాజ్యసమితి సదస్సులో హెజ్‌బొల్లాపై నెతన్యాహు నిప్పులు చెరిగారు. ఆ మిలిటెంట్ సంస్థను చావుదెబ్బ తీస్తామని హెచ్చరించారు. లెబనాన్ నుంచి రోజువారీ రాకెట్ల దాడులను సహించేది లేదని అన్నారు. హమాస్ లొంగిపోయి.. ఆయుధాలు వీడి.. బందీలను విడిచిపెడితేనే గాజా యుద్ధం ఆగుతుందని నెతన్యాహు స్పష్టం చేశారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ఐఎన్ఎస్ అధ్యక్షుడిగా శ్రేయాంస్ కుమార్ ఎన్నిక


శ్రేయాంస్‌కుమార్

ఈనాడు, దిల్లీ: దేశంలోని వార్తాపత్రికలకు ప్రాతినిధ్యం వహించే ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) అధ్యక్షుడిగా 2024-25 సంవత్సరానికి ప్రముఖ మలయాళ దినపత్రిక 'మాతృభూమి' మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి. శ్రేయాంస్‌కుమార్ ఎన్నికయ్యారు. డిప్యూటీ ప్రెసిడెంట్‌గా వివేక్‌గుప్త (సన్మార్గ్), వైస్ ప్రెసిడెంట్‌గా కరణ్ రాజేంద్ర దర్డా (లోక్‌మత్), గౌరవ కోశాధికారిగా తన్మయీ మహేశ్వరి (అమర్ ఉజాల) ఎంపికయ్యారు. కొత్త కార్యనిర్వాహక కమిటీ 41 మంది సభ్యులతో ఏర్పాటైంది. వీరిలో ఐ.వెంకట్ (ఈనాడు), ఎస్.బాలసుబ్రమణ్యం ఆదిత్యన్ (డైలీ తంతి), గిరీశ్ అగర్వాల్ (దైనిక్‌భాస్కర్, భోపాల్), సమాహిత్ బల్ (ప్రగతివాది), సముద్రభట్టాచార్య (హిందుస్థాన్‌టైమ్స్, పట్నా), హర్‌ముస్జీ ఎన్. కామా (బాంబే సమాచార్), గౌరవ్ చోప్రా (ఫిల్మీ దునియా), విజయ్ కుమార్ చోప్రా (పంజాబ్ కేసరి, జలంధర్), విజయ్ జవహర్‌లాల్ దర్డా (లోక్‌మత్, నాగ్‌పుర్), జగ్జీత్ సింగ్ దార్ది (చార్దికలా డైలీ), వివేక్‌గోయంకా (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ముంబయి), కె.ఆర్.పి. రెడ్డి (సాక్షి), మహేంద్ర మోహన్ గుప్త (దైనిక్ జాగరణ్) తదితరులు ఉన్నారు. ఐఎన్ఎస్ 85వ వార్షిక సర్వసభ్య సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పండగలకు 6 వేల ప్రత్యేక రైళ్లు

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

దిల్లీ: పండగల వేళ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. దసరా, దీపావళి, ఛఠ్ పూజలకు సొంతూళ్లకు వెళ్లే ప్రజల కోసం దాదాపు 6 వేల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ.. 'పండగల కోసం గతేడాది 4,429 రైళ్లను నడపగా.. ఈసారి 5,975 రైళ్లను కేటాయించాం. మరో 108 రైళ్లకు సాధారణ కోచ్‌లు పెంచాం. దాంతో 12,500 కోచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. కోటి మందికి పైగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలు చేరుకోవడానికి ఇవి సహాయపడనున్నాయి'' అని పేర్కొన్నారు.



మీ సమయాన్ని అనర్హులకు కేటాయించకండి

మీ సమయం అత్యంత విలువైనది. దాన్ని అనర్హులకు కేటాయించకండి. అనవసరపు సమస్యలపై కూడా వృథా చేయకండి. ఎప్పటికప్పుడు మీకోసం తగినంత సమయం కేటాయించుకోండి. ఆత్మావలోకనం చేసుకుంటూ మిమ్మల్ని మీరు మరింత మెరుగుపరుచుకోండి.

– డేవిడ్ గొగిన్స్, మారథాన్ రన్నర్

కిషిద వారసుడిగా ఇషిబా

- మాజీ రక్షణమంత్రికి జపాన్ పగ్గాలు
- 1న బాధ్యతల స్వీకరణ


షిగెరు ఇషిబా

టోక్యో: జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిద వారసుడిగా మాజీ రక్షణమంత్రి షిగెరు ఇషిబా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. దీంతో అక్టోబరు 1న ఇషిబా దేశ 102వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎల్‌డీపీ అధ్యక్షుడిగా 2021లో కిషిద ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆయన మూడేళ్ల పదవీకాలం ఈ సెప్టెంబరుతో ముగుస్తుంది. దీంతో పార్టీకి అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అవినీతి ఆరోపణల దృష్ట్యా కిషిద ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలోనే పార్టీ అధినాయకత్వ పదవికి 9 మంది పోటీపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఎల్‌డీపీ పార్లమెంట్ సభ్యులతో పాటు దాదాపు 10లక్షల మంది పార్టీ సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కౌంటింగ్ చేపట్టి ఇషిబా విజయం సాధించినట్లు ప్రకటించారు.

ఎవరీ ఇషిబా..

67 ఏళ్ల ఇషిబా కెరీర్ ఆరంభంలో బ్యాంకింగ్ రంగంలో పనిచేశారు. తన 29 ఏళ్ల వయసులో 1986లో తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ప్రభుత్వ విధానాలను బహిరంగంగా వ్యతిరేకిస్తూ తరచూ వార్తల్లో నిలిచేవారు. ఈ క్రమంలో కిషిద ప్రభుత్వంలో ఆయనను పక్కనబెట్టారు. గత ఎల్‌డీపీ ప్రభుత్వంలో రక్షణ శాఖ మంత్రిగా పనిచేశారు.

కేరళలో మరో మంకీపాక్స్ కేసు నమోదు

తిరువనంతపురం: కేరళలో మరో మంకీపాక్స్ కేసు నమోదైంది. ఎర్నాకుళం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఈ వ్యాధి లక్షణాలతో ఆసుపత్రిలో చేరినట్లు శుక్రవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. అతడి నమూనాలను పరీక్షల కోసం పంపించగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపింది. అతడి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి తెలిపారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారిలో మంకీపాక్స్ లక్షణాలు కనబడితే వెంటనే ఆరోగ్య శాఖను సంప్రదించాలని సూచించారు. కాగా ఈ నెల 9న దేశంలో తొలి మంకీపాక్స్ క్లేడ్-2 రకం కేసు నమోదైంది. ఆ తర్వాత 18న కేరళలో క్లేడ్-1 రకాన్ని నిర్ధారించారు. దీంతో దేశంలో ప్రాణాంతక మంకీపాక్స్ కేసుల సంఖ్య మూడుకు చేరుకుంది.

విద్యార్థిని బలిచ్చిన పాఠశాల యాజమాన్యం!

- యూపీలో ఐదుగురి అరెస్టు

ఆగ్రా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాథ్రస్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. నరబలి ఇస్తే పాఠశాల కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయన్న మూఢనమ్మకంతో నిర్వాహకులు రెండో తరగతి విద్యార్థిని హత్య చేశారు. సోమవారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో పాఠశాల యజమాని సహా అతడికి సహకరించిన డైరెక్టర్, ప్రిన్సిపల్, మరో ఇద్దరు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. తాంత్రిక పూజలను విశ్వసించే డీఎల్ పబ్లిక్ స్కూల్ యజమాని జశోధన్ సింగ్.. పాఠశాల, కుటుంబ శ్రేయస్సు కోసం ఓ బాలుడిని బలి ఇవ్వాలని డైరెక్టర్ అయిన తన కుమారుడు దినేశ్ బఘేల్‌ను కోరారు. దీంతో ఈ నెల 23న పాఠశాల వసతి గృహంలో నిద్రిస్తున్న రెండవ తరగతి విద్యార్థి కృతార్థ్‌ను బఘేల్ ఓ ఉపాధ్యాయుడి సహాయంతో అపహరించి ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్లాడు. అక్కడ బాలుడు మేల్కొని ఏడవడంతో నిందితులు అతణ్ని గొంతు నులిమి హత్య చేశారు. ఆ సమయంలో మరో ఉపాధ్యాయుడు, ప్రిన్సిపల్ ఘటనా స్థలంలో కాపలాగా ఉన్నారు. అనంతరం నిందితులు చిన్నారి తల్లిదండ్రులకు ఫోను చేసి బాలుడి ఆరోగ్యం బాగోలేదని, బఘేల్ కారులో ఆసుపత్రికి తరలిస్తున్నట్లు చెప్పారు. అయితే కారును అడ్డుకున్న బాలుడి కుటుంబ సభ్యులు ఘటనపై తమకు సమాచారం అందించారని పోలీసులు తెలిపారు.

మూడు హత్యల కేసు దోషికి నైట్రోజన్ గ్యాస్‌తో మరణశిక్ష



అలబామా: నైట్రోజన్ గ్యాస్ ప్రయోగం ద్వారా దోషులకు మరణశిక్ష అమలుచేయడం అమెరికాలో ఇటీవల తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా ఈ పద్ధతిలో రెండో శిక్షను అమలుచేశారు. పనిచేస్తున్న చోట ముగ్గురిని కాల్చిచంపిన కేసులో దోషిగా తేలిన యుగెని మిల్లర్ (59) అనే వ్యక్తికి అలబామాలో గురువారం ఈ శిక్షను అమలు చేశారు. దక్షిణ అలబామా జైలులో మిల్లర్ ముఖానికి మాస్కు అమర్చిన తర్వాత నైట్రోజన్ గ్యాస్‌ను విడిచిపెట్టారు. రెండు నిమిషాల్లో కిందపడిపోయిన మిల్లర్.. మరో ఆరు నిమిషాల తర్వాత తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు. డెలివరీ ట్రక్కు డ్రైవరుగా పనిచేసే మిల్లర్ 1999 ఆగస్టు 5న సహోద్యోగులు ముగ్గురిని కాల్చిచంపాడు. మిల్లర్ మానసికస్థితి సరిగా లేదని వారు వదంతులు సృష్టిస్తున్నారనే అనుమానంతో ఇలా చేసినట్లు దర్యాప్తులో తేలింది. 2022లోనే మిల్లర్‌కు విషపూరిత ఇంజెక్షనుతో మరణశిక్ష అమలుచేయాలని చూడగా.. అధిక బరువు కారణంగా అతడి నరాలు దొరక్క ఆ ప్రయత్నం ఫలించలేదు. అలబామాలో ఈ ఏడాది జనవరిలో హత్యకేసు నిందితుడు కెన్నెత్ స్మిత్ (58)కు ఇలాగే మరణశిక్షను అమలుచేశారు. స్మిత్ శిక్ష అమలుకు ముందు ఈ పద్ధతికి వ్యతిరేకంగా న్యాయవాదులు సుదీర్ఘంగా పోరాడినా న్యాయస్థానంలో ఊరట లభించలేదు.

చైనాలో కుప్పకూలిన అణు జలాంతర్గామి!



బీజింగ్: నేవీ, న్యూక్లియర్ విస్తరణ కార్యకలాపాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టు తెలుస్తోంది. డ్రాగన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అణు జలాంతర్గామి మునిగిపోయినట్లు ఉపగ్రహ చిత్రాల ఆధారంగా అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. మ్యాక్సర్ టెక్నాలజీస్ మార్చి 10న తీసిన ఉపగ్రహ చిత్రాల ప్రకారం. . వుహాన్ సమీపంలోని షిప్‌యార్డు వద్ద ఈ జలాంతర్గామిని చైనా నిలిపి ఉంచింది. జూన్ నాటి చిత్రాల్లో చూస్తే.. ఆ సబ్‌మెరైన్ మళ్లీ తీరం వద్ద కనిపించలేదు. ''ఇందులో ఎలాంటి ఆశ్చర్యం లేదు. ఝౌ క్లాస్‌లోని తొలి జలాంతర్గామి తీరం సమీపంలో మునిగిపోయిందనే విషయాన్ని దాచిపెట్టేందుకు చైనా ప్రయత్నిస్తోంది'' అని అమెరికా రక్షణశాఖ సీనియర్ అధికారి వెల్లడించారు. గతేడాది కూడా చైనాకు చెందిన అణు జలాంతర్గామి '093-417' ఎల్లో సముద్ర జలాల్లో ఘోర ప్రమాదానికి గురై 55 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చైనా ఈ ప్రచారాన్ని తోసిపుచ్చింది. బ్రిటన్ ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ఆధారంగా అంతర్జాతీయ మీడియా ఆ కథనాన్ని ప్రచురించింది.

అమెరికాలో తుపాకుల కట్టడికి కొత్త చట్టం



వాషింగ్టన్: అమెరికాలో నానాటికీ పెరుగుతున్న తుపాకుల సంస్కృతిని అరికట్టడానికి అధ్యక్షుడు జో బైడెన్ కొత్తచట్టంపై సంతకాలు చేశారు. మరో రెండు నెలల్లో అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్న తరుణంలో బైడెన్ ఈ బిల్లుపై సంతకాలు చేయడం గమనార్హం. ''అమెరికాలో వ్యాధులు, ప్రమాదాలతో చనిపోతున్న చిన్నారుల కంటే.. తుపాకుల కారణంగా నమోదవుతున్న మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది చాలా బాధాకరం. ఈ హింసను అంతం చేయడానికి నేను, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కృషి చేస్తున్నాం. మీరూ మాతో చేతులు కలపండి'' అని బైడెన్ ఈ సందర్భంగా 'ఎక్స్'లో పేర్కొన్నారు. అమెరికాలో పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో కాల్పుల ఘటనలు నానాటికీ పెరుగుతున్నాయి. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సర్వే ప్రకారం.. 2020లో 4,368 మంది పిల్లలు తుపాకుల కారణంగా మృతిచెందారు. 2019లో ఈ సంఖ్య 3,390 కాగా.. 2021లో 4,752కు చేరింది. జార్జియాలోని పాఠశాలలో ఇటీవల జరిగిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా.. తొమ్మిదిమంది గాయపడ్డారు.

క్రేజే వ్యాపారమాయెనే!



- అమెరికాలో ట్రంప్ పేరు, ముద్రలతో పలు వస్తువుల అమ్మకాలు
- మాజీ అధ్యక్షుడికి భారీగా ముడుతున్న లైసెన్సు ఫీజు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ దేశంలో తన పట్ల ప్రజల్లో ఉన్న అభిమానాన్ని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డాలర్లుగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో దేశాధ్యక్ష పదవికి పోటీపడుతున్న ట్రంప్ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పటి నుంచి తన పేరు, ముద్రతో బైబిళ్లు, పాదరక్షలు, క్రిప్టో కరెన్సీ, పరిమళ ద్రవ్యాల వంటి బ్రాండెడ్ వస్తువులను అమ్ముతున్నారు. తాజాగా గురువారం ట్రంప్ గడియారాల కలెక్షన్‌ను విడుదల చేశారు. వాటిలో అతి ఖరీదైన వాచీ ధర లక్ష డాలర్లయితే, తక్కువ ధర 499 డాలర్లు. 18 క్యారట్ల బంగారంతో తయారు చేసిన లక్ష డాలర్ల వాచీలో 122 వజ్రాలు పొదిగి, మూడు వెరైటీలుగా అమ్ముతున్నారు. ఈ వస్తువులను అమ్మగా వచ్చే సొమ్మును ట్రంప్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరు. ఆ అమ్మకాలపై ఆయనకు లైసెన్సు ఫీజు లభిస్తుంది. దానిద్వారా బాగా ఆదాయం వస్తుంది. ట్రంప్ రాజకీయాల్లో దిగకముందే తాగు నీరు, వోడ్కా, మాంసం వంటకాలను లైసెన్సు ఒప్పందం మీద విక్రయించి బాగా సొమ్ము చేసుకున్నారు. ఈ వారం మొదట్లో తన ముఖాన్ని ముద్రించిన 100 డాలర్ల వెండి నాణాలను విక్రయించబోతున్నానని ప్రకటించారు. మార్చిలో ఈస్టర్ పండుగకు ముందు 59.99 డాలర్ల ధరకు తన మద్దతుదారులతో బైబిల్‌ను కొనిపించారు. అమెరికా పతాక చిహ్నంతో 399 డాలర్ల పాదరక్షల అమ్మకాలను ఫిబ్రవరిలో ఒక కొత్త వెబ్‌సైట్ ద్వారా ప్రారంభించారు. 99 డాలర్లకు కోలోన్, పెర్ఫ్యూమ్ సీసాలు అమ్ముకుంటున్నారు. నిరుడు క్రిప్టో కరెన్సీ విక్రయాలనూ చేపట్టారు. ఈ వస్తువులను డోనాల్డ్ ట్రంప్ కానీ, ఆయన కంపెనీలు కానీ తయారుచేయడం లేదని, విక్రయ లైసెన్సు ఒప్పందం కింద తామే ఆయన పేరును వాడుకుని వస్తువిక్రయాలు సాగిస్తున్నామని ఒక సేల్స్ వెబ్‌సైట్ వివరించింది. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ట్రంప్ ఎన్నికల ప్రచారానికి వినియోగించబోవడం లేదనీ స్పష్టం చేసింది.

ట్రంప్ మీద కమల పైచేయి


తాజా ప్రజాభిప్రాయ సర్వేల్లో వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలో మిషిగన్, పెన్సిల్వేనియా, జార్జియా వంటి కీలక రాష్ట్రాల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నా పాలక డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు ఎక్కువ మద్దతు లభిస్తోందని వివిధ ప్రజాభిప్రాయ సర్వేలు తెలిపాయి. నవంబరు 5న జరిగే ఎన్నికల్లో అమెరికా అధ్యక్ష పదవికి హారిస్, ట్రంప్ పోటీపడుతున్న సంగతి తెలిసిందే. రియల్ క్లియర్ పాలిటిక్స్ వెబ్‌సైట్ ప్రకారం జాతీయ స్థాయిలో కమలా హారిస్‌కు ట్రంప్ మీద 2 శాతం ఆధిక్యత కనిపిస్తోంది. ఈ సైట్ వివిధ సర్వేలను క్రోడీకరించి పై విషయం తెలిపింది. యూగవ్-యుమాస్ లోవెల్స్ సెంటర్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ సంస్థల సంయుక్త సర్వే ప్రకారం మిషిగన్ రాష్ట్రంలో కమలా హారిస్‌కు 48 శాతం, ట్రంప్‌నకు 43 శాతం మద్దతు వ్యక్తమవుతోంది. పెన్సిల్వేనియా రాష్ట్రంలో కమలకు 48 శాతం, ట్రంప్‌నకు 46 శాతం ఓటర్ల మద్దతు లభిస్తోంది. ఫాక్స్ న్యూస్ ప్రకారం జార్జియా రాష్ట్రంలో కమలకు 51 శాతం, ట్రంప్‌నకు 48 శాతం మద్దతు వ్యక్తమవుతోంది. అరిజోనా రాష్ట్రంలో ఈ లెక్కలు తారుమారయ్యాయి. అక్కడ ట్రంప్ 51 శాతం, కమల 48 శాతం ఆదరణ చూరగొంటున్నారు.

పర్యావరణ స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ పదవికి జైరాం వీడ్కోలు

దిల్లీ: 'శాస్త్ర సాంకేతిక, పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పు'లపై ఏర్పాటు చేసిన పార్లమెంటు స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వీడ్కోలు పలికారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. తదుపరి ఈ పదవిని చేపట్టబోయే భువనేశ్వర్ కలితా 2019లో కాంగ్రెస్ నుంచి భాజపాలోకి చేరారని గుర్తుచేస్తూ చురకలంటించారు. సెప్టెంబరు 2019-జూన్ 2022, సెప్టెంబరు 2022-జూన్ 2024 మధ్య ఈ స్థాయీ సంఘానికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహించిన రమేశ్.. ప్రస్తుతం ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. 'భాజపాకు చెందిన భువనేశ్వర్ కలితాతో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. 2019, ఆగస్టు 5, ఉదయం 11 గంటలవరకు కాంగ్రెస్‌లో ఆయన నా సహచరుడు. అనంతరం భాజపాలో చేరారు. ఇప్పుడు స్థాయీ సంఘానికి ఛైర్ పర్సన్‌గా నా స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఆ రోజు ఆయన తీసుకున్న నిర్ణయం పార్లమెంటు చరిత్రలో విశిష్టమైంది' అని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

ఈజిప్ట్ బిలియనీర్ మరణానంతరం.. కోర్టుకు లైంగిక ఆరోపణల వెల్లువ


మహ్మద్ అల్ ఫయాద్

ఇంటర్నెట్ డెస్క్: ఈజిప్టునకు చెందిన బిలియనీర్ మహ్మద్ అల్ ఫయాద్ (94) గతేడాది మృతిచెందగా.. ఆయన తమపై అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ 60 మంది మహిళలు తాజాగా బ్రిటన్ కోర్టును ఆశ్రయించారు. బాధితుల సంఖ్య 150కు పైగా ఉండవచ్చని వీరి తరఫు న్యాయవాదులు చెబుతుండటం గమనార్హం. బ్రిటన్‌లోని ప్రముఖ లగ్జరీ డిపార్ట్‌మెంటల్ స్టోర్ హారోడ్స్ సంస్థ మాజీ యజమాని ఫయాద్ తన వద్ద పనిచేసే పలువురు మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పేర్కొంటూ బీబీసీ ఇటీవల ఓ డాక్యుమెంటరీ ప్రసారం చేసింది. 1985 - 2010 మధ్య ఈ దారుణాలు జరిగినట్లు వెల్లడించటం సంచలనం రేపింది. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు బాధితులు ఎవరైనా ఉంటే బయటకు వచ్చి ఫిర్యాదు చేయాలని ప్రకటించారు. ఈ కేసుపై బ్రిటన్ కోర్టు విచారణ కూడా మొదలుపెట్టింది. దీంతో ఇప్పటివరకు 60 మంది మహిళలు ఫిర్యాదు చేశారు. 2010లోనే ఈ సంస్థను ఖతార్‌కు చెందిన మరో కంపెనీ చేజిక్కించుకొంది.

మధ్యవర్తిత్వ కోర్టుల తీర్పుల్లో జోక్యానికి అవకాశాలు పరిమితమే

అప్పీలేట్ న్యాయస్థానాల అధికారంపై సుప్రీంకోర్టు

దిల్లీ: ఏదైనా వివాదంపై మధ్యవర్తిత్వ న్యాయస్థానం వెలువరించిన తీర్పులో అప్పీలేట్ కోర్టుల జోక్యానికి పరిమిత అవకాశాలు మాత్రమే ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం స్పష్టం చేసింది. మధ్యవర్తిత్వ కోర్టు నిర్ణయానికి మూలమైన సాక్ష్యాలనూ పునఃపరిశీలించజాలవని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం తెలిపింది. ఆ తీర్పు... భారత ప్రభుత్వ విధానాలతో విభేదించేలా ఉన్నా, అవినీతి, మోసంతో ప్రభావితమైనా అప్పీలేట్ కోర్టు జోక్యం చేసుకోవచ్చని వివరించింది. 'మధ్యవర్తిత్వ, రాజీ చట్టం-1996' ముఖ్య ఉద్దేశం పిటిషనర్లకు న్యాయాన్ని వేగంగా, చౌకగా అందించేలా చేయటంతో పాటు సాధారణ కోర్టుల జోక్యాన్ని వీలైనంత మేరకు తగ్గించడమని తెలిపింది. పంజాబ్, హరియాణా హైకోర్టు 2017, జనవరి 10న వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ పంజాబ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది. బియ్యం సరఫరా విషయంలో ఒక మిల్లుతో ఏర్పడిన వివాదంలో 2012లో మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. దీనిని పౌర సరఫరాల సంస్థ సవాల్ చేసింది.

బిహార్ ప్రభుత్వ పాఠశాలలో మద్యపానం, అర్ధనగ్న నృత్యాలు



పట్నా: బిహార్‌లో ఓ ప్రభుత్వ పాఠశాలను కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చుకున్నారు. అక్కడే మద్యం తాగుతూ, బార్ డ్యాన్సర్లతో కలిసి అసభ్యకర నృత్యాలతో వేడుకలు చేసుకున్నారు. సహర్సా జిల్లా జలాయీ పోలీస్‌స్టేషను పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనల తాలూకు వీడియో వైరల్‌గా మారింది. పెళ్లి వేడుకల్లో భాగంగా ఇదంతా జరిగినట్లు తెలుస్తోంది. పాఠశాలలో ఇలాంటి వేడుకలకు విద్యాశాఖ ఎలా అనుమతి ఇచ్చిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి బారాత్ వెంట వచ్చిన కొందరు వ్యక్తులు పాఠశాలలో బస చేసి వినోదం కోసం అలా చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి మమతా కుమారి వెల్లడించారు.


జితేంద్ర అవ్హాడ్ దంపతులు

లాడెన్ జీవిత చరిత్ర చదవమన్న విపక్ష నేత భార్య వ్యాఖ్యలపై దుమారం

ముంబయి: మహారాష్ట్రలో మాజీ ముఖ్యమంత్రి శరద్ పవార్ పార్టీకి చెందిన మాజీ మంత్రి జితేంద్ర అవ్హాడ్ సతీమణి రుతా అవ్హాడ్ ఓ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. సమాజంలో నెలకొన్న పరిస్థితులే ఒసామాబిన్ లాడెన్‌ను ఉగ్రవాదిగా మార్చాయని వ్యాఖ్యానించిన ఆమె.. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరును పోల్చిచెప్పడం వివాదానికి కారణమైంది. ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం 'ఇండియా' కూటమి నేతలకు అలవాటేనని భాజపా మండిపడింది. రుతా అవ్హాడ్ తన ప్రసంగంలో.. ''మీరు ఒసామాబిన్ లాడెన్ జీవిత చరిత్ర చదవండి. కలాం ఎలా రాష్ట్రపతి అయ్యారో.. లాడెన్ ఎలా ఉగ్రవాదిగా మారాడో అర్థం చేసుకోవచ్చు'' అని విద్యార్థులకు వివరించారు. దీనిపై భాజపా తీవ్రంగా స్పందించింది. ''ఎన్సీపీ (శరద్ పవార్) నేత సతీమణి లాడెన్‌ను సమర్థిస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కలాం ప్రస్తావన అనవసరం'' అని ఖండించింది. ఈ విమర్శలపై స్పందించిన రుతా తన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు.







EENADU Vol: 51, Iss: 49 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

నకిలీ ఉద్యోగుల దందా!

- పనిచేయకుండానే బల్దియాలో 1500ల మందికి జీతాలు



ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో పలువురు పని చేయకుండానే జీతాలు పొందుతున్నారు. కొన్నేళ్లుగా ఈ తంతు నడుస్తోంది. ఇంట్లో ఉండి వేరే పనులు చేసుకుంటూ బల్దియాలో జీతం తీసుకుంటున్న ఉద్యోగుల్లో రవాణా విభాగం ప్రధానమైనది. ఇంత జరుగుతున్నా సంబంధిత రవాణా విభాగం ఇంజినీర్లు, పారిశుద్ధ్య విభాగంలోని వైద్యాధికారులు, ఇంజినీర్లు, ఎంటమాలజీ విభాగంలోని సీనియర్ ఎంటమాలజిస్టులు స్పందించడం లేదు.

అక్రమం ఇలా..: మొత్తం 1500 మంది పనిచేయకుండానే జీతాలు పొందుతున్నారు. వారిలో రవాణా విభాగం నుంచే 800 మంది ఉన్నారు. పారిశుద్ధ్యం, ఎంటమాలజీ విభాగాల్లో మరో 700 మంది అక్రమంగా జీతాలు తీసుకుంటున్నారు.

డీజిల్ కూపన్ల దందా.. కవాడిగూడ పార్కింగ్ యార్డులో 150 వరకు లైట్ మోటారు, హెవీ వాహనాలున్నాయి. మరమ్మతుల పేరుతో రూ.5 కోట్లను కొందరు ఉద్యోగులు దారి మళ్లిస్తున్నారు. వాహనాల టైర్లు, డీజిల్ కూపన్లను అమ్ముకుంటున్నారు.

పనిచేసే వారిపైనే భారం..

జీహెచ్ఎంసీ రవాణా విభాగంలో పొరుగు సేవల కింద పనిచేసే డ్రైవర్లు, ఇతర లేబర్లు కలిపి 2 వేల మంది ఉన్నారు. అందులో చాలా మంది రికార్డుల్లోనే ఉంటున్నారు. కొందరు పాలకమండలి నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఇళ్లలో పనిచేసే వారిని ఉద్యోగిగా చేర్పిస్తున్నారు. నేతలు పదవి దిగిపోయాక కూడా కొందరు అలాగే కొనసాగుతున్నారు. పని చేయకుండా జీతం దక్కుతుండడంతో బల్దియాను ఏటీఎం కార్డులా వాడుకుంటున్నారు. నకిలీ సిబ్బంది గైర్హాజరుతో రోజూ విధులు నిర్వర్తించే ఉద్యోగులపై తీవ్రమైన భారం పడుతోంది.



గూడు వీడలేక.. గోడు వినే వారు లేక

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు చేపట్టిన సర్వేపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలో బాధితులు నిరసన తెలిపారు. ఇళ్లు ఖాళీ చేసి ఎక్కడికెళ్లాలంటూ పలువురు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. ఎంపీ ఈటల రాజేందర్ నిర్వాసితులకు మద్దతు తెలిపారు. ఆయన వెంట భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా నేతలు ప్రేమేందర్‌రెడ్డి, సామ రంగారెడ్డి ఉన్నారు.

జీవనదిలా.. మూసీ

- రూ.5,500 కోట్ల ప్రాజెక్టుకు వారంలో టెండర్లు
- మల్లన్నసాగర్ నుంచి నగరానికి 15 టీఎంసీల తాగునీరు



ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీలోకి సంవత్సరం పొడవునా మంచినీటిని వదిలేందుకు వీలైన ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వారంలోనే టెండర్లను పిలవనుంది. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 15 టీఎంసీల తాగునీటిని తీసుకువచ్చే ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేయడానికి కసరత్తు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో రూ.5,500 కోట్ల ప్రాజెక్టుపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శుక్రవారం సమీక్షించి తక్షణం టెండర్లు పిలువాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ఉరుకులు పరుగులపై ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పైపులైన్ ద్వారా జంటజలాశయాలకు.. ప్రభుత్వం రాజధాని పరిధిలో 55 కి.మీ.ల పొడువున ఉన్న మూసీ నది సుందరీకరణ తలపెట్టింది. ఇది పూర్తయ్యేనాటికి మూసీలో నిరంతరాయంగా మంచినీటి ప్రవాహం ఉంటేనే ఫలితం ఉంటుందని అధికారులు భావించారు. ఇందుకు జంట జలాశయాల నుంచి ఏడాదిలో రెండున్నర టీఎంసీల నీటిని విడతల వారీగా విడుదల చేస్తూనే ఉండాలి. గోదావరి నుంచి నీటిని తీసుకొస్తేనే ఇది సాధ్యం. ఈ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును తక్షణం చేపట్టాలని నిర్ణయించింది. మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీల నీటిని తీసుకువచ్చే పైపులైను ప్రాజెక్టును అధికారులు రూపకల్పన చేశారు. 12.5 టీఎంసీల నీటిని ఘనపూర్ రిజర్వాయర్‌కు తెచ్చి అక్కడ శుద్ధి చేసి నగర అవసరాలకు వినియోగిస్తారు. మిగిలిన రెండున్నర టీఎంసీలను పైపులైను ద్వారా జంటజలాశయాలకు తీసుకురావాలని నిర్ణయించారు. జలాశయాలకు నీరు చేరిన తరువాత అవసరమైనప్పుడు సుందరీకరణ చేసిన మూసీలోకి వదిలేందుకు ప్రణాళిక రూపొందించారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత: గవర్నర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ కాలనీలో నిర్వహించిన 'స్వచ్ఛతా కి భాగీదారి' (స్వచ్ఛతలో అందరి భాగస్వామ్యం) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత బస్తీలో పర్యటించి అక్కడి పరిస్థితులు, పారిశుద్ధ్య నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

పిల్లల భవిష్యత్తు కోసమే చోరీలు

- వారికి తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా..
- పోలీసుల విచారణలో ఘరానా దొంగ వెల్లడి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: 2004 నుంచి దొంగతనాలు మొదలుపెట్టిన ఓ దొంగ ఇప్పటికే సుమారు 200కు పైగా చోరీలు చేశాడు. వివిధ ఠాణాల్లో మొత్తం 60 కేసులు అతనిపై నమోదయ్యాయి. ఇటీవల రాజేంద్రనగర్ పోలీసులకు చిక్కడంతో రిమాండ్‌కు తరలించారు. అతన్ని నగరంలోని మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన సుధాకర్‌గా గుర్తించారు. అతన్ని కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణలో నిందితుడు ఆసక్తికర విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలుసుకున్న పోలీసులు.. పిల్లల కోసమైనా చోరీలు మానుకోవాలని సూచించగా.. తాను దొంగతనాలు చేస్తున్నదే వారి కోసమంటూ సమాధానం ఇవ్వడంతో ఆశ్చర్యపోయారు. తండ్రి దొంగ అని పిల్లలకు తెలిస్తే వారు అవమానంతో కుంగిపోతారని పోలీసులు చెప్పగా.. ఆ విషయం తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నానని చెప్పినట్లు తెలిసింది. తాను బెంగళూరులో డ్రైవింగ్ చేస్తున్నానని పిల్లలకు చెప్పినట్లు తెలిపాడు. అతన్ని పట్టుకున్న విషయం అన్ని పత్రికల్లో వచ్చినట్లు పోలీసులు గుర్తుచేయగా.. తన పిల్లలు ప్రభుత్వ వసతిగృహంలో చదువుకుంటున్నారని, విషయం వారికి తెలియదని సుధాకర్ చెప్పినట్లు తెలిసింది. మొదట్లో ఐదారు చోరీలు చేసిన తర్వాత మానేద్దామనుకున్నానని, తరువాత తాను దొంగతనం చేయకపోయినా వేరే ప్రాంతాల్లో పోలీసులు తనను అరెస్టు చేసినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం.



దాండియా ఆట.. బతుకమ్మ పాట



మరో మూడు రోజుల్లో దసరా నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమాజిగూడలోని విల్లామేరీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం రంగీలా రాస్ పేరుతో బతుకమ్మ ఉత్సవం, దాండియా వేడుక నిర్వహించి ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, సోమాజిగూడ

మూసీ నిర్వాసితుల పునరావాసంపై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మార్డీసీ ఎండీ దానకిశోర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రక్షాళనలో నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుతోనే సరిపెట్టకుండా మహిళలకు రుణాలు, చిన్నారులను హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్వాసితులకు అన్నిరకాల తోడ్పాటు అందించిన తరువాతే కూల్చివేతలను మొదలుపెట్టాలని భావిస్తోంది. మూసీ పునరావాసంపై ఎమ్మార్డీసీ ఎండీ దానకిశోర్ శుక్రవారం అధికారులతో చర్చించారు. ఉపాధి కల్పన, పట్టా ఉంటే చట్ట ప్రకారం రావాల్సిన ప్రయోజనాలు, ఆయా కుటుంబాల్లోని పిల్లలకు గురుకులాల్లో అడ్మిషన్లు కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సమన్వయంతో అర్హులకు పథకాలు అందేలా చూస్తామన్నారు.

హౌసింగ్ సిబ్బందికి ఇళ్ల కేటాయింపు బాధ్యతలు

మూసీ నిర్వాసితులకు త్వరితగతిన ఇళ్ల కేటాయింపు కోసం ప్రాంతాల వారీగా హౌసింగ్ సిబ్బందికి జీహెచ్ఎంసీ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు పడక గదుల ఇళ్లను మూసీ నిర్వాసితుల కుటుంబాలకు కేటాయించనున్నారు. ఇందుకుగాను.. ప్రాంతాలవారీగా హౌసింగ్ సిబ్బందిని కేటాయిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్(హౌసింగ్), చీఫ్ ఇంజినీర్(హౌసింగ్)ను ఆమె ఆదేశించారు.

మత్తులో హత్యలు... అడ్డొస్తే గొడవలు
ధన్వంతరి మోసానికి సీసీఎస్ చికిత్స
15లో



నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, నగర వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్ఎంసీ నిషేధం విధించింది. అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, చెట్లు, విద్యుత్తు స్తంభాలకు ప్రకటనలు తగిలించడం, రహదారులపై బోర్డులను ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం యంత్రాంగాన్ని ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు. గోడలపై ప్రకటనలు, నినాదాలు, ఇతర రాతలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపకమిషనర్లు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తాఖీదులు తప్పవన్నారు. ఉల్లంఘనలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా నిషేధాజ్ఞలు పట్టించకపోతే జరిమానా వేయాలని, రోజువారీ నివేదికలను కేంద్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం దోహదం



పురస్కార గ్రహీతలతో శ్రీనివాస్‌గుప్తా, మురళీమోహన్‌రాజు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటకరంగం దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గమని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం సైఫాబాద్‌లోని అన్మోల్ కాంటినెంటల్ హోటల్‌లో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పర్యాటక పురస్కారాలను 'మీర్ అహ్మద్ అలీ (నైస్ టూర్స్ అండ్ ట్రావెల్స్), డా.బోగ కోదండపాణి (సావరిన్ ఎస్టేట్స్ అండ్ మల్టీ ట్రేడర్స్), డి.రఘురామ్ (శ్రీబాలాజీ ట్రేడర్స్), ఎస్.విలాస్ (హైదరాబాద్ హాలీడేస్)లకు ప్రదానం చేశారు. అంతకముందు కవి సమ్మేళనం నిర్వహించారు. నాట్యగురువు డా.ఎస్.పి.భారతి, సామాజిక వేత్తలు మురళీమోహన్ రాజు, ఎస్.రామచంద్రరావు, సర్వేపల్లి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్ న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ రోడ్డు నం.2 ఎల్వీప్రసాద్ మార్గ్‌లోని పామ్ బంజారా రెస్టారెంట్ పక్క గల్లీలో కొన్ని వీధిదీపాలు వెలగడం లేదు. చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– జయదీప్, స్థానికుడు, బంజారాహిల్స్

✓ సిబ్బందిని పంపి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్– 18.

మూసీ సుందరీకరణ పేరిట దందా

ఫిల్మ్‌నగర్: మూసి సుందరీకరణ పేరుతో దందా నడుస్తోందని భారాస రాష్ట్ర నాయకులు పి.కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. మూసీ సుందరీకరణ పేరిట దోచుకునే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. మూసీ వెంట ఉన్న వారికి కేసీఆర్ అండగా ఉంటారన్నారు. సమావేశంలో రాకేష్‌కుమార్, వై.సతీష్‌రెడ్డి, గజ్జెల నగేష్, పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోండి

ఖైరతాబాద్: మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్న దుకాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆరిజన్ డైయిరీ సీఈఓ బోడపాటి శేజల్ ఆబ్కారీ శాఖను కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాధవి వైన్స్‌లో మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆబ్కారీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు.

'అడ్డదారుల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు'

ఖైరతాబాద్: కొందరు సచివాలయం వేదికగా అడ్డదారుల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని తెలంగాణ నిరుద్యోగ రక్షణ ఐకాస ఛైర్మన్ డా.మహిపాల్ యాదవ్ ఆరోపించారు. మరో వారం రోజుల్లో కొన్ని పోస్టులు భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

హడలెత్తిస్తున్న శునకాలు.. చర్యలకు మీనమేషాలు



పంజాగుట్ట, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిని, కదిలించిన వారిని హడలెత్తిస్తూ దాడి చేస్తున్నాయి. వీధులు, ఉద్యానాలు, రహదారులపై గుంపులుగా తిష్టవేస్తున్న శునకాలతో పాదచారులు, వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.



ప్రతాప్‌నగర్‌లో..

• సిబ్బంది, వాహన కొరతతో వెటర్నరీ విభాగం సతమతం
• సగటున వారానికి అయిదుగురు కుక్కకాటు బాధితులు

ఈ కాలనీల్లో అధికం..

ద్వారాకాపురి కాలనీ, బాలాపుర బస్తీ, పంజాగుట్ట కుమ్మరిబస్తీ, పద్మావతినగర్, వెంకటరమణ కాలనీ, చింతలబస్తీ ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం మాత్రం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. డివిజన్‌లోని ఉద్యానాల్లో ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లే వారిని కరుస్తున్నాయని, వాటి బారి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీసి కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. వారానికి కనీసం అయిదుగురు కుక్క కాటు బారిన పడి వస్తున్నారని బస్తీదవాఖానాల వైద్య సిబ్బంది చెబుతున్నారు.

లెక్కలు మిక్కిలిగా..

జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో 5 సర్కిళ్లలో 90 వేలకు పైచిలుకు వీధికుక్కలున్నట్లు అధికారులు లెక్కతేల్చారు. వాస్తవానికి లక్షన్నర పైచిలుకు వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయని ఓ అధికారి తెలిపారు. వీధి కుక్కల బెడద గురించి ఫిర్యాదు చేస్తే డాగ్ స్క్వాడ్ వచ్చేసరికి ఆలస్యం అవుతోంది. ఒక్క ఖైరతాబాద్ సర్కిల్ విషయమే తీసుకుంటే రోజుకు కనీసం 10 ఫిర్యాదులైన కుక్కల సమస్యపై వస్తున్నాయి. వాస్తవానికి సరిపడా సిబ్బంది లేక, అవసరమైన సంఖ్యలో వాహనాలు అందుబాటులో లేక జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం సమస్యలు ఎదుర్కొంటుంది. కుక్కల బెడద విషయమై తమకు ఫిర్యాదులు అందిన వెంటనే కుక్కలను పట్టుకొని తీసుకువెళ్లి యానిమల్ బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలు చేసి, రేబిస్ నిరోధక, డి-ఫార్మింగ్ టీకాలను వేసి తిరిగి వదిలిపెడుతున్నామని వెటనరీ విభాగం అధికారులు చెప్పారు.

కోర్టు ఉత్తర్వులను అమలుచేయరా?

● సహకార శాఖ కమిషనర్ రిజిస్ట్రార్‌పై హైకోర్టు ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవకతవకలపై సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందించని సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ హరితపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాగైతే కోర్టు ధిక్కరణ కింద జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. చర్యల్లో జాప్యంపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 18కి వాయిదావేసింది. గత మేనేజింగ్ కమిటీ అవకతవకలపై విచారణ జరిపి సమర్పించిన నివేదికపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో జూబ్లీహిల్స్ సొసైటీ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఎం.హరిత వ్యక్తిగతంగా హాజరయ్యారు. విచారణ నివేదికను పిటిషనర్‌కు అందజేశారు. గత పాలకమండలి అవకతవకలపై విచారణ జరిపినా చర్యలు ఎందుకు చేపట్టలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించారు. వచ్చే విచారణకు హాజరు మినహాయింపు ఇవ్వాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించారు.

నేడు రాష్ట్రపతి పర్యటన.. ట్రాఫిక్ ఆంక్షలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉత్తర మండలం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట్ ఫ్లైఓవర్, హెచ్‌పీఎస్ ఔట్‌గేట్, పీఎన్‌టీ ఫ్లైఓవర్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా జంక్షన్, టివోలి, జేబీఎస్, సికింద్రాబాద్ క్లబ్, కార్ఖానా జంక్షన్లు, తిరుమలగిరి, ఆల్వాల్, బొల్లారం, రాణిగంజ్, గ్రీన్‌లాండ్స్ జంక్షన్, సోమాజిగూడ రోడ్, యశోద ఆసుపత్రి, ఎంఎంటీఎస్, వీవీ విగ్రహం కూడలి (ఖైరతాబాద్), పంజాగుట్ట, ఎన్‌ఎఫ్‌సీఎల్, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లిస్తామని పేర్కొన్నారు.

ప్రజావాణిలో 63 అర్జీల తక్షణ పరిష్కారం

సోమాజిగూడ: మహాత్మా జ్యోతిబా పులే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలకు అధికారులు తక్షణ పరిష్కారం చూపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌ఛార్జి డా.జిచిన్నారెడ్డి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మొత్తం 365 అర్జీలు రాగా 63 సమస్యలు తక్షణం పరిష్కారమైనట్లు అధికారులు తెలిపారు. మిగతా అర్జీలను పోర్టల్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. రెవెన్యూ-105, విద్యుత్తు-58, ఎస్సీ సంక్షేమం-42, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి-29, మైనారిటీ- 26, ప్రవాసీ ప్రజావాణి -22, ఇతర శాఖలకు 83 అర్జీలు వచ్చాయి. ప్రజావాణి అధికారి దివ్య పాల్గొన్నారు.

ఆసుపత్రి బిల్లులో రాయితీ పేరుతో ఉద్యోగుల చేతివాటం

జూబ్లీహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి బిల్లు చెల్లింపుల వ్యవహారంలో డబ్బులు తీసుకొని రాయితీ ఇస్తున్న ఇద్దరు ఉద్యోగులపై ఆసుపత్రి ప్రతినిధులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసుపత్రి ఆవరణలో ఉన్న ప్రత్యేక బిల్లింగ్ విభాగానికి జనరల్ మేనేజర్‌గా కె.విక్రమ్, అత సహాయకులుగా అరుణ్, భాను పనిచేస్తున్నారు. నగదు చెల్లించి చికిత్స పొందే పేద రోగులకు బిల్లుపై రాయితీ ఇచ్చే అధికారం వీరికి ఉంది. దీనిని అవకాశంగా తీసుకొని రాయితీ ఇస్తామని చెప్పి పలువురి వద్ద డబ్బులు తీసుకొన్నారు. జూన్‌లో ఆసుపత్రిలో ఉన్న ఒక రోగి సహాయకురాలైన నాగజ్యోతికి బిల్లులో రాయితీ ఇస్తామంటూ అరుణ్ డబ్బులు అడిగాడు. అతడి భార్య చరవాణి నంబరు ఇచ్చి అందులో రూ.10వేలు పంపాలని సూచించారు. ఈ డబ్బు తమ ఉన్నతాధికారులకు ఇస్తామని చెప్పారు. దీంతో తనకు మరింత రాయితీ కావాలని కోరింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఒప్పందం కుదరకపోవడంతో నాగజ్యోతి విషయం ఆసుపత్రి వర్గాల దృష్టికి తీసుకెళ్లింది. అంతర్గత విచారణ చేపట్టిన ఆసుపత్రి వర్గాలు విక్రమ్ సూచనల మేరకు అరుణ్ రోగుల నుంచి రాయితీ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆసుపత్రి జనరల్ మేనేజర్ గోపాల్‌రావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ముక్కుసూటితనం వల్లే లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి కాలేదు'

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముక్కు సూటిగా ఉండటం వల్లనే కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి కాలేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీపై రూపొందించి 'యూనిటీ - ఏ మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' డాక్యుమెంటరీని విడుదల చేశారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ.. కొండా జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, డాక్యుమెంటరీ దర్శకుడు బడుగు విజయ్ కుమార్‌కి అభినందనలు తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో భారాస నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, నేతలు



జలదృశ్యంలోలో ఆర్.కృష్ణయ్య తదితరులు

● బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారాస నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ● లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో జలదృశ్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలు సౌఖ్యంగా జీవించేందుకు తన స్వగృహమైన జలదృశ్యాన్ని ఉద్యమానికి అప్పగించారని కొనియాడారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జైప్రకాష్, పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, బీసీ నాయకులు సురేష్, శంకర్, రామకృష్ణ, ఉదయ్, తదితరులు ఉన్నారు.

డీజే శబ్దాలపై దృష్టి

జూబ్లీహిల్స్: రానున్న పండుగలతో పాటు ఇతర వేడుకల సమయంలో డీజేల శబ్దాలపై దృష్టి సారిస్తామని బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని అవర్ ప్లేస్ హోటల్‌లో శుక్రవారం బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ ప్రాంతాల్లో దసరా సందర్భంగా అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించే మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపు

పంజాగుట్ట: నిమ్స్ నుంచి పంజాగుట్ట చౌరస్తా వరకు కాలిబాటపై ఆక్రమణలను శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్, ఎస్సై ఆంజనేయులు సిబ్బంది ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి చేయండి

ఫిల్మ్‌నగర్: హకీంపేట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ దేరంగుల వెంకటేశ్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించండి

బోరబండ: బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ మహమ్మద్ బాబాఫసియుద్దీన్ అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

రహదారి విస్తరణ చేపట్టాలి

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జిహెచ్ఎంసీ ముఖ్య నగర ప్రణాళికాధికారి శ్రీనివాస్‌ను కోరారు. రహదారి ఇరుకుగా ఉండటం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

నెక్లెస్‌రోడ్డులో చెత్త తొలగింపు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూట్స్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు నెక్లెస్ రోడ్డులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నిఖిల్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: వెంగళ్‌రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య జన్మదిన వేడుకలు యూసుఫ్‌గూడలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. బారాస నాయకులు విజయకుమార్, శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.




పర్యాటకం చెంత.. మురుగు కుంట!

నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ సమీపంలో పెద్ద ఎత్తున నీరు నిలిచి, పాకురుపట్టి మురుగుగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు పక్కనే హెచ్ఎండీఏ మైదానంలో ఐమ్యాక్స్ సమీపంలో ఈ దుస్థితి నెలకొంది. ఐమ్యాక్స్‌కు వచ్చే వాహనచోదకులు ఈ నీటిలోంచి వెళ్లి వాహనాలు పార్కింగ్ చేయాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా సమస్య ఉన్నా అధికారులు నీరు నిలువకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై నగరవాసులు అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఖైరతాబాద్

అల్లుకున్న నిర్లక్ష్యం

హిమాయత్‌నగర్ డివిజన్ షంషీర్బాగ్ వీధిలో వివిధ ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలకు చెందిన తీగలు ప్రమాదకరంగా, ఇంటి ముందు చేతికి అందేలా ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





గ్రామసింహాలకు ఆశ్రయమిస్తే వేధిస్తున్నారు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ షెల్టర్స్‌లో ఆశ్రయం పొందుతున్న గ్రామ సింహాలకు భద్రత లేదని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. వాటికి విషం ఇంజెక్షన్ ఇచ్చి దారుణంగా చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలకు ఆశ్రయం కల్పిస్తున్న, ఆహారం పెడుతున్న ప్రైవేట్ షెల్టర్స్ నిర్వాహకులనూ వేధిస్తున్నారని అక్షయ పాత్ర ఫీడింగ్ బౌల్ ఫర్ ఏనిమల్స్ నిర్వాహకుడు జైదీప్ కుమార్, ఏనిమల్స్ హోమ్ ఎన్జీఓ నిర్వాహకులు సహస్ర, రాజా వాసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరంలో ఐదు జోన్లలో ఐదు షెల్టర్స్ ఉన్నాయని, వీటిలో ఆశ్రయం పొందుతున్న శునకాల పరిస్థితి దారుణంగా ఉంది. గత ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో కుక్కలను పట్టుకునేందుకు రూ.18కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది ఇప్పటి దాకా దాదాపు రూ.12కోట్లు ఖర్చు చేసినా ఉపయోగం లేదన్నారు. సమావేశంలో జంతు ప్రేమికులు ధనలక్ష్మి, రాధారెడ్డి, అనురాధ మాట్లాడారు.

పక్వాడ వైద్యశిబిరాలకు మంచి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న సెంట్రల్ జిల్లా భాజపా అధ్యక్షుడు గౌతంరావు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 'పక్వాడ' పేరిట పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్‌సుల్తాన్‌నగర్ సామాజిక భవనంలో భాజపా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఆధ్వర్యంలో సరిత కృష్ణ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం అక్టోబరు రెండవ తేదీ వరకు ఉంటుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భాజపా రాష్ట్ర కమిటీ సభ్యులు లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంబాల గంగరాజు, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, నగర నాయకులు అట్లూరి రామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, సరిత, ప్రసన్న, గణేష్, సునీత, ఓల్డ్‌సుల్తాన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ మెయరీ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: హైదర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు అక్టోబర్ 20న నగరంలో జరిగే 15వ ఇండియన్ నేషనల్ మెమరీ ఛాంపియన్‌షిప్ 2024కి ఎంపికయ్యారు. జూబ్లీహిల్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ నుంచి ఛాంపియన్‌షిప్ చీఫ్ ఇన్‌ఛార్జి డా.పి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో జ్ఞాపకశక్తిపై సదస్సు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఛాంపియన్‌షిప్ రుసుము వైరల్ పే సేల్స్ అండ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించిందన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్‌ను అభినందించారు. మదీనా మహేక్, లాస్య, అనూష, మల్లికార్జున్, సమీమ్ ఇస్లాం ఎంపికైన వారిలో ఉన్నారని ప్రిన్సిపల్ చెప్పారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దర్జీ వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన యువతి అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక బీదర్‌కు చెందిన యువతి(17) గ్రామంలో ఓ యువకుడితో సన్నిహితంగా ఉంటోందని, మూడు నెలల కిందట బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబరు 1లో ఉంటున్న సోదరి వద్ద వదిలి వెళ్లారు. ఈనెల 22న టైలర్ వద్ద వస్త్రాలు ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న వ్యక్తిపై కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన మోతీలాల్ చిత్తు కాగితాలు సేకరిస్తూ రాత్రి వేళ ఖైరతాబాద్‌లోని సెన్సేషన్ థియేటర్ ప్రాంతంలోని కాలిబాటలపై నిద్రిస్తుంటాడు. గురువారం రాత్రి ఎప్పటి మాదిరిగా నిద్రించగా అదే వృత్తిలో ఉంటున్న బీదర్‌కు చెందిన దిలీప్ కర్రతో అతన్ని బలంగా కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైనులో హుక్కా వ్యాపారం.. వ్యక్తి అరెస్టు

ఖైరతాబాద్: ఆన్‌లైన్ హుక్కా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన నాగరాజు అలియాస్ రాజాకింగ్ ఖైరతాబాద్‌లోని మారుతీనగర్‌లో నివాసం ఉంటూ గతంలో బంజారాహిల్స్‌లోని ఓ కేఫ్‌లో పనిచేసేవాడు. అక్కడ హుక్కా వాడుతున్న వారితో పరిచయాలు ఏర్పడటంతో ఆర్నెళ్లుగా సొంతంగా అవసరమైన పరికరాలన్నీ తెచ్చుకున్నాడు. అవసరం ఉన్న కస్టమర్లకు హుక్కాను వారి ఇంటికే పంపిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అతడి ఇంటిపై దాడి చేసి హుక్కాకు వినియోగించే 14 రకాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఖైరతాబాద్ పోలీసులకు అప్పగించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జికి విద్యుదాఘాతం.. ఒకరికి గాయాలు

ఖైరతాబాద్: నిత్యం పర్యాటకులతో రద్దీ ఉండే ఎన్టీఆర్ గార్డెన్ ఎదుట ఫుట్ ఓవర్ బ్రిడ్జికి విద్యుదాఘాతం ఏర్పడి ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాల్లోకి వెళ్లితే.. ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో గప్‌చుప్ బండిని నిర్వహించేందుకు గురువారం మధ్యాహ్నం కామారెడ్డికి చెందిన షేక్ ముజీబ్ ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పుట్ఓవర్ బ్రిడ్జికి అనుకోగా తాకడంతో విద్యుదాఘాతమై వేగంగా పక్కకు తప్పుకున్నాడు. అప్పటికే వీపు భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానిక వ్యాపారులు బ్రిడ్జిపైకి పర్యాటకులు వెళ్లకుండా కట్టడి చేశారు. విద్యుత్తు అత్యవసర నంబరుకు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. ముజీబ్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ విషయమై విద్యుత్తు అధికారులను సంప్రదించగా వారు.. విద్యుత్తు తీగ దెబ్బతిని ఓ చోట విద్యుదాఘాతం వచ్చిందని, బ్రిడ్జిని పూర్తిగా తనిఖీ చేయగా ఎలాంటి విద్యుత్తు ప్రసారం లేదన్నారు.

పాదచారి చరవాణి చోరీ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ ఒంటరిగా వెళ్తున్న యువకుడిపై దాడిచేసి చరవాణి ఎత్తుకెళ్లిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లికి చెందిన నవీన్ విద్యార్థి. మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 26న రాత్రి 2 గంటల సమయంలో అమీర్‌పేట్‌లో స్నేహితుడిని కలిసి ఒంటరిగా వస్తున్నాడు. ఎస్సార్‌నగర్ మెట్రో స్టేషన్ వద్దకు చేరుకునే సరికి బైక్‌పై అపసవ్య దిశలో వచ్చిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు నవీన్ చెంపపై కొట్టారు. నవీన్ కిందపడటంతో అతని సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై డ్రైవర్ దురుసు ప్రవర్తన

నారాయణగూడ, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా.. దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్‌పై నారాయణగూడ పోలీసు ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండకు చెందిన సర్వర్ ఓ కొరియర్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పని మీద హిమాయత్‌నగర్ వైపు వచ్చి, ఇక్కడి మినర్వా హోటల్ దగ్గర రోడ్డు మధ్యలో కారు నిలిపాడు. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న నారాయణగూడ బ్లూకోర్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకొని వాహనం పక్కన నిలపాలని సూచించారు. దీంతో సర్వర్ దురుసుగా ప్రవర్తించాడు. కానిస్టేబుల్ నరసింహాచారి, హోంగార్డు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తు.. విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మద్యం మత్తు వల్ల అదుపు తప్పిన కారు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు, ఓ యువతి స్వల్పంగా గాయపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన రోహిత్ వెంకట్, అతడి స్నేహితులైన సంతోష్, చిన్మయి మునగాల, ఓ యువతి కలిసి జూబ్లీహిల్స్‌లోని డౌన్‌టౌన్ పబ్‌కు వచ్చారు. వెంకట్ కొద్ది రోజుల్లో విదేశాలకు వెళ్తుండటంతో స్నేహితులకు పార్టీ ఇవ్వడానికి వీరంతా ఇక్కడికి వచ్చారు. పబ్‌లో అతిగా మద్యం తాగి ఇంటికి కారులో బయలుదేరారు. అర్ధరాత్రి 12.10 గంటల ప్రాంతంలో రోడ్ నంబరు 37లోని క్యూ హబ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఎంజీ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంలోని బెలూన్‌లు తెరుచుకున్నాయి. కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న వారు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించగా వెంకట్ రోహిత్‌కు మద్యం మోతాదు శాతం 240గా వచ్చింది. మిగిలిన వారూ మద్యం తాగినట్లు గుర్తించారు. విద్యుత్తు స్తంభం దెబ్బతినడంతో టీజీఎస్పీడీసీఎల్ ఏఈ మహమూద్ శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తులో హత్యలు.. అడ్డొస్తే గొడవలు

నగరంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

ఈనాడు, హైదరాబాద్ రాంనగర్, న్యూస్‌టుడే

● బాగ్‌లింగంపల్లిలో గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు పాత నేరస్థులు పాన్ దుకాణంలోకి వెళ్లి గొడవపడ్డారు.

● బోల్‌కపూర్‌లో ఇద్దరు యువకులు మత్తుపదార్థం తీసుకుని వీరంగం వేశారు.

● తాజాగా ముషీరాబాద్ పరిధిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని గంజాయి మైకంలో జోగుతున్న యువకుడు కత్తితో పొడవటంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నగరంలో చోటుచేసుకున్న ఘటనల్లో ఇవి కొన్ని మాత్రమే. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముఠాలను క్షేత్రస్థాయిలో పోలీసులు సవాల్‌గా మారుతోంది.



పాన్‌దుకాణం యజమానిపై మత్తులో దాడి చేస్తున్న యువకుడు

● ఏపీ, ఒడిశా ఏజెన్సీ ప్రాంతాలనుంచి నగరానికి రోజుకు 100కిలోల గంజాయి వివిధ మార్గాల్లో చేరుతున్నట్లు అంచనా. దూల్‌పేట్, మంగళ్‌హాట్ అడ్డాగా సాగుతున్న దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఆబ్కారీ, పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తున్నా పూర్తిస్థాయిలో సానుకూల ఫలితాలు రావడం లేదు. ● నగరంలో నెలలోనే నాలుగు చోట్ల గొడవలు, రెండు హత్యలు, 10కి పైగా జరిగిన రోడ్డు ప్రమాదాలకు గంజాయి మత్తే కారణంగా పోలీసులు నిర్ధారించారు.

● రాష్ట్రంలో సుమారు 40 వేల మంది డ్రగ్స్‌కు బానిసలైనట్లు టీజీన్యాబ్ నిర్ధారించింది. వీరిలో 25 వేల మంది మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ఉన్నట్లు అంచనా.

ఖాళీ జాగాలే అడ్డాలు

● మత్తుకు చిత్తైన వారిలో చాలామందికి కటుంబాలు దూరంగా ఉంటున్నాయి. విరంచా మెట్రో పిల్లర్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండులు, శ్మశానాలు, పబ్లిక్ గ్రౌండ్, పార్కుల్లో మకాం వేస్తున్నారు. ● ముషీరాబాద్, చిక్కడపల్లి, గాంధీనగర్ పరిధిలో రేయింబవళ్లు గంజాయి పీలుస్తూ ప్రాంతాల వెళ్లే వారిని బెదిరిస్తున్న ముఠాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఎప్పటికప్పుడు అదుపులోకి తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. ● కటుంబానికి దూరంగా ఉంటూ కూలీ చేసుకుంటూ విలాసాలకు, పొదుపు చేసుకుని మత్తులో ఉండే యువకులను మత్తుముఠాలు ఏజెంట్లుగా మార్చుకుంటున్నాయి. ● ఆర్డర్లపై, తెల్లవారుజాము సమయాల్లో ఈ ముఠాలు గంజాయి ప్యాకెట్లను చేరవేస్తున్నాయి. కమిషనరేట్ రూ. 200-300 నగదు, 5 గ్రాముల గంజాయి ఇస్తున్నారు.

ధన్వంతరి మోసానికి సీసీఎస్ చికిత్స!

● రూ.514 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్

● బాధితులకు న్యాయం జరిగేలా ఏర్పాట్లు



ఈనాడు, హైదరాబాద్: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్(డీఎఫ్ఐ) లో కాస్త సొమ్ము చెల్లించి భారీగా లాభపడొచ్చని చెప్పిన మాటలు నిజమని వేలాది మంది నమ్మారు. ఎన్నో ఏళ్ల కష్టార్జితాన్ని ట్రస్ట్‌లో పెట్టుబడిగా పెట్టి నట్టేట మునిగిపోయారు. డాక్టర్ పి.కమలాకరశర్మ వ్యవస్థాపక ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన తమ వర్గానికి చెందిన వారికి అండగా నిలిచేందుకు ట్రస్ట్ ఏర్పాటుచేసినట్లు నమ్మించారు. స్వయంసేవ, ఉపాధికల్పన, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య సేవల అందిస్తామంటూ ఊదరగొట్టారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే నెలవారీ అధిక వడ్డీలు చెల్లిస్తామంటూ ప్రచారం చేశారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు, వయోవృద్ధులు భవిష్యత్ అవసరాల కోసం కష్టార్జితాన్ని ట్రస్ట్‌లో పెట్టుబడి పెట్టారు. కొద్దికాలం 3 నెలలకోసారి సక్రమంగా వడ్డీలు చెల్లించారు. తరువాత ముఖం చాటేశారు. సభ్యులు పోస్టు చేసినా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి ఈ ఏడాది నగర సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేశారు. దర్యాప్తు ఆలస్యమవుతోందంటూ బాధితులు జీవిత సమస్యల ఎదుట ఆందోళన నిర్వహించారు. సీసీఎస్ డీసీపీ శ్వేత బాధితులతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

బాధితుల గగ్గోలు: వేలాది మంది సుమారు రూ.1500 కోట్ల మేర ట్రస్ట్‌కు చెల్లించినట్లు అధారాలు చూపుతున్నారు. కొంతకాలం సజావుగానే వడ్డీలు చెల్లించడంతో నమ్మకంగా ఓ విశ్రాంత ఉద్యోగి వాపోయారు. దాచుకున్న డబ్బంతా మోసగాళ్ల చేతిలో పోయి ప్రస్తుతం మాత్రలు కొనుక్కునేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. బాధితుల సొమ్ము తిరిగిపొందేందుకు సీసీఎస్ పోలీసులు కృషిచేస్తున్నారు. నగర సీపీ సీవీ ఆనంద్ దర్యాప్తుపై ఆరా తీసి సమీక్షించి సత్వర చర్యలకు ఆదేశించినట్లు సమాచారం.

ఆస్తుల విక్రయంతో న్యాయం: డీసీపీ శ్వేత

ధన్వంతరిలో 31 కంపెనీలు, 9ట్రస్టులున్నాయి. సీసీఎస్ దర్యాప్తులో 25మంది బాధితులున్నట్లు తేలింది. ట్రస్ట్ పేరిటున్న రూ.514 కోట్ల విలువైన 6 ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. బ్యాంకుఖాతాలను ఫ్రీజ్ చేశాం. ట్రస్ట్ నిర్వాహకుల ఆస్తులవిక్రయానికి అంగీకరించారు. వచ్చిన సొమ్మతో బాధితుల నష్టాన్ని భర్తీ చేయవచ్చు.

'ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులు విక్రయించాలి'

కాచిగూడ, న్యూస్‌టుడే: అమాయకులను రూ.1500 కోట్ల మేరకు మోసగించిన ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులను విక్రయించి బాధితులకు సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల పోరాట కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో బాధితులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరు రామకృష్ణ ఆశ్రమంలో భూములను విక్రయించి రూ. 26 కోట్ల రికవరీ చేసిన సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీ ఆదినారాయణలకు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన ఆస్తులు విక్రయించి బాధితులకు న్యాయంచేయాలన్నారు. నగేష్, రావుల బాయి చూపారని కోరారు.

ఆర్పీ పట్నాయక్ కుమారుడిపై దాడి.. విద్యార్థిపై కేసు

రాయదుర్గం: సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కుమారుడు వైష్ణవ్ పట్నాయక్‌పై దాడిచేసిన ఓ విద్యార్థిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదుచేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న వివరాల ప్రకారం.. మణికొండ పంచవటి కాలనీలో నివసించే ఆర్పీ పట్నాయక్ కుమారుడు శంకర్‌పల్లిలోని ఓ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ చదువుతున్నాడు. అదే కళాశాలలో మరో విద్యార్థి ర్యాగింగ్ చేస్తున్నాడని ప్రిన్సిపల్‌కు వైష్ణవ్ పట్నాయక్ ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపల్ అతన్ని మందలించారు. గురువారం సాయంత్రం ఇద్దరూ బస్సులో ఇళ్లకు తిరుగు పయనమయ్యారు. మణికొండలో బస్సు దిగుతుండగా వైష్ణవ్ పట్నాయక్‌పై ఆ విద్యార్థి గొడవకు దిగాడు. ఈ క్రమంలో అతడి చెవిని కొరకడంతో రక్తస్రావమైంది. ఘటనపై ఆర్పీ పట్నాయక్ ఫిర్యాదు చేశారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కీలక మార్గం.. నడకే కష్టం



నగరం నడిబొడ్డున ఉన్న రవీంద్రభారతి వద్ద ప్రధాన రహదారిపై కాలిబాట లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులందరూ తిరిగే ఈ దారిలో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

నిర్లక్ష్యం పందిరేసింది..



ట్యాంక్‌బండ్‌పై నాటిన తీగ మొక్కలు రక్షణ గోడను ఆనుకుని కింది దాకా పెరిగాయి. గోడలకు వున్న రంధ్రాల్లో వేళ్లూనుకుని గోడకు ప్రమాదకరంగా మారాయి. లోయర్ ట్యాంక్‌బండ్ మార్గంలో కనిపిస్తున్న చిత్రమిది.

'దేవర' విడుదలతో ఎన్టీఆర్ అభిమానుల సందడి

రాంనగర్, న్యూస్‌టుడే: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' చలన చిత్రం విడుదల సందర్భంగా శుక్రవారం ఉదయం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని పలు థియేటర్ల వద్ద అభిమానులు సందడి నెలకొంది. ఈ క్రమంలో కొందరు అభిమానులు బాణసంచా కాల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి.. సుదర్శన్-35ఎంఎం థియేటర్ ప్రాంగణంలో ఫ్లెక్సీలో ఏర్పాటుచేసిన భారీ కటౌట్‌కు మంటలంటుకుని దగ్ధమైంది.



కాలిపోతున్న కటౌట్

వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. కొంతసేపటికి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని థియేటర్ యాజమాన్యం తెలిపింది. ఎవరో కావాలనే ఎన్టీఆర్ కటౌట్‌కు నిప్పు పెట్టి పారిపోయారని ఆరోపిస్తున్నా.. వాటిల్లో నిజం లేదని చిక్కడపల్లి ఎస్సై నాగరాజు చెప్పారు.

భవనంపైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

మియాపూర్, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వివాహిత భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మియాపూర్ ఎస్సై వెంకటేష్ వివరాల ప్రకారం.. మయూరి నగర్ దివ్యశ్రీశక్తి అపార్ట్‌మెంట్స్ 9వ ఫ్లోర్లో నెప్రహా ఆయన భార్య సాయి సింధూర(29) ఉంటున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని వేళ సాయిసింధూర 9వ అంతస్తు పైనుంచి కిందకి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు సమాచారమివ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఐడీపీఎల్ కాలనీలో నివాసముండే ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. అనారోగ్యం కారణమా? అన్న కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మంత్రాల పేరుతో మోసం.. నకిలీ బాబా అరెస్టు



కేశవగిరి, న్యూస్‌టుడే: రోగాలు నయం చేస్తా.. సమస్యలు దూరం చేస్తానంటూ ప్రజలను మోసంచేస్తున్న నకిలీ బాబాను బండ్లగూడ పోలీసులతో కలిసి, సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణ్‌పేట్‌కు చెందిన మహ్మద్ ఇల్యాస్‌అహ్మద్(42) వృత్తిరీత్యా ఇస్త్రీ పనిచేస్తుంటాడు. 2012లో నగరానికి జీవనోపాధికి వచ్చిన ఆయన పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో నివసించాడు. భూతవైద్యుడు(బాబా)గా అవతారమెత్తాడు. అతీత శక్తులున్నాయని.. మీ సమస్యలన్నీ ఇట్టే తీరుస్తానని ప్రచారం చేసుకున్నాడు. తన వద్దకు వచ్చిన అమాయకులకు మాయమాటలు చెప్పి, అధిక మొత్తంలో డబ్బులు వసూలుచేశాడు. రెండు నెలల క్రితం బండ్లగూడ జహంగీరాబాద్‌లో అద్దెకు ఇల్లు తీసుకుని దందా ప్రారంభించాడు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్‌వర్మ, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు ఎం.మధు, షేక్‌కవియుద్దీన్, పి.సాయిరాం, సిబ్బంది అతడి ఇంటిపై దాడిచేశారు. ఇల్యాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు నిమిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించారు.

ఐఎస్ఎఫ్ పిచ్‌కు 10 అంకురాలు ఎంపిక



ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ భరత్

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: అంకురాలకు ప్రోత్సాహం అందించేందుకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహిస్తోన్న ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ (ఐఎస్ఎఫ్) 2024లో పది అంకురాలు ఐఎస్ఎఫ్ పిచ్ ఫెస్ట్‌కు ఎంపికయ్యాయి. ఇందులో వాటర్ ఫాల్ ఆటోమేషన్, ప్లానిటిక్స్, ఐ గోవైస్ మొబిలిటీ, డాక్టర్‌ఎట్‌హోమ్, 6డిగ్రీ, కోడ్ బ్లూ, టెన్, కిక్ ఆఫీస్, సిరిగ్లో, టియా కెనెక్టర్లు ఉన్నాయి. దాదాపు 53వేలకు పైగా అంకురాలు ఐఎస్ఎఫ్ పిచ్‌ఫెస్ట్‌కు దరఖాస్తు చేసుకున్నాయని, ఇందులో నుంచి 50 అంకురాలకు తమ గురించి తెలియజేసేందుకు అవకాశం కల్పించినట్లు ఐఎస్ఎఫ్ ఛైర్‌పర్సన్, కన్వీనర్ జేఏ చౌదరి తెలిపారు. 50 సంస్థల్లో నుంచి అత్యున్నతంగా ఉన్న 10 సంస్థలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీటికి ఐఎస్ఎఫ్ తరఫున మార్గనిర్దేశకత్వం, పెట్టుబడులు సమీకరించడంలో సాయంతోపాటు, ఇతర అంశాల్లో తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు.

సందర్శించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఐఎస్ఎఫ్ ఫెస్టివల్‌ను శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఎం.భరత్ సందర్శించారు. ఇక్కడ పలు అంకురాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అంకుర సంస్థల ప్రతినిధులతో మాట్లాడి వాటి ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు.

పేదలను తరలించకుండా.. మూసీకి రక్షణగోడ నిర్మించాలి



బాధితులతో మాట్లాడుతున్న గౌతంరావు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీనది పరివాహక ప్రాంతాల నుంచి పేదలను తరలించకుండానే.. ఆయా ప్రాంతాలకు వరద ముప్పు తలెత్తకుండా పటిష్ఠ రక్షణగోడను నిర్మించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు కోరారు. నగర శివార్లలో రెండు పడకగదుల ఇళ్లను ఇస్తామంటే నగరంతో ముడిపడ్డ వారి జీవనోపాధి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. శుక్రవారం భాజపా గోల్నాక అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తులసీనగర్ లంక, కమలానగర్ తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నేతలు కీసరి నర్సింగ్‌యాదవ్, రాంచందర్, దామోదర్‌నాయుడు, ఈశ్వర్‌రావు, రవీందర్, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరీవాహక ప్రాంతాలవాసుల కొవ్వొత్తుల ర్యాలీ

అత్తాపూర్: హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలపై ప్రతాపం చూపుతోందని పలువురు ఆరోపించారు. అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లను కూల్చివేస్తామని అధికారులు సర్వే చేయడాన్ని నిరసిస్తూ బాధితులు, వివిధ పార్టీల నాయకులు అత్తాపూర్ హైదర్‌గూడలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని అనుమతులు తీసుకొని ఇళ్లు నిర్మించుకుంటే ఇప్పుడు ప్రభుత్వం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటూ తమను బెదిరిస్తోందన్నారు. ఇళ్లు కూల్చివేయాలనే నిర్ణయాన్ని సీఎం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, భాజపా నాయకులు కొమురయ్య, వివిధ సంఘాల నేతలు, సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధు తదితరులు పాల్గొన్నారు.

పీరంచెరువులోని భవంతులు హైడ్రాకు కనిపించవా..?

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పీరంచెరువులో యథేచ్ఛగా పెద్దపెద్ద భవంతులు కడుతున్నారని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇక్కడి చెరువులో కొనసాగుతున్న భవన నిర్మాణాలపై వీడియో, సమాచారాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆయన ఎక్స్ వేదికగా పోస్టుచేశారు. ఇక్కడి అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ప్రశ్నిస్తే.. 'మాకు సీఎం బాగాతెలుసు.. ఆర్-టాక్స్(పర్ ఎస్ఎఫ్‌టీ రూ.50/) కట్టుకుంటాం.. కోర్టుకు ఎలా పోవాలో మాకుతెలుసు అని దబాయిస్తున్నరంట. మరి ఇక్కడి అధికారులు ఏంచేస్తున్నరు? పేదోళ్ల ఇండ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే శని, ఆదివారాల్లో కూల్చుతున్నరు కదా..! హైడ్రా కమిషనర్ ఎక్కడ..? అంటూ నిలదీశారు. ప్రవీణ్‌కుమార్ ఇక్కడి స్నేహిత హిల్స్ కాలనీలోనే నివాసముంటున్నారు. ఆయన భవనంపై నుంచే పీరంచెరువు ఎఫ్‌టీఎల్‌లో కొనసాగుతున్న భవనాల నిర్మాణ పనులను వీడియో తీశారు.

60 దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ఓ వైద్యుడు ఇంట్లో బంగారం చోరీ చేసిన కేసులో నిందితుల్లో ఒకరిని పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ రాధమ్మకాలనీకి చెందిన వైద్యుడు కిరణ్ ఇంటిలో మే 28న చోరీ జరిగింది. 20 తులాల బంగారం దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. అక్కడున్న సీసీకెమెరాల ఆధారంగా పాతనేరస్థుడు దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని యానాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో శామ్యూల్ రాజ్ అనే నిందితుడితో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దొంగిలించిన బంగారం నాగ్‌పూర్‌లో ముత్తూట్ సంస్థలో తాకట్టు పెట్టినట్లు చెప్పాడు. పోలీసులు వెళ్లి 13 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతను 60 దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శామ్యూల్‌రాజ్ పరారీలో ఉన్నాడని చెప్పారు.

అత్త ప్రశ్నించిందని.. కోడలు బలవన్మరణం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: తనకు గాయమైతే ఆసుపత్రిలో ఎందుకు చూపించలేదని అత్త ప్రశ్నించినందుకు కోడలు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందింది. పటాన్‌చెరు ఎస్సై వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన బాలమ్మకు ఇటీవల రహదారి ప్రమాదం జరిగింది. ఆమె చేతికి గాయం అవడంతో నన్ను ఆసుపత్రిలో ఎందుకు చూపలేదని కోడలు అనూష(38)ను గురువారం ప్రశ్నించింది. దీనితో మనస్తాపం చెందిన అనూష అత్త వేసుకునే రక్తపోటు నియంత్రణ మాత్రలు వేసుకుని బలవన్మరణానికి యత్నించింది. ఆమెను ప్రైవేటుఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వసతి గృహానికి రూ.2 లక్షల జరిమానా

శేరిలింగంపల్లి, మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల రెసిడెన్షియల్ హాస్టల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు రూ.2 లక్షల జరిమానా విధించారు. హాస్టల్‌లోని పలువురు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురైనట్లు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీనిపై పరిశీలించాలని చందానగర్ సర్కిల్ సహాయ వైద్యాధికారి కేపీస్ రవి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు పలువురికి ఆదేశాలు ఇచ్చారు. అధికారుల బృందం వెళ్లి పరిశీలించగా వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న విద్యార్థులను కొందరిని ప్రైవేటు ఆసుపత్రికి, మరికొందరిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హాస్టల్‌లోని క్యాంటీన్ తదితర ప్రదేశాలు తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించారు.

నమ్మించి రూ.2కోట్లు కాజేశాడు

ఈనాడు, హైదరాబాద్: ఖరీదైన ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నట్లు నమ్మించి రూ.కోట్లు కాజేసి మోసగించిన ఘటనపై శుక్రవారం నగర సీసీఎస్‌లో కేసు నమోదైంది. నగరానికి చెందిన వైద్యనిపుణుడికి సోదరి కుటుంబం ద్వారా శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్, బిల్డర్స్ నిర్వాహకుడు జి.శ్రీనివాస్ పరిచయమయ్యాడు. ఘటకేసర్‌లో తాము కొత్తగా నిర్మిస్తున్నట్లు చెప్పాడు. ఇది నిజమని భావించిన వైద్యుడు రూ.2.3కోట్లు చెల్లించాడు. రెండేళ్లు గడచినా నిర్మాణం చేపట్టలేదు. శ్రీనివాస్ పేరిట స్థలం లేదని గుర్తించారు. మోసపోయానని డబ్బు తిరిగి ఇవ్వమని కోరాడు. అతడిచ్చిన చెక్ బ్యాంకులో చెల్లకపోవటంతో బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్టు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: డ్రగ్స్‌తో పాటు గంజాయి విక్రయిస్తున్న ముఠాను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టుచేశారు. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. సికింద్రాబాద్ శివాజీనగర్‌కు చెందిన ఎడ్ల రాజు (25) అలియాస్ ప్రభ, చెన్నకేశవ వంశీ (22) అలియాస్ సాయి, అభిషేక్ కుమార్ సింగ్(24)లు ప్రైవేటు ఉద్యోగులు. వీరు నిత్యం జల్‌పల్లి 16వ వార్డులోని పీ7 రోడ్డుపై ఉన్న జేసీ దాబా వద్దకు చేరుకుని గంటన్నర పాటు ఉండి మాయమవుతారు. ఈ యువకులు కావాల్సిన వారికి డ్రగ్స్, గంజాయిని విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం వారిపై ఎస్సై తమ సిబ్బందితో కలిసి దృష్టిపెట్టారు. డ్రగ్స్ సేకరిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగరాన్ని సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంలో భాగంగా 90 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం ఈ కార్యక్రమంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీవరేజీపై వచ్చే ఫిర్యాదులను తగ్గించడంతోపాటు దీర్ఘకాలికంగా వస్తున్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. భవిష్యత్తులో నీటి ట్యాంకుల డిమాండ్ లేకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. సీవరేజీపై ఈఎన్‌సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక అధికారి సత్యనారాయణ ప్రదర్శన ఇచ్చారు. ఇందులో ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, విజయరావు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఎం హోం ప్రిన్సిపల్



ప్రిన్సిపల్ ప్రభుదాస్

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ హోం పాఠశాల (వీఎం హోం) ప్రిన్సిపల్ వి.ప్రభుదాస్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. వీఎం హోం వసతి గృహంలో ఫుడ్ కాంట్రాక్టు సంబంధించి సదరు గుత్తేదారు నుంచి రూ.29 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో శుక్రవారం రూ.29 వేలు నగదు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. అధికారులు పాఠశాలలో శుక్రవారం రికార్డులను పరిశీలించారు. పట్టుబడిన ప్రభుదాస్‌ను నాంపల్లి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు.

రాజధానిలో 5 కొత్త డంపింగ్ యార్డులు

ఈనాడు, హైదరాబాద్: నగరం నలువైపులా ఐదు కొత్త డంపింగ్ యార్డులు రాబోతున్నాయి. త్వరలోనే భూములను స్వాధీనం చేసుకుంటామని, భూ కేటాయింపు కోసం సర్కారుకు లేఖ రాయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు కమిషనర్ ఆమ్రపాలి వెల్లడించారు. ఐదింటిలో దుండిగల్ సమీపంలోని ప్యారానగర్‌లో భూ కేటాయింపు పూర్తయిందని తెలిపారు. అక్కడున్న 152 ఎకరాల్లో యూరోపియన్ సాంకేతికతను మరో నాలుగుచోట్ల భూకేటాయింపు జరగాల్సి ఉందని జీహెచ్ఎంసీ వెల్లడించింది.

జవహర్‌నగర్‌పై తగ్గనున్న ఒత్తిడి: గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ 7,500 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. శివారులోని 17 మున్సిపాలిటీలు నగర పాలక సంస్థలనుంచి మరో 1,500టన్నులు.. మొత్తం 9వేల టన్నుల వ్యర్థాలు రోజూ జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. ఆ చెత్తను సవ్యంగా నిర్వహించడంలో రాంకీ సంస్థ ఆపసోపాలు పడుతోంది.

రూ.50 లక్షల హవాలా సొమ్ము స్వాధీనం

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.50 లక్షల హవాలా సొమ్మును శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారి అమిత్ సిర్వాణి రూ.50 లక్షల భారీ మొత్తంతో బొగ్గులకుంట ఆదిత్య ఆసుపత్రి సమీపంలో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపకపోవడంతో.. నగదును స్వాధీనం చేసుకుని సుల్తాన్‌బజార్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

రూ.5.27 కోట్ల మోసం కేసులో నలుగురి రిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నగర వాసిని రూ.5.27 కోట్లు మోసగించిన కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వనస్థలిపురానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి కొత్తండ రమణ్ మురళీకృష్ణన్ (53), అల్మాస్‌గూడకు చెందిన వ్యాపారి కందుకూరి రవీందర్‌రెడ్డి (40), అత్తాపూర్‌కు చెందిన బండ్లమూడి రవి, జీడిమెట్లకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సామినేని మాధవరావు (40)ను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 11 చెక్‌బుక్కులు, 23 సిమ్‌కార్డులు, 10 ఏటీఎం కార్డులు, ఒక స్వైపింగ్ యంత్రం, 3 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు గత జులై 11న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయడంతో ఈ నలుగురి దందా బహిర్గతమైంది. బాధితుడిని ఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా ఆకర్షించిన ముఠా.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే పెద్దమొత్తంలో లాభాలొస్తాయని నమ్మించి మోసం చేసింది.

సందడి చేసిన నాగ చైతన్య



హైపర్‌వర్స్ రైడ్‌ను ప్రారంభిస్తున్న నాగ చైతన్య

ఆదిభట్ల, న్యూస్‌టుడే: సినీనటుడు నాగ చైతన్య రావిర్యాలలో సందడిచేశారు. దేశంలోని అతిపెద్ద అమ్యూజ్‌మెంట్ పార్కు చైన్లలో ఒకటైన వండర్‌లాలో ఏర్పాటుచేసిన రెండు రైడ్‌లు హైపర్‌వర్స్, జీపాల్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నాగ చైతన్య మాట్లాడారు. గ్లోబల్ పార్కులకు దీటుగా ప్రపంచ స్థాయి రైడ్‌లను వండర్ల తీసుకొచ్చిందన్నారు. సందర్శకులకు ఇవి మరుపురాని అనుభూతిని ఇస్తాయన్నారు. వండర్‌లా ఏండీ అరుణ్ కె.చిట్టిలపిల్లి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		
	ఫాంరేటు 125-00	డ్రెస్డ్ 213-00
	రిటైల్ 147-00	స్కిన్‌లెస్ 243-00

నృత్యంతో అలరించిన కృతిశెట్టి

పీర్జాదిగూడ (బోడుప్పల్), న్యూస్‌టుడే: వస్త్రదుకాణం ప్రారంభించడమే కాదు.. నృత్యంతో అభిమానులను సినీనటి కృతిశెట్టి అలరించింది. శుక్రవారం పీర్జాదిగూడలో కాంచీపురం మంగళ గౌరి వస్త్ర దుకాణాన్ని సినీ నటి కృతిశెట్టి ప్రారంభించారు. డైరెక్టర్ కృష్ణమూర్తి నేతృత్వంలో ఏర్పాటైన వస్త్ర దుకాణంలో దసరా, దీపావళి ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని కృతిశెట్టి పేర్కొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న కృతిశెట్టి

నార్సింగిలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

నార్సింగి న్యూస్‌టుడే: నార్సింగిలో కొత్తగా ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్‌ను సినీనటి సంయుక్త మేనన్ శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిత్యనూతన డిజైన్లు, అధునాతన కలెక్షన్లతో తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద షాపింగ్‌మాల్‌గా మాంగళ్య అవతరించిందన్నారు. డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమఃశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.


చీర పరిశీలిస్తున్న సంయుక్త మేనన్

పాఠాలు చెప్పని వేలిముద్ర ప్రొఫెసర్లు



కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో అట్టడుగున బోధనా ప్రమాణాలు

ఈనాడు, హైదరాబాద్: "కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు కనీస నైపుణ్యాలు ఉండటం లేదు. ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేస్తా'మంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడం సంచలనం సృష్టించింది.

ఎంటెక్ ఉంటే చాలు.. అఖిల భారత సాంకేతిక విద్యామండలి మార్గదర్శకాలను అనుసరించి ఆచార్యులను నియమిస్తున్నట్లు కళాశాలలు పేర్కొంటున్నా, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో పరిస్థితి వేరుగా ఉంది. చాలామంది ఆచార్యులు ఉదయం, సాయంత్రం 'వేలి' ముద్రలు (బయోమెట్రిక్) వేసి వెళ్తున్నారు. జేఎన్‌టీయూ పరిధిలోని 216 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలుంటే, 30 శాతం కళాశాలల్లో ఈ తరహా ప్రొఫెసర్లే ఉన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ పూర్తిచేసిన వారిని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించాలి. అందుకు విరుద్ధంగా బీటెక్ పూర్తిచేసిన వారితో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఎంటెక్ పూర్తి చేసిన వారితో ఎంటెక్ విద్యార్థులకే పాఠాలు చెప్పిస్తున్నారు.

- పంజాగుట్ట- ఖైరతాబాద్ మధ్యలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఎంటెక్ పూర్తిచేసిన వారికి నెలకు రూ.20 వేలు ఇస్తూ.. ఉదయం ఒకసారి, సాయంత్రం వేలి ముద్రలు వేయించుకుని పంపుతున్నారు.
- గండిపేటకు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, సివిల్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. ఆ విభాగాల్లో పీజీ చేసిన వారితో హాజరు వేయిస్తున్నారు.

తొలి సెమిస్టర్‌లోనే ధమాల్

జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో సరైన సంఖ్యలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో.. ఆ ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణతపై పడుతోంది. ఈ ఏడాది జనవరిలో తొలి సెమిస్టర్ రాసిన 17,063 విద్యార్థుల్లో 9,677 మంది ఫెయిల్ అయ్యారు. సుమారు 57 శాతం మంది పరీక్షలు తప్పడం జేఎన్‌టీయూ చరిత్రలో ఇదే తొలిసారి. ప్రమాణాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది లేకపోవడంతో.. పాఠాలు అర్థంకాక విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. పీహెచ్‌డీ లేకపోయినా, ఎంటెక్ విద్యార్హతతో కొన్ని కళాశాలలు ప్రిన్సిపాళ్లను నియమించుకుంటున్నాయి. తనిఖీలు నిర్వహిస్తే.. నకిలీల గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

సీపీఆర్‌ని పాఠ్యాంశంగా చేర్చాలి: గవర్నర్

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఆకస్మాత్తుగా గుండె పోటు వస్తే కాపాడే సీపీఆర్ శిక్షణ పొందితే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడగలిగే ధైర్యం వస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కార్డియాక్ అరెస్టు వీక్, ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిజియాలజిస్టు హయగ్రీవరావు ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ బొమ్మపై సీపీఆర్ సాధన చేశారు. కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డా.సంబిత్ సాహు, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.


సీపీఆర్ సాధన చేస్తున్న జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో బుర్రా వెంకటేశం

ధ్యానంతో మానసిక ప్రశాంతత

నందిగామ, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేశ్ డి పటేల్(దాజీ) అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలోని అతిపెద్ద ధ్యాన మందిరంలో ఆయన 69వ జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దలైలామా ప్రతినిధి, శ్రీలంక దేశానికి చెందిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య అదనపు సెక్రటరీ జనరల్ దమింద పోరగే విచ్చేశారు. బుద్ధుడు జ్ఞానోదయం పొందిన మహాబోధి చెట్టు మొక్కను బుద్ధగయ నుంచి తీసుకువచ్చి దాజీతో శాంతివనంలో నాటించారు.


మహాబోధి మొక్క నాటుతున్న దలైలామా ప్రతినిధులు, కమలేశ్ డి పటేల్

'లడ్డూ కల్తీ'పై కేంద్రం విచారణ చేపట్టాలి

జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదమైన లడ్డూ కల్తీ వ్యవహారంపై తక్షణం విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. శుక్రవారం నింబోలిఅడ్డలో నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నిమ్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, బూషణ్ భాస్కర్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ వ్యవహారానికి అప్పటి వైకాపా ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

విశ్వనగరం మెరిసేలా.. భూ నిర్వాసితులు మురిసేలా



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ (ఫోర్త్) సిటీలో పనులు వేగంగా సాగుతున్నాయి. భూ నిర్వాసితులకు టీజీఐఐసీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేట పరిధిలో 600 ఎకరాల లేఅవుట్ రూపొందించి రహదారులు నిర్మిస్తున్నారు. కందుకూరు, యాచారం మండలాల్లోని 13వేల ఎకరాల భూసేకరణకు సంబంధించి.. సుమారు 8వేల మంది నిర్వాసితులు ఉన్నారు. ఇప్పటికే వీరికి ప్లాట్ల పత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, కందుకూరు

ఉస్మాన్‌సాగర్ నీటి విడుదల

నార్సింగి, న్యూస్‌టుడే: ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయం నుంచి శుక్రవారం నాలుగు గేట్లు అడుగు మేర ఎత్తి 484 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులుగా పేర్కొన్నారు.

నగరంలో ఈనాడు

- కాచిగూడ భద్రుకా కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(బీసీసీఐటీ) ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి 'సమాజం - సైబర్ సెక్యూరిటీ పాత్ర'పై సదస్సు
- రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు 'అక్కినేని ఆణిముత్యాలు గ్రంథావిష్కరణ - అంకితోత్సవం'

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం: మంత్రి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన ప్రజాపాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 6వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యమకారులకు గుర్తింపుతో పాటు ఎలా సాయం చేయాలనేది చర్చించుకొని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్దామని సూచించారు. ఉద్యమకారులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఏడాదిలోగా అమలయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో విమలక్క, వెన్నెల గద్దర్, ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ చీమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యత్వం తీసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జన్యు సంబంధిత పరిశోధనల్లో పురోగతి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: జన్యు సంబంధిత చికిత్సా విధానాల్లో కొనసాగుతున్న పరిశోధన ప్రయత్నాల్లో పురోగతి సాధిస్తున్నామని గ్రో రీసెర్చ్ ల్యాబ్ డైరెక్టర్, నారాయణ నేత్రాలయ ఫౌండేషన్ సీనియర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా.ఆర్కా శుభ్రఘోష్ తెలిపారు. త్వరలో దేశీయంగానూ ఆధునిక జన్యు సంబంధిత సమస్యల చికిత్సా విధానం అందుబాటులోకి రానుందని వెల్లడించారు. అమీర్‌పేటలోని జెనిటిక్ ఇన్‌స్టిట్యూట్, జెనిటిక్ డిసీజెస్ ఆసుపత్రిలో 'ఇన్నోవేషన్ డయాగ్నసిస్, కేర్, మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ మస్క్యులర్ డిస్ట్రోఫిస్' అనే అంశంపై రెండ్రోజుల సదస్సును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. బీబీనగర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ డా.నీరజ్‌కుమార్, జెనిటిక్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డా.బి.విజయలక్ష్మి, వైద్య నిపుణులు సూర్యబాలకృష్ణ, బి.శ్రీనాథ్, టి.సునీత, పోషకాహార నిపుణులు ఎ.ఎన్.మల్లేశ్వరి, కొల్లిపర పార్వతి, భారత్ ఎండీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురళి, డైరెక్టర్ బి.వి.రామలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న డా.ఆర్కా శుభ్ర ఘోష్, చిత్రంలో నీరజ్‌కుమార్

బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్‌తో మోకాలి చికిత్స

గచ్చిబౌలి న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్‌ను ఉపయోగించి మోకాలి పాక్షిక రీసర్ఫేసింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు గచ్చిబౌలిలోని ఒమేగా హాస్పిటల్ ఆర్థోపెడిక్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య కపూర్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. "తొలిసారిగా బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్ ఉపయోగించి మోకాలి పాక్షిక రీసర్ఫేసింగ్‌ను విజయవంతంగా నిర్వహించాం. ఈ ఇంప్లాంట్ టైటానియం, నియోబియం, నైట్రైడ్‌తోపాటు యాంటీఆక్సిడెంట్ పాలిథిలిన్ కలిగి ఉండటం వల్ల శరీరం అలెర్జీకి గురి కాదు. 62 ఏళ్ల మహిళకు విజయవంతంగా ఈ శస్త్రచికిత్స చేశాం" అని ఆయన వివరించారు.

కిమ్స్ కడల్స్ మిసెస్ మామ్ పోటీలు రేపటి నుంచి

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సాధారణ ప్రసవాల ప్రాధాన్యంతో పాటు గర్భిణులకు సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ఏటా మిసెస్ మామ్ పోటీలు నిర్వహిస్తుంది. ఈసారి హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ.. ఇలా 8 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, గైనకాలజిస్టు డాక్టర్ కె.శిల్పిరెడ్డి తెలిపారు. శుక్రవారం మిసెస్ మామ్ పోటీల గోడ పత్రికను కొండాపూర్‌లోని ఆసుపత్రిలో ఆవిష్కరించారు. సెప్టెంబర్ 29న ఈ కార్యక్రమం ప్రారంభమై, డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే గ్రాండ్ ఫినాలెతో ముగుస్తుంది. డైరెక్టర్ డా.సుధీర్, సీవోవో సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డాక్టర్ శిల్పిరెడ్డి, డాక్టర్ సుధీర్ తదితరులు

ఎస్టీ కులాల యువతీ యువకులకు నేడు, రేపు ఉచిత రిజిస్ట్రేషన్లు



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎస్టీల్లోని బంజారా, కోయ, గోండు, ఎరుకల కులాలకు చెందిన యువతీయువకుల కోసం 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఈ నెల 28, 29 తేదీల్లో సోమాజిగూడలోని 'ఈనాడు కార్యాలయంలో జరగనుంది. వివాహాల కోసం ఎదురుచూస్తున్న వారంతా.. శనివారం, ఆదివారం రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా ప్రొఫైల్ రిజిస్టర్ చేయించుకోవచ్చు. పూర్తి వివరాలకు 91549 92572, 91543 40820 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

'ఎలీప్' అధ్యక్షురాలిగా కన్నెగంటి రమాదేవి



నిజాంపేట, న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూనర్స్ ఆఫ్ ఇండియా(ఎలీప్) నూతన అధ్యక్షురాలిగా కన్నెగంటి రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా పారిశ్రామికవేత్తల పేరుతో 1993 డిసెంబరు 18న ఎలీప్ ఆవిర్భవించింది. ప్రగతి నగర్‌లోని ఎలీప్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నూతన అధ్యక్షురాలితోపాటు కమిటీ సభ్యులుగా పి.జ్యోతిరావు, కె.పద్మజా ప్రభాకర్, ఎ.దుర్గాభవానీ, ఎన్.స్వరూపారాణి, టి.పల్లవి జోష్ ఎన్నికయ్యారు.


జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో.. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలి: మంత్రి

మాదాపూర్, న్యూస్‌టుడే: జీవితమున్నది ఒక్కటే.. దాన్ని సాకారం చేసుకోవాలి.. నిత్యం కుటుంబం, సంపాదనలో మునిగిపోకుండా కనీసం నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలను చూసి ప్రశాంతంగా గడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పర్యాటక ప్రదేశాల సందర్శనతో మనసుకు ఆనందం, ఆహ్లాదంతోపాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితమ్)లో ప్రపంచ పర్యాటక దినోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసిన పలువురు కలెక్టర్లకు అవార్డులు అందజేశారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్ పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న జూపల్లి కృష్ణారావు. చిత్రంలో పటేల్ రమేష్‌రెడ్డి, వాణీప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, నిఖత్ జరీన్, ఈషా సింగ్, పక్కన సాంస్కృతిక ప్రదర్శనలు

లులూ మాల్ వార్షికోత్సవం


కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న మాల్ ప్రతినిధులు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రోడ్డులోని లులూ మాల్ యాజమాన్యం శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించింది. మాల్ ప్రతినిధులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. మాల్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంగా మాల్ వినియోగదారులకు షాపింగ్ అనుభూతిని అందించి గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఉత్తమమైన నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందిస్తూ సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 31 వరకు ప్రత్యేక ఆఫర్ ద్వారా గంట గంటకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రచనల్లో అడవి బాపిరాజు సిద్ధహస్తుడు


నివాళులర్పిస్తున్న మాణిక్, శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనమూర్తి, సుబ్బారావు, వంశీ రామరాజు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అడవి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో రచయిత, కళాకారుడు 'అడవి బాపిరాజు యాదిలో..' శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించగా.. వంశీ రామరాజు, మాణిక్, పొత్తూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలు కోటీశ్వరులయ్యేందుకు ప్రోత్సాహం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మహిళలు కోటీశ్వరులు అయ్యేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన సరస్ ఫెయిర్ 2024ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలకు రూ.లక్ష కోట్లు ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ అనిల్ యాదవ్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి లోకేష్‌కుమార్ పాల్గొన్నారు. హిజ్రా ప్రేమ్‌లీల బృందం తయారు చేసిన బ్యాగు స్టాల్‌ను మంత్రి పరిశీలించి అభినందించారు.


చీరలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

వసుంధర

vasundhara@eenadu.in





వీళ్లు... షీరోలు!

ఎవరైనా లాభం కోసమే వ్యాపారం చేస్తారు. కొందరు మాత్రమే సేవతో కూడుకున్న వ్యాపారాన్ని ఎంచుకుంటారు. రెండో కోవకే చెందుతారు చెన్నైకి చెందిన జయశ్రీ తిలక్. 'షీరో హోమ్ ఫుడ్' సంస్థ ప్రారంభించి పేద, మధ్య తరగతి మహిళలకు ఇంట్లోనే వంట చేస్తూ సంపాదించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఉబర్- మోడల్‌ను ఇండియన్ హోమ్ ఫుడ్ ఇండస్ట్రీలోకి తీసుకొచ్చిన మొదటి సంస్థగానూ పేరొందారు. ఆ వివరాలు మనతో పంచుకున్నారిలా...


నేటికాలంలో భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలకు వెళ్తుండడంతో వంటకు ఎక్కువ సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. అలా అని తరచూ బయట తినలేని పరిస్థితి. బదులుగా ఇంట్లో తయారుచేసిన ఆహారాన్నే మనం అందిస్తే బావుంటుంది అనుకున్నా. పైగా కొవిడ్ సమయంలో ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యత పెరిగింది. దాంతో నా భర్త తిలక్‌తో కలిసి 2020లో చెన్నైలో 'షీరో హోమ్ ఫుడ్' ప్రారంభించాను.

150కిపైగా రకాలతో...

మొదట యాభైమంది మహిళలతో సంస్థను ప్రారంభించా. కుటుంబ పరిస్థితులు, చదువు లేకపోవడం... ఇలా రకరకాల కారణాలతో బయటకు వెళ్లి పనిచేయలేనివారు చాలామందే ఉంటారు. అలాంటివాళ్లకి ఉత్తర, దక్షిణాది రుచులతో కలిపి 150కిపైగా రకాల్లో శిక్షణ ఇస్తున్నాం. పైగా ఎలాంటి పెట్టుబడి అవసరం లేదు. బాగా వండడం తెలిస్తే చాలు. ఒకరకంగా చెప్పాలంటే... ఆసక్తే ఈ వ్యాపారానికి పెట్టుబడి. వారికి స్విగ్గీ, జొమాటో, వంటి ఫుడ్ సంస్థలతో భాగస్వామ్యాన్ని కల్పించి ఆదాయం అందేలా చూస్తున్నాం. సులభంగా, వేగంగా వండేలా సూచనలు చేయడం, స్మార్ట్‌ఫోన్ వినియోగించడం, ఆర్డర్ తీసుకోవడం, డెలివరీ ఏర్పాట్లు తదితరవాటికి సంబంధించి శిక్షణ ఇస్తున్నాం. రుచిగా, శుచిగా వండడం, ఆహారం వృథా కాకుండా ఎలా చేయాలో నేర్పిస్తున్నాం. ఆర్డర్ రాగానే వండడం ప్రారంభించి 25 నిమిషాల్లో ఫుడ్ చేతికందేలా చూస్తాం. ఆ సమయంలో వారికి సాయపడే విధంగా తరిగిన కూరగాయలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వంటివీ అందిస్తాం. ఆ ఆహారాన్ని డెలివరీ బాయ్స్ ద్వారా వినియోగదారులకు అందేలా చేస్తాం. ఇలా మహిళా భాగస్వాములు వారానికి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదించుకుంటున్నారు. మాతో పనిచేస్తున్న మహిళల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. 'షీరో'లో చేరిన చాలామంది మహిళలు తమ స్వయంశక్తితో పిల్లల్ని చదివించుకోగలుగుతున్నారు. భర్తకు చేదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం చెన్నై, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో మా బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తంగా 2 వేలమందికి పైగా మహిళలు ఈ షీరో సంస్థ భాగస్వాములుగా ఉన్నారు. భవిష్యత్తులో పది లక్షలమంది మహిళలకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో కొనసాగుతున్నా. వంటల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన మహిళలకు ఏటా 'షీరో అవార్డ్స్' ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సంస్థను విజయవంతంగా నడిపించడంలో రెస్టరంట్, క్యాటరింగ్ వ్యాపారంలో నాకున్న 15 ఏళ్ల అనుభవమూ ఉపయోగపడింది. అన్నట్లూ మా సంస్థకు 'షీరో' అన్న పేరు ఎందుకు పెట్టామో తెలుసా? మా దృష్టిలో మహిళలే అసలైన హీరోలు కాబట్టి.

– ఆళ్ల లక్ష్మిహరికృష్ణ, చెన్నై

వంటగదికీ కొన్ని మొక్కలు!



ఇంటి లోపల మొక్కలు పెంచడం ఇప్పుడు కొత్త విషయమేమీ కాదు. మరి వంటగది సంగతేంటి? అక్కడా పెంచుతున్నారా? ఓ... కొత్తిమీర, టొమాటో, పచ్చిమిర్చి అంటూ జాబితా తీయకండి. వంటలో సాయ పడతాయి సరే! ఆరోగ్యం మాటేంటి? అందుకే వీటికీ చోటివ్వండి.

కమ్మనైన పోపు వాసన... నోరూరించే వంటకాల ఘుమఘుమలే కాదు... పొగ, కాగిన నూనెల నుంచి విడుదలయ్యే కొన్ని వాయువులు మన ఆరోగ్యానికి చేటు చేస్తాయి. అందుకే వంటగదిలో మొక్కలకు చోటివ్వమంటోంది నాసా పరిశోధన. ఆ జాబితాలో ముందుంది 'పామ్' మొక్క. ఇది గాలిని శుభ్రపరచడమే కాదు హ్యూమిడిఫైయర్‌గానూ పనిచేస్తుంది. పోనీ ఓ చిన్న కలబంద మొక్కను పెంచండి. అందమైన కుండీలో పెడితే చూడటానికీ అందంగా ఉంటుంది. నీటి అవసరమూ తక్కువే. దీనిలోని సాపోనిన్స్, ఆక్సిన్స్, గిబ్బరెలిన్స్ వంటి రసాయనాలు, ఎంజైమ్‌లు గాలిని శుభ్రపరుస్తాయి. అంతేనా... పొరపాటున చేయి వగైరా కోసుకున్నా దీని జెల్ మందులా పనిచేస్తుంది.

ఇంటికి శుభప్రదం అని మనీ ప్లాంట్‌నీ, వెదురు మొక్కనీ పెంచుతుంటాం కదా! వాటిని వంటగదికి చేర్చినా మంచిదే. పెద్దగా పట్టించుకోవాల్సిన పని ఉండదు, ఆరోగ్యానికి ఆరోగ్యం. కాగిన నూనెలో అలా కాయగూరలు వేయగానే కమ్మని వాసనైతే వస్తుంది కానీ... ఈక్రమంలో బోలెడు రసాయనిక చర్యలూ జరుగుతాయి. వాటి నుంచి దీర్ఘకాలంలో హాని కలగొద్దంటే 'స్నేక్, 'పుదీనా' మొక్కలకు చోటివ్వండి. మామూలుగా వంటగదిలో ఆడుతూ పాడుతూ పనిచేయడం కంటే... ఎక్కడ మాడుతుందో, సమయానికి వంట పూర్తవుతుందో లేదో అంటూ కంగారుపడుతూ పనిచేస్తుంటారు కదా! అందుకే, వీటికి చోటిస్తే... కిచెన్‌కి అదనపు అందాన్ని ఇవ్వడంతోపాటూ మనసునీ ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి.



మీకు తెలుసా?

పూలు, వాటి పరిమళాల్ని ఇష్టపడే మహిళల సంఖ్య ఎక్కువే. అయితే, ఈ పూల పరిమళాలను ఎక్కువగా ఇష్టపడేవారు, మిగతావారితో పోలిస్తే మూడురెట్లు సంతోషంగా ఉంటున్నారట.

ఒత్తిడిని ఓడిద్దామిలా!



డెడ్‌లైన్ ముంచుకొస్తోంది... ప్రాజెక్ట్ పూర్తవ్వలేదు. అమ్మకి బాగోలేదు... దగ్గరుండి చూసుకోలేని పరిస్థితి. పాపతో సమయం గడపలేకపోతున్నా. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సేల్స్‌గర్ల్... అన్న తేడా లేకుండా ఏ ఉద్యోగినిని కదిపినా... ఇలా ఏదో ఒక సమస్య. ఫలితం... తీవ్రమైన ఒత్తిడి. దాన్ని అలాగే వదిలేస్తే... బీపీ, గుండెజబ్బు, డిప్రెషన్... ఇలా శారీరక, మానసిక అనారోగ్య సమస్యలెన్నో చుట్టుముడతాయి. కొన్నిసార్లు మరణానికీ దారితీయొచ్చు. ఈ ఒత్తిడి మహిళల్లోనే ఎక్కువెందుకు? ఎలా అధిగమించాలి?

రమ్యకి వర్క్ ఫ్రమ్ హోమ్. ఉదయం ఎనిమిదికే లాగిన్ అవ్వాలి. అత్తగారికది అర్థం కాదు. 'ఇంటిపనీ వంటపనీ ఎవరు చేస్తారు...' అంటూ ఒకటే సణుగుడు. 'అమ్మాయిలే పనులన్నీ చేయాలి. అందరూ చేయట్లేదా...' భర్త గొణుగుడు. నిండా పాతికేళ్లులేని ఆ అమ్మాయి సంస్థ ఇచ్చిన టాస్క్‌లే పూర్తిచేస్తుందా... ఇంటిపనే చేస్తుందా... పోనీ ఎలాగో చేస్తే... బాగోలేదంటూ వంకలు. ఇది రమ్య సమస్య మాత్రమే కాదు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఇంటిపనీ పిల్లలపనీ కుటుంబ సభ్యుల బాగోగులూ బంధువుల మర్యాదలు... అన్నీ ఆడవాళ్ల బాధ్యతే.

దివ్య మంచి అమ్మాయి. ఆఫీసులో చకచకా పనిచేస్తుంది. దాంతో బాస్ ఆమెకే ఎక్కువ టాస్క్‌లు ఇస్తారు. క్రమంగా అది ఆమెకు భారంగా మారింది. రోజూ ఆలస్యమవడంతో ఇంట్లోవాళ్ల నుంచి కంప్లెయింట్స్. ఇవన్నీ ఆమెను తీవ్ర ఒత్తిడికీ వేదనకీ గురిచేస్తున్నాయి. అలాగని ఉద్యోగం మానేయలేరు. తమని తాము నిరూపించుకునేందుకు ఇష్టపడి ఎంచుకున్న కెరియర్ ఒకటైతే, చాలా సందర్భాల్లో ఇద్దరి సంపాదనా కీలకం కావడం మరో కారణం.

ఇవేకాదు, అనారోగ్యం, వివక్ష, జన్యువులు, భావోద్వేగాల్ని అణచుకోవడం... ఇలా ఎన్నో అంశాలు మహిళల్లో ఒత్తిడికి కారణాలు. దీర్ఘకాలంలో అది కాస్తా బీపీ, త్వరగా మెనోపాజ్ రావడం, అలర్జీలు, గుండెపోటు, డిప్రెషన్‌లకి దారితీస్తుంది. డెలాయిట్ చేసిన అధ్యయనంలో- మిగిలిన దేశాలతో పోలిస్తే భారతీయ ఉద్యోగినులు 53శాతం ఒత్తిడికి గురవుతున్నట్లు తేలింది. అలాగని ఒత్తిడి మంచిది కాదనీ చెప్పలేం. అది అస్సలు లేకపోతే ఏ పనీ సకాలంలో పూర్తవదు. దీన్నే గుడ్ స్ట్రెస్ అంటారు. ఇది కూరల్లో వేసే మసాలా లాంటిది. మోతాదులో ఉన్నప్పుడే కూరకి రుచిని పెంచుతుంది. అలాగే గుడ్ స్ట్రెస్ శక్తిసామర్థ్యాల్ని వెలికితీస్తుంది. అదే మరీ ఎక్కువైతే... డిస్ట్రెస్‌గా మారుతుంది. దీన్నుంచే అనారోగ్య సమస్యలన్నీ. అలా కాకుండా ఉండాలంటే ఇలా చేసి చూడండి.

సమన్వయం: కెరియర్, వ్యక్తిగత జీవితం... రెండిటికీ మధ్య ఉన్న సన్నని గీత చెరగనివ్వొద్దు. నిర్దిష్ట వేళల్లోనే పని పూర్తిచేయాలి. మిగిలిన సమయాన్ని కుటుంబానికి ఇవ్వాలి. అందులోనే మీకోసం గంటైనా కేటాయించుకోండి. సంగీతం, బుక్స్, ఆటలు... ఇలా ఏదోకటి హాబీగా చేసుకుంటే ఒత్తిడి మాయం.

ప్రాణాయామం: కొండంత పని ఉందని అందులోనే మునిగిపోకుండా... మధ్యమధ్యలో దీర్ఘశ్వాస తీసుకోండి. దీనివల్ల పారా సింపథెటిక్ నాడీవ్యవస్థ చురుగ్గా మారుతుంది. ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను తగ్గించి మనసుని ప్రశాంతంగా ఉంచుతుంది. ఉదయాన్నే పది నిమిషాలు ప్రాణాయామం చేసినా మంచిదే. కుర్చీకే అతుక్కోకుండా గంటకోసారి రెండు నిమిషాలైనా లేవాలి.

ఆనందం: నిత్యం సంతోషంగా ఉండేవాళ్లని ఒత్తిడి ఏమీ చేయదు. అలా ఉండేందుకు ఎన్నో మార్గాలు... పెంపుడు జంతువులు ఒంటరితనాన్ని పోగొట్టి, ఆనందాన్ని పెంచే లవ్ హార్మోన్-ఆక్సీటోసిన్‌ను విడుదల చేస్తాయి. యోగా, నడక, ధ్యానం, ఏరోబిక్స్ వల్ల కూడా ఎండార్ఫిన్లు విడుదలై సంతోషాన్ని కలిగిస్తాయి. ఇష్టమైనవాళ్లని ఓ నిమిషం కౌగిలించుకుంటే రోజంతా ఆనందంగా ఉంటారు.

పర్యటన: ఒంటరిగా ఉన్నట్లయితే మనసుకి నచ్చిన వాళ్లతో సమయం గడిపేందుకు ప్రయత్నించండి. లేదూ ఏదైనా టూర్‌కి వెళ్లండి.

రంగులు: బెడ్‌రూమ్‌లో పేస్టల్ కలర్స్ ఉండేలా చూసుకోండి. అవి కంటికి ఆహ్లాదాన్నీ మనసుకి ఆనందాన్నీ కలిగిస్తాయి.

నిద్ర: ఏడెనిమిది గంటల నిద్ర ఎంతో అవసరం. గాఢనిద్రలో శరీరం, మనసూ రిలాక్సవుతాయి. రోజూ ఎనిమిది గంటలు నిద్రించేవాళ్లలో ఒత్తిడి శాతం చాలా తక్కువని పరిశోధనల్లో తేలింది. అందుకే పడుకునే ముందు టీవీ, మొబైల్ చూడకండి. మంచి పరిమళం కూడా ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఆహారం: పండ్లూ కూరగాయలూ ముడిధాన్యాలూ చిరుధాన్యాలూ, లీన్ ప్రొటీన్‌తో కూడిన సమతులాహారం తీసుకోండి. విటమిన్లూ ఖనిజాల లోపం కూడా ఒత్తిడికి కారణమే.

సానుకూల దృక్పథం: మీ జీవితంపట్లా మీకు లభించిన వాటిపట్లా కృతజ్ఞతా భావనతో ఉండండి. ఎవరికీ చెప్పుకోలేని మీ భావోద్వేగాలకు డైరీలో చోటివ్వండి. ఒత్తిడి చాలావరకూ తగ్గుతుంది.

అరోమాథెరపీ: మంచి పరిమళంతో కూడిన డిఫ్యూజర్ వల్ల గుండెవేగం, కండరాల్లో ఒత్తిడి తగ్గుతాయి. దాంతో మనసూ శరీరం రెండూ సేదతీరతాయి.

ఇవన్నీ చేస్తున్నా మీలో ఒత్తిడి తగ్గకపోతే... కారణాన్ని వెతకండి. ఈరోజు ఒత్తిడిని కలిగించేది ఏడాది తరవాత కూడా అలాగే ఉంటుందా అని ఆలోచించండి. అప్పటికీ తగ్గలేదా... అయితే కెరియర్ ఎంత ముఖ్యమైనా జీవితంకన్నా కాదన్నది గుర్తుంచుకోండి. ఎంత చేయగలరో అంతే చేయండి. అప్పుడిక ఏ ఒత్తిడీ మిమ్మల్ని దరిచేరదు.

నో చెప్పడం తెలియాలి!

సమస్యల్ని పరిష్కరించుకునే పరిణతి ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అయితే, ప్రతికూల పరిస్థితుల్లో వచ్చే ఒత్తిడిని నియంత్రించే శక్తిని రెజీలియన్స్ అంటారు. ఇది కొందరిలో మాత్రమే ఉంటుంది. ఉద్వేగాలు ఎక్కువగా ఉండటం, రెండు మూడు బాధ్యతల్ని ఒకేసారి నిర్వర్తించడం, కాదని చెప్పలేని అసహాయత, చేసే పనికి తగ్గ శక్తి సామర్థ్యాలు లేకపోవడం వంటివాటివల్ల ఇతరులను మెప్పించడానికో, ఒప్పించడానికో ఒత్తిడికి గురవుతుంటారు. దీనికితోడు ఆఫీసులో టార్గెట్లు రీచ్ అవ్వడం, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, ఉద్యోగం పోతుందన్న భయం... వంటివాటితో తలకు మించిన భారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అమ్మాయిలకు ముందుగా కావాల్సింది ధైర్యం. అదనపు పనికి సున్నితంగా 'నో' చెప్పడం తెలియాలి. విరామం తీసుకుని కాసేపు సహోద్యోగులతో మాట్లాడటం, పై అధికారులతో చెప్పి సమయం తీసుకోవడం, పనిని షేర్ చేసుకోవడం, కొన్ని రోజులు సెలవు తీసుకోవడం వంటి వాటివల్ల కొంతవరకూ ఒత్తిడిని అదుపు చేసుకోవచ్చు. వీటివల్ల ఉపయోగం లేదనుకున్నప్పుడు ఉద్యోగాన్ని వదులుకోవడానికీ వెనకాడొద్దు. ఇంట్లోనూ భార్యాభర్తలు పనుల్ని విభజించుకోవడం, పెద్దల్ని చూసుకోవడానికీ, వంట చేయడానికీ... సహాయకుల్ని నియమించుకోవడం వల్ల కూడా స్ట్రెస్, ఆందోళనల్ని అధిగమించొచ్చు. లేదంటే... సైకియాట్రిస్టులను కలవండి. వారు మందులు సూచిస్తారు. ఒత్తిడిని నియంత్రించుకునే టెక్నిక్‌లు చెబుతారు.



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

కొవ్వును కరిగించే ఉత్కటాసన!

పాదాలను సమానంగా ఉంచి, రెండు పాదాల మధ్య సుమారు అడుగు దూరం ఉండేలా నిటారుగా నిల్చోండి. అరచేతులు కిందికి చూసేలా చేతులను ముందుకు చాపండి. ఇప్పుడు నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నట్లుగా మోకాళ్లను వంచి కటి భాగాన్ని మెల్లగా కిందకి తీసుకెళ్లండి. ఈ స్థితిలో సౌకర్యవంతంగా ఉండడానికి ప్రయత్నించండి. వెన్నెముకను నిటారుగా ఉంచండి. అలాగే మోకాళ్లు కాలివేళ్లను దాటి వెళ్లకుండా గమనించుకోండి. ఆ స్థితిలో 15 సెకన్లు ఉండేందుకు ప్రయత్నించి.. ఆపై నెమ్మదిగా నిల్చొని విశ్రాంతి తీసుకోండి. ఇలా ఒక విడతలో 2-3 పర్యాయాలు చేయొచ్చు. మధ్యమధ్యలో కాస్త విశ్రాంతి నిస్తూ అలా 5-6 సార్లు చేయొచ్చు.



ఉత్కటాసన.. తుంటి, తొడల భాగంలో ఉండే అధిక కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది. బరువు తగ్గడానికి పనిచేస్తుంది. కండరాలను దృఢపరుస్తుంది. మంచి ఫలితం కోసం ఈ ఆసనం వేస్తూనే పీచు పదార్థాలున్న ఆహారం తీసుకోవాలి. బేకరీ ఉత్పత్తులు, మసాలాలూ, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. నీరు అధికంగా తీసుకోవాలి. తీగకు కాసే కూరగాయలతోపాటు పండ్లు, తేలికగా జీర్ణమయ్యే పదార్థాలను తీసుకోవాలి. తుంటి, మోకాళ్లు, వెన్ను సర్జరీ అయినవారు ఈ ఆసనం ప్రయత్నించకూడదు. మోకాళ్ల నొప్పులు తీవ్రంగా ఉన్నా చేయొద్దు.

- శిరీష, యోగా గురు

స్క్రీన్‌కు సమయమెంత!

కమలి రెండేళ్ల కూతురు ఫోన్ చేతికివ్వనిదే ముద్ద మింగదు. ఏడాది కూడా నిండని రోహిణి కూతురు ఫోన్‌లో పాటలు పెడితేనే తింటుంది. ఇంట్లోనే కాదు, బయట కూడా చిన్నారులందరికీ చేతిలో ఫోన్ ఉంటేనే చెప్పినట్లు వింటున్నారు. ఇలా తల్లిదండ్రులు నెలల వయసు నుంచే పిల్లలకు స్క్రీన్ అలవాటు చేయడం మంచిది కాదని, ఆ సమయాన్ని పరిమితం చేయాలంటున్నారు నిపుణులు.

విదేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచే టాబ్లెట్స్, స్మార్ట్ ఫోన్స్ ద్వారా పాఠాలు చెబుతారు. దీంతో క్రమేపీ ఎడ్యుకేషనల్ అప్లికేషన్స్‌తోపాటు పిల్లలు డిజిటల్ గేమ్స్‌లోనూ ఆసక్తి పెంచుకోవడంతో స్క్రీన్ సమయం పెరిగింది. ఇది వారి బాల్యంపై చెడు ప్రభావం చూపుతున్నట్లు ఓ అధ్యయనం ద్వారా తెలిసింది. ఈమేరకు చేసిన పరిశోధనలో బ్రెజిల్‌కు చెందిన 70శాతంమంది చిన్నారులు మొబైల్స్ పరిమితి లేకుండా వినియోగిస్తున్నట్లు తేలింది. దీనివల్ల అభిజ్ఞానైపుణ్యాలు అభివృద్ధి చెంది విద్యా ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ, మితిమీరిన ఫోన్ వినియోగంవల్ల భావోద్వేగాల నిర్వహణలో ఇబ్బందులెదుర్కొన్నట్లు గుర్తించారు. పలు శారీరక, మానసిక అనారోగ్యాలూ బయటపడ్డాయి. దీంతో బాల్యం నుంచి ఏ పిల్లలైనా కూడా ఎంత సమయం ఫోన్ వినియోగించొచ్చని నిపుణులు చెబుతుండగా, ప్రపంచ ఆరోగ్యసంస్థ కూడా చిన్నారుల స్క్రీన్ సమయాన్ని నియంత్రించమంటోంది.



నియంత్రణతో...

రెండేళ్లలోపు చిన్నారుల చేతికి ఫోన్ అందించకూడదు. రెండు నుంచి అయిదేళ్ల వయసువారు రోజుకి ఓ గంటసేపు ఫోన్ చూడొచ్చు. అది కూడా ఒకేసారి కాకుండా రోజులో ఎప్పుడైనా కాసేపు పరిమితిగానే చూడాలి. ఇక ఆరు నుంచి 12 ఏళ్ల పిల్లలకు రోజులో మూడు గంటలకన్నా ఎక్కువ సమయాన్ని కేటాయించకూడదు. ఫోన్ వినియోగాన్ని తగ్గించకపోతే పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అలసట, తలనొప్పి, నిద్రలేమి వంటి శారీరక సమస్యలతోపాటు మానసికారోగ్యం కూడా దెబ్బతింటుంది. ఒత్తిడి, ఆందోళనతోపాటు ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. సామాజిక నైపుణ్యాల అభివృద్ధి, కలుపుగోలుతనం వంటివి లోపిస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పిల్లలను క్రీడల్లో ప్రవేశించేలా చేయాలి. పుస్తకపఠనం, తోట పెంపకం వంటివాటిని ప్రోత్సహించాలి. ఇవన్నీ వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడతాయి.

బంగారం-వెండి



27న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	77,450	77,020	75,800	75,480	77,400	76,900	77,800	78,000	77,180	76,740
ఆర్నమెంట్	71,000	70,600	71,000	70,060	71,670	71,900	71,430	71,760	71,000	70,600
వెండి (కిలో)	102,000	101,000	94,000	93,900	91,000	90,600	92,800	94,100	93,000	91,000

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,100	7,060
వెండి (గ్రా)	102.00	101.00

చూడ 'చెక్కని' ప్రతిభ



సామాజిక మాధ్యమాల్ని వినోదాలకూ, కాలక్షేపానికీ వినియోగిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటోంది యువత. ఈ అమ్మాయి మాత్రం తన ప్రతిభను చూపేందుకు ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా చేసుకుంది. తనలోని సృజనాత్మకతకు పదును పెడుతూ నైపుణ్యాల్ని పెంపొందించుకుంటోంది. ఇటీవల 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ చోటు సంపాదించుకుంది.

శ్రీకాకుళం నగరానికి చెందిన బోటు వర్షప్రియ చిన్నతనం నుంచి కళాకృతులు రూపొందించడంలో ప్రత్యేక ఆసక్తి కనబరిచేది. ఎక్కువగా పెయింటింగ్స్ వేయడం, పేపర్లతో ఆకర్షణీయమైన డిజైన్లను తయారు చేసేది. సుద్దముక్కలు, పెన్సిల్‌పై పేర్లు, బొమ్మలు చెక్కేది. ఇంటర్ పూర్తయ్యాక డిజైనింగ్ కోర్సులో చేరాలనుకుంది. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా అది సాధ్యపడలేదు. అయితేనేం వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. మరోవైపు తన కళా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇంట్లో అమర్చుకునే ఆకృతులను తయారు చేస్తోంది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు కోసం గతంలో నాలుగు సార్లు ప్రయత్నించి విఫలమైంది. ఆ తర్వాత నుంచి తాను తయారు చేసే ప్రతి వస్తువునూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. వాటిని అక్కడ విక్రయిస్తోంది కూడా. తన పరీక్ష ఫీజులు, పుస్తకాల ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించుకుంటోంది. అలా ఇన్‌స్టా ద్వారానే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేసుకుని సఫలమైంది. కేవలం 17 నిమిషాల 15 సెకన్లలో పెన్సిల్‌పై ఆంగ్ల అక్షరాలను చెక్కి ఈ ఘనత సాధించింది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానమే లక్ష్యమంటోంది. అమ్మాయిల ఇష్టాలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఎవరైనా లక్ష్యాన్ని సాధించడానికి వీలుంటుందని చెబుతోంది వర్షప్రియ.



– ఆర్.ఎస్.హేమంత్‌కుమార్, శ్రీకాకుళం

బౌ... భలేగుంది కదూ!



ఫ్యాషన్ డిజైనర్లు రోజుకో రకం సృష్టించేస్తుంటారు. వేదికల మీదా ప్రదర్శిస్తుంటారు. కానీ, కొన్ని మాత్రమే కలకాలం నిలిచిపోతాయి. కొత్తందాలను అద్దుకుని ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చేస్తుంటాయి. అలాంటివాటిల్లో బౌ డిజైన్ కూడా ఒకటి. 17వ శతాబ్దంలో ఐరోపాలోని మగవారు మాత్రమే ఈ బౌ గుర్తుని చెప్పులపై ఫ్యాషన్‌గా ఎంచుకునేవారట. దీన్ని హుందాతనానికి సింబాలిక్‌గా భావించేవారు. అయితే, కాలక్రమంలో మాత్రం ఇది స్త్రీత్వానికి గుర్తుగా మారిపోయింది. ముఖ్యంగా కార్టూన్ షోల్లో లింగ వైవిధ్యాన్ని చూపించేందుకు ఈ బౌని వాడటం ఆరంభించారు. అలా అప్పట్నుంచి హెయిర్ బ్యాండ్‌లు, దుస్తులు, నగలపైనా బౌ చేరిపోయింది. తాజాగా బౌ డిజైన్ బ్యాగులూ ఆదరణ పొందుతున్నాయి. అరచేతిలో ఇమిడే క్లచ్ నుంచి కాలేజీ అమ్మాయిలు వేసుకునే స్లింగ్ వరకూ అన్నింటా కనిపిస్తోంది. అలాంటివే ఈ డిజైన్లు కూడా... వాటినోసారి మీరూ చూసేయండి.





హైదరాబాద్ అంతర్జాతీయ వైద్యసేవల గమ్యస్థానం

తెలంగాణ రెసిడెంట్ కమిషనర్



బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ శెల్లీ సలెహిన్‌కు జ్ఞాపికను అందిస్తున్న గౌరవ్ ఉప్పల్

ఈనాడు, దిల్లీ: బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ శెల్లీ సలెహిన్ శుక్రవారం దిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్ నగరంలోని వివిధ ఆసుపత్రులు అందిస్తున్న అత్యుత్తమ వైద్యసేవలను తమ దేశ పౌరులు ఉపయోగించుకొనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ తెలంగాణలో అమలుచేస్తున్న హెల్త్ టూరిజం గురించి బంగ్లా డిప్యూటీ హైకమిషనర్‌కు వివరించారు. అత్యుత్తమ వైద్యసేవలు అందించడంలో హైదరాబాద్ అంతర్జాతీయ వైద్యసేవల గమ్యస్థానంగా మారిపోయినట్లు తెలిపారు. అనంతరం వారిద్దరూ తెలంగాణ, బంగ్లాదేశ్ మధ్య హెల్త్ టూరిజం, పర్యాటక రంగంలో సహకరించేందుకున్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను సలెహిన్ ప్రశంసించినట్లు రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం పేర్కొంది.

నేడు, రేపు కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు

ఈఎస్ఐసీ సనత్‌నగర్ ఆధ్వర్యంలో టచింగ్ మిలియన్ లైవ్స్

ఈనాడు, హైదరాబాద్: ఈఎస్ఐ బీమావైద్య సేవల పరిధిలోకి వచ్చే కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం ఈ నెల 28, 29 తేదీల్లో 'టచింగ్ మిలియన్ లైవ్స్' పేరిట 'గుండె, మూత్రపిండాల ఆరోగ్యపరీక్షను సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఉచితంగా నిర్వహిస్తోంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో బ్లడ్‌ప్రెషర్, కొలెస్ట్రాల్, బ్లడ్‌షుగర్, కిడ్నీ పరీక్షలు, ఈసీజీ, ఈకేజీ, 2డీ ఎకో ఇతర అత్యవసర పరీక్షలు ఉంటాయని, సూపర్‌స్పెషాలిటీ వైద్యులతో సంప్రదింపులు కల్పిస్తామని వెల్లడించింది. పరీక్షల అపాయింట్‌మెంట్ కోసం 7013219199 నంబరుకు హాయ్ అని సందేశం పంపించాలని కోరింది.

30 నుంచి ఐసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ సీట్ల భర్తీకి ఈ నెల 30 నుంచి ఐసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 30న ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్, అక్టోబరు 1న ధ్రువపత్రాల పరిశీలన, 1, 2 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. అక్టోబరు 4వ తేదీలోపు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. స్పాట్ ప్రవేశాల మార్గదర్శకాలను 6న వెబ్‌సైట్లో ఉంచుతామని తెలిపారు.

అక్కడ పోస్టింగులకు రాయ'బేరాలు'

- విద్యుత్ సంస్థల్లో భారీగా పైరవీలు
- సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేసిన డిస్కంలు
- నేడో, రేపో ట్రాన్స్‌కో, జెన్‌కోలోనూ విడుదల

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల్లో సాధారణ బదిలీలపర్వం మొదలవగానే పలు పోస్టులకు పైరవీలు షురూ అయ్యాయి. మొత్తం 4 విద్యుత్ సంస్థల్లో కొన్ని ప్రాంతాల్లోని పోస్టులకు భారీగా డిమాండు ఉంది. కిందిస్థాయిలో ఉండే లైన్‌మెన్ మొదలుకుని ఉన్నతస్థాయిలో డివిజనల్ ఇంజినీరు వరకు అక్కడే కావాలంటున్నారు. వీరి సంపాదన నెలకు రూ.లక్షల్లో ఉంటోంది. ఉదాహరణకు నగరాల్లో సైబరాబాద్, గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్, మాదాపూర్, పటాన్‌చెరు, వరంగల్, కరీంనగర్‌లకు డిమాండు అధికంగా ఉంది. కొన్ని పోస్టులకు రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు ఇవ్వడానికైనా ఇంజినీర్లు సిద్ధపడుతున్నారంటే వీరి అక్రమార్జనను అర్థం చేసుకోవచ్చు. పెద్దఎత్తున రాజకీయ పైరవీలకూ తెరలేపారు. గతంలో ఆరోపణలున్న ఉద్యోగులు కీలక స్థానాలకు పంపాలంటూ రాయబారాలు సాగిస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

- సాధారణ బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలతో రెండు డిస్కంలు శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశాయి. మిగిలిన ట్రాన్స్‌కో, జెన్‌కోలోనూ నేడో, రేపో ఉత్తర్వులు జారీకానున్నాయని సమాచారం.
- అర్హులైన ఉద్యోగుల పేర్లతో జాబితాలను నేడు(28న) డిస్కం పోర్టల్‌లో ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతరాలను 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. వచ్చే నెల 4 వరకు ఉద్యోగులు దరఖాస్తులు అందజేయొచ్చు. 7న ఉత్తర్వులు జారీ అవుతాయి. 8 నుంచి బదిలీలపై నిషేధం ఉంటుంది.
- ఉత్తర్వులు అందుకున్న వారు వచ్చే నెల 10లోగా కొత్త పోస్టులో చేరాలి.
- ఒకే పోస్టును ఎక్కువ మంది కోరుకుంటే ప్రాధాన్య క్రమంలో కేటాయిస్తారు. మొదటి ప్రాధాన్యంలో దంపతులు, తరువాత వరుసగా 2025 సెప్టెంబరు 30లోగా ఉద్యోగ విరమణ పొందేవారు తదితరులు ఉన్నారు.
- ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో గత జూన్ 30 నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారందరూ బదిలీకి అర్హులే.
- ఆపరేషన్, నిర్వహణ(ఓఅండ్ఎం) విభాగంలో పనిచేస్తున్న వారిని ప్రస్తుత సెక్షన్ నుంచి మారుస్తారు. కార్పొరేటు కార్యాలయంలో పనిచేస్తున్న సహాయ ఇంజినీరు(ఏఈ), డీఈలను అక్కడి నుంచి లేదా వారున్న సర్కిల్ పరిధి నుంచి బయటి ప్రాంతాలకు పంపుతారు. 2025 సెప్టెంబరు 30లోగా రిటైరయ్యే వారు కోరుకుంటే తప్ప మార్చరు.
- కనీసం రెండేళ్ల సర్వీసు ఉన్నా.. ప్రతి కేడర్‌లో మొత్తం పనిచేస్తున్న ఉద్యోగుల్లో 50% మందికి మించి బదిలీ చేయరు.

సంఘాల నేతలకు మినహాయింపు

మొత్తం 19 విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలకు బదిలీ నుంచి రక్షణ ఉంటుందని డిస్కంల సీఎండీలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు లేదా కార్యదర్శితో పాటు ప్రాంతీయ అధ్యక్షుడు లేదా ప్రాంతీయ కార్యదర్శికి మినహాయింపు ఉంటుంది. వారు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతంలో వారి స్థాయి పోస్టు మరోచోట ఉంటేనే అక్కడికి మారుస్తారు.

అటవీ శాఖాధికారులపై దాడి... ఇద్దరికి తీవ్రగాయాలు

- ఐదుగురిపై కేసు నమోదు





ఆసుపత్రిలో సెక్షన్ అధికారి వినోద్‌కుమార్ ★ బీట్ అధికారి శరత్‌చంద్ర


తాడ్వాయి, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న అటవీశాఖాధికారులు, సిబ్బందిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటుచేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, అటవీశాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండల పరిధి దామెరవాయి అడవిలో పోడు జరుగుతుందనే సమాచారం గురువారం రాత్రి 11 గంటల తర్వాత ఆ శాఖ అధికారులకు తెలిసింది. దీంతో సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారులు శరత్‌చంద్ర, సుమన్, మరో ఇద్దరు సిబ్బందితో కలిసి ప్రభుత్వ జీపులో బయలుదేరారు. ఇదే సమయంలో దామెరవాయి సమీపంలో తాడ్వాయికి చెందిన గంట సూరజ్‌రెడ్డి జేసీబీతో ఎదురయ్యాడు. అడవిలో పోడు చేసి వస్తున్నారని భావించిన అధికారులు జేసీబీని స్వాధీనం చేసుకొని తాడ్వాయి అటవీశాఖ కార్యాలయానికి తీసుకొస్తుండగా, మార్గ మధ్యంలో సూరజ్‌రెడ్డి సోదరుడు గంట శశిధర్, మరోవ్యక్తి పాండవుల సాయి వచ్చి జేసీబీని నిలిపివేసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇరువురి మధ్య మాటలు పెరగడంతో.. శశిధర్, సూరజ్‌రెడ్డి కలిసి అధికారులపై ఇనుప చువ్వతో దాడి చేశారు. వీడియో తీసేందుకు ప్రయత్నించిన బీట్ అధికారి సెల్‌ఫోన్‌ను పగులగొట్టారు. వాహనం అద్దాలు, లైట్లు సైతం ధ్వంసం చేశారు. ఈ దాడిలో సెక్షన్ అధికారి వినోద్‌కుమార్ చేయి విరిగి, తలకు తీవ్ర గాయం కావడంతో.. అపస్మారకస్థితిలోకి వెళ్లారు. శరత్‌చంద్ర తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రులిద్దరినీ తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో.. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం రాత్రి బాధిత అధికారులను పరామర్శించారు. దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. దాడి ఘటనపై అటవీశాఖ రేంజ్ అధికారి కృష్ణవేణి, ఇతర అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సూరజ్‌రెడ్డి, శశిధర్‌లతో పాటు దాడికి సహకరించిన పాండవుల సాయి, జేసీబీ డ్రైవర్ నీరటి శ్రీకాంత్, సహాయకుడు మాదరి చంటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

3, 4 తేదీల్లో.. తెలుగువర్సిటీ ప్రవేశ పరీక్షలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు 3, 4 తేదీల్లో ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వర్సిటీ వెబ్‌సైట్ www.pstu.cet.org లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.

అప్రమత్తతతో పారిశ్రామిక ప్రమాదాలకు అడ్డుకట్ట

కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్



ఈనాడు, హైదరాబాద్: కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు యంత్రాల పరీక్షలు, సర్టిఫికేషన్ జారీలో సంబంధిత నిపుణులు ఏమైనా లోపాలు గుర్తిస్తే వెంటనే కర్మాగారాల డైరెక్టరేట్‌కు సమాచారాన్ని అందించాలని కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్ సూచించారు. ఈ సమాచారాన్ని ఈ-మెయిల్ ఇతర మార్గాల్లో ఎప్పుడైనా అధికారులకు అందించాలన్నారు. తెలంగాణ కర్మాగారాల విభాగం, జాతీయ భద్రతామండలి తెలంగాణ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సదస్సులో 'నిర్మాణ స్థిరత్వం, ప్రత్యేక పరికరాల సమ్మిళిత భద్రతలో సమర్థుల పాత్ర' అంశంపై ఆయన మాట్లాడారు. అప్రమత్తతతో పారిశ్రామిక ప్రమాదాలను నివారించొచ్చని, పారిశ్రామిక యంత్రాలు, పరికరాలకు నిరంతరం పరీక్షలు నిర్వహించాలని, దీనిపై యజమానులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కర్మాగారాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలను నివారించేందుకు నిపుణులు తరచూ పరీక్షలు నిర్వహించాలని కర్మాగారాల శాఖ డైరెక్టర్ బి.రాజగోపాలచారి సూచించారు. బరువులు ఎత్తే మిషన్లు, ప్రెషర్ వెసెల్స్, పవర్‌ప్రెసెస్, కెమికల్, సాల్వెంట్ ప్లాంట్లలో పరీక్షలు నిరంతరం కొనసాగాలని కోరారు. ఈ సమావేశంలో కర్మాగారాలశాఖ అధికారులు, అధీకృత నిపుణులు పాల్గొన్నారు.



పశ్చిమబెంగాల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు

ఉప ముఖ్యమంత్రి భట్టి నివాసంలో చోరీ

కాపలాదారు సహా ఇద్దరిని అదుపులోకి తీసుకొన్న బెంగాల్ రైల్వే పోలీసులు



నిందితుడు రోషన్ మండల్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసంలో చోరీ జరిగింది. నిందితులను పశ్చిమ బెంగాల్‌లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం... హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లో భట్టి విక్రమార్క వ్యక్తిగత నివాసముంది. ప్రస్తుతం అధికారిక నివాసం ప్రజాభవన్‌లో ఉంటున్న ఆయన ఈనెల 21 నుంచి అమెరికా పర్యటనలో ఉన్నారు. సొంతింటి వద్ద బిహార్‌లోని మధుబనికి చెందిన రోషన్ మండల్ అనే వ్యక్తి కాపలాదారుగా ఉన్నాడు. గురువారం భట్టి పీఎస్‌వో భాస్కరశర్మ అతన్ని సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. ఇంటికెళ్లి చూడగా కనిపించలేదు. ప్రధాన తలుపు తాళం పగులగొట్టి, లోపల ఉన్న స్టీల్ అల్మారాను విరగొట్టి, రూ.80 వేల నగదు, వెండి సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గురువారం రాత్రి భాస్కరశర్మ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్నేహితుడితో కలిసి దొంగతనం

పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పుర్ రైల్వే పోలీసులకు గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో భువనేశ్వర్-హావ్‌డా జన్‌శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ప్రయాణికుల్లో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని సోదాచేయగా రూ.1.50 లక్షల నగదు, 100 గ్రాముల బంగారు బిస్కెట్, పెద్ద మొత్తంలో ఆభరణాలు, వెండి పాత్రలు, విదేశీ కరెన్సీ లభించాయి. నిందితుల్లో ఒకరిని రోషన్ మండల్‌గా గుర్తించారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన తన స్నేహితుడు ఉదయ్‌కుమార్‌ను రోషన్ హైదరాబాద్ రప్పించాడని, ఇద్దరూ కలిసే చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. అయితే ఫిర్యాదులో పేర్కొన్నదానికి, పట్టుబడిన సొత్తుకు మధ్య తేడా ఉంది. నిందితులు ఇవన్నీ భట్టి ఇంట్లోనే తస్కరించారా? మరోచోటా చోరీచేసి అన్నింటితో కలిపి పారిపోయారా... అనేది తేలాల్సి ఉంది.

అక్రమ పదోన్నతులపై విచారణ జరపాలి

విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐకాస డిమాండు

ఈనాడు, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా సీనియారిటీని పాటించకుండా అడహాక్ పేరుతో అక్రమంగా ఇచ్చిన పదోన్నతులపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి (ఐకాస) డిమాండు చేసింది. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పదోన్నతులు సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఐకాస ఆరోపించింది. నేరుగా నియామక విధానంలో చేరిన ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన అమలు చేసి న్యాయం చేయాలని ట్రాన్స్‌కో సీఎండీ కార్యాలయంలో శుక్రవారం ఇచ్చిన వినతిపత్రంలో కోరింది.

రూ.2 వేల కోట్ల రుణసేకరణకు బాండ్ల విక్రయం

ఈనాడు, హైదరాబాద్: కొత్తగా రూ.2 వేల కోట్ల రుణసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం బాండ్లను విక్రయానికి పెట్టింది. ఇతర రాష్ట్రాలతో కలిపి తెలంగాణకు రూ.19,942 కోట్ల రుణాల సేకరణకు వచ్చేనెల ఒకటిన బాండ్లను వేలం వేయనున్నట్లు రిజర్వు బ్యాంకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

మేం భారత్‌కు వ్యతిరేకం కాదు

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు వివరణ



మాలే: భారత్ వ్యతిరేక ఎజెండాను తాము ఎన్నడూ అనుసరించలేదని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు పేర్కొన్నారు. 79వ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికాకు వచ్చిన ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ... "ఏ దేశానికీ మేం వ్యతిరేకం కాదు. 'ఇండియా అవుట్' విధానం మేం ఎప్పుడూ అనుసరించలేదు. విదేశీ సైన్యం మా భూభాగంలో ఉండటంతో మేం తీవ్ర సమస్యను ఎదుర్కొన్నాం" అని తెలిపారు. ఒక్క విదేశీ సైనికుడు కూడా తమ దేశంలో ఉండకూడదని మాల్దీవుల ప్రజలు భావించారని అన్నారు. గతేడాది నవంబరులో ముయిజ్జు... మాల్దీవుల అధ్యక్ష పగ్గాలను చేపట్టారు. వెంటనే మాల్దీవుల్లోని 90 మంది భారత సైనిక సిబ్బంది దేశం విడిచి వెళ్లాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారిని భారత్ ఉపసంహరించుకుంది. సైనికుల స్థానంలో పౌర సిబ్బందిని నియమించింది. ఈ సంఘటన రెండు దేశాల సంబంధాలపై ప్రభావం చూపింది. దీంతో పాటు.. జనవరిలో ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటనపై ముయిజ్జు మంత్రిమండలిలోని ముగ్గురు మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ ముగ్గురిపై వెంటనే ముయిజ్జు వేటు వేశారు. "అలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయకూడదు. అందుకే వారిపై చర్యలు తీసుకున్నాం. ఎవరిని అవమానించినా నేను అంగీకరించను" అని ఆ సంఘటనపై ముయిజ్జు వివరణ ఇచ్చారు.

అక్టోబరులో భారత్‌కు

అక్టోబర్ 7-9 తేదీల్లో ముయిజ్జు భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ అధికార వర్గాలు వెల్లడించాయి. 8న మోదీ, భారత అధికారులతో ముయిజ్జు చర్చలు జరపనున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

పాక్ నుంచి యుద్ధ విమానాలను కొనుగోలు చేసిన అజర్‌బైజాన్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ నుంచి దాదాపు 1.6 బిలియన్ల(దాదాపు రూ.13.5 వేల కోట్లు)తో జేఎఫ్-17 బ్లాక్ 3 యుద్ధ విమానాలను అజర్‌బైజాన్ కొనుగోలు చేసింది. ఈ విమానాలను హెదర్ అలియెవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హాం అలియెవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని కొనియాడారు. 'పాకిస్థాన్, అజర్‌బైజాన్ మధ్య ఉన్న స్నేహాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం ఎంతో కీలకమైంది. ఇరు దేశాల సన్నిహిత రక్షణ సహకారాన్ని ఇది పెంపొందిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధ విమానాలను పాకిస్థాన్ నుంచి ఇప్పటికే మయన్మార్, నైజీరియా కొనుగోలు చేశాయి. జేఎఫ్-17ను ఇరాక్ సైతం కొనుగోలు చేయనుందన్న అనుమానాలు చాలా కాలం నుంచి వ్యక్తమవుతున్నాయి.

హరియాణాలో వచ్చేది కాంగ్రెస్ సర్కారే

మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ ధీమా

రోహ్‌తక్: హరియాణాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న భాజపా అక్టోబరు 5 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతుందని, కాంగ్రెస్ అఖండ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడ్డా శుక్రవారం ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవి ఎవరిని వరిస్తుందనేది ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకున్న తరవాత కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. అయితే తాను రాజకీయాల్లో అలసిపోనూ లేదు, వాటి నుంచి విరమించుకోవడమూ లేదనంటూ సీఎం రేసులో ఉన్నట్లు స్పష్టం చేశారు. కేంద్ర మాజీ మంత్రి కుమారి సెల్జా మొదట అలిగి ప్రచారానికి దూరంగా ఉండిపోగా అధిష్ఠానం బుజ్జగించిన మీదట తిరిగివచ్చారని గుర్తుచేయగా, కాంగ్రెస్ సమైక్యంగా నిలుస్తోందని భూపీందర్ హుడ్డా స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోటీ కాంగ్రెస్-భాజపాల మధ్యే కేంద్రీకృతమవుతుందన్నారు.



న్యూయార్క్‌లో శుక్రవారం ట్రంప్ టవర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం సందర్భంగా కరచాలనం చేస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ

ముగ్గురు ఇరాన్ వ్యక్తులపై అభియోగాలు

ట్రంప్ ఎన్నికల ప్రచార హ్యాకింగ్ వ్యవహారంపై అమెరికా న్యాయవిభాగం చర్య

వాషింగ్టన్: అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచార సమాచారాన్ని హ్యాకింగ్ ద్వారా దొంగిలించడం, మీడియాకు విడుదల చేయడం వంటి ఆరోపణలపై ముగ్గురు ఇరాన్ వ్యక్తులపై అమెరికా న్యాయవిభాగం శుక్రవారం అభియోగాలు నమోదు చేసింది. వారు ముగ్గురు ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ ఉద్యోగులు. ప్రభుత్వాధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రైవేటు సంస్థలు వంటివి వారి విస్తృత లక్ష్యాలుగా ఉన్నాయని ఈ సందర్భంగా న్యాయవిభాగం వెల్లడించింది.

రూ.300 కోట్ల సొమ్ము కాజేసి సాధువుగా చలామణి.. అరెస్ట్

మథుర (యూపీ): అధిక వడ్డీల ఆశ చూపించి జనం నుంచి డిపాజిట్ల రూపంలో రూ.300 కోట్లకు



పైగా సొమ్ము వసూలుచేసి మహారాష్ట్ర నుంచి పరారైన ఓ వ్యక్తి.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురలో సాధువుగా చలామణి అవుతుండటం గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ సొమ్ముతో నిందితుడు ఆస్తులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మోసం చేసినట్లు పలు ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్న బబ్బన్ విశ్వనాథ్ శిందేను మథురలోని కృష్ణ బలరామ్ ఆలయం వద్ద వృందావన్ (యూపీ), బీడ్ (మహారాష్ట్ర) పోలీసుల సంయుక్త ఆపరేషనులో భాగంగా అరెస్టు చేశారు. శిందే పోలీసులకు చిక్కకుండా సాధువు వేషంలో దిల్లీ, అస్సాం, నేపాల్, యూపీలోని పలు జిల్లాలు తిరిగినట్లు డీఎస్పీ సందీప్‌కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం రాత్రి అరెస్టు చేసిన శిందేను బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

వాద్రాపై గురిపెట్టిన భాజపా


హరియాణాలో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు కమలదళం వ్యూహం



రాబర్ట్ వాద్రా

దిల్లీ: హరియాణాలో ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు అధికార భాజపా కొత్త వ్యూహం పన్నింది. ఈ క్రమంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బావమరిది రాబర్ట్ వాద్రాపై వచ్చిన అవినీతి ఆరోపణలను ప్రచారంలోకి తెచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల పోరు హరియాణా పుత్రుడు, గాంధీ కుటుంబ బ్రోకర్ (దలాల్) మధ్య అని భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా పేర్కొన్నారు. గతంలో భూపీందర్ సింగ్ హుడ్డా ప్రభుత్వ హయాంలో వాద్రాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కాంగ్రెస్ నాయకత్వం మౌనం ఎందుకు వహిస్తోందంటూ ప్రశ్నించారు. భాజపాను మూడో దఫా అధికారంలోకి తీసుకురావాలని హరియాణా ప్రజలు మానసికంగా సిద్ధమైపోయారని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, రాష్ట్రంలోని నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో కృషిచేశాయని భాటియా వివరించారు. రైతు సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్న రాహుల్ గాంధీ భూబకాసుర బావమరిది (రాబర్ట్ వాద్రా) గురించి చిన్న మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదంటూ నిలదీశారు. హుడ్డా కేవలం ముసుగు మాత్రమేనని అవినీతి నిజ స్వరూపం గాంధీ కుటుంబం అని పేర్కొన్నారు.


ఎంఎస్‌పీకి పూర్తి అర్థం తెలుసా రాహుల్? : అమిత్ షా



రేవాడీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం విమర్శలతో విరుచుకుపడ్డారు. హరియాణాలో 24 రకాల పంటలను భాజపా ప్రభుత్వం ఎంఎస్‌పీకి కొనుగోలు చేస్తోందని, అసలు ఎంఎస్‌పీ (కనీస మద్దతు ధర) పూర్తి అర్థం తెలుసా అని రాహుల్‌ను ప్రశ్నించారు. అలాగే ఖరీఫ్‌లో ఏ పంటలు వేస్తారో, రబీలో ఏ పంట పండుతుందో చెప్పగలరా? అని నిలదీశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా 24 పంటలకు మించి కొనుగోలు చేస్తుంటే ఆ విషయం తెలపాలని కాంగ్రెస్ నేతలను అమిత్ షా కోరారు.

స్వయంకృషితో ప్రజాదరణ పెంచుకొన్న రాహుల్

- ఆయనలో మార్పు ఆసక్తికరం: సైఫ్ అలీఖాన్



ముంబయి: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ ప్రశంసలు కురిపించారు. స్వయంకృషితో ఆయన తన మీద ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని మార్చుకోగలిగారని పేర్కొన్నారు. రాహుల్ తనను తాను ఎంతో సంస్కరించుకుని ప్రజాదరణ పెంచుకున్నారన్నారు. ఓ జాతీయ మీడియా గురువారం సాయంత్రం నిర్వహించిన చర్చా వేదికలో రాజకీయ నేతల గురించి చర్చ రాగా.. సైఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎలాంటి నాయకుడిని ఇష్టపడతారు?' అనే ప్రశ్నకు బదులిస్తూ.. 'ధైర్యంగా, నిజాయతీగా ఉండే రాజకీయ నాయకులంటే ఇష్టం' అని చెప్పారు. ప్రధాని మోదీ, దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, రాహుల్ గాంధీల్లో ఎవరు దేశాన్ని భవిష్యత్తులోకి నడిపించగలరు? అని ప్రశ్నించగా... 'వాళ్లంతా ధైర్యవంతులైన నాయకులే. అయితే, రాహుల్‌గాంధీ తీరు నన్ను కాస్త ఎక్కువగా ఆకట్టుకుంటోంది. గతంలో ఆయన చేసే పనులను, చెప్పే మాటలను కొంతమంది అగౌరవపర్చిన సందర్భాలున్నాయి. అలాంటి స్థితి నుంచి ఆయన తనను తాను ఎంతగానో మార్చుకున్నారు. ఆ ప్రయాణం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది" అని సైఫ్ చెప్పారు. దేశానికి ఏం కావాలో ప్రజలు స్పష్టంగా చెప్పారని ఆయన పేర్కొన్నారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని సైఫ్ స్పష్టం చేశారు.

ఇప్పటి రాజకీయాలకు అధికారమే పరమావధి: నితిన్ గడ్కరీ



ఛత్రపతి శంభాజీనగర్: ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమాజ సేవ, దేశ నిర్మాణం, అభివృద్ధికి పర్యాయపదంగా ఒకప్పటి రాజకీయాలు ఉండేవని, ఇప్పుడు అధికారమే పరమావధిగా రాజకీయాలు చేస్తున్నారంటూ పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రస్తుతం అభిప్రాయ భేదాలు సమస్య కాదని, ఆలోచనలంటూ లేకపోవడమే సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. రాజస్థాన్ గవర్నర్ హరిభావూ కిసన్‌రావ్ బాగడే సన్మాన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మాట్లాడారు. తాను ఆరెస్సెస్ కార్యకర్తగా పనిచేసిన రోజులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. "ఆరెస్సెస్ కార్యకర్తగా పనిచేసిన రోజుల్లో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నా. అప్పుడు తగిన గుర్తింపు గానీ, గౌరవం గానీ ఉండేవి కాదు. హరిభావూ ప్రజల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేశారు. పార్టీ కార్యకర్తగా నేను 20 ఏళ్ల పాటు విదర్భలో పనిచేశా. అప్పట్లో మేం నిర్వహించే ర్యాలీలపై ప్రజలు రాళ్లు రువ్వేవారు. ఎమర్జెన్సీ తర్వాత నేను ప్రసంగాలు చేయడానికి వినియోగించే ఆటోను కొందరు తగలబెట్టేశారు" అంటూ నాటి రోజులను గడ్కరీ గుర్తుచేసుకున్నారు. "ఇవాళ నేను మాట్లాడుతుంటే.. వేల మంది ఇక్కడికి వచ్చి వింటున్నారు. ఇవాళ నాకు దక్కిన ఈ గుర్తింపు నిజానికి నాది కాదు. ప్రాణాలకు ఎదురొడ్డి మరీ కష్టపడిన హరిభావూ వంటి కార్యకర్తలదే" అని గడ్కరీ పేర్కొన్నారు.

ప్రధాన ఆరోగ్య సమస్యగా ఫ్యాటీ లివర్ వ్యాధి


దిల్లీ: మద్యం తాగనివారిలోనూ కాలేయంలో కొవ్వు పేరుకుపోయే నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతోందని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర పేర్కొన్నారు. ప్రతి పది మందిలో దాదాపు ముగ్గురికి ఈ సమస్య ఉంటోందని తెలిపారు. ఊబకాయం, మధుమేహం వంటి జీవక్రియ సంబంధ రుగ్మతలే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. శుక్రవారం ఆయన ఎన్ఏఎఫ్ఎల్‌డీకి సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ రుగ్మతను ప్రధాన సాంక్రమికేతర వ్యాధిగా గుర్తించేలా భారత్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఎన్ఏఎఫ్ఎల్‌డీ ఉద్ధృతిని తగ్గించడానికి జీవనశైలిలో మార్పులు అవసరమని తెలిపారు. తాజా మార్గదర్శకాలను క్షేత్రస్థాయి కార్యకర్తలకు చేర్చాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఓఎస్‌డీ పుణ్య సలీల శ్రీవాస్తవ కోరారు. దీనివల్ల ఎన్ఏఎఫ్ఎల్‌డీని ఆరంభంలోనే గుర్తించడానికి వీలవుతుందన్నారు.

భద్రతామండలిలో భారత్ ఉండాల్సిందే: బ్రిటన్

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి బ్రిటన్ మద్దతు పలికింది. ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ 79వ సదస్సులో బ్రిటన్ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ.. "భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీలు శాశ్వత సభ్యదేశాలుగా భద్రతా మండలిలో ఉండాలి. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. భద్రతామండలిని మరింత పటిష్ఠం చేయాలి. అందులో భాగంగా శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి" అని అన్నారు.

ఐరాసలో మళ్లీ కశ్మీర్ రాగం

- మారని పాక్ బుద్ధి
- పాలస్తీనా సమస్యతో పోల్చే యత్నం



న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో అందరూ గాజా యుద్ధం గురించి మాట్లాడుతుంటే.. లెబనాన్, ఇజ్రాయెల్ ఘర్షణ గురించి ప్రసంగిస్తుంటే.. పాకిస్థాన్ మాత్రం ఎప్పట్లానే అసలు విషయాన్ని పక్కనపెట్టి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. అధికరణం 370 రద్దుపై విమర్శలు చేసింది. కశ్మీర్‌కు ప్రత్యేకహోదా కల్పించే ఆ అధికరణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. శుక్రవారం.. 79వ ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సదస్సులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగించారు. ఎప్పట్లానే ఆయన కశ్మీర్ రాగాన్ని అందుకున్నారు. 20 నిమిషాల ప్రసంగంలో హిజ్బుల్ ఉగ్రవాది బుర్హాన్ వని, అధికరణం 370 రద్దు లాంటి అంశాలను షరీఫ్ ప్రస్తావించారు. పాలస్తీనా సమస్యతో కశ్మీర్‌ను పోల్చే ప్రయత్నం చేశారు. భారత్‌లో హిందూ ఆధిపత్య ఎజెండా నడుస్తోందని విమర్శించారు. 20 కోట్ల మంది ముస్లింలను లొంగదీసుకోవాలన్న ప్రయత్నం జరుగుతోందని, ఇస్లాం చరిత్రను చెరిపివేసే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు.

ఎర్డొగాన్ నోట.. వినిపించని కశ్మీర్ మాట

మరోవైపు ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో ఎప్పుడూ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తే తుర్కియే ఈసారి మౌనం వహించింది. 35 నిమిషాల ప్రసంగంలో తుర్కియే అధ్యక్షుడు గాజాలోని మానవ సంక్షోభంపైనే ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇజ్రాయెల్‌పై ధ్వజమెత్తారు. ఎక్కడా కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించలేదు. త్వరలో బ్రిక్స్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలోనే ఎర్డొగాన్.. కశ్మీర్ అంశంపై మౌనం వహించినట్లు తెలుస్తోంది. బ్రిక్స్.. వ్యవస్థాపక దేశాల్లో భారత్ ఒకటి.

అమెరికాలో పలు రాష్ట్రాలకు తుపాను తాకిడి

- ముగ్గురి మృతి
- లక్షల ఇళ్లకు నిలిచిన విద్యుత్ సరఫరా



ఫ్లోరిడాలోని క్రిస్టల్ రివర్ నగరంలో వరద నీటిలో కుమార్తెలను తీసుకెళుతున్న పౌరుడు

క్రాఫర్డ్ విల్: అట్లాంటిక్ మహాసముద్రం నుంచి గురువారం రాత్రి 11 గంటల 10 నిమిషాలకు అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్ర తీరాన్ని దాటిన హెలెనా పెను తుపాను ఉత్తరాన జార్జియా రాష్ట్రాన్ని చేరింది. శుక్రవారం ఉదయానికి అక్కడ గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. అయితే కేటగిరి 4 తుపానుగా మొదలైన హెలెనా ఇప్పుడు కేటగిరి 1గా బలహీనపడింది. తీరందాటినపుడు దాని ఉద్ధృతికి విద్యుత్ సరఫరాను నిలిపేయడంతో ఫ్లోరిడాలో 12 లక్షల ఇళ్లు, వ్యాపారాలు చీకట్లో మగ్గాయి. జార్జియా రాష్ట్రంలో 1,90,000కు పైగా, ఉత్తర, దక్షిణ కరోలినా రాష్ట్రాలలో 30,000కుపైగా భవనాలకు కరెంటు సరఫరా ఆగిపోయింది. ఈ రాష్ట్రాలతోపాటు అలబామా, వర్జీనియా రాష్ట్రాల గవర్నర్లు కూడా ఎమర్జెన్సీ ప్రకటించారు. తుపాను వల్ల ఫ్లోరిడాలో ఒకరు, జార్జియా రాష్ట్రంలో ఇద్దరు మరణించారు. తుపాను వల్ల ఉత్తర కరోలినా పర్వతాల్లో 10 సెం.మీ. వాన కురిసింది. మరో 14 సెం.మీ. వర్షపాతం నమోదు కావచ్చనేది అంచనా. అట్లాంటిక్ మహాసముద్రంలో జూన్ 1 నుంచి తుపానుల సీజను మొదలైంది.

క్యాటరింగులో ట్రాన్స్‌జెండర్లు.. బిరియానీతో ఘుమఘుమలు

ఈటీవీ భారత్: ట్రాఫిక్ సిగ్నళ్ల కూడళ్లలో బిచ్చమెత్తుకొంటూ కనిపించే ట్రాన్స్‌జెండర్లు అంటే సమాజంలో ఒకరకమైన చిన్నచూపు.. ఛీత్కారాలు. వీరిలో చాలామంది కుటుంబసభ్యుల ఆదరణకూ నోచుకోరు. ఈ అవమానాలు, అవాంతరాలన్నీ దాటుకొని తన కాళ్ల మీద తాను నిలబడటమే కాకుండా, తనలాంటివాళ్లు ఆత్మగౌరవంతో బతికేలా చేయూతను అందిస్తున్నారు తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన సెల్వీ అమ్మ (50). సెల్వీ చేసే రవుథర్ బిర్యానీ చాలా ఫేమస్. చాలామంది ఇళ్లలో జరిగే వేడుకలకు సెల్వీ అమ్మ వంట కోసం కొన్ని నెలల ముందే సంప్రదిస్తారంటే అతిశయోక్తి కాదు. పొరుగు రాష్ట్రం కేరళ నుంచి వీరికి ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. సెల్వీ శ్రమ చాలామంది ట్రాన్స్‌జెండర్లకు ఓ దిక్సూచి అయింది. కనీసం టీ పెట్టడం కూడా రానివారికి వంటల్లో మెళకువలు నేర్పారు. అలా ఒకరొకరుగా చేరి.. సెల్వీ అమ్మ క్యాటరింగ్ వ్యాపారం ఇపుడు 40 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి చూపుతోంది. ఇందులో పది.. పదిహేనేళ్ల నుంచి పనిచేస్తున్నవారు కూడా ఉన్నారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లో మళ్లీ జంతువుల దాడుల కలకలం

- నలుగురికి గాయాలు

బహరాయిచ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో మళ్లీ జంతువుల దాడులు కలకలం రేపాయి. గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురు చిన్నారులున్నారు. కతర్నియాఘాట్ వన్యప్రాణి అభయారణ్యం పరిధితోపాటు బహరాయిచ్ అటవీ ప్రాంతంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. వీటిని చిరుతల దాడులుగా కతర్నియాఘాట్ అధికారి పేర్కొన్నారు. మరోవైపు బహరాయిచ్‌లో దాడి చేసినది నక్క లేదా శునకం అయిఉండొచ్చని అక్కడి అధికారులు చెప్పారు. గ్రామస్థులు మాత్రం వీటిని తోడేళ్ల దాడులుగా పేర్కొంటున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అభయారణ్యం పరిధిలోని హరఖపుర్ గ్రామంలో మధుసూదన్(35) అనే రైతు పొలంలో ఒంటరిగా పనిచేస్తుండగా జంతువు దాడి చేసి గాయపరిచింది. అయోధ్య పుర్వ గ్రామంలోని సుజోలీ ప్రాంతంలో జరిగిన మరో జంతువు దాడిలో సహిబా(13) అనే బాలిక గాయపడింది. ఘూమ్ని గ్రామంలో జరిగిన మూడో ఘటనలో అరూష్ అనే ఆరు నెలల చిన్నారి గాయపడ్డాడు. నఖా గ్రామంలో జరిగిన మరో ఘటనలో మమత(5) అనే చిన్నారి గాయపడింది.

బ్రహ్మోస్ ఏరోస్పేస్‌లో మాజీ అగ్నివీరులకు పోస్టులు రిజర్వ్

దిల్లీ: భారత్‌కు చెందిన డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన మిలిటరీ ఇండస్ట్రియల్ కన్సార్షియం సంయుక్తంగా నిర్వహిస్తోన్న బ్రహ్మోస్ ఏరోస్పేస్ మాజీ అగ్నివీరులకు రిజర్వేషన్లు కల్పించింది. టెక్నికల్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో కనీసం 15 శాతం ఖాళీలను వారికి కేటాయించింది. వివిధ విభాగాల్లో వీరిని నియమించుకోవాలని భాగస్వామ్య సంస్థలను కోరింది. భద్రతకు సంబంధించిన విభాగంలో కనీసం 50 శాతం పోస్టులను వీరితో భర్తీ చేయనుంది. ఈ మేరకు బ్రహ్మోస్ సంస్థ అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. "సైనిక, సాంకేతికతో పాటు క్రమశిక్షణ విషయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ.. భారత్‌లో అభివృద్ధి చెందుతోన్న రక్షణ, పారిశ్రామిక రంగాలకు ఎంతగానో ఉపయోగపడనుంది. 2047కు అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు భారత్ అడుగులు వేస్తోన్న తరుణంలో.. మాలాంటి సంస్థల్లో వారి సహకారం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకంగా మారనుంది" అని బ్రహ్మోస్ వెల్లడించింది. త్వరలో హరియాణాలో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రకటన రావడం గమనార్హం. ఆ రాష్ట్రం అగ్నిపథ్ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

'12th ఫెయిల్' చూసి కళ్లు చెమర్చాయి: సీజేఐ

సుప్రీంకోర్టు ఆవరణలో చిత్ర ప్రదర్శన

దిల్లీ: "ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలకు నా కళ్లు చెమర్చాయి. విక్రాంత్, మేధా శంకర్ అద్భుతంగా నటించారు. ఇలాంటి చిత్రాలు చుట్టూ ఉన్న ప్రజల కోసం ఏదైనా చేయాలనే స్ఫూర్తిని అందరిలో నింపుతాయి" అని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. ఐపీఎస్ అధికారి మనోజ్‌కుమార్ శర్మ జీవితాన్ని ఆధారంగా చేసుకొని బాలీవుడ్ దర్శకుడు విధువినోద్ చోప్రా తెరకెక్కించిన '12th ఫెయిల్' చిత్రం అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకొంది. విక్రాంత్ మైసీ, మేధా శంకర్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని బుధవారం సాయంత్రం సుప్రీంకోర్టు ఆవరణలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సహా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు వారి వారి కుటుంబసభ్యులతో కలిసి దాదాపు 600 మంది ఈ చిత్రాన్ని తిలకించారు. సినిమా వీక్షించిన అనంతరం సీజేఐ చిత్రబృందాన్ని అభినందించారు. "అయిదేళ్లు శ్రమించి ఈ చిత్రాన్ని తెరకెక్కించా. సీజేఐ మాటలతో నా శ్రమకు విలువ దక్కినట్లు అనిపించింది" అని దర్శకుడు విధువినోద్ చోప్రా ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనకు చిత్రంలోని ప్రధాన పాత్రధారులతో పాటు ఐపీఎస్ అధికారి మనోజ్‌కుమార్ శర్మ, ఐఆర్ఎస్ అధికారిణి శ్రద్ధాజోషి దంపతులు కూడా హాజరయ్యారు. గతేడాది అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఆర్థికంగానూ మంచి విజయం సాధించింది.

దిల్లీలో వాయు కాలుష్యాన్ని అరికట్టడంలో విఫలమయ్యారు

కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ కంట్రోల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా దేశ రాజధాని దిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టడంలో కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ కంట్రోల్ (సీఏక్యూఎం) విఫలమైందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణకు కమిషన్ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కమిషన్ తీరుపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దేశ రాజధాని, దాని పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత పర్యవేక్షణ, వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దిల్లీ పొరుగు రాష్ట్రాల్లోని పొలాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని అరికట్టే విషయంలో గతంలో కమిషన్ చెప్పినవన్నీ గాల్లో మాటలుగా కనిపిస్తున్నాయని పేర్కొంది. "పంట వ్యర్థాల దహనం సమస్యను పరిష్కరించడానికి కనీసం ఒక్క కమిటీ కూడా వేయలేదు. ఏటా ఈ సమస్యను చూస్తుంటే సీఏక్యూఎం చట్టం అమలు కావడం లేదని తెలుస్తోంది. చట్ట ప్రకారం ఏం చర్యలు తీసుకున్నారో కనీసం ఒక్కటైనా చూపించండి" అని సీఏక్యూఎంను ధర్మాసనం నిలదీసింది. సీఏక్యూఎం ఛైర్‌పర్సన్ బదులిస్తూ.. గాలి కాలుష్య కట్టడికి మూడు సబ్ కమిటీలు ఏర్పాటు చేశామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. అలాంటి మొక్కుబడి సమావేశాలతో ఎంత సమర్థంగా పనిచేయగలుగుతున్నారో అర్థమవుతుందని వ్యాఖ్యానించింది. పంట వ్యర్థాలకు సంబంధించి ప్రత్యామ్నాయాలు అమలు చేసేందుకు కృషి చేయాలని, ఆ చర్యలకు సంబంధించి సమగ్ర నివేదికను తమకు అందజేయాలని సీఏక్యూఎంను సుప్రీంకోర్టు ఆదేశించింది.

సుప్రీం కీలక తీర్పుల సారాంశాలతో కొత్త వెబ్ పేజీ

దిల్లీ: సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుల సారాంశాలతో కొత్త వెబ్ పేజీ అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమైన తీర్పులను ప్రజలందరూ అర్థం చేసుకునేలా సులువైన రీతిలో పేజీని రూపొందించినట్లు సుప్రీంకోర్టు ఓ ప్రకటనలో తెలిపింది. న్యాయస్థాన చరిత్రాత్మక తీర్పులు దేశంలోని వివిధ రంగాలపై ప్రభావం చూపుతాయని, అందువల్ల పౌరులందరికీ వాటిని అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో ఈ కొత్త పేజీని రూపొందించినట్లు తెలిపింది. ఆయా తీర్పులను సంవత్సరాల వారీగా వెబ్ పేజీలో పొందుపరిచామని వివరించింది. సారాంశాలతో పాటు ఆయా కేసులకు సంబంధించిన తీర్పు వీడియోలను, వాదనల మౌలిక ప్రతులను సైతం అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. ప్రజలకు సమాచారాన్ని అందించడం, చట్టపరమైన అవగాహన పెంచడం వంటి విస్తృత లక్ష్యాల్లో భాగంగా.. ఈ వెబ్ పేజీని రూపొందించినట్లు తెలిపింది.

'కాంప్లాన్'పై తప్పుడు వీడియోలను తొలగించండి

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లుయెన్సర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, వారికి సాధికారత లేని అంశాలపై వ్యాఖ్యానాలు చేయరాదని దిల్లీ హైకోర్టు హెచ్చరించింది. కాంప్లాన్ హెల్త్ డ్రింక్‌పై పెట్టిన తప్పుడు వీడియోలను రెండు వారాల్లో పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పది లక్షల మంది, ఫేస్‌బుక్‌లో 60 వేల మంది ఫాలోవర్స్ ఉన్న ప్రశాంత్ దేశాయ్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ఇటీవల కాంప్లాన్‌తోపాటు ఇతర హెల్త్‌డ్రింకుల్లో చక్కెర శాతం నిర్దేశిత మోతాదుకు మించి ఉంటోందని, అవి ఆరోగ్యానికి హానికరమని సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేశారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జైడస్ వెల్‌నెస్ ప్రొడక్ట్ లిమిటెడ్ కంపెనీ... దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసును పరిశీలించిన న్యాయస్థానం కాంప్లాన్‌ను దేశాయ్ నేరుగా లక్ష్యంగా చేసుకున్నట్లు అనిపిస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆయన పెట్టిన వీడియోలను రెండు వారాల్లో తొలగించాలని ఆదేశించింది.


టీనేజీ ప్రేమ వివాదాలు సంక్లిష్టమైనవి

- వాటిని నేరంగా పరిగణించడంపై చర్చ జరగాలి
- దిల్లీ హైకోర్టు వ్యాఖ్య

దిల్లీ: యువతీ యువకుల టీనేజీ ప్రేమలతో తలెత్తే వివాదాలు న్యాయపరంగా చాలా సంక్లిష్టమైనవని దిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. వాటిని నేరంగా పరిగణించే విషయాన్ని విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ తెలిపారు. పదిహేడేళ్ల వయసు యువతి తనకు నచ్చిన వ్యక్తితో వెళ్లిపోవడం, ఆ తర్వాత వాళ్లు దొరికిపోవడం, బాధితురాలి తల్లిదండ్రులు ఆమె వాంగ్మూలాన్ని పోలీసుల వద్ద మార్చివేసేలా చేయడం వంటివి ఎన్నో ఘటనల్లో జరుగుతోందన్నారు. పోలీసులు కూడా వాస్తవ పరిస్థితికి పూర్తి భిన్నమైన లేదా పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలను నమోదు చేస్తుంటారన్నారు. తొలుత నేర శిక్షాస్మృతి సెక్షన్ 161 ప్రకారం, ఆ తర్వాత సెక్షన్ 164 ప్రకారం నమోదు చేసే వాంగ్మూలాల్లో అత్యధికం పరస్పర విరుద్ధంగానే ఉంటున్నాయని న్యాయమూర్తి తెలిపారు. అయితే, ప్రస్తుత కేసులో నిందితుడు నేరానికి పాల్పడ్డాడా లేదా అనే విషయంపై తాను వ్యాఖ్యానించడంలేదని చెబుతూ 22 ఏళ్ల యువకుడికి బెయిల్ మంజూరు చేశారు. బాధితురాలిని కలుసుకోరాదనే షరతు విధించారు. 17 ఏళ్ల యువతిని అపహరించాడనే నేరారోపణ కింద 2022 ఏప్రిల్ 19 నుంచి నిందితుడు జైల్లో ఉన్నాడు. అతనిపై ఛార్జిషీట్ నమోదైంది. యువకుడిని ఇంకా కస్టడీలోనే కొనసాగించడం అతని భవిష్యత్తును దెబ్బతీస్తుందని జడ్జి అభిప్రాయపడ్డారు. ఈ కేసులో బాధితురాలు 23 రోజుల వ్యవధిలో రెండు రకాల వాంగ్మూలాలు ఇవ్వడాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు.

పట్టాలపై పశువుల నిరోధానికి ప్రత్యేక లోహ కంచె

- అభివృద్ధి చేసిన భారతీయ రైల్వే
- ఇప్పటివరకూ 6,547 కి.మీ. మేర నిర్మాణం



దిల్లీ: రైలు పట్టాలపైకి పశువులు, ద్విచక్ర వాహనదారులు రాకుండా ప్రత్యేక లోహ కంచెను భారత రైల్వే అభివృద్ధి చేసింది. ప్రస్తుతం దేశంలో రైళ్ల వేగాన్ని పెంచడంపై రైల్వే దృష్టి సారించింది. సుమారు గంటకు 110 కి.మీ. వేగంతో పరుగులు పెట్టే రైళ్లకు అంతరాయం కలగకుండా ఉండేందుకు రైలు పట్టాల పొడవునా భద్రతా కంచెను నిర్మించాల్సి ఉంది. పాత విధానంలో నిర్మిస్తున్న కంచె పశువులు పట్టాలపైకి రావడాన్ని నిరోధించడంలేదు. దీంతో డబ్ల్యూ-బీమ్ తరహా లోహ కంచెను రైల్వే అభివృద్ధి చేసింది. అహ్మదాబాద్-ముంబయి మార్గంలో దీనిని నిర్మించారు. ఈ దారిలో అనుమతించిన రైళ్ల వేగాన్ని గంటకు 160 కి.మీ.కు పెంచారు. ఇప్పటివరకూ నూతన విధానంలో 6,547 కి.మీ. మేర కంచెను నిర్మించారు.



రోల్స్‌రాయిస్ కొత్త కలినన్ సిరీస్II రూ.10.50 కోట్లు



చెన్నై: బ్రిటన్‌కు చెందిన విలాసవంత కార్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్, తన అధునాతన స్పోర్ట్స్ వినియోగ వాహనం న్యూ కలినన్ సిరీస్ II శ్రేణి కారును శుక్రవారం చెన్నైలో ప్రదర్శించింది. ఈ కారు పరిచయ ధర రూ.10.50 కోట్లు అని సంస్థ రీజినల్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్) ఇరెన్ నిక్కీ తెలిపారు. 2018లో కలినన్ మోడల్‌ను ఆవిష్కరించాక, ప్రధానంగా యువత ఆకర్షితులైనట్లు వివరించారు. బ్లాక్ బ్యాడ్జ్ కలినన్ సిరీస్ II కార్లు రూ.12.25 కోట్ల నుంచి ప్రారంభమవుతాయన్నారు. వీటి డెలివరీలు ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. అనేక కొత్త సాంకేతికతలు, మెటీరియల్స్‌తో, అద్భుత డిజైన్‌తో ఈ వాహనాలను తీర్చిదిద్దినట్లు వివరించారు.

అంతర్జాతీయ ప్రయాణాలపై 20% వరకు రాయితీ

10 విమానయాన కంపెనీలతో మేక్‌మైట్రిప్ భాగస్వామ్యం

ముంబయి: అంతర్జాతీయ విమాన మార్గాల్లో బిజినెస్ క్లాస్ ప్రయాణానికి ఊతమిచ్చేందుకు ఆన్‌లైన్ ప్రయాణ కంపెనీ మేక్‌మైట్రిప్ 10 విమానయాన సంస్థలు, ఐసీఐసీఐ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఎయిర్ అస్తానా, మలేషియా ఎయిర్‌లైన్స్, ఒమన్ ఎయిర్, కంటాస్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్ విమానాల్లో బిజినెస్ క్లాస్ ధరపై 20% వరకు రాయితీ లభిస్తుందని తెలిపింది. సెప్టెంబరు 27 ప్రారంభమైన ఈ ఆఫర్ ప్రకారం అక్టోబరు 2 వరకు చేసుకునే బుకింగ్‌లపై తగ్గింపు వర్తిస్తుందని పేర్కొంది. ఐసీఐసీఐ బ్యాంక్ కార్డుదారులకు అదనంగా రూ.10,000 తగ్గింపును వర్తింపజేసేందుకు ఆ బ్యాంక్‌తోనూ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సౌజన్య శ్రీవాస్తవ పేర్కొన్నారు.

నాగ్‌పుర్ విమానాశ్రయ బాధ్యతలు జీఎంఆర్‌కే

కేంద్రం, ఏఏఐ క్యురేటివ్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: నాగ్‌పుర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ విమానాశ్రయ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి జీఎంఆర్ గ్రూప్‌నకు ఏర్పడిన చిక్కులు తొలగిపోయాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సంస్థకు ఈ పనులను అప్పగించడాన్ని సవాలు చేస్తూ కేంద్రం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దాఖలు చేసిన క్యురేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నాగ్‌పుర్ విమానాశ్రయం అభివృద్ధి, నిర్వహణను జీఎంఆర్‌కు ఇస్తున్నట్లు మిహాన్ ఇండియా (మల్టీ మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్ ఎయిర్‌పోర్ట్ అట్ నాగ్‌పుర్) 2019 మార్చి 7న లెటర్ ఆఫ్ అవార్డును ఇచ్చింది. దీన్ని రద్దు చేయాలని కోరుతూ బాంబే హైకోర్టులో కేంద్రం, ఏఏఐ పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్లను బాంబే హైకోర్టు తిరస్కరిస్తూ, జీఎంఆర్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనిపై కేంద్రం, ఏఏఐ అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు చేశాయి. విచారణ అనంతరం 2022, మే 9న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. మరోసారి విచారించాలని కోరుతూ కేంద్రం, ఏఏఐ క్యురేటివ్ పిటిషన్‌ను దాఖలు చేశాయి. దీన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టానికి అనుగుణంగా విచారణ అర్హత ఈ పిటిషన్‌కు లేదన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయంతో ఏకీభవిస్తూ, క్యురేటివ్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

టి+0 సెటిల్‌మెంట్.. ఇపుడే కాదు

క్యాపిటల్ మార్కెట్ విభాగంలో టి+0 రోలింగ్ సెటిల్‌మెంట్‌ను అమలు చేయడాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) వాయిదా వేసింది. ఈ విధానాన్ని ఎపుడు తీసుకొచ్చేదీ భవిష్యత్తులో వెల్లడిస్తామని పేర్కొంది.



ప్రస్తుతమున్న టి+1 వ్యవస్థను 2021 నుంచి దశల వారీగా అమలు చేయడం ప్రారంభించారు. పూర్తి స్థాయిలో 2023 జనవరికి ఇది అందుబాటులోకి వచ్చింది. తొలుత ఇది టి+5గా ఉండేది. అంటే ట్రేడ్ జరిగిన అయిదు రోజులకు కానీ షేర్ల సెటిల్‌మెంట్ జరిగేది కాదు. 2002లో దీనిని టి+3 స్థాయికి తగ్గించారు. 2003లో టి+2కు తీసుకురాగలిగారు. టి+0 సెటిల్‌మెంట్‌కు కట్ ఆఫ్ పే ఇన్ టైం సాయంత్రం 3:30 గంటలుగా క్లియరింగ్ కార్పొరేషన్ నిర్ణయించింది. అంటే ట్రేడ్ జరిగిన రోజు సాయంత్రంలోగా సెటిల్‌మెంట్ జరగాల్సి ఉంటుంది.

నేడు మాక్ ట్రేడింగ్: క్యాపిటల్ మార్కెట్ విభాగంతో పాటు ఎఫ్ అండ్ ఓ విభాగాలకు శనివారం (సెప్టెంబరు 28) తన డిజాస్టర్ రికవరీ సైట్ నుంచి మాక్ ట్రేడింగ్‌ను ఎన్ఎస్ఈ చేపట్టనుంది. ఈ సైట్ నుంచి లైవ్ ట్రేడింగ్ సెప్టెంబరు 30, అక్టోబరు 1 తేదీల్లో జరుగుతుంది. మాక్ ట్రేడింగ్ సెషన్‌లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఎక్స్ఛేంజీ అత్యవసర పరిస్థితి పరీక్షలను నిర్వస్తామని తెలిపింది.

సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం



రూ.8,000–10,000 కోట్ల సంస్థ ఆవిర్భావం

ఈనాడు – హైదరాబాద్

మైలాన్ ఇండియా మాజీ సీఈఓ బి.హరిబాబు నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వియాష్ లైఫ్‌సైన్సెస్‌ను, స్టాక్ మార్కెట్లో నమోదైన సీక్వెంట్ సైంటిఫిక్ అనే కంపెనీలో విలీనం చేయనున్నారు. వియాష్ లైఫ్ సైన్సెస్ స్టాక్‌మార్కెట్లో నమోదు కాని, ప్రైవేట్ సంస్థ కావడం గమనార్హం. ఈ రెండు కంపెనీల్లో, అగ్ర శ్రేణి ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ కార్లైల్ కొంత కాలం క్రితం పెట్టుబడి పెట్టింది. మైలాన్ ఇండియా నుంచి బయటకు వచ్చాక, 2019లో వియాష్ లైఫ్‌సైన్సెస్‌ను హరిబాబు నెలకొల్పగా, అదే ఏడాది చివర్లో లారస్ ల్యాబ్స్ సహ వ్యవస్థాపకుడైన శ్రీహరి రాజు కలిదిండి జతకలిశారు. తదుపరి వింధ్య ఫార్మా, వందన లైఫ్‌సైన్సెస్ అనే కంపెనీలను వియాష్ కొనుగోలు చేసింది. విశాఖపట్నంలోని మైలాన్ ఇండియాకు చెందిన ఏపీఐ-ఫార్ములేషన్ల యూనిట్‌ను, ముంబయిలోని మైలాన్ ఏపీఐ యూనిట్‌ను కూడా సొంతం చేసుకుంది. వియాష్ లైఫ్‌సైన్సెస్‌లో 2021లో కార్లైల్ పెట్టుబడి పెట్టింది. ఆ తర్వాత సైమెడ్ ల్యాబ్స్, ఆప్కో ఫార్మా, ఆప్కో ల్యాబ్స్ అనే సంస్థలను సైతం వియాష్ లైఫ్ కొనుగోలు చేసింది.

సీక్వెంట్ టర్నోవర్ రూ.1,400 కోట్లు

సీక్వెంట్ సైంటిఫిక్, మహారాష్ట్రలోని థానే కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫార్మాస్యూటికల్ సంస్థ. ఈ కంపెనీకి కార్లైల్ గ్రూపునకు చెందిన సీఏ హార్బర్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థ 53% వాటాతో ప్రమోటర్‌గా ఉంది. సీక్వెంట్ సైంటిఫిక్, జంతు ఆరోగ్య సంరక్షణ విభాగంలో ఏపీఐ, ఫార్ములేషన్ల ఔషధాలను అందిస్తోంది. 2023-24లో ఈ సంస్థ రూ.1400 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

అగ్రశ్రేణి ఆర్ అండ్ డీ సంస్థగా ఎదిగేందుకు వీలు



వియాష్ లైఫ్

సీఈఓ హరిబాబు

వియాష్ లైఫ్‌సైన్సెస్, సీక్వెంట్ సైంటిఫిక్‌లలో కార్లైల్ ప్రధాన వాటాదారుగా ఉండటంతో, వియాష్‌ను సీక్వెంట్ సైంటిఫిక్ కిందకు తీసుకువస్తే, స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీలకు లభించే ప్రయోజనాలు ఉంటాయి. రెండు కంపెనీలకు ఉన్న నైపుణ్యాలు, సామర్థ్యంతో ఒక అగ్రశ్రేణి ఆర్అండ్‌డీ కంపెనీగా ఎదిగే అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఈ విలీనం వల్ల తమ వినియోగదార్లకు ప్రపంచ స్థాయి ఉత్పత్తులు, సేవలు అందించగలుగుతామని వియాష్ లైఫ్ సీఈఓ బి.హరిబాబు అన్నారు.

ప్రతి 100 వియాష్ షేర్లకు 56

సీక్వెంట్ సైంటిఫిక్ డైరెక్టర్ల బోర్డు శుక్రవారం సమావేశమై ఈ విలీనానికి ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం వియాష్ లైఫ్‌సైన్సెస్ వాటాదార్లకు సీక్వెంట్ సైంటిఫిక్ షేర్లు కేటాయిస్తారు. ప్రతి 100 వియాష్ లైఫ్ షేర్లకు, 56 సీక్వెంట్ షేర్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత ఈ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో ట్రేడ్ అవుతాయి. విలీన వార్త వెలుగు చూడటంతో, శుక్రవారం సీక్వెంట్ సైంటిఫిక్ షేరు బీఎస్ఈలో రూ.26 పెరిగి, రూ.217 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,400 కోట్లకు చేరింది. ప్రతిపాదిత లావాదేవీ పూర్తయ్యాక పూర్తయ్యాక, విలీన సంస్థ మార్కెట్ విలువ రూ.8,000-10,000 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. విలీనం వల్ల పశు సంపద- ఆరోగ్యం విషయంలో అగ్రస్థానానికి చేరుకోగలుగుతామని సీక్వెంట్ సైంటిఫిక్ ఎండీ, సీఈఓ రాజారాం నారాయణన్ పేర్కొన్నారు.

బీఎస్ఈ, ఎన్ఎస్ఈల లావాదేవీ రుసుముల్లో మార్పులు

అక్టోబరు 1 నుంచి అమల్లోకి

దిల్లీ: ఈక్విటీ (క్యాష్), డెరివేటివ్స్ (ఫ్యూచర్స్, ఆప్షన్స్) విభాగాల్లో ట్రేడ్‌లకు లావాదేవీ రుసుములను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు సవరించాయి. సవరించిన రుసుములు అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులకు రూ.కోటి ప్రీమియమ్ టర్నోవరుపై లావాదేవీ రుసుమును రూ.3,250కు బీఎస్ఈ సవరించింది. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ఇతర కాంట్రాక్టుల లావాదేవీ రుసుముల్లో మార్పు చేయలేదు. ఎన్ఎస్ఈ విషయానికొస్తే క్యాష్ మార్కెట్‌కు లావాదేవీ రుసుము రూ.లక్ష ట్రేడింగ్ విలువకు రూ.2.97గా ఉండనుంది. ఈక్విటీ ఫ్యూచర్స్‌కు ఈ రుసుము రూ.1.73 కాగా.. ఈక్విటీ ఆప్షన్స్‌కు రూ.లక్ష ప్రీమియం విలువకు రూ.35.03గా సవరించింది.

400 రోజుల ఎఫ్‌డీ : బీఓఐ

ఈనాడు, హైదరాబాద్: పండగల సీజన్ సందర్భంగా ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తెలిపింది. 400 రోజుల కాలవ్యవధి గల ఈ డిపాజిట్ పథకంలో సూపర్ సీనియర్ సిటిజన్లకు (80 ఏళ్లు దాటిన వారు) 8.10%; సీనియర్ సిటిజన్లకు (60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల లోపు వారికి) 7.95%, సాధారణ డిపాజిట్‌దారులకు 7.45% వడ్డీ ఇస్తామని వెల్లడించింది. రూ.3 కోట్ల లోపు డిపాజిట్లకు ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయి.

కోడి గుడ్డు

28న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	505
వరంగల్	507
విజయవాడ	530
గోదావరి	530
విశాఖపట్నం	530
చిత్తూరు	543

భారత్‌లోనే ఎక్కువ నియామకాలు చేపడతాం

యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్

దిల్లీ: అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థ యాక్సెంచర్, భారత్‌లో మరిన్ని నియామకాలు జరుపుతామని ప్రకటించింది. ముఖ్యంగా తాజా ఉత్తీర్ణులపై సంస్థ దృష్టి సారిస్తున్నట్లు కంపెనీ సీఈఓ జూలీ స్వీట్ వెల్లడించారు. కళాశాలల నుంచి కొత్తగా బయటకు వచ్చే గ్రాడ్యుయేట్లను నియమించుకోవడానికి కంపెనీ కట్టుబడి ఉందని 'ఇన్వెస్టర్ కాల్'లో ఆమె పేర్కొన్నారు. ఈ నియామకాల్లో ఎక్కువ భాగం భారత్‌లోనే ఉంటాయని అన్నారు. 'డేటా, ఏఐ (కృత్రిమ మేధ) సిబ్బందిని స్థిరంగా పెంచుకుంటున్నాం. 2025-26 కల్లా 80,000 మందిని తీసుకోవాలన్న లక్ష్యంలో భాగంగా, ఇప్పటికే 57,000 ప్రాక్టిషనర్లను నియమించుకున్నామ'ని జూలీ పేర్కొన్నారు.

సిస్కో తొలి తయారీ కేంద్రం

అమెరికా టెక్నాలజీ దిగ్గజ సంస్థ సిస్కో, మన దేశంలో తొలి తయారీ కేంద్రాన్ని చెన్నైలో ప్రారంభించింది. దేశీయ విపణితో పాటు ఎగుమతుల కోసం ఇక్కడ నెట్‌వర్క్ కన్వర్జన్స్ సిస్టమ్ 540 సిరీస్ రౌటర్లను తయారు చేయనున్నారు. ఇందువల్ల 1200 మందికి ఉద్యోగాలు లభిస్తాయని సంస్థ సీఈఓ చక్ రాబిన్స్ వెల్లడించారు.

రెండేళ్లలో 2,000 ఉద్యోగాలు

అసూరెన్స్ ఇంటర్నేషనల్

దిల్లీ: భారత్‌లో వచ్చే రెండేళ్లలో 2,000 మందిని నియమించుకునే ప్రణాళికలో ఉన్నట్లు వాహన విడిభాగాల కంపెనీ అసూరెన్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పేర్కొంది. వివిధ అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తుల విక్రయాలను పెంచుకునే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఇంజినీరింగ్, సేల్స్, కస్టమర్ సపోర్ట్, ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ సీఈఓ ముకేశ్ శర్మ పేర్కొన్నారు.

స్పెషాలిటీ స్టీల్ కోసం మరోసారి పీఎల్ఐ పథకం

దిల్లీ: స్పెషాలిటీ ఉక్కు కోసం మరోసారి పీఎల్ఐ పథకాన్ని తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం పనిచేస్తోంది. తొలిసారి ఈ పథకాన్ని ప్రకటించినప్పుడు, అంచనాలకు తగ్గట్లుగా స్పందన రానందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ పేర్కొన్నారు.



రక్షణ, వాహన, విద్యుత్ వంటి రంగాల్లో ఉపయోగించే నాణ్యమైన ఉక్కును స్పెషాలిటీ స్టీల్ అంటారు. శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో సందీప్ మాట్లాడుతూ 'స్పెషాలిటీ ఉక్కు రంగానికి మరింత చేయాల్సి ఉంది. ఈ రంగానికి ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకంపై మరింత ఆసక్తి తీసుకురావడం కోసం ఇంకో విడత అమలు చేస్తామ'న్నారు. మొత్తం రూ.6,400 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చేలా ఈ రంగానికి పీఎల్ఐ పథకాన్ని ప్రకటించగా.. అందులో రూ.2600 కోట్లు మాత్రమే కేటాయింపులు చేయగలిగినట్లు వివరించారు.

200 మర్చంట్ బ్యాంకర్ల లైసెన్సులు రద్దవుతాయా?

సెబీ కఠిన నిబంధనల నేపథ్యం

దిల్లీ: మర్చంట్ బ్యాంకర్లకు సంబంధించి, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించిన కఠిన నిబంధనలు అమల్లోకి వస్తే, ప్రస్తుతం గుర్తింపు ఉన్న ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థల్లో 225కి పైగా సంస్థలు ఈ వ్యాపారం నుంచి వైదొలిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



దాదాపు మూడు దశాబ్దాల క్రితం (1992లో) రూపొందించిన మర్చంట్ బ్యాంకర్ల నిబంధనలే ఇప్పటికే అమల్లో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వీటిల్లో మార్పుచేర్పులు చేయాలని సెబీ యోచిస్తోంది. ఇందుకు సంబంధించి గత నెలలో విడుదల చేసిన చర్చాపత్రంలో మర్చంట్ బ్యాంకర్లకు పలు కొత్త నిబంధనలను సెబీ ప్రతిపాదించింది. మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా నిర్దిష్ట ఆదాయాన్ని ఆర్జించకుంటే ఆ సంస్థల లైసెన్సు రద్దు చేయడం లాంటివి ఇందులో ఉన్నాయి. ఇవి కార్యరూపం దాలిస్తే, క్రియాశీలకంగా లేని / నామమాత్రంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు తమ లైసెన్సు కోల్పోయే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇందువల్ల వందల సంఖ్యలో లైసెన్సులు రద్దయినా, అవి నిర్వహించే లావాదేవీలు నామమాత్రంగా ఉన్నందున 'మర్చంట్ బ్యాంకింగ్ రంగంపై పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చ'ని పేర్కొంటున్నారు.

ఇవీ ప్రతిపాదనలు: క్యాటగిరీ 1 మర్చంట్‌బ్యాంకర్‌గా కార్యకలాపాలు సాధించేందుకు అనుమతి పొందాక, వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి కనీసం రూ.25 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడంలో విఫలమైతే.. వాటి లైసెన్సును రద్దు చేయాలన్నది సెబీ ప్రతిపాదన.

✦ కనీసం రూ.50 కోట్ల నికర విలువ ఉంటేనే కేటగిరి 1 మర్చంట్ బ్యాంకర్‌గా లైసెన్సు లభిస్తుంది. ప్రస్తుతం ఇది రూ.5 కోట్లుగా ఉంది.

✦ కేటగిరి 2 మర్చంట్ బ్యాంకర్‌లు రూ.10 కోట్ల నికర సంపదను కలిగి ఉండటంతో పాటు, వరుస మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీసం రూ.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాల్సి ఉంటుంది.

✦ మర్చంట్ బ్యాంకర్లకు ప్రస్తుతమున్న నిబంధనావళిలో సెబీ లైసెన్సు రద్దుకు సంబంధించిన అంశం లేదు.


✦ ప్రధాన కంపెనీలు, ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదవుతున్న చిన్న-మధ్య స్థాయి సంస్థల ఐపీఓ కార్యకలాపాలను చూస్తున్న మర్చంట్ బ్యాంకర్ల మధ్య స్పష్టమైన విభజన ఉండేలా ప్రతిపాదిస్తున్నారు. క్యాటగిరీ 2 మర్చంట్ బ్యాంకర్లు ఇకపై ప్రధాన కంపెనీల ఐపీఓ వ్యవహారాలను పర్యవేక్షించలేరు.

డిపాజిట్ల సేకరణకు బ్యాంకుల కష్టాలు

- 80 శాతానికి చేరిన రుణ-డిపాజిట్ల నిష్పత్తి
- ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ నివేదిక

దిల్లీ: రుణాలకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా డిపాజిట్లను సేకరించేందుకు బ్యాంకులు కష్టపడుతున్నాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.1,64,98,006 కోట్ల రుణాలను ఇచ్చాయి. ఇదే సమయంలో క్రెడిట్ టు డిపాజిట్ (సీ-డీ) నిష్పత్తి 75.8% నుంచి 80.3 శాతానికి చేరిందని ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది.

2024 ఏప్రిల్ ఆర్‌బీఐ బులెటిన్ ప్రకారం చూస్తే.. మార్చిలో సీడీఆర్ 95.94 శాతంగా ఉంది. 2024 మార్చి 8 నాటికి ఇది 92.95 శాతంగా నమోదయ్యింది. వాణిజ్య బ్యాంకుల రుణ వితరణ ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. అదే సమయంలో డిపాజిట్లలో మాత్రం ఆశించినంతగా వృద్ధి కనిపించడం లేదు. 2018-19 నుంచి ఇప్పటి వరకూ డిపాజిట్లతో పోలిస్తే రుణాల్లోనే అధిక వృద్ధి నమోదవుతోంది. బ్యాంకు డిపాజిట్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాలు అనేకం అందుబాటులోకి రావడంతోనే ఈ చిక్కులు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని అసంఘటిత రంగం నుంచి బ్యాంకు డిపాజిట్లలోకి నగదు రావడం లేదని తెలిపింది.



పెట్టుబడుల వైపు..

స్టాక్ మార్కెట్లోకి వస్తున్న 30 ఏళ్లలోపు పెట్టుబడిదారులు 2018-19లో 22.6 శాతంగా ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి 39.9 శాతానికి (జులై 31 నాటికి) చేరారు. యువ మదుపరులు ఈక్విటీ మార్కెట్లపైనే ఆసక్తి చూపిస్తున్నారని నివేదిక తెలిపింది. 30-39 ఏళ్ల మధ్య ఉన్నవారి సంఖ్య స్థిరంగా ఉండగా, 40 ఏళ్లకు పైబడిన వారి సంఖ్య కాస్త తగ్గిందని వెల్లడించింది.

పన్ను రేట్లు తగ్గితే మేలు

డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కొత్త మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. గతంలోలాగా చిన్న డిపాజిట్లను ఆకర్షించేందుకు దృష్టి సారించాలని పేర్కొంటున్నారు. భారీమొత్తంలో లభించే కార్పొరేట్ డిపాజిట్లపైనే బ్యాంకులు ఆధారపడకుండా, ప్రజల నుంచి చిన్న మొత్తంలో డిపాజిట్లు స్వీకరించేందుకు ఆసక్తి చూపించాలని ట్రూనార్త్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈఓ రోచక్ భక్షి వివరించారు. బ్యాంకులకు బలమే చిన్న మదుపరులని గుర్తు చేశారు. బ్యాంకుల్లో 47 శాతం డిపాజిట్లు సీనియర్ సిటిజన్లవే ఉన్నాయని, అంటే, యువత బ్యాంకు డిపాజిట్లను పట్టించుకోవడం లేదనే సంగతి స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వం డిపాజిట్ల ప్రతిఫలంపై పన్ను శాతాన్ని తగ్గించాలని, అప్పుడే వీటిపై ఆసక్తి పెరుగుతుందన్నారు.

సోనాలిక ట్రాక్టర్స్ నుంచి మైక్రో విద్యుత్తు కార్లు!

అంతర్జాతీయంగా విద్యుత్ కార్లకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని, వీటి తయారీ చేపట్టాలని సోనాలిక ట్రాక్టర్స్ యోచిస్తోంది. మనదేశం నుంచి ట్రాక్టర్ల ఎగుమతిలో అతి పెద్ద సంస్థ అయిన సోనాలిక ట్రాక్టర్స్, ఐరోపా విద్యుత్ క్వాడ్రిసైకిల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టాలని భావిస్తోంది. మొదటగా నెదర్లాండ్స్‌లో చిన్న విద్యుత్ కార్ల (మైక్రోకార్స్)ను సంస్థ ఆవిష్కరించనుందని తెలుస్తోంది. 'ప్రస్తుతం మేం క్వాడ్రిసైకిల్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఆ పనులు బాగా జరుగుతున్నాయ'ని సోనాలిక గ్రూప్ సంయుక్త ఎండీ రమన్ మిత్తల్ తెలిపారు. వీటిని కచ్చితంగా ఎపుడు ఆవిష్కరించేదీ చెప్పకపోయినప్పటికీ.. 12-24 నెలల్లో అందుబాటులోకి తెస్తామని వివరించారు. దేశీయ ట్రాక్టర్ల మార్కెట్లో ఈ కంపెనీకి 13.5% వాటా ఉంది. ఎగుమతి మార్కెట్లో 34.3% వాటా ఉండడం విశేషం.

మదుపర్ల లాభాల స్వీకరణ

సెన్సెక్స్ ▼ 264	నిఫ్టీ ▼ 37
85572	26179

సమీక్ష

మదుపర్ల లాభాల స్వీకరణతో సూచీల జోరుకు అడ్డుకట్ట పడింది. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో ముగియడమే కాకుండా.. జీవనకాల గరిష్ఠాల నుంచి వెనక్కి వచ్చాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాంటి దిగ్గజ షేర్లలో అమ్మకాలు ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 3 పైసలు తగ్గి 83.69 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.39% నష్టంతో 71.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కొత్త రికార్డు స్థాయిలకు చేరి..

సెన్సెక్స్ క్రితం రోజు ముగింపైన 85,836.12 పాయింట్లతో పోలిస్తే శుక్రవారం ఉదయం నష్టాలతో 85,571.85 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత 85,978.25 వద్ద జీవనకాల తాజా గరిష్ఠాన్ని తాకింది. అనంతరం మదుపర్ల లాభాల స్వీకరణలో నష్టాల్లోకి జారుకుని 85,474.58 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 264.27 పాయింట్ల నష్టంతో 85,571.85 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో ఇంట్రాడేలో 26,277.35 పాయింట్ల వద్ద రికార్డు గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 37.10 పాయింట్ల నష్టంతో 26,178.95 వద్ద స్థిరపడింది.

సగం షేర్లకు నష్టాలు: సెన్సెక్స్ 30 షేర్లలో సగం షేర్లు నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ షేరు 3.03%, భారతీ ఎయిర్‌టెల్ 1.96%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.83%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.65%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.55% చొప్పున డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 2.66%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.72%, టైటాన్ 1.5%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.43%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31%, ఏషియన్ పెయింట్స్ 1.01% లాభపడ్డాయి.

ఐటీ షేర్లు రాణించాయ్: అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థ యాక్సెంచర్, వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించడంతో, దేశీయంగా శుక్రవారం ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల షేర్లు తొలుత 4% రాణించినా, చివరకు 1.41% వరకు లాభాల్లో ముగిశాయి. ప్రధాన సూచీలు నష్టపోయినా, ఐటీ షేర్లు సానుకూలంగా చలించడం గమనార్హం. టెక్‌మహీంద్రా, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్, పర్సిస్టెంట్, ఎంఫసిస్, కోఫోర్జ్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ఎన్ఎస్ఈలో రాణించాయి.



✦ ఎల్లో డైమండ్, రిచ్ ఫీస్ట్ బ్రాండ్లపై స్నాక్స్‌ను విక్రయించే ప్రతాప్ స్నాక్స్ సంస్థలో 46.85% వాటా కొనుగోలు చేయనున్నట్లు ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, మహి మధుసూధన్ కేలా ప్రకటించారు. లావాదేవీ విలువ రూ.846.40 కోట్లు. ప్రతాప్ స్నాక్స్‌కు చెందిన ముగ్గురు ప్రమోటర్లు ఈ వాటా విక్రయించనున్నారు.

✦ డ్రీమ్ 11 మాతృసంస్థ డ్రీమ్స్ స్పోర్ట్స్‌లో వాటా విక్రయించేందుకు సింగపూర్ సంస్థ టీఐజీఏ ఇన్వెస్ట్‌మెంట్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతినిచ్చింది.

✦ అర్హులైన సంస్థాగత మదుపర్లకు షేర్ల జారీ ద్వారా పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.5000 కోట్లు సమీకరించింది. ఈ నిధులు బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి పెరిగేందుకు దోహదం చేయనున్నాయి.

✦ కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ముగిసేసరికి 213.26 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో 1,09,93,000 షేర్లను విక్రయానికి ఉంచగా.. 2,34,43,38,230 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 96.50 రెట్ల స్పందన లభించింది.

✦ డిఫ్యూజన్ ఇంజినీర్స్ తొలి పబ్లిక్ ఆఫర్ రెండో రోజుకు 27.17 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో 65,98,500 షేర్లను ఆఫర్ చేయగా.. 17,93,02,816 షేర్లకు బిడ్‌లు వచ్చాయి. చిన్న మదుపర్ల విభాగంలో 33.88 రెట్ల స్పందన లభించింది.

✦ రిలయబుల్ టెక్నోసిస్టమ్స్ ఇండియా నుంచి ఎలక్ట్రానిక్ మాడ్యూళ్ల కోసం రూ.5.72 కోట్ల ఆర్డరు లభించినట్లు అపోలో మైక్రో సిస్టమ్స్ వెల్లడించింది.

692 బిలియన్ డాలర్లకు విదేశీ మారకపు నిల్వలు

సెప్టెంబరు 20తో ముగిసిన వారంలో మన విదేశీ మారకపు నిల్వలు 2.838 బిలియన్ డాలర్లు పెరిగి 692.296 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది జీవనకాల తాజా గరిష్ఠ స్థాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 2.057 బిలియన్ డాలర్లు పెరిగి 605.686 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 726 మిలియన్ డాలర్లు అధికమై 63.613 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆర్) 121 మిలియన్ డాలర్లు పెరిగి 18.54 బిలియన్ డాలర్లకు చేరగా. . అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 66 మిలియన్ డాలర్లు తగ్గి 4.458 బిలియన్ డాలర్లకు పరిమితమైంది.

బీపీసీఎల్ షేరు దూకుడు

మదుపర్ల నుంచి గణనీయ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) షేరు బీఎస్ఈలో 7% దూసుకెళ్లి రూ.370.50 వద్ద జీవనకాల తాజా గరిష్ఠాన్ని చేరింది. చివరకు 6.43% పెరిగి రూ.367.30 వద్ద ముగిసింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో కలిపి మొత్తంగా 3 కోట్ల వరకు షేర్లు చేతులు మారాయి. నెలవారీ సగటు ట్రేడింగ్ పరిమాణం అయిన ఒక కోటి షేర్లతో పోలిస్తే ఇది మూడింతలు. గత ఏడాదికాలంలో బీపీసీఎల్ షేరు 110% లాభపడింది. అంటే వాటాదార్ల పెట్టుబడి రెట్టింపునకు పైగా పెరిగిందన్నమాట.

ఈనాడు సినిమా

అగ్ర తారల సినిమాలు ఏళ్లకొద్దీ సమయం తీసుకొంటున్నాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు సినిమాలతో అలరించిన తారలు... ఇప్పుడు రెండు మూడేళ్లకో సినిమాకే పరిమితం అవుతున్నారు. ఎప్పుడు విడుదలవుతాయా ఆ సినిమాల కోసం ఎదురు చూసి అలసిపోతుంటారు అభిమానులు. భారీ తారాగణం, పాన్ ఇండియా హంగుల జోడింపు, సరైన విడుదల తేదీల అన్వేషణ... ఇలా వాటి వెనక చాలా లెక్కలుంటాయి. అందుకే అంత ఆలస్యం. యువ హీరోలకు ఈ విరామం బాగా కలిసొస్తోంది. అగ్ర తారలతో సినిమా కుదిరే అవకాశం లేక పోవడంతో చాలా మంది దర్శకులు యువ హీరోలపై దృష్టి పెడుతున్నారు. ఇదే అదనుగా వాళ్లూ వేగం పెంచి చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. రానున్న రోజుల్లో యువ హీరోల సినిమాల విడుదలల సంఖ్య భారీగా పెరగనుంది.

యువ హీరో... యమ జోరు

● చేతినిండా సినిమాలతో నవతరం కథానాయకులు బిజీ


సిద్ధు జొన్నలగడ్డ


అడివి శేష్


నిఖిల్


వరుణ్ తేజ్


శర్వానంద్


విష్వక్ సేన్


శ్రీవిష్ణు

వచ్చే ఏడాది తనవి మూడు సినిమాలు విడుదలవుతాయంటూ అడివి శేష్ ఇటీవలే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. రెండు సినిమాల చిత్రీకరణలతో బిజీగా గడుపుతున్న శర్వానంద్... సంపత్ నంది దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రాన్ని ఖరారు చేశారు. విష్వక్‌సేన్ చేస్తున్న సినిమాల జాబితా అయితే అంతకంతకూ పెరుగుతూనే ఉంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌దీ అదే జోరు. వీళ్లే కాదు... యువ కథానాయకుల్లో ఎక్కువమంది ఎక్కువ సినిమాలు చేయడంపై దృష్టిపెట్టారు. వాళ్ల దగ్గరకు ఆ స్థాయిలోనే కథలొస్తున్నాయి.

◆ అగ్ర తారలే కాదు... అప్పుడప్పుడూ యువ హీరోలూ బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తుంటారు. రూ.వందల కోట్లు వసూళ్ల రికార్డులూ వీళ్ల సొంతం అవుతున్నాయి. గత కొన్నేళ్లుగా పాన్ ఇండియా స్థాయిలోనూ అదరగొట్టిన యువ హీరోలూ మన దగ్గర చాలా మందే. 'మేజర్' సినిమాతో అడివి శేష్, 'కార్తికేయ 2' సినిమాతో నిఖిల్ చేసిందదే. అందుకే యువ హీరోల సినిమాల్నీ పరిశ్రమ, వ్యాపార వర్గాలు ఎంతో కీలకంగా భావిస్తుంటాయి. అగ్ర హీరోల కంటే, యువ హీరోల సినిమాలే పరిశ్రమని ముందుకు నడిపిస్తుంటాయి. వీళ్లు జోరు పెంచి ఎక్కువ సంఖ్యలో సినిమాలు చేస్తే చిత్రసీమ మరింత కళగా మారుతుంది. ప్రస్తుతం ఆ కళ టాలీవుడ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అడివి శేష్ 'డెకాయిట్', 'గూఢచారి 2' చిత్రాలు చేస్తున్నారు. ఈ రెండూ కూడా పాన్ ఇండియా స్థాయిలోనే రూపొందుతున్నాయి. వీటితోపాటు, మరో చిత్రాన్నీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తానని చెబుతున్నారు శేష్. మరో కథానాయకుడు నిఖిల్ పాన్ ఇండియా స్థాయిలోనే 'స్వయంభూ', 'ది ఇండియా హౌస్' చిత్రాలు చేస్తున్నారు. ఇవి పూర్తవుతాయో లేదో, ఆ వెంటనే 'కార్తికేయ 3' మొదలవుతుంది. ఇప్పటికే అందుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. వరుస విజయాలతో జోరు మీదున్న సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా ప్రస్తుతం 'జాక్', 'తెలుసు కదా' చిత్రాలు రూపొందుతున్నాయి. ఆ తర్వాత టిల్లు ఫ్రాంచైజీలో భాగంగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కనుంది.

◆ శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. బైక్ రైడింగ్ నేపథ్యంలో సాగే ఓ స్పోర్ట్స్ డ్రామా ఇది. శర్వానంద్‌కి 36వ చిత్రం. ఆయన 37వ చిత్రం రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతోంది. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. వీటితోపాటు, ఇటీవలే సంపత్ నంది దర్శకత్వంలో 38వ చిత్రాన్ని ఖరారు చేశారు శర్వానంద్. ఇదొక పీరియాడిక్ కథతో రూపొందుతోంది. ఈ సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ త్వరలోనే 'బైసన్ నాయుడు' చిత్రంతో సందడి చేయనున్నారు. దీంతోపాటు కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలోనూ, లుధీర్ అనే ఓ యువ దర్శకుడితోనూ సినిమాలు చేస్తున్నారు. మంచు మనోజ్, నారా రోహిత్‌తో కలిసి ఓ తమిళ చిత్రం రీమేక్‌లోనూ నటిస్తున్నారు. విష్వక్‌సేన్ ప్రస్తుతం 'మెకానిక్ రాకీ', 'లైలా' సినిమాలు చేస్తున్నారు. శ్రీధర్ గంటా దర్శకత్వంలో ఓ విలేజ్ పొలిటికల్ యాక్షన్ డ్రామానీ, అనుదీప్ దర్శకత్వంలో ఓ వినోదాత్మక చిత్రాన్నీ చేస్తున్నారు. 'మెకానిక్ రాకీ' ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీవిష్ణు వచ్చే నెలలో 'శ్వాగ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆ తర్వాత గీతా ఆర్ట్స్ సంస్థలో కార్తీక్ రాజు దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో ఓ చిత్రం ప్రారంభమైన సంగతి తెలిసిందే. 'మట్కా' సినిమాతో బిజీగా గడుపుతున్న వరుణ్‌తేజ్, తదుపరి మేర్లపాక గాంధీ దర్శకత్వంలో సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ నవంబరు నుంచి మొదలు కానుంది. మరో రీమేక్ సినిమాపై కూడా చర్చలు సాగుతున్నట్టు సమాచారం.

◆ యువ హీరోల్లో భారీ బడ్జెట్ చిత్రాలు చేస్తున్న కథానాయకులు నాని, నాగచైతన్య, నితిన్. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' సినిమాపైనే దృష్టిపెట్టినా, ఆయన కూడా వరుసగా సినిమాలు చేయబోతున్నారు. ప్రస్తుతం 'హిట్ 3' చేస్తున్న నాని తదుపరి శ్రీకాంత్ ఓదెల, సుజీత్ దర్శకత్వంలో సినిమాలు చేయనున్న సంగతి తెలిసిందే. నితిన్ 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' చిత్రాలతో వరుసగా సందడి చేయనున్నారు. ఇవి కాకుండా కొత్త సినిమాలూ కొన్ని లైన్‌లో ఉన్నాయి. యువ హీరోలు చాలా మంది చేతినిండా సినిమాలతో జోరుమీదున్నా, కొంత మంది ఇంకా సరైన కథల కోసం ఎదురు చూస్తున్నారు. అఖిల్ అక్కినేని, వైష్ణవ్‌తేజ్ తదితర తారలూ ఇలాగే వేగం పెంచారంటే వచ్చే ఏడాది మరింత హంగామానే అనేది పరిశ్రమ వర్గాల అంచనా.

కొత్త పాత్రలో సాయిపల్లవి



శివ కార్తికేయన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'అమరన్'. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 31న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో సాయిపల్లవి... ఇందు రెబెకా వర్గీస్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఆ పాత్రని పరిచయం చేస్తూ చిత్రబృందం శుక్రవారం ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రమిది. తెలుగు రాష్ట్రాల్లో సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి కలిసి శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై విడుదల చేస్తున్నారు. జి.వి.ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఎన్టీఆర్ వన్ మేన్ షో అనడానికి గర్వపడుతున్నా


సుధాకర్, కల్యాణ్ రామ్, కొరటాల శివ

"నా తమ్ముడు తెరపై కనిపించిన విధానం, తన నటన, పతాక సన్నివేశాల్లో చూపించిన ఆవేదన థియేటర్లలో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. 'దేవర' ఎన్టీఆర్ వన్ మేన్ షో అని చెప్పడానికి గర్వపడుతున్నా'' అన్నారు ప్రముఖ కథానాయకుడు, నిర్మాత నందమూరి కల్యాణ్‌రామ్. ఆయన సమర్పణలో, తన తమ్ముడు ఎన్టీఆర్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె సంయుక్తంగా నిర్మించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి విజయోత్సాహాన్ని పంచుకుంది. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "మా అందరి నాలుగేళ్ల కష్టం ఈ సినిమా. రికార్డు స్థాయిలో వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకుల ఆదరాభిమానాలకూ, అభిమానులకూ మేమెప్పుడూ రుణపడి ఉంటాం. ఎన్టీఆర్ ఇరగదీశాడు. మా నిర్మాణ సంస్థలకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన దర్శకుడు శివ, చిత్రబృందానికి కృతజ్ఞతలు" అన్నారు. దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ "నా కెరీర్‌లో అత్యుత్తమ చిత్రం ఇదే అంటున్నారు. ఇంత పెద్ద విజయం ఇచ్చినందుకు తెలుగు ప్రేక్షకులకు, ఈ అవకాశాన్నిచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌తోపాటు చిత్రబృందం అందరికీ కృతజ్ఞతలు. వీళ్లంతా లేకపోతే 'దేవర' ఈ స్థాయికి వెళ్లేది కాదు. ప్రతి ఒక్కరూ సొంత సినిమాలా భావించి రాత్రింబవళ్లు పని చేశారు. అందుకే ఇంత నాణ్యంగా వచ్చింది. మాకు విజయం వచ్చింది'' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "తెలుగు నుంచి స్టార్ కథానాయకుల సినిమా వస్తుందంటే చాలు... తెలుగు రాష్ట్రాల్లో కానీ, ఓవర్సీస్‌లో కానీ పండగ వాతావరణం నెలకొంటుంది. ప్రేక్షకుల అభిమానం వల్లే ఇలాంటి సినిమాలు నిర్మించాలనే కసి మాలో పెరుగుతోంది. ఎన్టీఆర్ తెరపై కనిపించిన విధానాన్ని అలా చూస్తూనే ఆస్వాదించాం. సినిమా మొదలైన దగ్గర్నుంచి, చివరి వరకూ ఒకే రకమైన టెంపోలో సినిమా సాగింది. తొలి రోజు వసూళ్లలో టాప్ 2 స్థానంలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాని నైజాం ప్రాంతంలో విడుదల చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఇటీవలే జపాన్, చైనా, రష్యా దేశాల పర్యటనకి వెళ్లా. తెలుగు సినిమాకి వాళ్లు ఇస్తున్న గౌరవం ఎంతో ఆనందాన్నిచ్చింది. మన స్టార్ హీరోలు అందరినీ సొంతం చేసుకున్నారు. ఎంతో గర్వంగా అనిపించింది. తెలుగు సినిమాని ఈ స్థాయిలో నిలబెట్టిన దర్శకులకు, కథానాయకులకు కృతజ్ఞతలు'' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, గీత రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

థ్రిల్ చేసే జిగేల్


హను రాఘవపూడి, మల్లి ఏలూరి

త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'జిగేల్'. ఈ కామెడీ థ్రిల్లర్‌ను మల్లి ఏలూరి తెరకెక్కిస్తున్నారు. జగన్ మోహన్, నాగార్జున అల్లం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ టీజర్‌ను ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి విడుదల చేశారు. త్రిగుణ్‌ను లాకర్ టెక్నీషియన్‌గా పరిచయం చేస్తూ మొదలైన ఈ టీజర్.. కామెడీ, థ్రిల్లింగ్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోంది. 20ఏళ్లుగా ఎలా తెరవాలో తెలియని ఓ లాకర్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్‌తో స్పష్టమవుతోంది. సాయాజీ షిండే, పోసాని కృష్ణమురళీ, రఘుబాబు, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్నారు.


సతీశ్, వంశీ పైడిపల్లి, రామారావు

రాజావారి రాక దసరాకి

'మ్యాడ్', 'ఆయ్' చిత్రాలతో విజయాల్ని అందుకున్న నార్నె నితిన్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద కథానాయిక. సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహిస్తున్నారు. చింతపల్లి రామారావు నిర్మాత. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ప్రేమ, కుటుంబ నేపథ్యంలో సాగే మంచి చిత్రమిది. 'శతమానం భవతి' సినిమాతో జాతీయ పురస్కారం అందుకున్న సతీశ్ వేగేశ్న తనదైన శైలిలోనే ఈ సినిమాని తెరకెక్కించారు. నార్నె నితిన్ హీరోగా ఎదుగుతున్నారు. ఆయనకి, సతీశ్ వేగేశ్నకి, నిర్మాతకీ ఈ చిత్రంతో మరో మంచి విజయం దక్కుతుందని నమ్ముతున్నా. దసరాకి కుటుంబమంతా కలిసి చూసేందుకు సరైన సినిమా ఇది'' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "'మ్యాడ్', 'ఆయ్' తర్వాత నార్నెకి ఈ సినిమాతో హ్యాట్రిక్ విజయం సొంతం కానుంది. ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని మలిచారు దర్శకుడు. దసరా సంబరాల్ని రెట్టింపు చేస్తుందీ చిత్రం'' అన్నారు. రావు రమేశ్, నరేశ్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరయు, రమ్య, ప్రియ మాచిరాజు, భద్రం, ఆనంద్, జబర్దస్త్ నాగి తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

మీ సూచనలు స్వాగతిస్తున్నాం... కానీ!


కంగనా రనౌత్

బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సందర్భాన్ని.. ఆ సమయంలో ఆమె ఎదుర్కొన్న అసమానతలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఇందులో ఓ వర్గం ప్రజల్ని కించపరిచే సన్నివేశాలున్నాయంటూ, ఈ సినిమా విడుదల నిలిపివేయాలని గత కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రంలో కొన్ని కట్స్ సూచించిన సెన్సార్ బోర్డు వాటిని అమలు చేస్తేనే సర్టిఫికేట్ జారీ చేస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా దీనిపై స్పందించిన కంగనా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'చిత్రంలో కొన్ని సన్నివేశాలను తొలగించడం గురించి చెప్పిన విషయాలను స్వాగతిస్తున్నాం. కానీ.. మీరు చెప్పిన కొన్ని సూచనలు అర్థవంతంగా అనిపించట్లేదు. ఇప్పటికే ఎంతో మంది ప్రతిభావంతులు మా చిత్రాన్ని చూసి ప్రశంసించారు. ఏ విషయంలో కూడా రాజీపడకుండా నిజాయతీగా చిత్రాన్ని తెరకెక్కించడం పట్ల వారు మమ్మల్ని అభినందించారు. వారి ఆమోదం ప్రోత్సాహకరంగా ఉంది. మేము ఈ కథను తగిన విధంగా గౌరవించామని నమ్ముతున్నాం. అందుకే నేను, చిత్రబృందం మా సినిమాని రక్షించడానికి సిద్ధంగా ఉన్నాం" అని చెప్పుకొచ్చింది.

చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం అందరి దృష్టి 'సింగమ్ అగైన్' చిత్రంపైనే. సినీప్రియులను విశేషంగా ఆకట్టుకున్న 'సింగమ్' ఫ్రాంచైజీలో రూపొందుతున్న చిత్రమిది. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో

యాక్షన్ చూపించే బాజీరావ్


అజయ్ దేవగణ్

నటిస్తున్న ఈ కాప్ యూనివర్స్ చిత్రాన్ని రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్నారు. దీపికా పదుకొణె, కరీనా కపూర్, రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను వచ్చే నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "ఈ కాప్ యూనివర్స్‌లో రూపొందుతున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. దీనికి అనుగుణంగానే చిత్రాన్ని తీర్చిదిద్దుతుంది చిత్ర బృందం. అక్టోబరు 3న విడుదల కాబోతున్న ట్రైలర్‌తో బాజీరావ్ సింగమ్ యాక్షన్ మొదలవబోతుంది. ఈ ట్రైలర్ సినీప్రియుల ఊహలకందని విధంగా ఉండబోతుంద''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'దే దే ప్యార్ దే 2' చిత్రీకరణలో ఉన్నారు అజయ్.

శంభాజీ మహరాజ్ పట్టాభిషేకం


విక్కీ కౌశల్

బాలీవుడ్ కథానాయకుడు విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటిస్తోన్న చిత్రం 'ఛావా'. హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా దీనిని లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో శంభాజీ భార్య ఏసుబాయి పాత్రలో మెప్పించనుంది రష్మిక. ఇటీవల విడుదలైన 'ఛావా' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ కోట తరహాలో ఏర్పాటు చేసిన సెట్‌లో శంభాజీ మహరాజ్ పట్టాభిషేక వేడుక సన్నివేశాలను 700మంది బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్లతో చిత్రీకరించినట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ చిత్రాన్ని దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. అక్షయ్ ఖన్నా, అశుతోష్ రానా, ప్రదీప్ రావత్ తదితర నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ చిత్రం డిసెంబరు 6న విడుదల కానుంది.


'భూల్ భులయ్యా 3'

రూహ్‌బాబా X మంజులిక

"నా సింహాసనాన్ని అతనికి ఇవ్వడానికి మీకు ఎంత ధైర్యం. ఎన్నిసార్లు ఈ సింహాసనాన్ని దూరం చేసినా.. ఇది నాకు మాత్రమే సొంతం'' అనే సంభాషణలతో 'భూల్ భులయ్యా 3' హంగామాను మొదలుపెట్టింది చిత్రబృందం. హారర్ ప్రియుల్ని మెప్పించిన 'భూల్ భులయ్యా' ఫ్రాంచైజీలో రూపొందుతున్న చిత్రమిది. బాలీవుడ్ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, త్రిప్తి దిమ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "కథ ఇప్పుడే మొదలైంది. రూహ్ బాబా వర్సెస్ మంజులిక. ఈ ఎపిక్ హారర్ అడ్వెంచర్ దీపావళికి రాబోతుంది'' అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ చిత్రంలో మరోసారి మంజులిక పాత్రలో ప్రేక్షకులను భయపెట్టడానికి సిద్ధమైంది విద్యాబాలన్. ఇందులో ఆమె చెరసాల నుంచి బయటకు రావడానికి ప్రయత్నించడం, రూహ్‌బాబాతో సింహాసనం కోసం తలపడుతున్న సన్నివేశాలను చూపిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ టీజర్. ఆఖర్లో "నంబర్ వన్ మంత్రగత్తె ఆమె', 'ఈ ప్రపంచంలో దెయ్యాలకు భయపడేవారు మూర్ఖులు'' లాంటి సంభాషణలు చెప్తూ సినిమాపై అంచనాల్ని పెంచుతున్నాడు కార్తిక్. నవంబరు 1న విడుదల కానున్న ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు.

పల్లె వీధుల్లోన వైభవం


ఇక్రా ఇద్రిసి, రుత్విక్

రుత్విక్, ఇక్రా ఇద్రిసి జంటగా నటించిన చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రమాదేవి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులోని 'పల్లె వైభవాన్ని...' అంటూ సాగే పాటని చిత్రబృందం ఇటీవలే విడుదల చేసింది. చిన్ననాటి జ్ఞాపకాల్ని, తల్లిదండ్రుల ప్రేమని, స్వచ్ఛమైన స్నేహాన్ని, పల్లె వైభవాన్ని గుర్తు చేసే పాట ఇది. దర్శకుడు సాత్విక్ స్వయంగా బాణీలు సమకూర్చిన ఈ పాటకి ఆయనే సాహిత్యం సమకూర్చారు. రితేశ్.జి రావు ఆలపించారు. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని సినీ వర్గాలు తెలిపాయి.



పేరు: కైవల్య వోహ్రా
వయసు: 21, ఊరు: బెంగళూరు
సంపాదన: రూ.3,800 కోట్లు

పేరు: ఆదిత్ పాలిచా
వయసు: 23, ఊరు: ముంబయి
సంపాదన: రూ.4,500 కోట్లు

చిటికెలో.. రూ.30 వేల కోట్లు!


ఓ పదహారేళ్ల పిల్లాడు ఏదైనా తన స్థాయికి మించి పని చేయాలని చూస్తుంటే.. 'ఏయ్ బాబూ.. పక్కకెళ్లి ఆడుకోమ్మా' అంటుంటాం సరదాగా. కైవల్య వోహ్రా, ఆదిత్ పాలిచాలు సైతం ఒకప్పుడు అలా అనిపించుకున్నవాళ్లే. కానీ మూడేళ్లకే కథ మొత్తం మార్చేశారు. కౌమారంలోనే అంకుర సంస్థలు ప్రారంభించి, ఇరవైల్లోనే వేల కోట్లకు అధిపతులు అయ్యారు. కోట్ల జనం దైనందిన జీవితాల్లో భాగస్వాములై, వాళ్ల కొనుగోలు తీరునే ప్రభావితం చేశారు. తాజాగా 'లింక్డ్ఇన్ భారత్‌లోని మేటి అంకురసంస్థల జాబితా'లో మొదటిస్థానంలో నిలిచిన సందర్భంగా ఆ స్ఫూర్తివీరుల విజయ ప్రస్థానం ఇదిగో.

'జెప్టో' అంటే.. చిటికె వేసే సమయంలోని లక్షో వంతు అని అర్థం. తమ సేవలు అంత వేగంగా ఉంటాయనే ఉద్దేశంతో ఆ పేరు పెట్టారు కైవల్య, ఆదిత్‌లు. ఇద్దరిదీ పాదరసంలాంటి బుర్రే.. వ్యాపారం చేసి కోట్లు కొల్లగొట్టాలనే ఆలోచనే. టెక్నాలజీపై బాగా పట్టు ఉంది. ఆ సారూప్యతే ఇద్దర్నీ దగ్గర చేసింది. చదువుకుంటూనే 2018లో 'గో పూల్' అనే కారు పూల్ సర్వీస్‌ని ప్రారంభించారు. సిటీ బస్సులు, లోకల్ రైళ్లతో నిత్యం యుద్ధం చేసే ముంబయి వాసుల కష్టాలు తీర్చడానికి ఈ సర్వీస్ ఉపయోగపడుతుందని భావించారు. మొదటి ప్రయత్నం బాగానే వర్కవుట్ అయ్యింది. ఈలోగా వాళ్లకి ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రవేశం లభించింది. ఎంతోమంది కలలు కనే విద్యాసంస్థ అది. గో పూల్‌ని మంచి లాభాలకు అమ్ముకొని స్టాన్‌ఫర్డ్‌లో చేరారు. కానీ అప్పటికే ఇద్దరి మెదళ్లు రకరకాల వ్యాపార ఆలోచనలతో నిండిపోయి ఉన్నాయి. కొత్త అవకాశాలు ఊరించేవి. దాంతో తరగతి గదిలో నేర్చుకునేదానికన్నా.. సవాళ్లకు ఎదురెళ్లి కలల అంకుర సంస్థ నిర్మించాలనుకున్నారు.

- ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇవ్వగానే కిరాణా, ఇతర అత్యవసరాలు ఇంటింటికీ అందించే ఉద్దేశంతో 'కిరాణా మార్ట్'ని 2021లో ప్రారంభించిందీ మిత్రద్వయం. ఇది ఒక్కరోజు ఆలోచన కాదు. నెలలపాటు మార్కెట్ స్థితిగతులపై అధ్యయనం చేశారు. కరోనా కారణంగా జనం డోర్ డెలివరీ సర్వీసులకు కొద్దిగా అలవాటు పడ్డారు. అదే ఊపులో జనానికి చేరువ కావాలనుకున్నారు. 45 నిమిషాల్లో సరకుల్ని ఇంటింటికీ అందిస్తామన్నారు. కానీ వాళ్లు అనుకున్నంత సులభం కాలేదు వ్యాపారం. కొట్టుకి వెళ్లి సామాన్లు కొని తెచ్చుకొనే సంప్రదాయ విధానం వేళ్లూనుకొని ఉండటం, కొన్ని దిగ్గజ సంస్థలు అప్పటికే ఆన్‌లైన్ డెలివరీలో ముందుండటంతో వీళ్ల ప్రయత్నం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. కొంచెం నిరాశ ఆవహించినా.. లోపాలపై దృష్టి పెట్టారు. అప్పుడే అమెరికా వెళ్లి 'వై కాంబినేటర్'లో చేరారు. స్టార్టప్ వీరులను సానబెట్టే పేరున్న కార్యక్రమం అది. అదయ్యాక వాళ్ల వ్యూహంలో చాలా మార్పులొచ్చాయి. పైగా వీళ్ల బిజినెస్ మోడల్ నచ్చడంతో పెద్దఎత్తున డబ్బులు పెట్టడానికి ముందుకొచ్చిందో సంస్థ. అలా 'జెప్టో' ఊపిరి పోసుకుంది. కానీ కిరాణా మార్ట్‌లో లోపాలు సవరించుకొని, పోటీదారులను దాటుకొని ముందుకెళ్లాలంటే ఏదో కొత్తదనం చూపించాలిగా! అందుకే 'ఆర్డర్ ఇచ్చిన పది నిమిషాల్లోనే సరకుల్ని మీ ఇంటికి చేరవేస్తాం' అని ప్రకటించారు. పెద్దఎత్తున ప్రచారం చేశారు. మొదటి లక్షన్నర ఆర్డర్లు రూపాయికే అందించారు. రాయితీలు, ఆఫర్లు ఎలాగూ ఉండనే ఉన్నాయి. పచారీ సామాన్లు, కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలు.. ఇలా 86 రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు. ఇవన్నీ సాహసాలనే చెప్పాలి. దానికి తగ్గట్టుగానే నెట్‌వర్క్‌ని తయారు చేసుకున్నారు.

- 2023లో భారత్‌లో తొలి యూనికార్న్ కంపెనీ జెప్టో.
- 21ఏళ్ల అత్యంత పిన్నవయసులో భారత బిలియనీర్లుగా నిలిచారు.
- హురూన్ 30ఏళ్లలోపు వ్యాపారవేత్తల జాబితాలో స్థానం.
- ఫోర్బ్స్ 30 అండర్ 30లో చోటు.

- మిగతా పోటీదారులు తమ నిల్వకేంద్రాలు నగరానికి ఆవల ఏర్పాటు చేస్తే.. జెప్టో మాత్రం.. వ్యూహాత్మకంగా బాగా జనసమ్మర్థం ఉన్న, అత్యధికంగా ఆర్డర్లు వచ్చే ప్రాంతాలకు సమీపంలోనే ఏర్పాటు చేసింది. దానికి తగ్గట్టే డెలివరీ భాగస్వాములు, స్థానిక వేర్‌హౌజ్ కేంద్రాల నిర్వాహకులతో చేతులు కలిపారు. వేగం, నాణ్యత.. నినాదంగా మలచుకున్నారు. వినియోగ దారులకు కావాల్సింది అదే. ఈసారి గురి తప్పలేదు. 'జెప్టో' శరవేగంతో జనాలకు చేరువైంది. దేశంలోని పది ముఖ్యనగరాలకు విస్తరించింది. రెండేళ్లలో నాలుగు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పోటెత్తాయి. ఏడాది తిరగకముందే యాప్‌లో పదిలక్షల ఆర్డర్లు వచ్చాయి. ప్రారంభించిన మూడేళ్లలోనే ముప్ఫై వేల కోట్ల రూపాయల విలువైన కంపెనీగా ఎదిగింది. ఇప్పుడు దిగ్గజ ఈ-కామర్స్ సంస్థలు సైతం వీళ్లబాటలోకే వచ్చేశాయి. 'మేమూ తక్కువ సమయంలోనే ఆర్డర్లు అందిస్తామ'ని చెబుతుండటం జెప్టో గొప్ప విజయం కాక మరేంటి?




తారాబులో తడిసిపోదామా?

వీకెండ్ వండర్

పన్నెండు వందల అడుగుల ఎత్తయిన జలపాతం! పైనుంచి అలవోకగా జారిపోయే ఆకాశ గంగ.. కింద ఆనందంగా జలకాలాడేందుకు చోటు. ఎటుచూసినా పచ్చని చెట్లు, చల్లని గాలి! చెబుతుంటేనే చూడాలి అనిపిస్తోంది కదా, దగ్గరగా చూస్తే వెనక్కి తిరిగి రావాలి అనిపించనంత అందంగా ఉంటుంది.. అదే తారాబు వాటర్‌ఫాల్స్. అరకులోయ నుంచి పాడేరు వెళ్లే దారిలో పెదబయలు అనే ఊరుంది. అరకు నుంచి పెదబయలుకి 40 కిలోమీటర్లు. అక్కడి నుంచి మరో 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే గుంజివాడ అనే గ్రామానికి చేరుకోవచ్చు. దానికి రెండు కిలోమీటర్ల దూరంలో గజిబిజి ప్రపంచానికి దూరంగా.. ప్రకృతి రమణీయతకు దగ్గరగా ఉందీ జలపాతం. వారాంతంలో సరదాగా బయల్దేరితే.. ఒక్కరోజులో చూసి రావచ్చు. ఇతర రవాణా మార్గాలు, భోజన సదుపాయాలు ఉండవు సుమా! సొంతంగా అన్నీ సమకూర్చుకుని వెళ్తే, సరదాగా రోజంతా ఎంజాయ్ చేయొచ్చు!!

– న్యూస్‌టుడే, అరకులోయ



మంచివాడే.. ముద్దూముచ్చటేం తెలియదు!

మనలో మనం

అందగాడు, బుద్ధిమంతుడు అని కన్నవాళ్లు పోరు పెడితే ఒకబ్బాయిని పెళ్లి చేసుకున్నా. తను మంచివాడే, కాకపోతే ముద్దూముచ్చట్లేం తెలియవు. బయటికెళ్లినప్పుడు చేతిలో చేయేస్తే విదుల్చుకుంటాడు. జంటగా తీసుకున్న సెల్ఫీ, స్టేటస్‌గా పెట్టినా.. అది 'పనికిమాలిన పని' అని తిడతాడు. బొత్తిగా రొమాంటిక్ సెన్స్ లేదు. పాతికలో ఉన్నాం.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు లైఫ్‌లో ఎంజాయ్ చేస్తామన్నది నా మాట. తనదేమైనా మానసిక జబ్బా?

- ఆర్.ఎం., ఈమెయిల్

పెద్దవాళ్లు తమ పిల్లలకు సంబంధాలు చూసేటప్పుడు కుటుంబ నేపథ్యం, బుద్ధిమంతుడు, మంచి ఉద్యోగస్తుడు, అందగాడు.. ఇవే చూస్తారు తప్ప మా కూతురితో రొమాంటిక్‌గా ఉంటాడా? సరదా వ్యక్తిత్వమా? అని ఎవరూ ఆలోచించరు. అది పెళ్లయ్యాక భాగస్వామికి మాత్రమే తెలుస్తుంది. అయినా ఇప్పుడు మించిపోయిందేమీ లేదు. మీరు భయపడుతున్నట్టు అదేమీ మానసిక వ్యాధి కాదు. పరిష్కరించలేని సమస్య అసలే కాదు. మీరిద్దరూ పెరిగిన వాతావరణం, భిన్నమైన మనస్తత్వాల కారణంగా ఆయన ప్రవర్తన అలా ఉంది.. అంతే.

కోటి ఆశలతో కొత్త బంధంలోకి అడుగు పెట్టిన మీకు.. భర్త కోరుకున్నట్టుగా లేకపోవడం బాధగానే ఉంటుంది. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీతో అతడిని మార్చడం సాధ్యమే. కాకపోతే దీనికోసం మీరు చాలా ఓపికగా ప్రయత్నించాలి. ఒక మనిషి ప్రవర్తన వాళ్ల ఆలోచనలు, నమ్మకాలు, కారణాల మీద ఆధారపడి ఉంటుంది. ముందు ఆ ప్రవర్తనకు కారణాలేంటో కనుక్కోండి. అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. ఇద్దరి మధ్య అనుబంధం బలపడటం, బలహీనపడటంలో కమ్యూనికేషన్‌దే కీలకపాత్ర. కాబట్టి మీ ఆలోచన, కోరిక, అతడి నుంచి ఆశించేదేంటో వివరంగా చర్చించాల్సిందే.

ఒకవేళ మీ కోరికను అతడు వ్యతిరేకిస్తే అది ఎందుకు సహేతుకం కాదో చెప్పండి. మీ బంధువులు, స్నేహితుల్లో సంతోషంగా ఉన్న జంటలను చూపించండి. అలా లేకపోవడంతో మీకు కలుగుతున్న బాధ వివరించండి. ఇంత చేసినా అతడు మారకపోతే.. ఒక మంచి మానసిక నిపుణుడిని కలవండి. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుంది. అనవసరంగా ఆందోళన చెందవద్దు.



– డా.అర్చన నందూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

యావరేజ్ అబ్బాయిలే కావాలట!

వరుణ్‌తేజ్‌లా ఆరడుగుల పొడవు, ప్రభాస్ లాంటి బాడీ, మహేష్ లాంటి రంగు.. ఇవేవీ లేవని బాధ పడిపోయే అబ్బాయిలూ.. ఇది మీకోసమే! దీర్ఘకాలం రిలేషన్‌షిప్‌లో కొనసాగాలని కోరుకునే అమ్మాయిలు అందగాళ్ల కంటే కూడా సగటుగా కనిపించే అబ్బాయిల పట్ల ఆకర్షితులవుతారని తాజాగా చేసిన ఓ సర్వేలో తేలింది. అందగాళ్లను చూసి ఆ సమయానికి కాసింత సరదా పడినా.. వారికి దగ్గరవ్వాలంటే అమ్మాయిలు ఆలోచనలో పడతారట.



'నేను నచ్చుతానో లేదో, ఆల్రెడీ ఎవరైనా అమ్మాయితో ప్రేమలో ఉన్నాడేమో, రిజెక్ట్ చేస్తే ఎలా..' ఇలాంటి సందేహాలతో ఆగిపోతారట. అదే సాదాసీదాగా.. కాస్త పక్కింటి అబ్బాయి ఫీచర్లు ఉన్నవారితో సులభంగా మాట కలపడానికి ధైర్యం చూపుతారట. అంతేకాదు, కొన్ని సినిమాల్లో చూపించినట్టు మరీ గుబురు గడ్డం ఉన్నవారు కూడా అంతగా నచ్చరట. ఉండీలేనట్టు ఉండే లేలేత గడ్డం ఉంటేనే వారికి ముచ్చట. పెంపుడు జంతువుల పట్ల దురుసుగా వ్యవహరించినా, డబ్బు పట్ల నిర్లక్ష్యం చూపినా వారికి అంతగా నచ్చరని సర్వే తేల్చేసింది. తమకంటే వయసులో ఎంతోకొంత పెద్దయి ఉండి, డస్కీ కలర్‌లో కాసింత హైట్ ఉండి, జాగ్రత్తగా కుటుంబాన్ని నడిపే సమర్థత ఉన్నవారైతే చాలు.. 'అబ్బా!! హస్బెండ్ మెటీరియల్' అనుకుంటూ ఇష్టపడిపోతారని అధ్యయనంలో తెలిపారు. 'సో.. సోసోగా ఉన్నాం' అనుకుంటూ ఆగిపోకుండా, అవకాశాలన్నీ మనకే అనుకుంటూ రంగంలోకి దూకేయండి మరి!

ఉద్యోగాలూ, కెరియర్లూ ఫ్యాషన్‌లాంటివే! కొత్త కొత్త ట్రెండ్‌లు వస్తుంటాయ్, పోతుంటాయ్. ఆర్థికమాంద్యంలో పింక్‌స్లిప్‌ల హవా నడిచింది. కరోనా వర్క్‌ఫ్రం హోం మోడల్ మోసుకొచ్చింది. ఇప్పుడూ కొన్ని కొత్త ట్రెండ్‌లు వినిపిస్తున్నాయి.

కొలువు.. కాదేం సులువు

డ్రై ప్రమోషన్లు: ఏఐ రాక చాలా ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. టెక్నాలజీ తోపాటు అన్ని రంగాల్లోనూ ఈ ప్రభావం ఉంది. ఈ గడ్డు సమయంలోనూ కొందరికి పదోన్నతులు దక్కుతున్నాయి. అయితే వీళ్లకు బాధ్యతలు, ఒత్తిళ్లు పెరుగుతున్నాయి తప్ప జీతంలో పెద్దగా మార్పుల్లేవు. ఇలాంటి వాటినే 'డ్రై ప్రమోషన్లు' అంటున్నారు.



కాఫీ బ్యాడ్జింగ్: ఆఫీసుకి రప్పించేందుకు యాజమాన్యం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగులు ససేమిరా రానంటున్నారు. ఆఖరికి వాళ్ల డిమాండ్లకు తలొగ్గి వారానికి రెండు, మూడురోజులే వచ్చేలా 'హైబ్రిడ్' తీసుకొచ్చారు. అయినా కొందరు ముదురుగాళ్లు మరీ తెలివిమీరి పోతున్నారు. ఆఫీసుకి వచ్చినట్టుగా బిల్డప్ ఇవ్వడం, కాసేపు కాఫీ పట్టుకొని ఐడీ కార్డు చూపించి జారుకోవడం ఇదీ వరుస. తర్వాత నచ్చినచోటు నుంచో, ఇంటికెళ్లి పని చేయడమో.. కాఫీ బ్యాడ్జింగ్.

షాడో పాలసీ: ఉద్యోగులు ఎంత మొండికేసినా కొన్ని కంపెనీలు తప్పనిసరిగా ఆఫీసుకు రావాల్సిందేనని తీర్మానించేశాయి. అయితే కొందరు అతి తెలివిపరులు మేనేజర్లను మేనేజ్ చేసేసి యాజమాన్యాలకు తెలియకుండా, నిబంధనలకు విరుద్ధంగా వర్క్ ఫ్రం హోం కొనసాగిస్తున్నారు. ఇదే షాడో పాలసీ.

ఆఫీస్ పికాకింగ్: కరోనా పుణ్యమాని కుర్ర ఉద్యోగులు ఇంటినుంచే పని చేసే లక్కీఛాన్స్ కొట్టేశారు. అయితే పరిస్థితి మళ్లీ యథాస్థితికి వచ్చినా.. ఉద్యోగులు ఆఫీసుకి రాలేమంటూ మొండికేస్తున్నారు. వీళ్లని పూర్తిస్థాయిలో కార్యాలయాలకు రప్పించేందుకు యాజమాన్యాలు కిచెన్, ప్యాంట్రీ సహా ఆఫీసుల్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాయి. హంగులు ఏర్పాటు చేయడం, అదనపు సౌకర్యాలు కల్పించడం.. ఇదే ఆఫీస్ పికాకింగ్. ఈ ముస్తాబు చూశాకైనా వాళ్లు తిరిగొస్తారని ఆశ.

ఘోస్ట్ వర్క్: ఏఐతో పనులు చక్కబెట్టే అవకాశం ఉన్నా.. కొన్ని సంస్థలు ఉద్యోగులపైనే నమ్మకం పెడుతున్నాయి. మరోవైపు తమ వినియోగదారులకు 'ఆ పని కృత్రిమ మేధస్సుతో పూర్తి చేశాం' అని నమ్మకం కలిగేలా చేస్తున్నాయి. ఈ దాగుడుమూతల కార్యక్రమమే 'ఘోస్ట్ వర్క్'.

సిరీస్ హిట్టవ్వగానే సైన్యంలోకి



బీటీఎస్ అంటే ఇష్టం లేని అమ్మాయిలు.. కొరియన్ డ్రామాలంటే వెర్రిగా చూసే అబ్బాయిలు.. లేని కాలేజీని కనిపెట్టడం కాస్త కష్టమే! అందులోనూ గతేడాది వచ్చిన 'మై డీమన్' వెబ్‌సిరీస్‌లో మెరిసిన 'సాంగ్ కాంగ్' గురించి వీటిని చూసే యువతకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సాంగ్ ఇందులో తనదైన స్టైలిష్ యాక్టింగ్‌తో అమ్మాయిల హృదయాలు కొల్లగొట్టేశాడు. నెట్‌ఫ్లిక్స్ టాప్ ట్రెండింగ్ షోలలో దాదాపు నాలుగు నెలలపాటు ఈ షో కొనసాగిందంటే అందుకే మరి. అయితే ఆ షో షూటింగ్ పూర్తయి, విడుదలయ్యాక ప్రపంచవ్యాప్తంగా ఎంతో పాపులర్ అయిన సాంగ్ కాంగ్.. ఆ స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేయనేలేదు. దక్షిణకొరియాలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సైన్యంలో శిక్షణ తీసుకోవాలనే నిబంధన ఉంది. తన శిక్షణ షెడ్యూలు దగ్గర పడటంతో సిరీస్ రిలీజ్ అవ్వగానే సైన్యంలోకి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో షేర్ చేసుకున్నాడు. తను గతంలో చేసిన 'స్వీట్ హోమ్' సిరీస్ సీజన్ 3 తాజాగా స్ట్రీమ్ అవుతోంది.

నడక వెనక్కి.. ఆరోగ్యం ముందుకి..



నడక మంచిదనే సంగతి అందరికీ తెలిసిందే. వెనక్కి నడవడం మరీ మంచిదంటున్నారు ఫిట్‌నెస్ గురూలు. ఇటీవల ఈ ట్రెండ్ కాస్త ఎక్కువ అవుతోంది. ఎందుకిలా అంటే..

టీనేజీ నుంచి ఓల్డేజీ దాకా అన్ని వయసుల వారికీ ఈ వెనక నడక మేలే చేస్తుందట. ఈ విధానంలో వేసే ప్రతి అడుగుకీ ఫలితం ఉంటుందని, ఇది మోకాళ్లు, కింది శరీరంపై ఒత్తిడి తగ్గిస్తుందని చెబుతున్నారు. దీనివల్ల శరీరంపై నియంత్రణ, అవయవాలతో సమన్వయం అధికమవుతుందట.

ముందుకు నడవడంతో పోలిస్తే వెనక్కి నడిచినప్పుడు మరింత నిటారుగా ఉంటాం. దీంతో పొట్ట, తుంటి, పిరుదులు, వీపు కిందిభాగంలోని అన్ని కండరాలు అత్యధికంగా ప్రభావితమవుతాయి. దృఢమైన క్వాడ్రిసెప్స్ రూపొందేందుకు దోహదపడుతుందట.

అనారోగ్య సమస్యలు, వయోభారంతో క్రమంగా నడక తీరు మారుతుంది. ముందుకి వాలిపోయినట్టు అవుతుంటారు కొందరు. రోజుకి ఇరవై నిమిషాలు వెనక్కి నడిస్తే.. దీన్ని గణనీయంగా తగ్గించుకోగుతామని చెబుతున్నారు. పెద్ద కష్టమైన పని కాదు కాబట్టి ప్రయత్నించి చూస్తే సరి!

ఒకేచోట కూర్చొని పని చేసేవాళ్లకి తుంటి, తొడలు, పొట్ట, కింది శరీర కండరాలు బిగుసుకుపోతాయి. ఇవి యథాస్థానానికి రావాలన్నా, రక్తప్రసరణ పెరగాలన్నా, గాయాలు కాకుండా ఉండాలన్నా.. వెనక్కి నడవడం ఉత్తమమైన వ్యాయామం అని నిపుణుల సలహా.

ఇంజినీరింగ్ తొలి రోజులవి. నేను హాస్టల్‌లో ఉండేవాడిని. ఉదయం ఏడున్నరకే బస్సు ఎక్కాల్సి ఉండటంతో రోజూ టిఫిన్ చేయకుండానే కాలేజీకి వెళ్లేవాడిని. నేరుగా క్యాంటీన్‌కి వెళ్లి అక్కడే ఏదోటి తినేవాడిని. ఈలోగా మొదటి క్లాసు పూర్తయ్యేది. ఓసారి మా క్లాస్‌మేట్ సాయికిశోర్ కూడా క్యాంటీన్‌కి వచ్చాడు. ఎక్కడ టోకెన్ తీసుకోవాలో తెలియక దిక్కులు చూస్తుంటే, నేనే వెళ్లి సాయపడ్డా. వేడివేడి పూరీలు తినిపించా. అప్పట్నుంచి మా ఇద్దరికీ స్నేహం కుదిరింది. తను నాకోసం ఇంట్లో టిఫిన్ చేయకుండా క్యాంటీన్‌కి వచ్చేవాడు. ఇలా ఓ రెండు వారాలు గడిచాయి. రోజూ మేం మొదటి క్లాసుకు డుమ్మా కొడుతుండటం మా టీచర్లు గమనించారు. ఓసారి మేం ఎప్పట్లాగే క్యాంటీన్‌లో ఉన్నప్పుడు మా క్లాస్‌మేట్స్ అందరూ క్యాంటీన్‌కి వచ్చేశారు. 'అదేంట్రా.. ఈరోజు సార్ రాలేదా?' అని వారిని అడుగుతుండగానే.. ఆఫీస్ బాయ్ బ్లాక్‌బోర్డు తీసుకొచ్చి అక్కడ పెట్టాడు. వెనకాలే మా లెక్చరర్ వచ్చారు. అప్పుడుగానీ మా ఇద్దరికీ విషయం అర్థం కాలేదు.. మాకోసం క్యాంటీన్‌నే క్లాస్ రూమ్‌గా మార్చేశారనీ! వాళ్ల ప్రాక్టికల్ అప్రోచ్‌కి మేమంతా నవ్వుకున్నాం. అప్పట్నుంచి ఫస్ట్ పీరియడ్ డుమ్మా కొట్టడం మానేశాం.

- రవి, షాద్‌నగర్

క్యాంటీనే.. క్లాస్‌రూం

కాలేజీ కహానీ



కొంటె కొటేషన్



గెలిచావంటే ప్రభంజనం.. అంతా పడతారు నీరాజనం!
– ఎ.లక్ష్మి, దూసి


లైక్స్ కోసం క్రేజు.. అందుకే సరస్సులో ఈ పోజు
– సీహెచ్ రాజా రంజిత్ రత్నకుమార్, రాజమహేంద్రవరం

నీ రన్నింగ్ చూస్తే షాక్.. కొలనే అయ్యిందా నీకు ట్రాక్!
– అల్లాడ రాంబాబు, ఈమెయిల్

పరుగు కోసం స్విమ్మింగ్ పూల్.. మునిగిపోతే అవుతావు ఫూల్!
– అభిరామ్, దూసి


నీటిపై తుంటరి నడక.. గతి తప్పితే వెయ్యాలి శాశ్వత పడక!
– ఇ.ఉదయ కుమార్, ఎన్.చిక్కేపల్లి


నీటిపై పరుగు.. స్విమ్మింగ్‌లో అరుదు..
– వసీం, ఆదిలాబాద్



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ఏటి వాలుకు ఎదురు వెళితే!





నదుల ద్వారా వస్తువులను రవాణా చేసేటప్పుడు ప్రవాహాల వేగాలను అనుసరించి లాజిస్టిక్స్ ప్లాన్ చేస్తే ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించవచ్చు. ఏటి వాలుకు ఈత కొట్టినా, ప్రవాహానికి ఎదురువెళ్లినా ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలుసుకోవాలంటే సాపేక్ష వేగాన్ని అర్థం చేసుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో అంకగణితంలోని 'పడవలు-ప్రవాహాలు' పాఠం ఉపయోగపడుతుంది. నీటిలో కదలికలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఆ భావనలు సాయపడతాయి. అందులో పట్టు సాధించాలంటే అభ్యర్థులు వేగం, కాలం, దూరం మధ్య సంబంధంపై అవగాహన పెంచుకోవాలి. సరళరేఖ సమీకరణాలను సాధించడం, భిన్నాలు, దశాంశాలను ఉపయోగించడం నేర్చుకోవాలి.

పడవలు - ప్రవాహాలు

నిలకడ నీటిలో

మనిషి/పడవ వేగం = x కి.మీ./గం.

ప్రవాహ వేగం = y కి.మీ./గం.

ప్రవాహ దిశలో

మనిషి వేగం/పడవ వేగం (Down Stream – ఏటి వాలు) = (x + y) కి.మీ./గం.

ప్రవాహానికి వ్యతిరేక దిశలో

మనిషి వేగం/పడవ వేగం (Up Stream - ఏటికి ఎదురు) = (x – y) కి.మీ./గం.

∴ ఏటి వాలు = x + y
ఏటికి ఎదురు = x – y } (+) చేయగా

ఏటి వాలు + ఏటికి ఎదురు = 2x

$\therefore x = \frac{\text{ఏటి వాలు + ఏటికి ఎదురు}}{2}$

∴ ఏటి వాలు = x + y
ఏటికి ఎదురు = x – y } (–) చేయగా

ఏటి వాలు – ఏటికి ఎదురు = 2y

$\therefore y = \frac{\text{ఏటి వాలు – ఏటికి ఎదురు}}{2}$

మాదిరి ప్రశ్నలు

1. ఎ) ఏటి వాలులో 11 కి.మీ., ఎదురులో 5 కి.మీ. 1 గంటలో పడవ నడుస్తుంది. అయితే నిలకడ నీటిలో పడవ వేగం ఎంత?
1) 3 2) 5 3) 8 4) 9

వివరణ: ఏటి వాలులో = 11 కి.మీ./గం.

ఏటికి ఎదురుగా = 5 కి.మీ./గం.

నిలకడ నీటిలో పడవ వేగం (x) = $\frac{\text{ఏటి వాలులో + ఏటికి ఎదురు}}{2}$

$= \frac{11+5}{2} = \frac{16}{2} = 8$ కి.మీ./గం. **జ: 3**

బి) ఒకడు ఏటి వాలులో 32 కి.మీ., ఏటికి ఎదురుగా 14 కి.మీ. పడవ నడిపాడు. ప్రతి వైపునకు 6 గంటలు తీసుకుంటే ప్రవాహ వేగం ఎంత? (కి.మీ./గం.లో)
1) $\frac{1}{2}$ 2) 1 3) $1\frac{1}{2}$ 4) 2

వివరణ: ఏటి వాలులో = $\left(\frac{32}{6}\right)$ కి.మీ./గం.

ఏటికి ఎదురుగా = $\left(\frac{14}{6}\right)$ కి.మీ./గం.

∴ ప్రవాహ వేగం (y) = $\frac{\text{ఏటి వాలులో – ఏటికి ఎదురుగా}}{2}$

$= \frac{\frac{32}{6} - \frac{14}{6}}{2}$



$= \frac{18}{6 \times 2} \Rightarrow \frac{3}{2} = 1.5$ కి.మీ./గం.

లేదా $1\frac{1}{2}$ కి.మీ./గం. **జ: 3**

2. పడవ నడిపేవాడు ఏటికి ఎదురుగా 2 కి.మీ.కు గంట; ఏటికి వాలుగా 1 కి.మీ.కు 10 నిమిషాలు తీసుకుంటే, నిశ్చల నీటిలో 5 కి.మీ.లకు ఎంత సమయం తీసుకుంటాడు?
1) 40 నిమిషాలు 2) 1 గంట 3) 1 గం. 15 ని. 4) ఏదీకాదు

వివరణ: ఏటికి వాలుగా 1 కి.మీ.కు 10 నిమిషాలు తీసుకుంటే

ఏటి వాలులో $= \frac{1}{\frac{10}{60}} \Rightarrow \frac{60}{10} = 6$ కి.మీ./గం.

ఏటికి ఎదురుగా 2 కి.మీ.కు 1 గంట తీసుకుంటే

ఏటికి ఎదురుగా $= \frac{2}{1} \Rightarrow 2$ కి.మీ./గం.

∴ పడవ వేగం $= \frac{6+2}{2} = 4$ కి.మీ./గం.

కాలం (T) = $\frac{\text{దూరం}}{\text{వేగం}}$

$= \frac{5}{4}$ కి.మీ./గం. $\Rightarrow = 1\frac{1}{4}$ గంటలు

∴ 1 గంట 15 నిమిషాలు **జ: 3**

3. ఒక పడవ 13 కి.మీ./గం.తో నిశ్చల నీటిలో వెళ్లగలదు. ప్రవాహ వేగం 4 కి.మీ./గం. అయితే 68 కి.మీ. వాలులో వెళ్లడానికి ఎన్ని గంటలు పడుతుంది?
1) 2 2) 3 3) 4 4) 5

వివరణ: పడవ వేగం (x) = 13 కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 4 కి.మీ./గం.

ఏటివాలుగా పడవ వేగం = 17 కి.మీ./గం.

ఏటివాలుగా ప్రయాణించిన దూరం = 68 కి.మీ./గం.

కాలం = $\frac{\text{దూరం}}{\text{వేగం}} = \frac{68}{17}$

∴ కాలం = 4 గంటలు **జ: 3**

4. ఒక వ్యక్తి పడవను కొంత దూరానికి ఏటి వాలులో నడిపే కాలానికి 3 రెట్లు ఎదురుగా నడిపేందుకు తీసుకుంటాడు. అయితే నిశ్చల నీటిలో పడవ వేగానికి, నీటి ప్రవాహ వేగానికి ఉన్న నిష్పత్తి ఎంత?
1) 2:1 2) 3:1 3) 3:2 4) 4:3

వివరణ: ఇచ్చిన లెక్క ప్రకారం

ఏటికి ఎదురుగా పడవ వేగం = x కి.మీ./గం.

ఏటి వాలుగా పడవ వేగం = 3x కి.మీ./గం.

$x = \frac{\text{ఏటికి ఎదురుగా + ఏటి వాలుగా}}{2}$

$y = \frac{\text{ఏటి వాలుగా – ఏటికి ఎదురుగా}}{2}$

x : y

$\Rightarrow \frac{x+3x}{2} : \frac{3x-x}{2}$

$\Rightarrow \frac{4x}{2} : \frac{2x}{2}$ ∴ 2 : 1 **జ: 1**

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

5. ఏటికి ఎదురుగా 42 నిమిషాల్లో 7 కి.మీ. ఒక పడవ నడుస్తుంది. ప్రవాహ వేగం 3 కి.మీ./గం. అయితే నిలకడ నీటిలో బోటు వేగం ఎంత (కి.మీ./గం.ల్లో)?
1) 4.2 2) 9 3) 13 4) 21

వివరణ: ఏటికి ఎదురుగా బోటు 42 నిమిషాల్లో 7 కి.మీ. ప్రయాణిస్తుంది.

ఏటికి ఎదురుగా $= \frac{D}{T} \Rightarrow \frac{7}{\frac{42}{60}}$

$\Rightarrow \frac{7 \times 60}{42} = 10$ కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 3 కి.మీ.

నిలకడ నీటిలో బోటు వేగం

x = ఏటికి ఎదురుగా + y = 10 + 3

x = 13 కి.మీ./గం. **జ: 3**

6. నిశ్చల నీటిలో పడవ వేగం 15 కి.మీ./గం. 30 కి.మీ. ప్రవాహ దిశలో కొంత దూరం వెళ్లి మళ్లీ తిరిగి రావడానికి 4 గం. 30 ని. సమయం పట్టింది. అయితే ప్రవాహ వేగం ఎంత?
1) 4 కి.మీ./గం. 2) 5 కి.మీ./గం. 3) 6 కి.మీ./గం. 4) 10 కి.మీ./గం.

వివరణ: ప్రవాహ వేగం = x కి.మీ./గం.

వాలులో వేగం = (15 + x) కి.మీ./గం.

ఎదురు వేగం = (15 – x) కి.మీ./గం.

$\therefore \frac{30}{15+x} + \frac{30}{15-x} = 4\frac{1}{2}$

$\Rightarrow \frac{30(15-x) + 30(15+x)}{(15+x)(15-x)} = \frac{9}{2}$

$\Rightarrow \frac{450 - 30x + 450 + 30x}{225 - x^2} = \frac{9}{2}$

$100(900) = 9(225 - x^2)$

$200 = 225 - x^2 \Rightarrow x^2 = 25$

x = 5 కి.మీ./గం. **జ: 2**

7. ఏటి వాలులో కొంతదూరం పోవడానికి పడవకు ఒక గంట, తిరిగి రావడానికి $1\frac{1}{2}$ గంట పట్టింది. ప్రవాహ వేగం 3 కి.మీ./గం. అయితే, నిలకడ నీటిలో పడవ వేగం ఎంత?
1) 12 కి.మీ./గం. 2) 13 కి.మీ./గం. 3) 14 కి.మీ./గం. 4) 15 కి.మీ./గం.

వివరణ: నిలకడ నీటిలో పడవ వేగం = x కి.మీ./గం.

వాలులో వేగం = (x + 3) కి.మీ./గం.

వాలుకు ఎదురు వేగం = (x – 3) కి.మీ./గం.

∴ ఏటి వాలులో కొంతదూరం పోవడానికి ఒక గంట, తిరిగి రావడానికి $1\frac{1}{2}$ గంట పట్టింది.

దూరం సమానం కాబట్టి

దూరం = వేగం × కాలం

$\text{వేగం}_1 \times \text{కాలం}_1 = \text{వేగం}_2 \times \text{కాలం}_2$

$(x+3) \times 1 = (x-3)\frac{3}{2}$

$2x + 6 = 3x - 9$

పడవ వేగం (x) = 15 కి.మీ./గం. **జ: 4**

8. ఒక వ్యక్తి నిశ్చలనీటిలో 5 కి.మీ./గం. పడవ నడపగలడు. ప్రవాహం వేగం 1 కి.మీ./గం. ఒక ప్రదేశానికి వెళ్లి తిరిగి రావడానికి అతడికి పట్టే కాలం 1 గంట అయితే, ఆ ప్రదేశం ఎంత దూరంలో ఉంది?
1) 2.4 కి.మీ. 2) 2.5 కి.మీ. 3) 3 కి.మీ. 4) 3.6 కి.మీ.

వివరణ: పడవ వేగం (x) = 5 కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 1 కి.మీ./గం.

ఏటి వాలులో వేగం = 5+1 = 6 కి.మీ./గం.

ఏటికి ఎదురుగా వేగం = 5 – 1 = 4 కి.మీ./గం.

కాలం (T) = $\frac{\text{దూరం}}{\text{వేగం}}$

∴ దూరం = D అనుకుంటే

$T = \frac{D}{6} + \frac{D}{4} = 1$ గంట $= \frac{2D+3D}{12} = 1$

$\Rightarrow 5D = 12$

D (దూరం) $= \frac{12}{5}$

= 2.4 కి.మీ. **జ: 1**



రచయిత: దొర కంచుమర్తి

మాదిరి ప్రశ్నలు



✦ ఏ దేశ నూతన ప్రధానమంత్రిగా మహ్మద్ ఘాజీ జలాలి ఎన్నికయ్యారు? **జ:** సిరియా

✦ న్యాయమూర్తుల నియామకం బదులు ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టిన తొలిదేశంగా ఏది నిలిచింది? **జ:** మెక్సికో

✦ కుష్ఠు వ్యాధిని నిర్మూలించిన తొలిదేశంగా ఏ దేశాన్ని డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది? **జ:** జోర్డాన్

✦ ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సహాయంతో ఏ రాష్ట్రంలో 12 నగరాలకు తాగునీటి సదుపాయం కల్పించడానికి 'ముఖ్యమంత్రి నగర్ ఉన్నియాన్ ప్రకల్ప్ ప్రాజెక్ట్'ను ప్రారంభించారు? **జ:** త్రిపుర

కరెంట్ అఫైర్స్

✦ పుణె విమానాశ్రయానికి కొత్త పేరు ఏమిటి? **జ:** సంత్ తుకారం విమానాశ్రయం

✦ ఏ రాష్ట్రంలోని 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలకు ఏటా రూ.10,000 ఇచ్చే 'సుభద్ర యోజన' పథకాన్ని 2024, సెప్టెంబరు 17న మోదీ ప్రారంభించారు? **జ:** ఒడిశా

✦ ఏ దేశ శాస్త్రవేత్తల బృందం ఇటీవల 'మాల్' అనే కొత్త బ్లడ్ గ్రూపును కనిపెట్టింది? **జ:** ఇంగ్లండ్

✦ ఇటీవల క్వాడ్ శిఖరాగ్ర సదస్సు అమెరికాలోని డెలావెర్‌లో జరిగింది. 2025లో ఈ సదస్సు ఏ దేశంలో జరుగుతుంది? **జ:** ఇండియా

✦ ట్రామ్ (రెండు బోగీలతో రోడ్డుపై నడిచే రైలు బండి) రవాణా సదుపాయాన్ని కోల్‌కతాలో నిలిపి వేయనున్నట్లు ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి స్నేహాశీష్ చక్రవర్తి ఇటీవల ప్రకటించారు. అయితే ట్రామ్ సర్వీస్ ఎప్పుడు ప్రారంభమైంది? **జ:** 1873, ఫిబ్రవరి 24

✦ రైతులకు, చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించడానికి 'బానా కైహ్' (హ్యాండ్ హోల్డింగ్) పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం? **జ:** మిజోరం

మరింత సమాచారం

టీజీపీఎస్సీ జనరల్ స్టడీస్ చరిత్ర బౌద్ధమతం


డీఎస్సీ-2024 సైకాలజీ


మర్రిచెట్టు ఊడను పట్టుకుని ఊగితే..!




వస్తువుల చలనం, బలాలు, శక్తికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే భౌతికశాస్త్ర విభాగమే యాంత్రిక శాస్త్రం. చుట్టూ ఉన్న వస్తువులు ఎలా కదులుతున్నాయి, ఎందుకు కదులుతున్నాయి, వాటిపై ఏ విధమైన బలాలు పనిచేస్తున్నాయనే ప్రశ్నలకు యాంత్రిక శాస్త్రం సమాధానాలను ఇస్తుంది. గ్రహాల చలనం నుంచి రోజువారీ వస్తువుల కదలికల వరకు అన్నింటినీ వివరిస్తుంది. కార్లు, విమానాలు, రోబోల లాంటి ఆధునిక యంత్రాల ఉత్పత్తిలో సాయపడుతుంది. ఈ శాస్త్రంలోని ప్రాథమిక అంశాల గురించి పరీక్షార్థులు తెలుసుకోవాలి. జడత్వం, స్థానభ్రంశం, త్వరణం, బలం, ఘర్షణ, పీడనాల ప్రభావంతో పాటు గెలీలియో, న్యూటన్, కెప్లర్, పాస్కల్, బెర్నౌలీ లాంటి ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్తలు చేసిన సూత్రీకరణలు, చెప్పిన నియమాలు, ఉదాహరణలను గుర్తుంచుకోవాలి.

యాంత్రిక శాస్త్రం

1. ఒక వస్తువుపై కొంతబలాన్ని ప్రయోగించినప్పుడు, ఆ వస్తువు లంబదిశలో స్థానభ్రంశం చెందితే అది చేసిన పని?
1) ధనాత్మకం 2) ఋణాత్మకం 3) తటస్థం 4) శూన్యం
2. టేబుల్‌పై ఉన్న పుస్తకాన్ని ఒక బాలుడు 4.5 N బలంతో కదిపినప్పుడు, అది 30 సెం.మీ. దూరం కదిలింది. అయితే అక్కడ జరిగిన పని?
1) 1.5 J 2) 2 J 3) 4.5 J 4) 1.35 J
3. సైకిల్‌తో సహా దానిపై ఉన్న వ్యక్తి ద్రవ్యరాశి 100 కిలోలు. ఆ సైకిల్ 3 మీ./సె. వేగంతో కదలాలంటే అతడు చేయాల్సిన పని ఎంత?
1) 500 J 2) 450 J 3) 650 J 4) 300 J
4. చలించే రోడ్డు రోలరుకు ఉండే శక్తి?
1) గతిశక్తి 2) స్థితిశక్తి 3) యాంత్రికశక్తి 4) పైవన్నీ
5. సిలిండర్‌లోని వాయువుకు ఉండే శక్తి?
1) గతిశక్తి 2) స్థితిశక్తి 3) యాంత్రిక శక్తి 4) గురుత్వాకర్షణ శక్తి
6. 2 కేజీల ద్రవ్యరాశి ఉన్న ఒక దిమ్మెను 2 మీ. ఎత్తుకు ఎత్తినప్పుడు అది పొందిన స్థితిశక్తి ఎంత?
1) 39.2 J 2) 56.2 J 3) 19.6 J 4) 29.4 J
7. విద్యుత్తు మోటార్‌లో ఏ శక్తి... ఏ శక్తిగా మార్పు చెందుతుంది?
1) యాంత్రిక శక్తి - విద్యుత్తు శక్తి
2) విద్యుత్తు శక్తి - యాంత్రిక శక్తి
3) యాంత్రిక శక్తి - ఉష్ణ శక్తి
4) ఉష్ణ శక్తి - యాంత్రిక శక్తి
8. భూమి నుంచి కొంత ఎత్తులో ఎగురుతున్న గాలిపటానికి ఉండే శక్తి?
1) గతిశక్తి 2) స్థితిశక్తి 3) యాంత్రికశక్తి 4) ఏదీకాదు
9. వేగంగా ప్రయాణించే వాహనాలు హఠాత్తుగా బ్రేకులు వేసినప్పుడు అవి కలిగి ఉండే త్వరణం?
1) ధన 2) ఋణ 3) సమ 4) శూన్య
10. ఒక వస్తువును 10 మీ./సె. వేగంతో నిట్టనిలువుగా పైకి విసిరితే, అది తిరిగి భూమిని చేరుకోవడానికి పట్టే కాలం ఎంత? ($g = 10\ m/s^2$)
1) 1 సె. 2) 10 సె. 3) 2 సె. 4) 4 సె.
11.  పక్కపటంలో AB = 3 సెం.మీ., BC = 4 సెం.మీ. అయితే A నుంచి Cని చేరడానికి ఒక చీమ పొందే స్థానభ్రంశం ఎంత?

1) 3 2) 4 3) 7 4) 5
12. జడత్వం దేనిపై ఆధారపడుతుంది?
1) పీడనం 2) స్థానభ్రంశం 3) సాంద్రత 4) ద్రవ్యరాశి
13. కింది వాటిలో సదిశ కానిది?
1) స్థానభ్రంశం 2) వేగం 3) త్వరణం 4) పీడనం
14. లాంగ్ జంప్ చేసే వ్యక్తి కొద్దిదూరం నుంచి పరిగెత్తుకుని వచ్చి దూకుతాడు. అతడు ఏ జడత్వం పొందడానికి అలా చేస్తాడు?
1) నిశ్చల 2) గమన 3) దిశా 4) పైవన్నీ
15. చెట్టు నుంచి రాలిన పండు నేరుగా భూమిని చేరుతుంది. అది పొందే త్వరణం?
1) ధన 2) ఋణ 3) శూన్య 4) సమ
16. ఒక వాహనం 30 కి.మీ./గం. వేగంతో బయలుదేరి 10 సెకన్లలో 70 కి.మీ./గం. వేగాన్ని పొందితే, దాని త్వరణం ఎంత?
1) 5 మీ./సె.^{2} 2) 10 మీ./సె.^{2} 3) 6 మీ./సె.^{2} 4) 4 మీ./సె.^{2}
17. బలానికి S.I. ప్రమాణం?
1) జౌల్ 2) ఎర్గ్ 3) న్యూటన్ 4) డైన్
18. కిందివాటిలో విశ్వగురుత్వాకర్షణ స్థిరాంకం విలువ?
1) $6.6 \times 10^{-10}\ Nm^2\ kg^{-2}$
2) $6.67 \times 10^{-6}\ Nm^2\ kg^{-2}$
3) $6.67 \times 10^{-11}\ Nm^2\ kg^{-2}$
4) $5.6 \times 10^{-11}\ Nm^2\ kg^{-2}$
19. విల్లు నుంచి వదిలిన బాణం ఏ సూత్రాన్ని పాటిస్తుంది?
1) న్యూటన్ 2) పాస్కల్ 3) బెర్నౌలీ 4) బాయిల్
20. గుడ్డును పరుపుపై వేస్తే పగలదు. గచ్చు నేలపై వేస్తే పగులుతుంది కారణం?
1) కాలాన్ని పెంచి, బలం తగ్గించడం
2) కాలాన్ని తగ్గించి, బలం పెంచడం
3) కాలం, బలం రెండూ పెంచడం
4) కాలం, బలం రెండూ తగ్గించడం
21. కింది వాటిలో స్పర్శీయ బలం కానిది?
1) ఘర్షణ బలం 2) అభిలంబ బలం 3) తన్యత బలం 4) గురుత్వాకర్షణ బలం
22. ఆవేశపరచిన బెలూన్ కాగితపు ముక్కలను ఆకర్షించడానికి కారణమైన బలం?
1) అయస్కాంత బలం 2) గురుత్వాకర్షణ బలం 3) స్థిరవిద్యుత్తు బలం 4) ఘర్షణ బలం
23. తలం గరుకుదనం పెరిగితే ఘర్షణలో కలిగే మార్పు ఏమిటో గుర్తించండి.
1) తగ్గుతుంది 2) పెరుగుతుంది 3) రెండు సమానమవుతాయి 4) ఎలాంటి మార్పు ఉండదు
24. పీడనానికి S.I. ప్రమాణం?
1) న్యూటన్ 2) డైన్ 3) జౌల్ 4) పాస్కల్
25.  ఒక వస్తువు BC మార్గంలో ప్రయాణించినా, అది కలిగి ఉండే త్వరణం?

1) ధన 2) ఋణ 3) సమ 4) శూన్య
26. వాహనాల వెనుక భాగంలో అధిక సంఖ్యలో టైర్లను ఏర్పాటు చేస్తారు. కారణమేంటి?
1) వైశాల్యం తగ్గించి, పీడనం పెంచడం
2) వైశాల్యం పెంచి, పీడనం తగ్గించడం
3) వైశాల్యం, పీడనం రెండూ తగ్గించడం
4) వైశాల్యం, పీడనం రెండూ పెంచడం
27. కిందివాటిలో 'డ్రాగ్' అని ఏ ఘర్షణను పిలుస్తారు?
1) ప్రవాహి ఘర్షణ 2) స్థితిక 3) దొర్లుడు 4) జారుడు
28. కిందివాటిలో ఘర్షణ బలం ఆధారపడని అంశాన్ని ఎంచుకోండి.
1) గరుకుతనం 2) అభిలంబ బలం 3) స్పర్శాతల వైశాల్యం 4) పైవన్నీ
29. ఒక వస్తువును నిట్టనిలువుగా పైకి విసిరితే అది పొందే త్వరణం?
1) ధన 2) ఋణ 3) సమ 4) శూన్య
30. కింది వాటిలో న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా పనిచేసేది?
1) విమానం 2) రైలు 3) గాలిపటం 4) రాకెట్ చలనం
31. ఘర్షణ లేని ప్రపంచాన్ని ఊహించిన శాస్త్రవేత్త?
1) న్యూటన్ 2) గెలీలియో 3) అరిస్టాటిల్ 4) బాయిల్
32. కింది వాటిలో క్షేత్రీయ బలం కానిది?
1) గురుత్వాకర్షణ బలం 2) అభిలంబ బలం 3) స్థిర విద్యుత్తు బలం 4) అయస్కాంత బలం
33. కలపకు రంధ్రాలు చేసే బర్మా చలనం ఏ చలనాన్ని కలిగి ఉంటుంది?
1) భ్రమణ 2) డోలన 3) క్రమ 4) హరాత్మక
34. కుట్టుమిషన్‌లో సూది చేసే చలనం?
1) భ్రమణ 2) కంపన 3) స్థానాంతర 4) క్రమరహిత
35. కింది వాటిలో రాకెట్ చలనం దేనికి సంబంధించింది?
1) సమ 2) సరేఖీయ 3) వక్రరేఖీయ 4) కంపన
36. 1 డైన్ = ... న్యూటన్స్.
1) 10^{-7} 2) 10^{-5} 3) 10^{7} 4) 10^{5}
37. బలానికి S.I. ప్రమాణం?
1) $N.m/s^2$ 2) $N.cm/s^2$ 3) $dyne.m/s^2$ 4) $dyne.cm/s^2$
38. ఒక వ్యక్తి మర్రిచెట్టు ఊడను పట్టుకుని ఊగుతున్నాడు. అతడిపైన పనిచేసే బలం?
1) ఘర్షణ 2) గురుత్వాకర్షణ 3) తన్యతా 4) 2, 3
39. కింది వాటిలో సరైన ఫలిత బలాన్ని గుర్తించండి.



డీఎస్సీ/టెట్ - 2024
భౌతిక శాస్త్రం

40. ఒక వస్తువుపై బలాన్ని ప్రయోగిస్తే, దాని స్థానభ్రంశం ప్రయోగించిన బలానికి వ్యతిరేక దిశలో ఉంటే జరిగిన పని?
1) $W = F \times S$ 2) $W = F \times S \cos\theta$ 3) $W = -F \times S$ 4) ఏదీకాదు
41. ఆవిరియంత్రంలోని ఏ శక్తి.. ఏ శక్తిగా మారుతుంది?
1) యాంత్రిక - ఉష్ణ 2) ఉష్ణ - యాంత్రిక 3) విద్యుత్తు - ఉష్ణ 4) ఉష్ణ - విద్యుత్తు
42. ఒక వస్తువు యొక్క స్థానభ్రంశం, దూరం సమానంగా ఉండాలంటే అది ఏ మార్గంలో ప్రయాణించాలి?
1) సరళరేఖ మార్గంలో 2) వక్ర మార్గంలో 3) కొంత కోణంతో 4) పైవన్నీ
43. స్టేషన్ నుంచి బయలుదేరిన వస్తువుకు ఉండే త్వరణం?
1) ధన 2) ఋణ 3) శూన్య 4) సమ
44. ఒక మంచు దిమ్మె నీటితో నింపిన పాత్రలో ఉంది. మంచు పూర్తిగా కరిగినప్పుడు పాత్రలో నీటి మట్టం?
1) పెరుగుతుంది
2) మొదట పెరిగి తర్వాత తగ్గుతుంది
3) మార్పు ఉండదు
4) తగ్గుతుంది
45. భారమితిని కనుక్కున్న శాస్త్రవేత్త?
1) ఆర్కిమెడిస్ 2) టారిసెల్లి 3) పాస్కల్ 4) బెర్నౌలీ
46. బస్సు మలుపు తిరిగినప్పుడు ప్రయాణికుడు బయటివైపునకు నెట్టబడటానికి కారణం?
1) గురుత్వాకర్షణ 2) అభికేంద్ర బలం 3) ఘర్షణ బలం 4) జడత్వం
47. కింది వాటిలో దేనిపై ఆధారపడి జలాంతర్గాములను తయారుచేస్తారు?
1) ఆర్కిమెడిస్ సిద్ధాంతం 2) పాస్కల్ నియమం 3) బెర్నౌలీ సిద్ధాంతం 4) న్యూటన్ నియమం
48. పాదరసం సాపేక్ష సాంద్రత?
1) 19.2 2) 13.6 3) 9.2 4) 7.5

సమాధానాలు

1-4; 2-4; 3-2; 4-1; 5-2; 6-1; 7-2; 8-3; 9-2; 10-3; 11-4; 12-4; 13-4; 14-2; 15-1; 16-4; 17-3; 18-3; 19-1; 20-2; 21-4; 22-3; 23-2; 24-4; 25-3; 26-2; 27-1; 28-3; 29-2; 30-4; 31-2; 32-2; 33-1; 34-2; 35-2; 36-2; 37-1; 38-4; 39-3; 40-3; 41-2; 42-1; 43-1; 44-3; 45-2; 46-4; 47-1; 48-2.

కొల్లాయిడ్ ద్రావణాలు

రెండు అంతకంటే ఎక్కువ అనుఘటకాలు కలిగిన సజాతీయ మిశ్రమాలను ద్రావణాలు అంటారు. ద్రావణంలో అత్యధిక మోతాదులో ఉన్న అనుఘటకాన్ని ద్రావణి అంటారు. ద్రావణంలో ద్రావణి కాకుండా ఉన్న అనుఘటకాలను ద్రావితాలు అంటారు. ద్రావణం భౌతికస్థితిని ద్రావణి భౌతికస్థితి నిర్ణయిస్తుంది. ద్రావణాల రకాలు, వాటి మధ్య భేదాలు, కొల్లాయిడ్ ద్రావణాల వర్గీకరణ, తయారీ మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కెమిస్ట్రీ

విక్షేపణ యానకానికి కలిపిన విద్యుద్విశ్లేష్యాన్ని ఏమంటారు?

రకాలు

ద్రావణంలోని ద్రావిత కణాల ఆధారంగా వాటిని మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

1. నిజద్రావణాలు 2. కొల్లాయిడ్ ద్రావణాలు
3. అవలంబనాలు

నిజద్రావణాలు

- ద్రావితం కణపరిమాణం 1 నానోమీటర్ (1nm) లేదా అంతకంటే తక్కువగా ఉన్న ద్రావణాలను నిజద్రావణాలు అంటారు. ఇవి సజాతీయ ద్రావణాలు. వీటిలోని ద్రావిత కణాలు కంటికి కనిపించవు.

ఉదా: చక్కెర ద్రావణం, ఉప్పు ద్రావణం, ఆమ్లజల ద్రావణం మొదలైనవి.

కొల్లాయిడ్ ద్రావణాలు

- ద్రావిత కణాల పరిమాణం 1nm నుంచి 1000 nm వరకు ఉన్న ద్రావణాలను కొల్లాయిడ్ ద్రావణాలు అంటారు.
- కొల్లాయిడ్ ద్రావణం ద్విగుణాత్మక విజాతీయ వ్యవస్థ. దీనిలో రెండు ప్రావస్థలు ఉంటాయి. అవి:
  1. విక్షిప్త ప్రావస్థ 2. విక్షేపణ యానకం
- కొల్లాయిడ్ ద్రావణంలో కణాలుగా విక్షిప్తం చెంది ఉండే పదార్థమే విక్షిప్త ప్రావస్థ (dispersed phase) విక్షిప్త ప్రావస్థ కణాలను విక్షేపణం చేసుకున్న అవిచ్ఛిన్న యానకమే విక్షేపణ యానకం (dispersed medium).
- విక్షేపణ యానకం + విక్షిప్త ప్రావస్థ = కొల్లాయిడ్ ద్రావణం

ఉదా:

1. స్టార్చ్ కొల్లాయిడ్ ద్రావణంలో స్టార్చ్ విక్షిప్త ప్రావస్థ, నీరు విక్షేపణ యానకం అవుతాయి.
2. పొగలో కార్బన్ కణాలు విక్షిప్త ప్రావస్థ, గాలి విక్షేపణ యానకం అవుతాయి.

అవలంబనాలు

- ద్రావిత కణాల పరిమాణం 1000 nm కంటే ఎక్కువగా ఉంటే ఆ ద్రావణాలను అవలంబనాలు అంటారు.

ఉదా: అన్ని రకాల అవక్షేపాలు.

కొల్లాయిడ్‌ల వర్గీకరణ

ఎ) విక్షిప్త ప్రావస్థ, విక్షేపణ యానకాల భౌతిక స్థితుల ఆధారంగా వర్గీకరణ:

విక్షిప్త ప్రావస్థ, విక్షేపణ యానకం అనేవి ఘన, ద్రవ, వాయు స్థితుల్లో ఉంటాయి. ఈ మూడు భౌతిక స్థితులను అనుసరించి కొల్లాయిడ్‌లను ఎనిమిది రకాలుగా వర్గీకరించారు.

విక్షిప్త ప్రావస్థ	విక్షేపణ యానకం	కొల్లాయిడ్ రకం	ఉదాహరణలు
ఘన పదార్థం	ఘన పదార్థం	ఘనసోల్	కొన్ని మిశ్రమలోహాలు
ఘన పదార్థం	ద్రవ పదార్థం	సోల్	పెయింట్, ఇంక్, రక్తం
ఘన పదార్థం	వాయు పదార్థం	ఏరోసోల్	పొగ, గాలిలో ధూళి
ద్రవ పదార్థం	ఘన పదార్థం	జెల్	జెల్లీ, జున్ను, గడ్డపెరుగు
ద్రవ పదార్థం	ద్రవ పదార్థం	ఎమల్షన్	పాలు, తలకు రాసుకునే క్రీమ్
ద్రవ పదార్థం	వాయు పదార్థం	ఏరోసోల్	మేఘం, పొగమంచు
వాయు పదార్థం	ఘన పదార్థం	ఘనసోల్	ప్యూమిస్ రాళ్లు, ఫోమ్ రబ్బరు
వాయు పదార్థం	ద్రవ పదార్థం	నురుగు	మదించిన క్రీమ్, సబ్బు నురుగు

- గోల్డ్ సోల్‌లో విక్షిప్త ప్రావస్థ - గోల్డ్ కణాలు, విక్షేపణ యానకం - నీరు
- రక్తంలో విక్షిప్త ప్రావస్థ - ఆల్బుమినాయిడ్, విక్షేపణ యానకం - నీరు లేదా ప్లాస్మా
- మేఘంలో విక్షిప్త ప్రావస్థ - నీటిబిందువులు, విక్షేపణ యానకం - గాలి
- పాలలో విక్షిప్త ప్రావస్థ - ద్రవ కొవ్వు, విక్షేపణ యానకం - నీరు
- పొగలో విక్షిప్త ప్రావస్థ - కార్బన్ కణాలు, విక్షేపణ యానకం - గాలి.

- ఒక వాయువు మరొక వాయువుతో సజాతీయ మిశ్రమాన్ని ఏర్పరుస్తుంది. కాబట్టి అది కొల్లాయిడ్ వ్యవస్థ కిందకి రాదు.

బి) విక్షిప్త ప్రావస్థ, విక్షేపణ యానకాల మధ్య ఉన్న అన్యోన్య చర్యల స్వభావం (ఆకర్షణ) ఆధారంగా వర్గీకరణ:

- విక్షిప్త ప్రావస్థ, విక్షేపణ యానకాల మధ్య ఉన్న ఆకర్షణ ఆధారంగా కొల్లాయిడ్‌లను రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

1. ద్రవప్రియ కొల్లాయిడ్‌లు (లియోఫిలిక్ కొల్లాయిడ్‌లు)
2. ద్రవ విరోధి కొల్లాయిడ్‌లు (లియోఫోబిక్ కొల్లాయిడ్‌లు)

నిజద్రావణాలు, కొల్లాయిడ్ ద్రావణాలు, అవలంబనాల మధ్య భేదాలు

ధర్మం	నిజ ద్రావణాలు	కొల్లాయిడ్ ద్రావణాలు	అవలంబనాలు
కణపరిమాణం	< 1 nm	1 nm - 1000 nm	>1000 nm
స్వభావం	సజాతీయం	విజాతీయం	విజాతీయం
దృగ్గోచరత	ద్రావిత కణాలు కంటిచూపునకు కనిపించవు	ద్రావిత కణాలు కంటిచూపునకు కనిపించవు	కంటిచూపునకు ద్రావిత కణాలను కనిపిస్తాయి
ఫిల్టర్ పేపర్ ద్వారా ప్రవహించడం	ద్రావిత కణాలు ఫిల్టర్ పేపర్ ద్వారా ప్రవహిస్తాయి. కాబట్టి వడపోత సాధ్యంకాదు.	ద్రావిత కణాలు ఫిల్టర్ పేపర్ ద్వారా నెమ్మదిగా ప్రవహిస్తాయి.	ద్రావిత కణాలు ఫిల్టర్ పేపర్ ద్వారా ప్రవహించవు. కాబట్టి వడపోత సాధ్యమవుతుంది.
కాంతి పరిక్షేపణం	కాంతి పరిక్షేపణం జరగదు. టిండాల్ ప్రభావాన్ని ప్రదర్శించవు.	కొల్లాయిడ్ కణాలు కాంతిని పరిక్షేపిస్తాయి. పరిక్షిప్త కాంతి కనిపిస్తుంది. దీన్నే టిండాల్ ప్రభావం అంటారు.	అవలంబనాల్లోని కణాలు టిండాల్ ప్రభావాన్ని ప్రదర్శించవు

ద్రవప్రియ కొల్లాయిడ్ (Lyophilic colloid)

- విక్షిప్త ప్రావస్థకు, విక్షేపణ యానకానికి మధ్య ఎక్కువ సాన్నిహిత్యం (ఆపేక్ష) ఉన్న కొల్లాయిడ్‌లను 'ద్రవప్రియ కొల్లాయిడ్‌లు' అంటారు.
- నీరు యానకంగా కలిగిన లయోఫిలిక్ కొల్లాయిడ్‌లను 'హైడ్రోఫిలిక్ కొల్లాయిడ్‌లు' అంటారు.
- విక్షిప్త ప్రావస్థను, విక్షేపణ యానకానికి కలిపి ద్రవప్రియ కొల్లాయిడ్‌లను సులభంగా తయారుచేయొచ్చు.

ఉదా: స్టార్చ్ ద్రావణం, జిగురు, జిలాటిన్ మొదలైనవి.

- ఈ రకం కొల్లాయిడ్‌లను 'ఉత్క్రమణీయ కొల్లాయిడ్‌లు' అని అంటారు. ఎందుకంటే ద్రవప్రియ కొల్లాయిడ్ యానకాన్ని కోల్పోయి, కొల్లాయిడ్ స్థితిని కోల్పోతే, దానికి తిరిగి తగినంత యానకాన్ని కలిపి కొల్లాయిడ్ స్థితిని మళ్లీ పొందొచ్చు.
- ఈ రకం కొల్లాయిడ్‌లకు స్థిరత్వం ఎక్కువ. ఇవి సులభంగా స్కందనం చెందవు.

ద్రవవిరోధి కొల్లాయిడ్ (Lyophobic colloid)

- విక్షిప్త ప్రావస్థకు, విక్షేపణ యానకానికి మధ్య తక్కువ సాన్నిహిత్యం కలిగిన కొల్లాయిడ్‌లను 'ద్రవవిరోధి కొల్లాయిడ్‌లు' అంటారు.
- నీరు యానకంగా కలిగిన లియోఫోబిక్ కొల్లాయిడ్‌లను 'హైడ్రోఫోబిక్ కొల్లాయిడ్‌లు' అంటారు.
- విక్షిప్త ప్రావస్థను విక్షేపణ యానకానికి కలిపి ద్రవవిరోధి కొల్లాయిడ్‌లను తయారుచేయలేం. వీటిని కొన్ని ప్రత్యేక పద్ధతుల్లో మాత్రమే తయారుచేస్తారు.

ఉదా: లోహ కొల్లాయిడ్‌లు, లోహ ఆక్సైడ్ కొల్లాయిడ్‌లు, లోహ సల్ఫైడ్ కొల్లాయిడ్‌లు మొదలైనవి.

- ఈ రకం కొల్లాయిడ్‌లను 'అనుత్క్రమణీయ కొల్లాయిడ్‌లు' అని అంటారు. ఎందుకంటే ద్రవవిరోధి కొల్లాయిడ్ యానకాన్ని కోల్పోయి, కొల్లాయిడ్ స్థితిని కోల్పోతే, దానికి తగినంత యానకాన్ని కలిపి ద్రవవిరోధి కొల్లాయిడ్‌ను తిరిగి పొందలేం.
- ఈ రకం కొల్లాయిడ్‌లకు స్థిరత్వం తక్కువ. ఇవి సులభంగా స్కందనం చెందుతాయి.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

కొల్లాయిడ్‌ల తయారీ

- గోల్డ్, సిల్వర్ మొదలైన లోహ కొల్లాయిడ్ సోల్‌లను విద్యుత్ విఘటనం లేదా బ్రెడిగ్ విద్యుత్ చాప పద్ధతి ద్వారా తయారు చేస్తారు.
- విక్షేపణ యానకంలో ఉన్న ఒక అవక్షేపానికి కొద్దిగా విద్యుద్విశ్లేష్యాన్ని కలిపి బాగా కుదపడం ద్వారా అవక్షేపాన్ని కొల్లాయిడ్ స్థితికి మార్చే ప్రక్రియను పెప్టీకరణం అంటారు.
- విక్షేపణ యానకానికి కలిపిన విద్యుద్విశ్లేష్యాన్ని 'పెప్టీకరణ కారకం' అంటారు.
- ఆక్సీకరణం, క్షయకరణం, జలవిశ్లేషణం మొదలైన రసాయన చర్యల ఆధారంగా కూడా కొల్లాయిడ్‌లను తయారు చేస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఎమల్షన్ ఏ రకానికి చెందిన కొల్లాయిడ్ ద్రావణం?
   1) ద్రవంలో ద్రవం 2) ద్రవంలో ఘనపదార్థం
   3) ద్రవంలో వాయువు 4) వాయువులో ద్రవం
2. కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) విక్షేపణ యానకం నీరుగా ఉన్న సోల్‌ను 'ఆక్వాసోల్' అంటారు.
   బి) విక్షేపణ యానకం ఆల్కహాల్‌గా ఉన్న సోల్‌ను 'ఆల్కాసోల్' అంటారు.
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే 3) ఎ, బి 4) ఏదీకాదు
3. కిందివాటిలో కొల్లాయిడ్ ద్రావణం కానిది ఏది?
   1) ఉప్పు ద్రావణం 2) చక్కెర ద్రావణం
   3) 1, 2 4) పాలు
4. జున్ను, జెల్లీలు ఏ కొల్లాయిడ్ రకానికి చెందిన ఉదాహరణలు?
   1) సోల్ 2) జెల్ 3) నురుగు 4) ఎమల్షన్
5. పొగ ఏ కొల్లాయిడ్ రకానికి చెందింది?
   1) వాయువులో ఘనపదార్థం 2) ద్రవంలో ఘనపదార్థం
   3) ద్రవంలో ద్రవపదార్థం 4) వాయువులో ద్రవపదార్థం

సమాధానాలు: 1-1, 2-3, 3-3, 4-2, 5-1.

424 Word of the Day

Temerarious

Telugu meaning: బాధ్యత లేని, నిర్లక్ష్యంగా

English meaning: The word 'temerarious' is an adjective that describes someone who is recklessly bold or rash.

Synonyms: Reckless, Audacious

Antonyms: Cautious, Thoughtful

Usage: **1.** His temerarious decision to climb the mountain without proper gear almost cost him his life.

2. The temerarious stunt earned him brief fame but left him with lasting injuries.

నోటిఫికేషన్స్

ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టులు

తెలంగాణలో 633 ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్ పరీక్ష ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 5 నుంచి అక్టోబరు 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అప్రెంటిస్ ఖాళీలు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు చెందిన రిసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) 2024-25 ఏడాదికి అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 200. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జూనియర్ రిసెర్చ్ ఫెలో ఖాళీలు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు చెందిన అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ) జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీలు 22. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 7 అక్టోబరు 2024.


దరఖాస్తు చేశారా..?

ఈ ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (సెప్టెంబరు 28) ఆఖరు తేదీ

- ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్)లో 24 ఎస్‌పీఎంయూ ప్రొఫెషనల్ పోస్టులు. ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)లో 250 డిప్యూటీ మేనేజర్ ఖాళీలు. సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- తెలంగాణలో ఐటీఐ కోర్సు అడ్మిషన్లు-2024. ట్రేడును అనుసరించి 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులు అర్హులు.
- టీసీఎస్ హైదరాబాద్‌లో ఒరాకిల్ క్లౌడ్ టెక్నికల్ పోస్టులు. ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఈ-బుక్ (బయాలజీ)



మానవ అస్థిపంజర వ్యవస్థ 206 ఎముకలు, మృదులాస్థి, స్నాయువుతో రూపొందింది. ఇది శరీరానికి ఆధారాన్ని అందిస్తుంది. ముఖ్యమైన అవయవాలను రక్షించడం, కదలికలను అనుమతించడం, రక్తకణాలను ఉత్పత్తి చేయడం లాంటి అనేక ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తుంది.

- సాధారణంగా అన్ని పోటీపరీక్షల్లో జనరల్ సైన్స్ (బయాలజీ) విభాగం నుంచి మానవ అస్థిపంజర వ్యవస్థ అంశంపై ప్రశ్నలు వస్తాయి.
- ఈ-బుక్‌లో మానవ అస్థిపంజర వ్యవస్థ భాగాలు, ఉపయోగాలు-విధులు, ఎముకలు-వర్గీకరణ, అక్షసంబంధ అస్థిపంజర వ్యవస్థలో ఉండే భాగాలు, మాదిరి ప్రశ్నలు ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్



లండన్‌కు చెందిన ప్రముఖ ఉన్నతవిద్యా విశ్లేషణ సంస్థ 'క్యూఎస్' 2024, సెప్టెంబరు 25న క్యూఎస్ గ్లోబల్ లిస్ట్ - 2025ను విడుదల చేసింది. ప్రపంచంలోని 58 దేశాలు, భూభాగాల్లో అత్యుత్తమంగా ఉన్న విద్యాసంస్థల 340 ఎంబీఏ, బిజినెస్ కోర్సుల ప్రమాణాలను విశ్లేషించి ఈ ర్యాంకులను ప్రకటించారు.

- ఎంబీఏ కోర్సుల నిర్వహణ ప్రమాణాల్లో ప్రపంచస్థాయి అగ్రశ్రేణి 100 విద్యాసంస్థల్లో భారత్‌కు చెందిన మూడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కు స్థానం లభించింది. బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా నగరాల్లోని ఐఐఎంలు ఇందులో చోటు సాధించాయి.

ఆస్ట్రేలియాకు చెందిన లోవీ సంస్థ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్ వార్షిక జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలను ప్రభావితం చేసే సామర్థ్యమున్న 27 దేశాలు, ప్రాంతాలతో ఈ సూచీని రూపొందించింది. అమెరికా 81.7 స్కోరుతో తొలి స్థానంలో నిలవగా, చైనా (72.7), భారత్ (39.1) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

దేశవ్యాప్తంగా 35 ఏళ్లలోపు వయసులోనే విశేష ప్రతిభ చూపుతున్న 150 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జాబితాను 'హురున్ అండర్ 35 జాబితా' పేరుతో హురున్ ఇండియా విడుదల చేసింది. రిలయన్స్ రిటైల్‌కు నేతృత్వం వహిస్తున్న ఈశా అంబానీ (32) ఈ జాబితాలో అత్యంత తక్కువ వయసున్న మహిళగా నిలిచారు. షర్‌చాట్ ప్రతినిధి అంకుష్ సచ్‌దేవ (31) అందరి కంటే పిన్నవయస్కుడు కావడంతో జాబితా అగ్రస్థానంలో నిలిచారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) భారత వృద్ధి రేటు అంచనాను 7 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) తెలిపింది.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Trigonometry

1. $\frac{\sin\theta + \cos\theta}{\sin\theta - \cos\theta} = \frac{13}{12}$ then find the value of $\cot^2\theta + 2$?

A) $\frac{1248}{625}$ B) $\frac{1251}{625}$ C) $\frac{1278}{625}$ D) $\frac{1271}{625}$

2. If $5\sin\theta + 12\cos\theta = 13$; Find the value of $\sin^2\theta + \tan^2\theta$.

A) $\frac{7825}{24336}$ B) $\frac{6927}{24336}$ C) $\frac{7564}{24336}$ D) $\frac{7769}{24336}$

3. If $P\tan^2 60^\circ \sec^2 30^\circ = \tan^2 45 . \mathrm{cosec}^2 60^\circ$. Then find P?

A) 0 B) 1 C) $\frac{1}{3}$ D) 3

4. If $\sec\theta + \tan\theta = 4$; Find the value of $2 + 3\sec\theta = ?$

A) $\frac{61}{8}$ B) $\frac{69}{8}$ C) $\frac{73}{8}$ D) $\frac{67}{8}$

5. $\sqrt{\frac{1+\sin\theta}{1-\sin\theta}} + \sqrt{\frac{1-\sin\theta}{1+\sin\theta}} = \frac{5}{2}$

Then the value of $5 + \tan\theta = ?$

A) $\frac{26}{5}$ B) $\frac{33}{5}$ C) $\frac{31}{5}$ D) $\frac{28}{5}$



6. If $7\sec\theta - 3\tan\theta = 7$. Then find the value of $3\sec\theta - 7\tan\theta = ?$

A) ±5 B) ±2 C) ±4 D) ±3

7. If $\sin\theta + \mathrm{cosec}\theta = 2$. Then find the value of $\sin^{115}\theta + \mathrm{cosec}^{115}\theta$.

A) –2 B) 2 C) 1 D) –1

8. Find the value of $\sin^2 59^\circ + \sin^2 31^\circ + \cos^2 42^\circ + \cos^2 48^\circ$

A) 2 B) –2 C) 1 D) 0

9. Find the value of $\tan 43^\circ \tan 44^\circ \tan 45^\circ \tan 46^\circ \tan 47^\circ$

A) 1 B) 0 C) 4 D) 2

10. Find the value of $\cos^2 20^\circ + \cos^2 70^\circ + \tan^2 60^\circ$

A) –1 B) 4 C) 2 D) 0

SSC Exams

Quantitative Aptitude

11. Find the value of $\cos 20^\circ \cos 35^\circ \cos 90^\circ \cos 100^\circ \cos 110^\circ$

A) 0 B) 5 C) 1 D) –1

12. What is the maximum value of $12\sin\theta + 35\cos\theta$?

A) 41 B) 37 C) 35 D) 36

13. What is the minimum value of $81\sec^2\theta + 144\mathrm{coses}^2\theta$?

A) 441 B) 484 C) 400 D) 361

14. For any acute angle, $\sin\theta + \sin^2\theta = 1$, then the value of $\cos^2\theta + \cos^4\theta + 4 = ?$

A) –1 B) 5 C) 4 D) 0

15. If $\sin x + \cos x = \frac{7}{9}$, then find the value of $\sin x \cos x$?

A) $-\frac{11}{81}$ B) $-\frac{14}{81}$ C) $-\frac{21}{81}$ D) $-\frac{16}{81}$

16. Find the value of the following expression $14(\sin^4\theta + \cos^4\theta) + 40(\sin^6\theta + \cos^6\theta) + 80\sin^2\theta\cos^2\theta$

A) 54 B) 56 C) 58 D) 52

17. If $\sin(a + b) = 1$ and $\cos(a - b) = \frac{\sqrt{3}}{2}$, then find the value of b?

A) 40° B) 30° C) 20° D) 35°

18. Find the value of the given expression $2 + \cos 71^\circ \cos 19^\circ - \sin 71^\circ \sin 19^\circ$

A) 2 B) 1 C) 0 D) 3

19. If $\mathrm{cosec}\theta + \cot\theta = \frac{4}{3}$, then what is the value of $\mathrm{cosec}^2\theta$?

A) $\frac{28}{27}$ B) $\frac{26}{25}$ C) $\frac{25}{24}$ D) $\frac{27}{29}$

20. Find the value of $\frac{\cos^2 27^\circ - \sin^2 27^\circ}{\cos^2 155^\circ + \sin^2 155^\circ}$

A) $\frac{\sqrt{10+2\sqrt{5}}}{4}$ B) $\frac{\sqrt{5}+1}{4}$ C) $\frac{\sqrt{5}-1}{4}$ D) $\frac{\sqrt{10-2\sqrt{5}}}{4}$

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of ***QnA Academy,*** *Hyderabad*